ఆంధ్ర సచిత్ర వారపత్రిక

విడిప్రతి వెల నాలుగు రూపాయలు!

సంపుటం-82 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచిక 25

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

(1938-1972 సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్)

ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, ఫోన్లు : 75667, 61247, 61248

వీక్లీ పోస్ట్

ముఖ చిత్రం

సుమన్, రాధ, భానుప్రియ ముఖ చిత్రంతో వెలువడిన మా (మీ) ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాల అందంగా ఉన్నది. టెర్రరిజం నుంచి పంజాబ్‌కు విముక్తి ఎప్పుడు? (సంపాదకీయం) చాల బాగుంది. చల్లా సుబ్రహ్మణ్యంగారి 'లవ్‌గేమ్' చాల ఇంట్రెస్టుగా ప్రారంభం అయింది.

సి. హెచ్. శ్రీనివాసరావు (గౌరీపట్నం)

సీరియల్

మా ఆంధ్రపత్రికలో మా అభిమాన రచయిత్రి మన్నెం శారద గారి సీరియల్ సూపర్ హీరో ఇన్నాళ్లకు మొదలయినందుకు ఎంతో సంతోషముగా వున్నది. మొదట్లోనే ఎంతో ఊపందుకుని ఆనందపరచింది.

–ఎమ్. భారతమ్మ, గౌలిగూడ.

కవితలు

*19-1-90 నాటి మా ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురించిన "యువతా- కవితా" శీర్షికలోని కవితలు మమ్మల్ని ఎంతగానో అలరించాయి. ఈ శీర్షిక ద్వారా యువకవులనుఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఒక్కొక్క కవిత మమ్మల్ని సుదూర తీరాలలో విహరింప జేస్తున్నాయి. ఎడిటర్‌గార్కి మా కృతజ్ఞతలు. –ముజీబ్ అన్సారీ, హైదరాబాద్.

కోరిక

ఇన్నిరోజుల ఎడబాటు అనంతరము ఆంధ్రపత్రిక రావడము మాకు ఎనలేని ఆనందము కల్గించినది. అందులో మా అభిమాన రచయిత్రి సీరియలు సూపర్ హీరో మొదలవ్వడము మాకు ఎనలేని సంతోషాన్ని కల్గించినది. ఇన్నిరోజుల నిరీక్షణకి ఫలితము దక్కినట్లనిపించి సంతోషించితిమి.

–అనిత, సరిత, కవిత, హైదరాబాదు.

దేవ్

దేవానంద్‌ని చూస్తుంటే కాలానికి వయసుకు లొంగని నటుడా! అనిపిస్తుంది అంటూ మీ సినిమా విశేషాలు యిచ్చిన కితాబు చూసి నవ్వుకున్నాం. బహుశా ఆయన ఫిలింఫెస్టివల్ సందర్భంగా దూరదర్శన్ యిటీవల ప్రసారం చేసిన కార్యక్రమంలోని దేవానంద్‌ని చూసి ఉండరు!

- విజయ (రాజమండ్రి)

(74 వ పేజీ చూడండి....)

పదండి లోపలికి!



ముఖ చిత్రం:

"నారినారి నడుమ మురారి"లో 'నిరోషా'

పై వారం :

వరల్డ్ ఫుట్‌బాల్

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఎడిటోరియల్ అడ్వైజర్: శివలెంక రాధాకృష్ణ ఎడిటర్: వీరాజీ ముద్రాపకుడు: ప్రచురణకర్త: శివలెంక నాగేశ్వరరావు

విజయవాడ 9-2-1990 శక సం. 1911 మాఘమాసం 20వ తేదీ

ప్రపంచం దృష్టిలో కాశ్మీర్ సమస్య

మూడువైపుల సముద్రం, ఉత్తరాన ఎత్తైన హిమాలయాలు పెట్టని కోటగా భారతదేశం, అసలు సైన్యమే అక్కరలేకుండా శత్రుదుర్భేద్యంగా వుంటుందని బానిస భారతదేశంలో ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులు పాఠాలు చదివేవారు. కానీ *1947* ఆగస్టు *15* తరువాత హిమాలయపర్వతాలు భారతదేశానికి పెట్టని గోడలు కావని నిరూపిస్తూ పాకిస్తాన్, చైనా చివరికి భారతదేశం సహాయంతో ఏర్పడ్డ బంగ్లాదేశ్‌లు, సరిహద్దుల వెంబడి భారతదేశ సమగ్రతకు భంగం కలిగించే కవ్వింపు చర్యలు కొనసాగిస్తూ వచ్చాయి. పంజాబు సమస్య గత పది సంవత్సరాలుగా "భారతదేశానికి గుండెల్లో బల్లెమైతే," కాశ్మీర్ సమస్య ఆదినుంచి "నెత్తిమీద నిప్పుల కుంపటిగా" వుంటూ వచ్చింది.

కాశ్మీర్ అంటే భూతలస్వర్గంగా వాసికెక్కిన టూరిస్టు కేంద్రంగా; వెండితెరమీద సినిమా నటులు యుగళగీతాలు పాడుకునే ప్రణయ భూమిగా మాత్రమే సామాన్య భారతీయులకు తెలుసుకానీ, భారతదేశంలోని యితర ప్రాంతాలకీ కాశ్మీర్‌లో చెలరేగుతున్న అల్లకల్లోలం గురించి అంతంతమాత్రమే తెలుసు. *1947, 49* మధ్య కాశ్మీర్‌లో చెలరేగిన యుద్ధకాండ 'అందాల కాశ్మీర్' రాజ్యంలోని మూడింట ఒక భాగాన్ని పాకిస్తాన్ కబ్జాక్రింద వదిలిపెడితే తప్ప తాత్కాలికంగానైనా సమసిపోలేదు. ప్రపంచదేశాలు కాశ్మీర్ సమస్యని వివాదగ్రస్తమైన దాయాది స్థిరాస్తి రూపంలోనే ఆయా సందర్భాన్నిబట్టి యిరుపక్షాల వైపూ మొగ్గుచూపుతూ తమాషా చిత్తగిస్తూ వచ్చినాయన్న మాట చారిత్రక సత్యం.

1949 జనవరి *1* నుంచి *1990* జనవరి *1*దాకా నాడు సమితి జోక్యంతో యేర్పడ్డ యుద్ధ విరమణ రేఖ వెంబడి అనేక పర్యాయాలు భారత, పాకిస్తాన్‌ల మధ్య ఘర్షణలు, సంఘర్షణలు కొనసాగుతున్నాయి. భారతదేశంలో ఎన్నికలు జరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వాలు వస్తున్నాయి. అత్యధికాంశం కాంగ్రెస్ పార్టీయే ఢిల్లీ గద్దెమీద కూర్చుని ప్రజాపరిపాలన కొనసాగించింది. అయినప్పటికీ కాశ్మీర్ సమస్యని పరిష్కరించడానికి చొరవ తీసుకొని తెగింపు మార్గాన్ని అనుసరించలేదు. కాశ్మీర్ ప్రాంతానికి ప్రత్యేక రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించడంతో కాలక్రమంలో సమస్య దానికదే పరిష్కరింపబడుతుందని ఉదాసీన భావాన్ని కేంద్రప్రభుత్వం అవలంబిస్తూ వచ్చింది.

కాశ్మీర్ రాష్ట్రంలో పార్టీలు పార్టీ ఫిరాయింపులు పార్టీల కుమ్మక్కులు మొదలైనవి రకరకాలుగా వస్తూ వున్నా కూడా అక్కడ 'కాశ్మీర్ సింహం'గా ప్రసిద్ధికెక్కిన "షేక్ అబ్దుల్లా" అతని కుమారుడు లేదా అతని అల్లుడు యీ విధంగా ఒకే కుటుంబం పరిపాలన సాగిస్తూవచ్చింది. రాజ్యాంగరీత్యా ప్రత్యేక ప్రతిపత్తిని కలిగిన ఒక స్వతంత్ర ప్రాంతాన్ని పరిపాలిస్తున్న రీతిలో వ్యవహరించారు తప్ప ప్రజలను వీరు ప్రత్యేకించి ప్రధాన భారత భూభాగ సంస్కృతిలోకి మళ్లించడానికి చేసిన అదనపు ప్రయత్నాలేమీ లేవు. దీర్ఘవ్యాధికి దానిమానాన్న దాన్ని వదిలేస్తే కాలక్రమంలో రోగ నిదానం దానంతటదే సాధ్యమవుతుందని ఒక రకమైన ఆత్మవంచన ధోరణిలో కేంద్రం వ్యవహరిస్తూ వచ్చిందని మనం అనుకుంటే తప్పులేదు.

ఇటీవల చరిత్రాత్మక ఎన్నికలకు ముందుకూడా 'బోఫోర్స్' ప్రహసనాన్ని రక్తి కట్టించే విధంగా పాలక ప్రతిపక్షాలు రెండూ పార్లమెంటులో వ్యవహరిస్తున్నప్పుడు కాశ్మీర్ వ్యవహారం చాపక్రింద నీరులాగా విషమిస్తున్నదని గగ్గోలు పెట్టింది పత్రికలు, ప్రజలు మాత్రమే! ఇటు ఇలా వుండగా అటు పాకిస్తాన్ 'బంగ్లాదేశ్' విషయంలో భారతదేశం అనుసరించిన వైఖరిని 'మానని గాయంగా' గుండెల్లో పెట్టుకొని 'ఆజాద్ కాశ్మీర్' పేరిట చెలామణీ అవుతున్న ఆక్రమిత భారతభూభాగం ఒక కీలకక్షేత్రంగా సైనికంగా, రాజకీయంగా రకరకాల కుతంత్రాలను పన్నుతూ, ఆగడాలు చేయిస్తూ వచ్చింది.

*1965*లో రాజస్థాన్‌లోని 'కచ్ బాడవా' తగాదా పరిష్కరించుకొన్నట్లు కాశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి భారతదేశానికిగానీ, పాకిస్తాన్‌కిగానీ ధైర్యం చాలకపోవడంతో కాశ్మీర్ సమస్య రావణాసురుడి కాష్టంగా తయారయ్యింది. నేషనల్ ఫ్రంట్ గవర్నమెంట్ వస్తూనే కాశ్మీర్ సమస్యని అనాలోచితంగా ఎదుర్కొని మరింత విషమం చేసింది. అయితే భారత, పాకిస్తాన్‌ల మధ్య వివాదగ్రస్తమైన భూమిగానే ప్రపంచంలోని చాలాదేశాలు సూపర్ పవర్స్‌లో ఒకటయిన అమెరికా విశ్వసిస్తున్నాయని గ్రహించడంలో వి. పి. సింగ్ ప్రభుత్వం యిప్పటికైనా విజ్ఞతా వివేకం ప్రదర్శించింది.

దౌత్య స్థాయిలో అంతర్జాతీయ రాజకీయ రంగంలో పాకిస్తాన్ పన్నుతున్న కుట్రకుతంత్రాలను బహిర్గతం చేయడానికి భారత ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించింది. పరస్పర చర్చల ద్వారా కాశ్మీర్ సమస్యని పరిష్కరించడం పాకిస్తాన్‌కి యిష్టం లేనపుడు బాహాబాహీ పోరాటానికి ఆ దేశం కవ్వింపుచర్యలు చేస్తున్నప్పుడు ప్రపంచం దృష్టిని యిటు మరల్చడం చాలా ముఖ్యం. ఈ "దౌత్యవ్యూహం" విజయవంతంగా సాగాలని అందరూ ఆశించాలి! ○

తాజా కాలమ్

వీరాజీ

1977 లో జనతా గవర్నమెంట్ ఈ 'పద్మ' అవార్డులని రద్దు చేసింది. అదే విధంగా ఫ్రంట్ గవర్నమెంట్ కూడా 'పద్మశ్రీ'ల జాబితాని పెంచడం మానేస్తుందని అనుకొన్నవాళ్ళు కొంతమందైనా వున్నారు. కేంద్రప్రభుత్వం ఈ అవార్డులను రద్దు చేయకపోగా వందదాకా సాగదీసింది. ఇంతమంది పద్మశ్రీలు (69) లోగడ వున్నట్టుగా లేదు. వడ్డింపులు కాంగ్రెస్ గవర్నమెంట్ పద్ధతిలోనే జరిగాయి. ముగ్గురు జర్నలిస్టులకి పద్మభూషణ్‌లు, ఆరుగురు జర్నలిస్టులకు 'పద్మశ్రీ'లు దొరికాయి. బాబాయి నెదిరించిన అబ్బాయి 'హిందూరామ్'కు, 'ఎక్స్‌ప్రెస్

అవార్డుల మేళా


అరుణ్‌శౌరీ'కి, సీనియర్ జర్నలిస్ట్ 'శ్రీ నిఖిల్ చక్రవర్తి'కి పద్మభూషణ్ అలంకారాలు లభించడంతో అన్ని వర్గాలకీ తృప్తి కలిగింది. ప్రవాస భారతీయులతోపాటు 'చిత్రా సుబ్రమణ్యం'కి కూడా ఒక 'శ్రీ' పంపిస్తే పోయేది. కానీ ఆశ్చర్యమేమిటంటే 'శత్రుఘన్‌సిన్హా'ని వి. పి. సింగ్ గారు మర్చిపోవడం. కాంగ్రెస్ ఓడిపోగానే టి. వి. తెర మీద రావలసిన 'అమితాబ్‌బచ్చన్'



చిత్రా సుబ్రహ్మణ్యం

సినిమాను రద్దు చేసి శత్రుఘన్‌సిన్హా నటించిన హిందీ సినిమాని ప్రసారం చేయడం అందరికీ జ్ఞాపకం వుండే వుంటుంది!

'అగ్ని' ఫేమ్ 'జౌల్ ఫకీర్ జైనులబ్దున్ అబ్దుల్ కలామ్' గారికి 'పద్మవిభూషణ్' యిచ్చి సత్కరించినందుకు 'ఆంధ్రప్రదేశ్'లో ఎక్కువమంది సంతోషిస్తారు. యీ మధ్యనే యీయనతో ప్రత్యేకమైన యింటర్వ్యూ 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' పాఠకులు చదివారు. నటులు 'ఓంపురి,



ఎన్. రామ్


కమల్‌హాసన్'ల సరసన మన తెలుగు నవ్వుల జల్లు అల్లు రామలింగయ్య' 'పద్మశ్రీ' నందుకోవడం మనకి ముఖ్యంగా సంతోషం. కాకపోతే యీసారీ బెంగాలీబాబులకి కొద్దిగా వర్షన తక్కువగా జరిగింది.

'బోఫోర్స్' ఉదంతంలో 'ఎన్. రామ్' కన్నా ఎక్కువ, పదిమంది దృష్టిలో పడ్డ 'సి. ఎ. జి' 'టి. ఎన్. చతుర్వేది'కి నేరుగా 'పద్మవిభూషణ్' లభించింది. నిష్పక్షపాత వైఖరి, ఉద్యోగ విధి నిర్వహణా తత్పరత ప్రదర్శించడం కూడా యీ రోజుల్లో అరుదైన విషయం కనుక చతుర్వేదికి యింత పెద్ద అవార్డు ఫ్రంట్ గవర్నమెంట్ యిచ్చి ఒక క్రొత్త ఒరవడిని తీసుకు వచ్చిందనుకోవాలి. అయితే నిష్పాక్షిక దృష్టి అవార్డులు పంపిణీ చేయడంలో కూడా పార్టీ యేదైనా గవర్నమెంట్‌లు చూపించటం మనదేశంలో జరగదు. అందుకనే తెలుగు సినిమా రంగంలో కనీసం మరొక నాలుగయిదు అవార్డులయినా రానందుకు చింతించవలసిన పనిలేదు. అలాగే నూరు టెస్టులు నాలుగు వేల పరుగులు, 350కి పైగా వికెట్లు తీసుకున్న 'కపిల్‌దేవ్' ఈసారి 'పద్మశ్రీ' నుంచి 'పద్మభూషణ్'కి ప్రమోషన్ సాధిస్తాడని చాలామంది అభిమానులు అనుకొన్నారు. కానీ కాంగ్రెస్ అభిమాని కాబోలు!యీ జాబితాలో లేడు. నిఖిల్‌చక్రవర్తి అవార్డు తిరస్కరించారు.

'పవర్ కట్' మామూలే!

ఇల్లు కొత్తయితే ఎలుకలు కొత్త! అన్నట్టుగా వుంది. "ఎన్టీఆర్" చేయలేనిది ఏమున్నది, ఇంటింటా అతని కీర్తి వెలుగుచున్నది" అని ఆంధ్రదేశమంతా "రుంజవాయించిన" స్లోగన్ యింకా చాలామంది మర్చిపోలేదు. కానీ శ్రీ ఎన్టీఆర్ మాత్రం ఆకాశమంత మనిషి కనుక హాయిగా 'విశ్వామిత్ర' షూటింగ్ చేసుకుంటున్నాడు. ఆ హైదరాబాద్‌లో నీటి కట కట, ఆంధ్ర దేశంలో పవర్ కట్‌లు ఎత్తి వేయలేని 'ఎన్టీఆర్'ని ఆంధ్ర జనం ఎత్తివేశారు కానీ ఆ రెండు కటకటలు ఆంధ్రప్రదేశ్‌ని, ఆంధ్రప్రదేశ్ రాజధానిని వదిలి పెట్టనంటున్నాయి. వీటికితోడు 'ఆర్టీసీ' బస్ ఛార్జీలు పెంచే ఉద్దేశ్యంలో వుంది గవర్నమెంట్. రైల్వేలు, బస్సులు తంతి తపాలా సర్వీసులు వీటి మీద లాభాలు రావాలి అనుకున్నంత కాలం మన ప్రభుత్వాలు సరియైన పరిపాలన చేయలేవు. ఈ సౌకర్యాలను జాతీయం చేసి పోటీ లేకుండా యీ సర్వీసులని చెలాయించాలనుకున్నప్పుడు వాటిని సబ్సిడీలు యివ్వడం ద్వారా నిర్వహించవలసిందే కానీ "పుండు మీద కారం" జల్లినట్టుగా యేడాదికో రెండేళ్ళకో అనవాయితీగా బస్సు రేట్లు, ఎలక్ట్రిసిటీ రేట్లు పెంచుకుంటూ పోవడం ప్రజాస్వామ్యం మాత్రం కాదు. 'డా. మర్రి చెన్నారెడ్డి' గారు వారసత్వంగా సంక్రమించిన గడ్డు సమస్యలెన్నింటినో ఎదుర్కొనవలసిన తరుణంలో 'సందట్లో సాడేమియా' అన్నట్టు 'హుస్సేన్ సాగర్'లో 'బుద్ధ విగ్రహం' బండ సమస్య ఒకటి. కోటి రూపాయలు ఖర్చు పెట్టి చెఱువులో బుద్ధ భగవానుడి ఏకశిలా విగ్రహం స్థాపించడం కన్నా, ఎండాకాలంలో జంటనగరాలకి మంచినీళ్ల సదుపాయం కల్పించడానికి పథకాలు ఆలోచించడం మేలు. ఇటువంటి విగ్రహ ప్రతిష్ఠల వల్ల ప్రజా చైతన్యం వస్తుందనుకోవడం ఫ్యూడల్ వ్యవస్థకి 'మంగళహారతి' పట్టడమే అవుతుంది. కోటి రూపాయలతో చేయగల పనులు, మనలాంటి పేద రాష్ట్రంలో చాలా వుంటాయి. 'డిస్నీలాండ్'లు, 'బుద్ధ విగ్రహాలు' వీటిని స్థాపించే కాలం ఎప్పుడైనా వస్తుంది. ప్రస్తుతానికి వాయిదా వేయడమే మంచిది.

○



టి.ఎన్. చతుర్వేది | సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ | మహారాజపురం సంతానం

1990 పద్మవిభూషణ, భూషణ, శ్రీ అవార్డులు

ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది పలు రంగాలలోని ప్రముఖులకి 6 మందికి 'పద్మవిభూషణ్', మొత్తం 25 మందికి 'పద్మభూషణ్', మొత్తం 69 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రకటించారు.

అత్యున్నత అవార్డు 'పద్మవిభూషణ్' విజేతలలో కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సి. ఎ. జి.) శ్రీ టి.ఎన్. చతుర్వేది, ప్రఖ్యాత శాస్త్రీయ విద్వాంసుడు కుమార్ గంధర్వ్, మద్రాసుకు చెందిన కర్నాటక గాత్ర సంగీత విద్వాంసుడు శ్రీ సెమ్మంగుడి రాధాకృష్ణ అయ్యర్, శ్రీనివాస అయ్యర్, డాక్టర్ అవుల్ పకీర్ జైనులుద్దీన్ అబ్దుల్ కలామ్ (అంతరిక్ష క్షిపణి సాంకేతిక పరిజ్ఞానం, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్) వున్నారు.

'పద్మభూషణ్' అవార్డు విజేతలలో ప్రముఖ జర్నలిస్టులు శ్రీ అరుణ్ శౌరి, శ్రీ ఎన్. రామ్ వున్నారు.

పద్మశ్రీ అవార్డు పొందిన ప్రముఖులలో తెలుగు సినీ నటుడు శ్రీ అల్లు రామలింగయ్య, సినీనటుడు కమల్ హాసన్, మద్రాసుకు చెందిన కర్నాటక గాత్ర సంగీత విద్వాంసుడు శ్రీ మహారాజపురం సంతానం, బొంబాయికి చెందిన రంగస్థల సినీనటుడు శ్రీ ఓంపురి, శ్రీ బందా వాసుదేవరావ్ వున్నారు.



కమల్ హాసన్ | అల్లు రామలింగయ్య | ఓంపురి

కంప్యూటర్‌లు ప్రేమిస్తాయా?

కంప్యూటర్లు కేవలం తమకు అప్పగించిన పనులను నిర్వర్తించడమే కాక... తాము చేసే పనిని ఆకళింపు చేసుకునే స్థాయికి ఎదిగితే?కంప్యూటర్లు... ఏదో 'వీడియో గేము'ల్లో మాదిరి కృత్రిమంగా కాకుండా సహజ సంభాషణా స్వరాలతో మాట్లాడగలిగితే?అప్పుడు కంప్యూటర్లు ఖచ్చితంగా 'రెండు మార్గాల' కమ్యూనికేషన్ వ్యవస్థగా రూపొంది తీరుతాయి. అప్పుడు కంప్యూటర్ 'కీ బోర్డ్' సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి ఉపకరించే సాధనంగా మరింత సామర్థ్యాన్ని సంతరించుకుంటుంది.

ఇటువంటి 'ఇంటరాక్టివ్ సిస్టమ్'ని రూపొందించే కృషిలో తొలి ప్రయత్నాన్ని 1985లో ఉత్తర కరొలినాలోని డ్యూక్ యూనివర్శిటీకి చెందిన అమెరికన్ పరిశోధకులు ప్రారంభించారు. కంప్యూటర్ సైన్సు విభాగం అసోసియేషన్ ప్రొఫెసర్‌గా వున్న అలాన్ డబ్ల్యు. బీర్మన్ నేతృత్వంలోని ఈ 'డ్యూక్' శాస్త్రవేత్తలు మొట్ట మొదటిసారిగా... మాటలకు, స్పర్శకు ప్రతిస్పందించి పని చేసే కంప్యూటర్ వ్యవస్థను రూపొందించారు. ఆ తర్వాత గొంతు, స్పర్శ, వాక్యాలు- ఈ మూడింటికి ప్రతిస్పందించి మరింత వేగంగా పని చేసే ఇతర 'మేధాశక్తి' వ్యవస్థలు కూడా అభివృద్ధి చెందాయి.


'డ్యూక్' వద్ద రూపొందిన 'వాయిస్ ఇంటరాక్టివ్ సిస్టమ్' (విస్)లో వినియోగదారుడు మాట్లాడటం ద్వారా, లేదా కంప్యూటర్ తెరను స్పృశించడం ద్వారా ఈ వ్యవస్థకు 'ఆజ్ఞలు' ఇవ్వగలడు. ఇందులో సుమారు 80 పదాలు నిక్షిప్తమై వుంటాయి. ఈ 80 పదాలనుండి వాక్యాల్ని తయారు చేసుకుని వాటి ద్వారా ఈ వ్యవస్థకు 'ఆజ్ఞలు' ఇవ్వవచ్చు.

'ఆజ్ఞలకు' ప్రతిస్పందించి పని చేయడంలో ఈ వ్యవస్థ రెండంచెల క్రమానికి లోనవుతుంది. మొదటి అంచెలో ఒక 'రికగ్నయిజర్' పరికరం ఈ వ్యవస్థకు వచ్చిన 'ఆజ్ఞ'లోని భాషను, కంప్యూటర్‌లో అప్పటికే నిక్షిప్తమైవున్న భాషను సరిపోల్చి చూస్తుంది. ఆ తర్వాత 'రికగ్నయిజర్'లోని 'ఆజ్ఞ'లను ఒక 'హోస్ట్ కంప్యూటర్' గ్రహించి వాటిని కంప్యూటర్ తేలికగా అర్థం చేసుకునే విధంగా అనువదిస్తుంది. మనుషులు మాట్లాడే తరహాలో... సహజమైన స్వర రీతులలో మాట్లాడగల నూతన స్వర ప్రతిస్పందనా వ్యవస్థల రూపకల్పన తమ లక్ష్యమని ఆయన చెప్పారు.

అయితే కంప్యూటర్ అనేది మనిషి మాదిరిగా ఆలోచించడం సాధ్యం కాదు కనుక మనిషిని పూర్తిగా తలపించగల 'హ్యూమనిస్టిక్ కంప్యూటర్' రూపకల్పన జరగడం కూడా సాధ్యం కాని విషయమని తాము భావిస్తున్నామని బీర్మన్ అన్నారు. "అట్టి కంప్యూటర్ ఈ శతాబ్దంలో... బహుశ ఎప్పటికీ తయారవ్వదు" అని ఆయన చెప్పారు.

భీమారావుకి బి.పి. వచ్చింది

లక్ష్మీశ్రీనివాసన



భీమారావు కోసం ఎదురు చూస్తోంది సుబ్బలక్ష్మి...

తనమీది కోపంతో విసురుగా బయటి కెళ్ళిన మనిషి – రెండు గంటలు గడిచి పోయినా ఇంటికి రాలేదు.... వెళ్తూ వెళ్తూ ఎనిమిదేళ్ళ వెంకటేశుని కూడా వెంట తీసుకు పోయాడు. ఏం మనిషో ఏమిటో ... ఎందుకు రాలేదో ఏమిటో ...

అంత టైమయినా అతను రానందుకు సుబ్బలక్ష్మికో పక్క ఆత్రంగా వుంది. మరో ప్రక్క ఆనాటి భర్త ప్రవర్తనకు బాధగానూ వుంది...

సుబ్బలక్ష్మి, భీమారావులు దంపతులై పదేళ్ళయ్యింది. అప్పట్నుంచీ సంసారం బాధ్యత అంతా సుబ్బలక్ష్మిదే.... ఏదో చిన్న ఫరమ్‌లో ఉద్యోగం చేస్తున్న భీమారావు– వచ్చిన జీతం భార్యకు తెచ్చివ్వడం వరకే తప్ప ఇంటి గొడవెప్పుడూ పట్టించుకోలేదు. తన కాళీ సమయాల్ని సస్పెన్స్, థ్రిల్లర్ నవలలు చదవడాని కంకితం చేసేసి – ఆఖరకు కాయగూరలు తెచ్చుకునే పని కూడా సుబ్బలక్ష్మికే అప్పగించేశాడు.

తనకొచ్చే కొద్దిపాటి ఆదాయంతో గుట్టుగా సంసారం నడుపుకొస్తున్న భార్య మీద ప్రగాఢమైన ప్రేమ, అపారమైన నమ్మకం వున్నాయతడికి.

అలాంటి భీమారావారోజు సుబ్బలక్ష్మిని అనుమానించి అనరాని మాటలన్నీ అన్నాడు. అందుక్కారణం – తెచ్చిన జీతం తెచ్చినట్టు తనిచ్చేస్తున్నా గత అయిదారు నెలల్నుంచి సరిపోవడం లేదని సణుక్కోవడం – నెలకో యాభై – అరవై రూపాయల వరకూ అప్పు చేస్తున్నానని చెప్పడం మొదలు పెట్టింది సుబ్బలక్ష్మి. ఎప్పటికప్పుడు వినీ విననట్టుగా వూరుకుంటున్న భీమారావుకి – యధాప్రకారం ఆ నెలకూడా యాభై అప్పు తెచ్చాననీ, తెచ్చిన యాభైతో అప్పు మొత్తం ఆరునంద లైందనీ సుబ్బలక్ష్మి చెప్పడంతో వెర్రికోపం వచ్చేసింది... ఇక వెనక ముందు లాలోచించకుండా, "నువ్వొత్త దుబారా మనిషివి. అనవసరపు ఖర్చులన్నీ పెట్టి నన్ను అప్పుల పాల్జేసేస్తున్నావ"ని మండిపడ్డాడు.

సుబ్బలక్ష్మి వూరుకుంటే ఏమౌనోగాని వూరుకోలేదు... "మీరిస్తున్న డబ్బు చాలకపోతే నేనేం చెయ్యను... నగానట్రల మాటిలా వున్నా మిమ్మల్ని పెళ్ళి చేసుకున్న పుణ్యానికి ఆనాటి నుంచి ఈనాటి వరకూ మంచి చీర కొనుక్కొని ఎరగను... నలుగురిలా సరదాగా సినిమాకెళ్ళి ఎరగను...." అంటూ తనూ ఇంతెత్తున ఎగిరిపడింది.

దాంతో మరింత రెచ్చిపోయి, ఇష్టమొచ్చినట్టు భార్యను తిట్టి, "నువ్వు దొరకని దొంగవి! నా సొమ్మంతా మీ అమ్మగారికి దోచి పెడుతున్నావు. ఇకనుంచి నీ పెత్తనం పనిచెయ్యదు!.... నేనే బజారుకెళ్ళి అన్నీ తెచ్చి నీ ముఖాన కొడతాను!" అని

భార్య చేతిలో వున్న యాభై నోటు లాక్కొని - ముందుకు తూలి పడబోయి నిలదొక్కుకొని - వెంకటేశుని చేతి సంచీ పట్టుకు తన వెంట రమ్మని చెప్పి, చరచరా బయటి కెళ్ళిపోయాడు భీమారావు

అదిగో, ఆ క్షణం నుంచే సుబ్బలక్ష్మి బాధపడి పోతూంది ఆమె తల్లి, అన్నగారు అవూళ్ళో వున్న మాట నిజమేగాని - వాళ్ళకు దోచి పెడుతున్నావన్న భీమారావు మాట మాత్రం శుద్ధ అబద్ధం! తనెంత పొదుపుగా సంసారం నడుపుకొస్తుందో తెలిసీ - భీమారావన్న వాడి బాణాల్లాంటి మాటల్నామె మర్చిపోవాలన్నా మర్చిపోలేక పోతోంది

బాధతో, ఆతృతతో సుబ్బలక్ష్మి అలా ఎదురు చూస్తుండగానే మరో అరగంట గడిచి పోయింది అప్పుడు కనిపించాడు అల్లంత దూరంలో - పరిగెత్తు కొస్తున్న వెంకటేశు వాడి చేతిలో సంచీగించి ఏం లేదు వాడి వెనుక గాని - ముందుగాని భీమారావొస్తున్న జాడలేదు

'ఏమైంది? వాడొక్కడే వస్తున్నాడేమిటి?' అని సుబ్బలక్ష్మి అనుకుంటూండగానే - పరుగు పందెంలో పాల్గొన్న వాడిలా దూసుకొచ్చిన వెంకటేశు, అమ్మా అమ్మా నాన్న అకస్మాత్తుగా పడిపోయారు మాట్లాడ్డం లేదు అక్కడి వాళ్ళిద్దరు కలిసి మెయిన్ రోడ్‌లో వున్న శాస్త్రిగారి ఆసుపత్రిలో నాన్నను చేర్చారు! అన్నాడు ఆయాసంతో రొప్పుతూ

సుబ్బలక్ష్మి గుండె గుబేల్ మంది ఆమెకు లోకమంతా చీకట్లై పోయినట్టు - భూమి గిర్రున తిరిగి పోతున్నట్టు అనిపించింది ఎగదన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగే ప్రయత్నం చేస్తూ ఎలాగో తలుపు తాళం వేసి వేంకటేశుతో బాటు రోడ్డు మీది కొచ్చింది అటుగా పోతున్న ఖాళీ రిక్షాను పిల్చి, మెయిన్ రోడ్‌లో వున్న శాస్త్రిగారి ఆస్పత్రికి తొందరగా పోనివ్వమని చెప్పి రిక్షాలో కూర్చొంది

జరిగినదంతా ఓ పీడకలలా అనిపించ సాగిందామెకు... ఇలా జరగడానికి కారణం తనేనేమో... ఆవేశంలో భర్త ఏదో అన్నంతలో తనెందు కావేశపడాలి? తనలా ఆవేశ పడినందుకే- అతడి ఆవేశం మరింత అధికమై మనిషి నిలువెల్లా వూగిపోయాడు. అసలు ఇంటిదగ్గరే పడిపోతా డనుకుంది తను. ఇప్పుడిలా వుంటుందో... ఏమో . 'ఏడుకొండల వాడా! వెంకటరమణా! నీ కొండ-కొస్తాం తండ్రీ.. నా భర్తను కాపాడు.. నా పసుపు కుంకుమలు నిలబెట్టు!!..' అని ఏడుకొండల వాడికి మొక్కుకొని - ఆ వెంటనే 'ఎంతపని చేశాను. పాపిష్టిదాన్ని, పాపిష్టి దాన్ని.. ' అంటూ తనను తాను తిట్టుకోసాగింది. ఆమెకు తెలియకుండానే కళ్ళ వెంబడి నీళ్ళు జలజల క్రిందికి రాలిపోతున్నాయి

రిక్షా కొంతదూరం వెళ్ళే సరికి - ఏదో పనిమీద సైకిలు తొక్కుకుంటూ వస్తున్న సుబ్బలక్ష్మి అన్న అప్పారావు - పవిట చెంగుతో కళ్ళొత్తుకుంటూ రిక్షాలో కూర్చున్న చెల్లెల్ని - మేనల్లుణ్ణి చూసి, సడెన్ బ్రేక్‌తో సైకిలాపి, ఏమైందమ్మా!.. ఎక్కడి కెళుతున్నారు?" అన్నాడు ఆందోళనగా

దేవుడు పంపినట్టు ఎదురొచ్చిన అన్నగార్ని చూసి, దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో తన భర్త సంగతి చెప్పింది సుబ్బలక్ష్మి ఆ వార్త వింటూనే అప్పారావు అదిరిపడ్డాడు అనుకోకుండా చెల్లెలి కలాంటి కష్టం వచ్చినందుకు మధన పడుతూ సైకిలు వెనక్కి తిప్పి రిక్షాననుసరించాడు

★ ★ ★ ★

ఇరవై నిమిషాల తర్వాత రిక్షా శాస్త్రిగారి ఆసుపత్రి ముందాగింది

రిక్షా దిగుతూనే తల్లిని, మేనమామను తండ్రి వున్న గదిలోకి తీసుకెళ్ళాడు వెంకటేశు వాళ్ళా గదిలో అడుగు పెట్టిన సమయానికి డాక్టర్‌గారు భీమారావుకి బి పి చూస్తున్నారు ఆయన దగ్గరే కాంపౌండర్‌తో బాటు - మీసాలు పెంచుకున్న మరొకతను కూడా చేతులు కట్టుకొని నిలబడి వున్నాడు

స్పృహలేకుండా బెడ్ మీద పడున్న భీమా రావును చూస్తూనే హొల్లుమంది సుబ్బలక్ష్మి

ఏడవకండమ్మా ఏడవకండి ఈయన మీకేమవుతారు? ఆప్యాయంగా అడిగారు డాక్టర్ గారు

ఆయన మా శ్రీవారండి! ఏడుస్తూనే చెప్పింది సుబ్బలక్ష్మి

వూరుకోండమ్మా ఏం భయం లేదూరుకోండి మీ వారికి హై బి పి వచ్చింది ఇప్పుడు కొంతవరకు కంట్రోలైంది లెండి! కొన్నేపట్లో పూర్తిగా సర్దుకోవచ్చు మీరేం కంగారుపడాల్సిన పనిలేదు గాని మందులు మాత్రం క్రమం తప్పకుండా వాడాలి నేను మళ్ళీ వచ్చి చూసి మందులు వ్రాసిస్తాను మీరు ధైర్యంగా వుండండి! అని చెప్పిన - కాంపౌండర్ని వెంట బెట్టుకొని ప్రక్క రూమ్‌లో కెళ్ళారు డాక్టరుగారు

'బి పి. వచ్చిందా! బావకప్పుడే బి పి రావడమేమిటి? అందులోనూ హై బి పి. " ఆశ్చర్యపోతూ అన్నాడు అప్పారావు.

కష్టించి పని చేసే తన భర్తకంత అకస్మాత్తుగా బి పి. ఎందుకొచ్చిందాని తల్లడిల్లుతున్న సుబ్బలక్ష్మి మాట్లాడలేదు.


ఏమమ్మా. మీవారు అప్పుడప్పుడూ హఠాత్తుగా పడిపోతుంటారా? అన్నాడు. అంతవరకూ మౌనంగా వున్న మీసాలతను


"ఇంతవరకెన్నడూ ఆయనిలా పడిపోవడం జరగలేదండి!' అంది సుబ్బలక్ష్మి

"అమ్మా! అమ్మా! ఇతడేనమ్మా ఇందాక నాన్ననేదో అన్నాడు! వున్నట్టుండి పట్టుకున్న చెప్పాడు వెంకటేశు

ఏమిట్రా ఏమిటి ఏమన్నాడితను? అనుమానంగా మీసాలతన్ని చూస్తూ అడిగాడు అప్పారావు

వెంకటేశు ఒకటి రెండు క్షణాలపాటు తలగోక్కుని, ఏమిటేమిటో గబగబా అన్నాడు మావయ్యా! నేను సరిగ్గా విన్లేదు అప్పుడక్కడికి రంగు రంగుల బూరలమ్మేవాడొస్తే చూస్తున్నాను- ఇంతలో నాన్న దబ్బున పడిపోయ్యారు నేను లబోదిబోమని ఏడుస్తుంటే - ఈ మీసాలతను, మరొకతను కలిసి





-ఎన్.టి.ఆర్. పవర్ కట్ చేసేసినాం!

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి- ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలే గాని బాధించకూడదు రసభరితంగా వుండాలే గాని అశ్లీలం కొట్టవచ్చి నట్టుండరాదు. కార్డు మీద మాత్రం రాయాలి ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!- ఈ విషయంలో సంపాదకునిదేతుది నిర్ణయం.

17-2-'90 లోగా అందేలాగా రిపార్టీలు పంపించాలి

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం బహుమతులు పొందిన రెండూకాక- మరికొన్ని యిక్కడ వేశాము తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేక పోయాం లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేగని నిరుత్సాహపడక మళ్ళీ ప్రయత్నించండి.

– ఎడిటర్

"నా కత్తి నాకు ముఖ్యం...అదిలేందే పార్లమెంటులోకి రాను"

* రు. 25 బహుమతి పొందిన రిపార్టీ:

"మహాశయా! మీలాంటి వారు అక్కడ ఉపయోగించాల్సింది కత్తి కాదు 'సుత్తి!' "

-వేదుల నరసింహాశర్మ (శంఖవరం)

* రు. 15 బహుమతి పొందిన రిపార్టీ:

"అయితే సభ్యులెవరూ తిరుపతి వెళ్లక్కర్లేదంటారు!"

-వి. వెంకటేశ్వరరెడ్డి (నెల్లూరు)

మరి కొన్ని వాగ్బాణాలు

"'బోఫోర్స్ గన్' వుందిగా చాలదా!"

-ఎం. సుధాకర్ (విజయవాడ)

"నానెత్తి నాకూ ముఖ్యం...హెల్మెట్‌లేందే నేనూరాను!"

-మణి స్టూడియో (నంద్యాల)

లక్కీ పేర్లు:

ఎల్. ఫణీంద్రనాథ్ (ధర్మవరం), వి. అప్పారావు (నాపడా), కె. శ్రీవాణి (గుళ్లపల్లి), జి.యు.ఎం. నాగేంద్రన్ (తణుకు), మాధవ్ (హైదరాబాద్), రవి (వరంగల్), కె.ఎస్. మాచన్న (తాళ్లపూడి), ఆర్. పురుషోత్తం (కలకోట), జి. సత్యసాయి (ఇందుపల్లి), డి. సత్యనారాయణ (పాత మంగళగిరి).

భీమారావుకి బి. పి. వచ్చింది

నాన్నను ఇక్కడకు తీసుకొచ్చి, మీ పెద్దాళ్ళని ఎల్లుండి రమ్మని నాతో చెప్పారు' అన్నాడు

మరింకొకతనేమయ్యాడురా" అన్నాడు అప్పారావు

అటూ ఇటూ చూసి పెదవి విరిచాడు వెంకటేశు

అతను వెళ్ళిపోయాడు లెండి' ఇప్పుడతనో పనేమిటి మీకు" అన్నాడు మిసాలతను

నిజమే అతనో పనేం లేదు అసలు పనంతా మీతోనే వుంది' చెప్పండి మా బావగార్ని మీరేమన్నారు" కోపంగా అన్నాడు అప్పారావు

ఏమిటండి మీ మాటలు" ఏదో పుణ్యానికి పోతే పాపం ఎదురైందన్నట్టుగా వుంది' ఆయన్ని నేనేమంటానండీ" అసలెందుకంటానంటారు" అన్నాడతను తెల్లబోతూ

మీరేదో అన్నారని మావాడు చెబుతున్నాడు ఏమన్నారో మర్యాదగా చెప్పండి' లేకపోతే ఎలా చెప్పించాలో నాకు తెలుసు" అన్నాడు కళ్ళెర్రజేసి అప్పారావు

సుబ్బలక్ష్మి కూడా అతడి వైపు అనుమానాస్పదంగా చూస్తూ ఆయన కావేశం కలిగించే మాటలేవో మీరనే వుంటారు' లేకపోతే అంత అకస్మాత్తుగా ఎందుకు విరుచుకు పడిపోతారు! మీరు నిజం చెప్పకపోతే పోలీసు కంప్లైంట్ ఇవ్వాల్సి వస్తుంది ' అంది హెచ్చరిస్తున్నట్టుగా

ఇదెక్కడి లేనిపోని గొడవండీ నాకు" మా ఇంటి ఇల్లాలి మీద ఒట్టేసి చెబుతున్నాను నిజంగా నేనేమి అన్లేదండి ఏదో సంచీ చేత బట్టుకొని ఈయన నా కొట్టు దగ్గరికొచ్చారు- కేజీ కలో ఎంతన్నారు" పది యాపాయలన్నాను – టమోటా లెంతన్నారు' పన్నెండన్నాను.- ఆ గాకరకాయ లెంతన్నారు' ఇరవై అన్నాను- ఇరవయ్యా ఇరవయ్యా అంటూ విరుచుకు పడిపోయారండి నాకు మతిపోయి – వెంటనే మావాడి సాయంతో ఈయన్నీ ఆస్పత్రికి తీసుకొచ్చాను మిసాలతను చెప్పడం ఆపి 'ఇందులో నా తప్పేముందో చెప్పమన్న'ట్టుగా సుబ్బలక్ష్మి, అప్పారావుల వైపు చూశాడు


సారీ, గురూగారూ మిమ్మల్ని అపార్థం చేసుకున్నాం- సంసారం గొడవ పట్టించుకోని మా బావగారిది, సామాన్యుడికి బి పి వచ్చేలా పెరుగుతున్న ధరలది, ధరలెంతగా పెరుగుతున్నా పట్టించుకోని ప్రభువులదే తప్పు ఇందులో మీ తప్పెంత మాత్రం లేదు" అంటూ బెడ్ మీదున్న బావగారి వైపు జాలిగా చూశాడు అప్పారావు

రాకరాక బజారుకొచ్చి బి పి కొని తెచ్చుకున్న భీమారావుని చూస్తూ మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకొంది సుబ్బలక్ష్మి

○

మెడ్విన్ హామీతో మీ ఆరోగ్యం పదిలం...
చెదరదు ఆ దరహాసం.

MEDWIN



శాస్త్రీయంగా నిర్వహించబడే మెడ్విన్ హాస్పిటల్స్ అత్యంత విశ్వసనీయమైన రోగ నిర్ధారణ సేవలతో బాటు అన్ని శాఖలలోనూ వైద్య సలహాలు, శస్త్ర చికిత్సా సదుపాయాలను కూడా కల్పిస్తోంది.

హాస్పిటల్ :

* 250 మంది రోగులకు అత్యంత సుఖప్రదమైన వసతి
* మొత్తం సెంట్రల్ ఎయిర్ కండిషన్ చేయబడింది
* 12 అంతస్తులలో 1.5 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణం
* పేషెంట్ల ఆహ్లాదానికై ప్రతి రూములోనూ టెలివిజన్ సెట్
* హైదరాబాదు నగరపు నడిబొడ్డున నిర్మించబడింది.

ప్రత్యేకతలు :

న్యూరాలజీ, న్యూరోసర్జరీ, కాన్సర్, గుండె జబ్బులు, గుండె పునఃపరిశీలనం శస్త్ర చికిత్స, శిశు వైద్యము, చిన్న పిల్లలకు శస్త్ర చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ, గాస్ట్రో ఎంటెరాలజీ, నేత్ర చికిత్స, శిశు వైద్యము, ఎముకల వైద్యము, ప్రసూతి వైద్యము, మూత్ర వ్యాధుల చికిత్స, నెఫ్రాలజీ, చెవి ముక్కు గొంతు జబ్బుల చికిత్స, దంత వైద్యము, చర్మ వ్యాధుల, మానసిక వ్యాధుల చికిత్స

శస్త్ర చికిత్సా విభాగాలు :

కొరొనరి బైపాస్, ఓపెన్ హార్ట్ సర్జరీ, రీనల్ ట్రాన్స్ ప్లాంటేషన్, న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, చిన్న పిల్లల శస్త్ర చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ.

అంతర్జాతీయ ప్రమాణాలు గల సాధన సామగ్రి :

రేడియాలజీ & ఇమేజింగ్ విభాగము : C.T. స్కాన్, ఎక్స్‌రే యంత్రాలు, ఆటోమేటిక్ ఫిల్మ్ ప్రాసెసర్లు, అల్ట్రా సౌండ్ స్కాన్, C.T. గైడెడ్ బయాప్సీ.

క్లినికల్ విభాగము :

మామూలు పరీక్షా సాధనాలతో బాటు అత్యంతాధునికమైన హిటాచీ 704 ఆటో అనలైజర్, బెక్‌మెన్ ఎలెక్ట్రోలైట్ అనలైజర్, అయానైజ్‌డ్ కాల్షియం అనలైజర్, ట్యూమర్ మార్కర్ పరీక్షలు, ఆధునికమైన రేడియో ఇమ్యునో ఎస్సే ప్రయోగశాలతో బాటు అన్ని రకాల హార్మోను పరీక్షలు.

పాథాలజీ :

కౌల్టర్ సెల్ కౌంటర్, ఆటోమేటిక్ టిష్యూ ప్రాసెసర్, మైక్రోటోమ్, ఇమ్యూనో ఫ్లూరసెంట్ మైక్రోస్కోపు, సైటోస్పిన్.

గుండెజబ్బుల విభాగము :

3 ఛానెల్ ఇ.సి.జి. కంప్యూటరైజ్డ్ ట్రెడ్‌మిల్, కలర్ డాప్లర్, హోల్టర్ మానిటరింగ్ యంత్రము, కార్డియాక్ కాథెటరైజేషన్ లాబొరేటరీ. వీటితోబాటు ఉదరకోశ వ్యాధులకై వీడియో ఎండోస్కోప్స్, ఫైబ్రోప్టిక్ క్లోనోస్కోప్స్, కాన్సర్ చికిత్సకై కోబాల్ట్ సెలెక్ట్రాన్ సామగ్రి

అంతేగాక అత్యంతాధునికమైన 9 ఆపరేషన్ థియేటర్లు, 8 పడకల ఎమర్జెన్సీ సెల్, 12 పడకల ఐ.సి.యు., ఒక పోస్ట్ ఆపరేటివ్ ఐ.సి.యు., ఒక డయాలిసిస్ యూనిట్, సరిగ్గా అయిదే అయిదు నిమిషాలలో ఫలితాలను తెలిపే ఇన్‌స్టెంట్ లాబొరేటరీ.

తన విధి నిర్వహణలో పరిపూర్ణతను సంతరించుకోవడానికి మెడ్విన్ హాస్పిటల్స్ నాణ్యతా కంట్రోలు కార్యకలాపాలలో ప్రపంచ మేటి అయిన బోరింగర్ వోల్ (ప. జర్మనీ) సంస్థతో అనుబంధం పెట్టుకున్నది.

అందరికోసం అనేక పథకాలు :

* ఆరోగ్య బీమా పథకం
* ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు
* పీరియాడిక్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాలు
* వైద్య సేవలన్నింటినీ పూర్తిగా కంప్యూటర్ ద్వారా రికార్డు చేయడం
* ఉచిత ఆరోగ్య పరీక్షా వారాలు
* 24 గంటలూ తెరిచిఉండే మందుల షాపు
* ఆంబ్యులెన్సు సదుపాయం

వైద్య రంగంలో విశిష్ట స్థానాన్ని కలిగివున్న మెడ్విన్ హాస్పిటల్స్‌కు తన అనుభవజ్ఞులైన, అద్భుతమైన డాక్టర్ల బృందం ఎంతో గర్వదాయకం. అలాగే ఆపత్సమయాలలో ఎవరికి ఎప్పుడు అవసరమవుతాయో తెలియని ఆకస్మిక సేవలందిస్తూ 24 గంటలూ పనిచేసే ఆసుపత్రి యంత్రాంగం.

పైగా యీ సేవలన్నీ మంచితనంతోనూ, మానవత్వం తోనూ రంగరింపబడి అంకిత భావంతో నిర్వహించ బడతాయి.



మెడ్విన్ హాస్పిటల్స్

(జయ డయగ్నొస్టిక్ అండ్ రీసెర్చ్ సెంటర్ లిమిటెడ్ వారి విభాగం,)
రాఘవరత్న టవర్స్, చిరాగ్ అలీ లేన్, హైదరాబాద్ – 500 001.
ఫోన్స్ : 242971 ; 2, 3, 4, 5

ADITYA–MH–102/89.

సీరియల్ ద్రౌపది

ప్రయాగ రామకృష్ణ



(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ-26: ద్రౌపదితో ఖాండవ ప్రస్థం చేరిన పాండవులు నారదుని సలహాపై రాజసూయయాగం నిర్వహిస్తారు. మయసభలో తనకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా పాండవులను జూదంలో ఓడించి దుర్యోధనుడు వారిని అడవుల పాలు చేస్తాడు. పన్నెండేళ్ల అరణ్యవాసము, ఒక యేడు అజ్ఞాతవాసము పూర్తి చేసిన పాండవులు తమకు అర్ధరాజ్యం యివ్వవలసిందిగా కృష్ణుడిని ధృతరాష్ట్రుడి వద్దకు రాయబారం పంపిస్తారు. కృష్ణుని సంధియత్నం విఫలమై యుద్ధం అనివార్యమవుతుంది. అందుకు కుంతి కూడా ఆనందిస్తుంది.

కృష్ణుడు వెంటనే ఏం చెప్పలేదు. చుట్టూ చూసాడు. తరువాత కర్ణుడి వైపు తిరిగి అన్నాడు. కుంతీదేవి కన్నె ప్రాయంలో సిద్ధ మంత్రబలంతో సూర్యుని వల్ల కన్నది నిన్ను. అందుచేత ధర్మం ప్రకారం నువ్వు పాండురాజు పెద్దకొడుకువవుతావు...'

ఆయన మాటలు ఇంకా పూర్తి కాలేదు... కర్ణుడి మొహం ఎర్రగా మారిపోయింది. మనిషి ఆవేశంతో నిలువెల్లా వణికిపోతున్నాడు.

"నువ్వేం చెప్పక్కర్లేదు. నాకు అన్నీ తెలుసు. నన్ను కని నదిలో పారేసి పోయింది కుంతీదేవి. కన్నబిడ్డకు మాతృత్వపు మమకారం అందివ్వలేని కఠిన హృదయం ఆవిడది" అన్నాడు.

కృష్ణుడు నవ్వి 'ఈ సంగతంతా పాండవులకు తెలీదు. వాళ్ళకు నే చెపుతాను. నీ తమ్ముళ్ళు అయిదుగురూ నీ పాదాలకు మ్రొక్కి నీకు పట్టాభిషేకం చేస్తారు. ధర్మరాజు తెల్లని చామరంతో విసురుతాడు. [illegible]డు శ్వేతచ్ఛత్రం పడతాడు. సవ్యసాచి సారథ్యం చేస్తాడు. మహేంద్ర వైభవంతో రాజ్యం పరిపాలిద్దువుగాని. నా వెంట వచ్చెయ్' అన్నాడు.

'ఈ బ్రతుకు శాశ్వతం కాదు. రాజ్యం, భాగ్యం అంతకంటే శాశ్వతంకాదు. అలాంటప్పుడు నన్ను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల్ని వదిలేసి కృతఘ్నుడిగా నీ వెంట నేనెందుకు రావాలి? పైగా తన స్వంత తమ్ముళ్ళ కంటే ఎక్కువ ప్రేమతో తెలిసిందంటే ధర్మరాజు రాజ్యం అంగీకరించడు.. వాళ్ళ తల్లే నాకూ కన్నతల్లని మాత్రం అతనికి తెలియనివ్వకు. అలాంటి ధర్మప్రభువు శాశ్వతంగా రాజ్యం చెయ్యడమే మనమందరం కోరుకొనేది' అన్నాడు కర్ణుడు. ఆ మాటలంటున్నప్పుడు అతని కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

అది చూసి గోపాలదేవుడు చలించిపోయాడు.

కర్ణుణ్ని ఎలాగైనా తన వైపు తిప్పుకోవాలనుకుని చివరి అస్త్రం ప్రయోగించాడు. 'నా మాట విన్నావంటే పాంచాల రాజకుమారి నిన్ను ఆరవ భర్తగా వరిస్తుంది' అన్నాడు.

కర్ణుడు నవ్వి 'ఇన్నాళ్ళూ నువ్వు సరసాగ్రేసర చక్రవర్తివే అనుకున్నాను. సంధానకర్తవు కూడా చూసుకుంటున్నాడు దుర్యోధనుడు నన్ను అతనెందుకు మోసం చేయాలి?' అన్నాడు కర్ణుడు.

'కాని కౌరవులు నీ తమ్ముళ్ళని చేస్తున్న మోసం కంటే నువ్వు కౌరవులని చెయ్యబోయే మోసమేం పెద్దది కాదు. ధృతరాష్ట్రుడి కొడుకులు ఎలాంటి వాళ్ళో- న్యాయానికి వాళ్ళెంత గౌరవం ఇస్తారో నీకూ తెలుసు' అని కృష్ణుడు అనేసరికి 'అయితే మాత్రం, నేను వున్నట్టుండి నీతో కుమ్మక్కయి పాండవుల పక్షాన చేరి అర్జునుడూ నేనూ యుద్ధం మానేస్తే నలుగురూ నవ్వరూ!' అన్నాడు కర్ణుడు. రథం మీద నుంచి చివాలున క్రిందకు దూకబోయి మళ్ళీ కృష్ణుడి వైపు తిరిగి 'నేను తనకు అన్నననన్నమాట. అయినా నన్నెందుకు ప్రలోభపెడ్తావ్? కౌరవులకూ, పాండవులకూ యుద్ధం తప్పదు. అసలు ఈ యుద్ధానికి మూలమే నేనూ, శకునీ, దుశ్శాసనుడు. అటువంటప్పుడు ఏం న్యాయం వూహించి దుర్యోధనుణ్ని వదిలిపెట్టమంటావు?' అన్నాడు.

కృష్ణుడిక లాభం లేదనుకున్నాడు.

'సరే, మీ వాళ్ళందర్నీ యుద్ధానికి సిద్ధంగా వుండమను.' జూదంలో శకుని ఒకసారి కాదు రెండుసార్లు గెలిచాడు పాండవుల్ని. ఈసారి ఇంకా పెద్ద పందెమని చెప్పు. గుర్రాలను జాగ్రత్తగా నడపమను' అని నవ్వేసి వెళ్ళిపోయాడు.

కృష్ణుడు ఉపప్లావ్యం చేరేసరికి పాండవులయిదుగురూ ఆయన కోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళు ఊహించని విషయం ఏమిటంటే- తమకు ఐదూళ్ళివ్వడానికి కూడా కౌరవులు నిరాకరించడం, స్వయంగా కృష్ణుడు వెళ్ళి అడిగినా కాదు పొమ్మనడం.

'ఇంతకీ అమ్మేమంది? ధర్మరాజు అడిగాడు.

కృష్ణుడు ఒక క్షణం వూరుకుని 'పాండవులకు అండగా నువ్వున్నావని ఇన్నాళ్ళూ అనుకునేదాన్ని నేను. ఎన్ని పోరాటాలూ, యుద్ధాలూ జరిగినా నువ్వు, నా కడుపున పుట్టిన వాళ్ళకు జయం సంపాదించి పెడతావనే పిచ్చి నమ్మకం వుండేది నాకు. ఐదూళ్ళిచ్చినా చాలని సిగ్గు లేకుండా వాళ్ళు బ్రతిమాలటం, నువ్వు రాయబారం నడపడానికి రావడం చూస్తే పాండవుల్ని కన్నందుకు నా మీద నాకే అసహ్యం వేస్తోంది అంది మీ అమ్మ చాలా నిష్ఠూరంగా నాతో' అన్నాడు.

ధర్మరాజు తల దించుకున్నాడు.

'సర్వం ఓడిపోయి నిరాధారంగా బయటకొచ్చినప్పుడు కూడా ఇంత బాధనిపించలేదు మాకు. మా కన్నతల్లే మమ్మల్ని పౌరుష హీనుల కింద జమకడితే ప్రజలెందుకు మెచ్చుకుంటారు? ఇంతకీ అమ్మకు మేం మెత్తబడటం ఇష్టం

లేదన్నమాట. మేం యుద్ధానికి సిద్ధంగా వున్నాం బావా!అంతే' అన్నాడు అర్జునుడు.

ధర్మరాజు కూడా ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు.

'మనకు దిక్కు మాధవుడెలాగో వున్నాడు. యుద్ధ ప్రయత్నాలు చెయ్యండి. వ్యూహాలు పన్నటం తెలిసి బాహు బలం కలిగి, మన ఏడు అక్షౌహిణులూ నడపగలిగే సేనాధిపతెవరో నిర్ణయించండి' అన్నాడు తమ్ముళ్ళతో

విరటుడైతే బాగుంటుందన్నాడు సహదేవుడు.

ద్రుపదుణ్ణి సేనాపతిగా చెయ్యాలన్నాడు నకులుడు.

'ద్రోణాచార్యుణ్ణి చంపడం కోసమే, ధృష్టద్యుమ్నుడు అగ్నికుండం లోంచి పుట్టాడు. రథాలూ, గుర్రాలూ, ఆయుధాలూ, కవచం అన్నీ అతనితో పాటే అగ్నిలోంచి పుట్టాయి.

విక్రమంలో సాటిలేని వాడు. అతన్ని దండ నాయకుణ్ణి చేస్తే బాగుంటుంది' అన్నాడు అర్జునుడు.

ఎటూ తేల్చలేకపోయాడు ధర్మరాజు.

'ఏమో, కృష్ణుడెలా చెబితే అలా చేద్దాం' అన్నాడు.

కృష్ణుడు నవ్వి 'ధర్మరాజా! నీ దగ్గరున్న రాజులంతా పరాక్రమవంతులే. అయినా దేవ గంధర్వ కింపురుషాది సమస్త దివ్యభూతాల వ్యూహాలూ తెలిసినవాడు ధృష్టద్యుమ్నుడు. కనుక అతనికే సేనాధిపత్యం ఇవ్వు' అన్నాడు.

ధర్మరాజు సరే అన్నాడు.

ఆ తరువాత ఏడు అక్షౌహిణులకూ సేనా నాయకుల్ని కూడా కృష్ణుడే నిర్ణయించాడు.

వెంటనే ధర్మరాజు సభ తీర్చి సేనా నాయకులందరికీ అభిషేకం చేశాడు.

ప్రణయభేరి మ్రోగింది.

పాండవులయిదుగురూ రథాలెక్కబోయే ముందు ద్రౌపది దగ్గరకు వెళ్ళారు.

- భార్యకీ ఒక వ్యక్తిత్వం వుంటుందన్న విషయం మర్చిపోయి ఆమెనో వస్తువులాగా పందెంలో వొడ్డిన పెద్దమనిషి ఇప్పుడు నవ్వుతూ తన ... వస్తున్నాడు. తన ప్రత్యర్థి ఎంత నీచుడో దుర్మార్గుడో తెలిసుంది కూడా అతనితో జూదమాడి సర్వం కోల్పోయి చివరికి కట్టుకున్న ఇల్లాల్ని కూడా పణంగా పెట్టిన ధర్మ ప్రభువు తమ్ముళ్ళని వెంటబెట్టుకుని తన సన్నిధికి వస్తున్నాడు.... అన్న



తనను సంప్రదించి, తన అభీష్టాన్ని మన్నించే చేస్తున్నట్టు ఎందుకీ దొంగాట?

ద్రౌపది కిటికీ వైపు తిరిగి వుంది.

ధర్మరాజు నెమ్మదిగా దగ్గరకు వెళ్ళి 'మహారాణీ! కౌరవుల వల్ల నీకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోబోతున్నాం. నీ మాట ప్రకారం చివరికి యుద్ధానికే సిద్ధపడ్డాం' అన్నాడు.

ఆమె గిర్రున వెనక్కి తిరిగింది. ధర్మరాజు మొహంలోకి చూస్తూ 'నా మాట ప్రకారమా' అని ఆశ్చర్యపోతూ అంది. 'మీ మంచితనం చెడిపోకుండా వుండేందుకు కౌరవులతో సంధి చేసుకోవాలనుకున్నారు. కులసతి ఏడ్చినా, పాండవులు చేతకాని వాళ్ళనీ, సిగ్గులేని వాళ్ళనీ నలుగురూ అనుకున్నా మీకేం ఫరవాలేదు. ధర్మరాజు శాంతమూర్తి అనుకుంటే చాలు మీకు. కాని చివరికి ధృతరాష్ట్రుడి కుమారులే- పాండవులు మాతో పోరాడుతారా? లేకపోతే మళ్ళీ అరణ్యాలకే వెడతారా? అనేసరికి పాపం తప్పనిసరై ఇప్పుడు యుద్ధానికి బయలుదేరినట్టున్నారు? అంది.

ధర్మరాజేం మాట్లాడలేదు.

ద్రౌపది పరిచారిక ద్వారా అంతఃపురాంగనలను వెంటనే రమ్మని కబురు చేసింది. వాళ్ళు రాగానే భర్తలయిదుగురికి ద్రౌపది వీర తిలకం దిద్దింది. అక్షింతలు చల్లింది అందరికీ వీర ఖడ్గాలు అందించింది. విల్లూ, బాణాలూ అర్జునుడికి ఇచ్చింది. వాటిని అతను భుజాన వ్రేలాడదీసుకోగానే ఆ వింటినీ, విజయుడి విలుకానితనాన్నీ తలుచుకుని ద్రౌపది మురిసిపోయింది.

విప్పారిన కళ్ళతో ప్రియవల్లభుణ్ణి చూసింది. 'కర్ణుడు నన్ను ఓడించి దుర్యోధనుణ్ణి గెలిపిస్తాడో మేము కర్ణుణ్ణీ, దుర్యోధనుణ్ణీ గెలిచి నీ గుండె మంట చల్లారుస్తామో... చూద్దాం' అన్నాడు అర్జునుడు ద్రౌపదితో.

అందరూ రథాల వైపు నడిచారు.

ద్రౌపది



అంతఃపురాంగనలు శుభసూచకంగా ఎదురొచ్చారు.

జయ వాద్యాలు మ్రోగాయి.

ఇంతలో శ్రీకృష్ణుడు వచ్చాడు. ఆయన, వక్షస్థలాన వనమాలిక ఘుమఘుమలాడుతూంటే తెల్ల గుర్రాల పగ్గాలు పట్టి రథం మీద నిలబడి వున్నాడు. తెల్లటి నవ్వులు నవ్వుతున్నాడు. ధర్మరాజుకు మ్రొక్కి రథ మెక్కాడు అర్జునుడు. హరి పాంచజన్యం, విజయుడు దేవదత్తం పూరించారు. భీముడూ, నకుల సహదేవులూ కూడా రథాలెక్కి శంఖ ధ్వని చేసారు. ధర్మరాజుకు ఎదురుగా వచ్చి సాష్టాంగ నమస్కారం చేసి సర్వ సేనాధిపతియై ముందు నడిచాడు ధృష్టద్యుమ్నుడు.

సుందర భీకరంగా వున్న పాండవ సేన అలా వెళ్ళి వెళ్ళి హిరణ్వతీ నదీ తీరాన విడిది చేసింది.

అప్పటికప్పుడు అక్కడొక రాజ మందిరం నిర్మించారు. దానిచుట్టూ తక్కినవాళ్ళ నివాస మందిరాలు వెలిశాయి. ఇంక యుద్ధమే తరువాయి.

* * * * *

ఎంతకీ తెల్లవారదేమనిపించి తూర్పు గవాక్షంలోంచి బయటకు చూసింది కుంతి.

చీకటి విడిపోవడానికి ఇంకావ్యవధి వుంది.

తెల్లవారాలి తను గంగా తీరానికి వెళ్ళాలి.పూజా విధి నిర్వహించడం కోసం రోజూ కర్ణుడు అక్కడికి వెడతాడు. తను వెళ్ళి అసలు సంగతి చెప్పి వాణ్ణి పాండవులతో కలిపితే ఈ గొడవ తీరిపోతుంది అనుకుంది కుంతి.

సన్నగా వెలుగు జాడ కనబడగానే గంగానది వైపు వెళ్ళింది. అప్పటికే కర్ణుడు నిశ్చల ధ్యానంలో వున్నాడు. ఎత్తయిన ఇసుక తిన్నెమీద కళ్ళు మూసుకుని సూర్యుడికి అభిముఖంగా కూర్చున్నాడు.

అతని జపం పూర్తయ్యేవరకూ ఒద్దున ఒకచోట కూర్చుంది కుంతి. ప్రభాత పూజయ్యాక కర్ణుడు కుంతిని చూసి సంభ్రమంగా దగ్గరకు వచ్చి శూద్రగోత్రం, రాధేయ నామధేయం చెప్పి వినయంగా నమస్కరించాడు.


కుంతి మనసు ఆర్ద్రమయింది.

కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'తండ్రీ! నువ్వు నా కన్నబిడ్డవిరా! నా చిన్నతనంలో దుర్వాస మహర్షి నాకో మంత్రం ఉపదేశించి ఆ మంత్ర జపంతో ఏ దేవతను పిలిస్తే ఆ దైవం వచ్చి సంతానం అనుగ్రహిస్తారని చెబితే సూర్యుని వరాన కన్నాను నిన్ను. నిజంగా నువ్వు నా పెద్ద కొడుకువి. కౌరవ పాండవులందరికీ నువ్వే ప్రభువ్వి. లోకమంతా ఏలుకో. రాధ కొడుకుననే తక్కువతనం నీకెందుకురా కర్ణా!' అంది.

ఆమె బుగ్గలమీద జారుతున్న కన్నీటిధారల్ని చూసి కర్ణుడు విచలితుడయ్యాడు.

'...అమ్మా! నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. కాని నువ్వే కావాలని నన్ను క్షత్రియ సంస్కారానికి పూర్తిగా దూరం చేశావు. ఇప్పుడు నేను నీ కొడుకునని చెప్పుకుంటేమాత్రం నీకేం మర్యాద?'



ప్రయాగ రామకృష్ణ సీరియల్

1. జూద మందిరంలో 'ద్రౌపది'కి జరిగిన అవమానానిక ముఖ్య కారకులు ఎవరు?- ఎందుచేత?
2. ద్రౌపది- కుంతి- ఈ సీరియల్ చదివి యీ "యిద్దర్ని" పోల్చి చూడండి!

నిబంధనలు:

* మీరు పంపే వ్యాసం అరఠావు నుంచి అర ఠావున్నరకి మించకూడదు. పంక్తులు దూరంగా అక్షరాలు విడివిడిగా వుండాలి-

* ఈ ప్రశ్నలు కూపన్‌సహా మీవద్ద వుంచుకోండి! త్వరలోనే మరో రెండు ప్రశ్నలు మరో కూపన్ ప్రకటిస్తాము-

* ఆ కూపన్ (2)తో పాటు మరి రెండు ప్రశ్నలు కూడా వుంటాయి. మొత్తం నాలుగు ప్రశ్నలలో ఏ రెండైనా మీరు తీసుకొని వ్యాసాలు రాయొచ్చును. కూపన్‌లు రెండూ పెట్టడం మరిచిపోకండి!

* వ్యాసాలలో ఉత్తమమయిన వాటికి

1) బ్రీఫ్‌కేసు, 2) చిన్న కామిరా, 3) గోడగడియారం, 4) ట్రాన్సిస్టర్ రేడియో- యింకా మరి

సూర్యానుగ్రహంతో జన్మించాను కనుక నాజన్మ ఉత్తమమయిందే అయినా పెళ్ళి కాకుండానే కన్నావు కనుక నీకు అపప్రధ వాటిల్లుతుందని ఇన్నాళ్ళూ అదంతా రహస్యంగా అట్టే పెట్టావు. తీరా ఇప్పుడు కౌరవులూ పాండవులూ యుద్ధానికి దిగేసరికి పాండవు లయిదుగురూ నా తమ్ములని నీవు చెబితే మాత్రం ప్రయోజనమేమిటి? నా అండ చూసుకునే దుర్యోధనుడు పాండవుల్ని ఎదిరించబోతున్నాడు. అదీగాక నన్ను రాజును చేసిందీ, మనిషిగా నిలబెట్టిందీ దుర్యోధనుడు. అతనివల్ల పైకొచ్చి ఇప్పుడతణ్ణి విడిచి పెట్టడం ధర్మమేమో నువ్వే చెప్పు).

ఇన్నాళ్ళూ కౌరవుల ఉప్పు తిన్నందుకు నేను విశ్వాసం చూపించాల్సిన సమయం ఇది. నేను దుర్యోధనుడి పక్షానే వుంటాను. నీ కొడుకులతో పోరాడి తీరుతాను. నువ్వింతగా ఇక్కడికొచ్చి అడిగావు కాబట్టి అర్జునుడొక్కడు తప్ప మిగిలిన నలుగురిలో ఎవరు నా చేతికి చిక్కినా చంపకుండా వదిలేస్తాను. అర్జునుణ్ణి మాత్రం చంపుతాను. ఎలాగైనా నీ కొడుకులు అయిదుగురే అనుకో. అర్జునుడు బ్రతికుంటే వాడితో అయిదుగురూ వాడు చస్తే నాతో అయిదుగురు' అన్నాడు.

'కర్ణా! నీ మనసు మారదా?' అని దీనంగా అడిగింది కుంతి.

కర్ణుడు తల అడ్డంగా తిప్పాడు.

అతణ్ణి తనవైపు తిప్పుకోటానికి కుంతి చేసిన ప్రయత్నమంతా వ్యర్థమైంది. నిజంగా ఈ రోజాగానీ కర్ణుడు తను చెప్పినట్టుగా వినుంటే ఆ దుర్యోధనుడి పరిస్థితి ఎంత ఘోరంగా తయారయ్యేదో.

ఆక్షణం ఎందుకో కుంతికి– వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోతున్న కర్ణుణ్ణి పిలిచి 'నాది పేరాశం కాదు. నాకు నా ఆరుగురు కొడుకులూ కావల్సిందే' అని చెప్పాలనిపించింది. కొడుకును పిలవబోయి, ఏడుపుతో గొంతు పూడుకుపోవడం వల్ల మాట రాక వూరుకుంది.

భూకంపాలు కనుగొనే సాధనం

భూ ప్రకంపనాలను కనుగొనే ఒక సాధనాన్ని న్యూజిలాండ్ కనుగొన్నది.

ఈ భూకంపాలు వచ్చే విషయాన్ని ఈ సాధనం యిట్టే కనిపెట్టేస్తుందట. అంతేకాకుండా భారీ నష్టం వాటిల్లకుండా యంత్రసామగ్రిని, విద్యుత్ ప్రసారాలను దానంతట అదే నిలిపి వేస్తుంది.

ఈ సాధనం మామూలుగా ఉపయోగించే డిటెక్టర్ల కంటే కూడా చాలా చిన్నదిగా వుంటుంది. రెండు రకాల తరంగాల ఆధారంగా ఈ సాధనం పనిచేస్తుందట.

చిన్నతనంలో తెలియక చేసిన తప్పుకి ఇప్పుడింత పెద్ద శిక్ష అనుభవించాల్సొస్తుందనుకోలేదు తను.

వెక్కి వెక్కి ఏడ్చింది.

*　　*　　*　　*　　*　　*

కర్ణుడు దుర్యోధన సభా భవనానికి చేరేసరికి అక్కడ దుశ్శాసనుడూ, శకునీ కూడా వున్నారు.

'రాయబారం విఫలమైందని పాండవులను మనమీదకు పురికొల్పాడు కృష్ణుడు ఇంక యుద్ధం తప్పదు.

రేపే దండయాత్ర. కురుక్షేత్రం మనకు విడిది. కర్ణా! నువ్వూ, శకునీ, దుశ్శాసనుడూ కలిసి వెంటనే మన బలాలను సమీకరించండి' అని దుర్యోధనుడు ఆజ్ఞాపించాడు.

వాళ్ళు ముగ్గురూ ఉత్సాహంతో బయలుదేరి యుద్ధానికి దండోరా వేయించారు. ఆ మరునాడు ఆయుధాలతో సహా సేనలన్నీ ఒకచోట చేరాయి. ద్రోణాచార్యుణ్ణీ, కర్ణుణ్ణీ, అశ్వత్థామనూ, బాహ్లికుణ్ణీ, శల్యుణ్ణీ, కృపాచార్యుణ్ణీ, భూరిశ్రవుణ్ణీ, గాంధారపతినీ, కృతవర్మనూ, కాంభోజ సింధురాజులనూ పిలిచి పదకొండు అక్షౌహిణులకు అధిపతులుగా నియమించాడు. భీష్ముడికి సర్వసేనాధిపతిగా అభిషేకం చేశాడు.

మంగళ వాద్యాలు మ్రోగాయి.

సైన్యఘోష సముద్ర ఘోషలా సాగింది. వజ్రాలతో ప్రకాశించే బంగారు తాళ ధ్వజంతో వజ్ర కవచంతో, తలపై వెలుగుతూన్న తెల్లని గొడుగుతో, కౌరవ సైన్య సముద్రానికంతటికీ చంద్రుడిలా ప్రకాశించాడు భీష్ముడు.

ద్రోణుడూ, కృపుడూ, అశ్వత్థామా, శల్యుడూ తమ చతురంగ బలాలను కూడ దీసుకుని కబుర్లాడుకుంటూ బయలు దేరారు.

ఇంతలో కృతవర్మా సైంధవుడూ, విందాను విందులూ, కళింగ ప్రభువు భగదత్తుడూ, మహా మాయగాడు శకునీ వచ్చి వాళ్ళను చేరారు. అనంతమైన కాల్బలంతో కొడుకు సోమదత్తుణ్ణీ, మనమడు భూరిశ్రవుణ్ణీ వెంట పెట్టుకుని బాహ్లికుడు వచ్చాడు. కాంభోజరాజు సుదక్షిణుడూ, కోసలపతి బృహద్బలుడూ, మాహిష్మతీ పుర ప్రభువు నలుడూ, త్రిగర్తరాజు సుశర్మా, అలంబుస, హలాయుధులనే రాక్షసులూ ఇంకా అనేకమంది రాజులూ తమ సైన్యాలతో కదిలి వచ్చారు.

పది అక్షౌహిణులూ ముందు నడిచాయి. వాటి వెనుక పదకొండవ అక్షౌహిణితో దుర్యోధనుడు ఒక మదపు టేనుగు ఎక్కి ముత్యాల గొడుగూ, భుజంగకేతనం ప్రకాశిస్తుండగా బయలు దేరాడు. అతనికి రెండు వైపులా కర్ణుడూ, దుశ్శాసనుడూ వున్నారు.

కాసేపటికి అందరూ యుద్ధ భూమికి చేరుకున్నారు. అప్పటికింకా పాండవ సైన్యం రాలేదు.

భీష్ముడూ, ద్రోణుడూ ముందు నిలబడ్డారు.

"ద్రౌపది"-వ్యాసరచనపోటీ(1)



కొన్ని చిన్న బహుమతులు వుంటాయి!

* వీటి వివరాలు కూడా మీకు "సీరియల్" పేజీల్లోనే త్వరలో దొరుకుతాయి!
ఈలోగా మీరు కూపన్ (1) కత్తిరించి దాచుకొని ప్రశ్నలు కూడా తీసుకొని సీరియల్ చదువుతూ సంసిద్ధులు కండి!

* బహుమతుల పోటీ! కూపన్ 2 పడ్డ దాకా- మీ వ్యాసాలు పంపకండి! కూపన్! కత్తిరించి దాచండి!
బహుమతుల సమర్పణ: నాగేశ్వరీ పబ్లికేషన్స్, విజయవాడ-2, కూపన్ 2కై ఎదురుచూడండి.


-ఎడిటర్

ద్రౌపది కూపన్ నెం. 1

మీ పేరు . . . .

చిరునామా . . . .

. . . .





కొందరి చేత 'దేవుడు'గా కొనియాడబడి, మరికొందరి చేత వివాదాస్పద వ్యక్తిగా గుర్తింపు పొందిన ఓషో రజనీష్ పూనేలోని తన ఆశ్రమంలో 58వ ఏట అస్తమించారు.

'దివ్యజ్ఞాని'గా పిలువబడే శ్రీ రజనీష్ మధ్యప్రదేశ్‌లోని హోసంగాబాద్ జిల్లా కుచ్‌వాడ గ్రామంలో 1931 డిసెంబరు 11న జన్మించారు. సాగర్, జబల్‌పూర్‌లలో విద్యాభ్యాసం కొనసాగించి ఎం.ఎ. తత్వశాస్త్రం పట్టా పొందిన అనంతరం 1974 మార్చి 21న పూనేలో ఆశ్రమం ఏర్పాటు చేసుకున్నారు.

ఆ తర్వాత అమెరికా చేరి అక్కడ జడేగామ్‌లో 1981 మే 31న ఆశ్రమం నిర్మించుకున్నారు. ఇక్కడే ఆయన పూర్తిస్థాయి 'విలాస జీవితం' గడిపి ఎంతో మంది శిష్యపరమాణువులను (ఆడవాళ్ళే ఎక్కువట!) ఏర్పరచుకున్నారు. రజనీష్ భక్తులకు (హిందీ నటుడు వినోద్‌ఖన్నా కూడా ఒకప్పుడు రజనీష్ భక్తుడే!) స్థానిక అధికారులకు మధ్య వివాదం చెలరేగటంతో ఆ ప్రభుత్వం రజనీష్‌ను అక్కడి నుంచి పంపించివేసింది. అమెరికాలో వున్నప్పుడే ఆయనకు రోల్స్‌రాయిస్ కార్లు అనేకం వుండేవిట!

1987 జనవరిలో పూనేలోని కోరేగామ్ పార్క్ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ఆయన ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. అమెరికాలో వున్న సమయంలో ఆయనపై ఆ ప్రభుత్వం విషప్రయోగం జరిపిన ఫలితమే ఆయన ఆరోగ్య క్షీణతకు కారణమని భక్తులు ఆరోపించారు. (ఆయన గడిపిన విలాస జీవితపు ప్రభావమని కొందరు అంటున్నారు!)

శ్రీ రజనీష్‌గాను, రజనీష్ మైత్రేయ బుద్ధగాను పేర్లు మార్చుకొని ఓషో రజనీష్‌గా స్థిర పడిపోయిన రజనీష్‌కు ప్రపంచమంతటా ధనికులు, పేదలతో సహా 5 లక్షలమంది భక్తులున్నారట.

ఎన్నో పుస్తకాలను పఠించి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కిన శ్రీ రజనీష్ 650 పుస్తకాలను రచించారు. అందులో 'సంభోగ్ సే సమాధి తక్' అనే పుస్తకం 32 ప్రపంచ భాషల్లో అనువదించబడిందట. చనిపోయిన తర్వాత కూడా ఆయనను వజ్రాలు పొదిగిన శవపేటికలో వుంచారంటే ఆయన స్థాయి ఎలాంటిదో వేరే చెప్పవలసిన అవసరం లేదు. ○

వాళ్ళకు కుడి వైపున కృప అశ్వత్థామలూ, ఎడంవైపున బాహ్లిక సోమదత్త భూరిశ్రవసులూ వున్నారు. మధ్య కురు కుమారులతో దుర్యోధనుడున్నాడు. వాళ్ళకు ముందు అర్జునుణ్ణి చంపడమో, తాము చావడమో అని ప్రతిజ్ఞలు చేస్తూ సంశప్తక సైన్యం వుంది. మిగిలిన వీరులంతా అక్కడక్కడా నిలబడ్డారు. సైన్యాలకు, ఏనుగులూ, ఏనుగులకు రథాలూ, రథాలకు గుర్రాలూ, గుర్రాలకు కాల్బలాలూ అడ్డంగా నిలబడ్డాయి.

ఆ వ్యూహాన్ని చూసి సుయోధనుడు ఆశ్చర్యపోయాడు. గాంగేయుణ్ణి అభినందించి అంజలి ఘటించాడు.

ఇంతలో చతురంగ బలాలతో శైత్రభేరుల గంభీర ఘోషలతో వైభవంగా వచ్చాడు యుధిష్ఠిరుడు. ఆయన వెనక గదాదండం తిప్పుకుంటూ భీముడు వచ్చాడు.

పద్మరాగ ప్రభలు చిమ్ముతున్న దివ్య రథ కాంతులతో, వజ్రాల్లా మిలమిలలాడుతున్న గుర్రాలతో, గరుడ పచ్చల కాంతిని ప్రసరింపచేస్తున్న కపికేతనంతో, మరకత ప్రభలు కురిపిస్తున్న తూణీరాలతో హరినీలకాంతులు ప్రకాశింపచేస్తున్న గోపాల దేవునితో అర్జునుడు వచ్చాడు. శౌర్య, ధైర్య గాంభీర్యాలు అతనికి సొమ్ములయ్యాయి.

గాండీవం ఇంద్రధనువై
కిరీట కాంతులు మెరుపులై

వారి మ్రోత ఉరుమై శరీరపు నీలకాంతితో కారుమబ్బులా ప్రకాశించాడు అర్జునుడు.

బంగారు రథాలెక్కి నకుల సహదేవులు వచ్చారు. పెద్ద ఏనుగుల బలంతో, పాంచాలపతి వచ్చాడు. బలమైన సేనతో విరటుడూ, సాత్యకీ చేకితానుడూ, శిఖండీ వచ్చారు. చేత శూలాలు పట్టి నడక నేర్చిన చీకటి ముద్దలా కదిలి వచ్చాడు ఘటోత్కచుడు. అతని వెనుక ఇంకా అనేకమంది రాజులు తమ తమ సేనలతో వీరాలాపాలాడుతూ వచ్చారు.

పాండవ సేన పదక్షోహిణులతో మోహరించింది. సేనాముఖంలో వీరాలంకార భూషితుడై ధృష్టద్యుమ్నుడు నిలబడ్డాడు. కొండల్లాంటి ఏనుగులమధ్య బంగారు రథంలో ధర్మరాజు వున్నాడు. తెల్ల గొడుగూ, వింజామరలూ ప్రకాశిస్తుండగా బ్రాహ్మణులకు బంగారం, పట్టు వస్త్రాలూ పంచిపెడుతూ వాళ్ళ ఆశీర్వాదాలందుకుంటున్నాడాయన. అతనికి ముందు భాగంలో అర్జున సంరక్షితుడైన శిఖండి వున్నాడు. అతను భీష్ముడికి ఎదురుగా నిలబడ్డాడు. వాళ్ళ వెనుక అనేకమంది రాజులు వున్నారు.

అర్జునుడు సైన్యాన్నంతా ఒకసారి పరికించి చూసి గాండీవం సవరించుకున్నాడు. అసలే అది పాములాంటిది. పైగా ఇప్పుడు కృష్ణుడు పక్కనుండడంతో గాండీవానికీ, గాండీవధారికీ ఇద్దరికీ రెక్కలొచ్చినట్టుంది.

కృష్ణార్జునులు పాంచజన్య దేవదత్తాలు పూరించేసరికి పాండవసేనలు పొంగిపోయాయి. ధర్మరాజు నవ్వి, అచల వ్యూహాన్ని పన్నినందుకు ధృష్టద్యుమ్నుణ్ణి అభినందించాడు. ధృష్టద్యుమ్నుడు ధర్మరాజు పాదాలకు నమస్కరించాడు. ధర్మరాజు తటాలున వంగి ద్రుపదరాజు కుమారుణ్ణి లేవదీసి గాఢంగా కౌగలించుకున్నాడు.

ఇంక రెండు బలాలూ కలబడబోయే సమయంలో ఒక చిత్రం జరిగింది. ధర్మరాజు కవచం ఊడదీసి ఆయుధాలన్నీ రథంలో పెట్టేశాడు. రథం దిగి రెండు చేతులూ జోడిస్తూ మౌనంగా భీష్ముడి వైపు నడిచివెళ్ళాడు. అది చూసి భీమార్జున నకుల సహదేవులూ, ధృష్టద్యుమ్నుడూ కలవరపడ్డారు.

'అన్నయ్యా! ఏమిటిది? మేమందరం వుండగానే నువ్వెందుకిలా వాళ్ళకు తలవంచి వెళ్ళిపోతున్నావ్?' అని భీముడు ఆదుర్దాగా అడిగాడు.

'ఒకవంక శత్రువులు ఎదిరించి వస్తుంటే చేసిన సన్నాహమంతా నాశనం చేసి ఇలా వెళ్ళిపోవడం ఏమైనా బాగుందా!' అర్జునుడు అడిగాడు.

'పిరికిపందలా నువ్వెప్పుడు మారిపోయావు?'

'సరిగ్గా యుద్ధం మొదలయ్యే సమయంలో పాండవుల పౌరుషమంతా మంటగలిపి నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యడానికి ఎవరిచ్చారు నీకు అధికారం?' నకుల సహదేవులిద్దరూ అడిగారు.

ధర్మరాజు ఎవరికీ ఏం సమాధానం చెప్పలేదు.

కృష్ణుడు నవ్వి 'ఇంతలోనే ఎందుకంత ఆవేశపడతారు. అతని మనస్సులో మాటేమిటో నాకు తెలుసు. భీష్మ ద్రోణ కృప శల్యులకు నమస్కరించి వాళ్ళ ఆజ్ఞ తీసుకుని యుద్ధం చెయ్యాలనే ఉద్దేశ్యంతో వెడుతున్నాడు. పెద్దల అనుమతి తీసుకుని యుద్ధం చేస్తే జయం కలుగుతుందని పెద్దలంటారు. అలా చెయ్యడం కూడా మంచిదే' అన్నాడు.

ధర్మరాజు వెడుతూనే వున్నాడు. అజాత శత్రుడు భీష్ముడి రథం దగ్గరకు వెళ్ళేసరికి కౌరవ సైన్యమంతా అప్పుడే తాము గెలిచేసినట్టు పాండవుల్ని గేలి చెయ్యడం మొదలుపెట్టారు. ధర్మరాజు తిన్నగా వెళ్ళి గాంగేయుడి పాదాలు తాకి కళ్ళకు అద్దుకున్నాడు.

'మహానుభావా! నీకెదురుగా నిలబడి యుద్ధం చెయ్యవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. జరగకూడనిదేదో జరిగిపోతున్నట్టుగా నా మనస్సంతా ముళ్ళ పొదలా వుంది. ఈ యుద్ధానికి నీ అనుజ్ఞ తీసుకుంటేగానీ నా మనస్సుకు శాంతి లేదనిపించింది. నువ్వు దీవిస్తేనే నేను గెలిచేది' అన్నాడు వినయంగా.

భీష్ముడు సంతోషించాడు.

ద్రౌపది



ధర్మరాజు శిరస్సున ముద్దు పెట్టి మూర్ధం ఆఘ్రాణించాడు.

'నాయనా! ఇన్నాళ్ళూ దుర్యోధనుడి పక్షాన వున్నాను కనుక నీకోసం యుద్ధం చెయ్యడం తప్ప ఏదైనా వరం కోరుకో' అన్నాడు.

'తాతయ్యా! నువ్వు దుర్యోధనుడి పక్షానే యుద్ధం చెయ్యి. కాని నీకు వీలైనంతలో నాకు మేలయ్యే సహాయం కూడా చెయ్' అని అడిగాడు ధర్మరాజు.

'ఏమిటది'

ధర్మరాజు సంకోచిస్తూనే నిన్ను యుద్ధంలో ఎలా జయించాలో చెప్పు' అని అడిగాడు. అతని మాటలు విని చిరునవ్వు నవ్వాడు భీష్ముడు.

'నన్ను ఎదిరించి గెలవడం దేవతలకు కూడా సాధ్యంకాదు' అన్నాడు కావాలనే.

'అందుకే అర్థిస్తున్నాను' అన్నాడు ధర్మరాజు తెలివిగా.

ఇద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. ఆ చూపుల్లో శతృత్వం లేదు.

భీష్ముడు లౌక్యంగా 'నేను యుద్ధం విరమించి ఆయుధం విడిస్తే తప్ప నన్ను వధించడం ఎవరికీ సాధ్యంకాదు. ఇంకా దానికి సమయం రాలేదు. ఇప్పుడేం అడక్కు. మరోసారి కనిపించు' అన్నాడు. ధర్మరాజు భీష్ముడి మాటల్లోని ఆంతర్యం గ్రహించి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. వెళ్ళి తన రథమెక్కాడు.

కవచం తొడిగి విల్లందుకున్నాడు.

యుద్ధం మొదలైంది. శస్త్రాస్త్రాల ధాటికి నేలకూలుతూ ఏనుగులూ, గుర్రాలూ చేసే ధ్వనులతో దిక్కులు పిక్కటిల్లాయి. ఒక చెయ్యి తెగిపడితే మరో చేత్తో ఆయుధమందుకునే వాళ్ళు కొందరు, తెగిన తల క్రింద పడబోయే లోపలే తాము చంపదలుచుకున్న వాళ్ళను పొడిచి మరీ చచ్చేవాళ్ళు కొందరు, తాము నొచ్చి కూడా స్నేహితులకూ, చుట్టాలకూ అడ్డుపడే వాళ్ళు కొందరు...

రక్తం ఏర్లై ప్రవహిస్తున్నట్టు మహా భయానకంగా వుంది యుద్ధభూమి.

(ఇంకా ఉంది)

ప్రశ్నావళి

- కె. రామలక్ష్మి

ఎ. శ్రీధరాచార్యజోషి, అయిజ.

ప్రెజెంట్‌గా దర్శనమిస్తున్న అశ్లీల వాల్ పోస్టర్లు అసభ్య వ్యాపార ప్రకటనలు, ద్వంద్వార్థ సినీపాటలు ఇవన్నీ స్త్రీని కించ పరచడమేకాక మనస్థయిర్యాన్ని దెబ్బ తీసేలా వున్నాయి. ఈ తరుణంలో సాటి స్త్రీకి న్యాయం జరగాలంటే!

* ఈ సమాజంలో స్త్రీకి న్యాయం జర గడంకల్ల. ఆడదంటే విలువలేని సమాజాలు ఎప్పుడూ ఇలాగే ఆమె శరీరంపై డబ్బు చేసు కుంటాయి. వేటిని పబ్లిక్‌గా విమర్శిస్తారో వాటినే-వ్యాపారం కోసం ప్రోత్సహిస్తాయి...లే కుంటే అధికార వర్గానికి సన్నిహితంగా సారా లాబీ, వ్యభిచారం లాబీ, స్మగ్‌లింగ్, ఫీటింగ్ లాబీలు పనిచేస్తాయా-ఎక్కడైనా?! అంచేత గొప్పగా యీ అసభ్యతలని పబ్లికుగా పెద్ద మనుషులు నిరశించినా-ప్రయివేటుగా ప్రోత్సహి స్తూనే వుంటారు....ఇక యువత అంటారా? పౌరుషం, గర్వం, సాటి మనిషిపట్ల అభిమానం ఆదరణ లాంటివి ఎప్పుడో పోగొట్టుకుని-అధి కార వర్గాలకి చెంచాగిరీకోసం పోట్లాడుకుం టూంది....అంచేత-స్త్రీకి న్యాయం అన్నది-అర్థం లేని ఆశయం.

ఎ. మధుసూధన్‌రెడ్డి, రాజంపేట

ప్రేమించిన ప్రేయసి నన్ను మోసం చేస్తే నేనామెపై ప్రతీకారం తీర్చుకోవడం న్యాయమా? నేరమా?

* రెండూ కాదయ్యా ఉడుకుబో త్తనం....ఒక బ్బాయి నా దగ్గరికి వచ్చి "నా గళ్‌ఫ్రెండ్ నన్ను మోసం చేసింది. ఆమె గురించి-అసభ్యంగా గోడలమీద రాయించా" నని చెప్పాడు. "నిన్నటిదాకా నీ స్నేహితు రాలేకదా? ఇదేంటి అని నీ ఫ్రండ్సు నిన్ను అడగరా?" అని అడిగా. అది తోచలేదా కుర్రవాడికి....అలాగేవుంది మీ బాధ.

ఎస్. వెంకటప్రతాప్, అయిజ.

నా జీవితం మొత్తం సాహిత్యసేవకే అంకితం చేశాను. కథకు అత్యద్భుతంగా ప్లానువేసి శైలినికూడా వూహించుకుని పేప రుమీద పెట్టబోయేటప్పటికి అంతా తారు మారౌతుంది. మీ సలహా?

* అలా 'అద్భుత ప్లాను' 'శైలి' వూహిం చుకోకుండా రాసే ప్రయత్నంచేసి చూడకూ డదా? ఏ పుట్టలో ఏ పాముందో కద!

కె.ఎల్.డి.జి. సాహిత్యప్రకాష్, కర్నూలు.

కె.రా.గారూ మనిషి జీవితానికి సార్థ కత అనేది ఎప్పుడు ఏర్పడుతుంది?

* నలుగురికి మంచి చేయకల్గినప్పుడు, కనీసం పదిమందికి వెనక గోతులు తీయ నప్పుడు, మీ వాళ్లు మీరు భారం అనుకోన ప్పుడు - సార్థకత ఏర్పడినట్లే తమ్ముడూ, "నువ్వు లేకుంటే కొంపగడవదు. అంటే చాలు ఆడదాని జీవితం సార్థకమైపోయినట్టు ఉబ్బిపోతుందే! పిచ్చిది - అలా చెప్పి బానిస చాకిరీ చేయించుకోకలడు మొగాడు జాగ్రత్త" అనేవాడు మా పెదమామయ్య.

పి. సుజాత, హైదరాబాదు.

ఎన్నో ప్రశ్నలకు జవాబులిస్తూ పాఠకుల నానందింప చేసినందుకు నా కృతజ్ఞతలు. నాకు పాతికేళ్ళు. నేను టీచరుగా పని చేస్తున్నాను. కాని మనస్సు అశాంతితో నిరా శతో దిగులుగా వుంటాను. ఏం చేయాలో చెప్తారా?

* డియర్‌యంగ్ లేడీ. హాయిగా వుద్యోగం వుంది. ఎదురుగా పాఠంచె ప్పడానికి పిల్లలున్నారు. ఇంక ఏం లోటని బెంగ? ఎంత మందికీపాటి అదృష్టం కూడా లేక బాధపడుతున్నారో వూహించు. పెళ్లి పిల్లలు ఇవన్నీ కాలానుగుణంగా అమ రాలి. వాటికోసం వర్తమానం జారిపోనివ్వకు. చేస్తున్న వృత్తిపై కుతూహలం పెంచుకోవడం ముఖ్యం. మధ్య తరగతి యింటి వాతావ రణాలు నేను పూర్తిగా వూహించుకోక లను. అవి అమ్మాయిలని కృంగతీయకూడదు - మరింత ధైర్యంగా నిలబడేలా చేయాలి గాని. ఇదీ లేకుండా 'యింట్లో పడివుండే' పరిస్థితి నొకసారి వూహించి చూసుకో - నీకే అర్థం అవుతుంది. మనసులో కుమిలిపో వడం కాదు తరుణోపాయం. మనసులో మాట యింట్లోనో ప్రాణ స్నేహితులకో చెప్పకల్గాలి. జీవితం ఆర్థిక స్వేచ్ఛ కలవారిచేతి బానిస. మరిచిపోకూడదు. ధైర్యం, నిజాయితీ, నీలో నీకు నమ్మకం వుంటే - మనస్సు హాయిగా వుండడమేకాదు. జీవితంకూడా హాయిగా వున్నట్టు అనిపిస్తుంది - వేక్ అప్ మైడియర్ యంగ్ ఫ్రెండ్. అదీ ముఖ్యం.

సి.హెచ్. కృష్ణమోహన్, కపిలేశ్వర పురం.

జర్నలిస్టుగా సమాజంలో తన విధిని నిర్వహించే వ్యక్తి ముఖ్య లక్షణాలు ఎలా వుండాలి?

*నిజాయితీ - నిజాయితీ - నిజాయితీ

టి. వేణు గోపాలాచారి, కోరుట్ల.

రాజకీయాలెందుకు?

*కొందరు బాగుపడ్డానికి.

బాణాల రమేష్‌బాబు, ఖమ్మం.

దేవుడున్నాడా? లేడా అనే సందిగ్ధం, చర్చలు ఇలా ఎల్లకాలం సాగవలసిన 'దే'నా?

*తప్పదు - రెండువర్గాలున్నంతవరకు!

మన దేశ రాజకీయాలను చూస్తూంటే మీకేమనిపిస్తోంది.

*కుక్కలు చింపిన విస్తరి.

పి. కృష్ణప్రసాద్, మచిలీపట్నం.


మీరే ప్రధాని అయితే బాబ్రీమసీదు వివాదం ఎలా పరిష్కరిస్తారు?

* సెక్యులర్ స్టేటని పేరు. మడత పేచీలన్నీ మతాల్ని గురించే! మనం వీటిని దాటి ఎప్పటికేనా మనుషులని మనుషులుగా పట్టించుకొంటామా అనిపిస్తూంది... నేనైతే అక్కడో పిల్లల పార్కు పెట్టేసి - ఆనందిం చండి అని వదులుతా.

ఆరుద్రగారిని మీరెక్కడ మొదట చూశారు?

* స్వతంత్ర ఆఫీసులో - కవిగా పరి చయం చేశాడు గోరాశాస్త్రి.

○



ఛాతీ మీద పచ్చబొట్టు ఎట్లా పోతుంది?



సరి "కొత్త" శీర్షిక

హల్లో డాక్టర్! నేనేం చెయ్యాలి?

డా. కొత్త రవీంద్రబాబు

వై. ఎస్. వి. ఎ. రావు - కాశీబుగ్గ

ఛాతీ దిగువ గొయ్యిలా వుంది. మెడ నొప్పి నీరసం.

రికెట్స్ వలన ఛాతీ దిగువ గొయ్యి ఏర్పడుతుంది. పెరిగే వయస్సులో విటమిన్ ఎ, డిల లోపం వలన అలా జరిగివుంటుంది. పళ్ళు పాలు ఆకు కూరలు గుడ్లు తీసుకోండి. ఇప్పుడు గొయ్యి పోగొట్టే మార్గం లేదు.

టి. కామేష్ - పాలకొల్లు

ముఖాన మొటిమలున్నాయి. వంటి మీద పొట్టు రేగుతుంది.

గ్రిస్‌డిడి గొట్టం ఒకటి నెలపాటు, టెట్రాసైక్లిన్ 250 మిల్లీ గ్రాముల గొట్టం ఆరు నెలలపాటు రోజు కొకటి వేసుకోండి. ముఖానికి క్రీములు పౌడర్లు వాడకండి.

వి. ప్రకాశరావు - ధవళేశ్వరం

ఫిస్ట్యులా వుంది.

ఫిస్ట్యులాకు శస్త్రచికిత్స తప్ప మార్గంలేదు. మందులు లేవు.

పి. శ్రీనాధ్, కరీంనగర్:

లావు తగ్గాలి. 16 సంవత్సరాలు.

ఆహారం ముఖ్యంగా తీపి వస్తువులు నూనె వస్తువులు తగ్గించండి. రాక్సిన్ రోజుకో బిళ్ళ వేసుకోండి.

పి. రమేశ్, నిజామాబాద్ :

అంగం మీద చర్మం అతుక్కొని వుంది.

బాబు సుంతీ ఆపరేషన్ చేయించుకోండి.

ఎల్.వి.కె. రెడ్డి, పేజెండ్ల:

జుట్టు వూడి పోతున్నది.

జీవిట్ రోజుకో గొట్టం వేసుకోండి మూడు నెలలపాటు.

ఎస్. రవి, సత్తుపల్లి:

మొటిమలు ఎక్కువగా వస్తున్నాయి.

గ్లిసరిన్ సోప్ వాడి రోజుకొక టెట్రాసైక్లిన్ 250 మిల్లీగ్రాముల గొట్టం వాడండి అయిదారు నెలలపాటు.

బి.ఆర్. కాంత్, మెట్‌పల్లి, కరీంనగర్ :

గతంలో స్వయం తృప్తి కలవాటుపడ్డాను. భయంగా వుంది.

న్యూనతాభావం వదలి మీ వృత్తి లేదా విద్యలో నిమగ్నులవండి.

ఎ. బోసుబాబు, చాగలమర్రి, కర్నూలు:

మోకాళ్ళు నొప్పులు వస్తూ పోతూ వున్నాయి.

ఇండోకాప్ ఎస్ ఆర్ రోజు కొకటి చొప్పున వాడండి. ఫలితం వుంటే కొన్ని నెలలపాటు ఆ గొట్టాలు వాడండి.

ఎ. విజయకుమార్ - నెల్లూరు

మనసు లేని ఆడదాన్ని ప్రేమించి ఆమె పేరు నా ఛాతీపై పచ్చ బొట్టు పొడిపించుకున్నాను. పచ్చబొట్టు పోయేదెలా? మందులున్నాయా?

ప్లాస్టిక్ సర్జరీ వలన పోతుంది. మందులుండవు.

ఎం. శ్రీకాంత్ - పాల్వంచ

నేను బక్కగా వుంటాను. లావవాలంటే ఏం చేయాలి?

పాలు, పళ్ళు, కోడిగుడ్లు తీసుకోండి. ఒరాబోలిన్ రోజుకో బిళ్ళ వేసుకోండి. జీర్ణశక్తికి బెస్ట్రోజైమ్ సిరప్ భోజనానంతరం గంట ముందు వాడండి.

త్వరలో

"న్యూమరాలజీ"

మీద

ప్రత్యేక శీర్షిక!

సయ్యద్ రసూల్ - విజయవాడ

శీఘ్రస్ఖలనము - నరాల బలహీనతతో బాధపడుతున్నాను.

నెలపాటు మేనిక్స్ గొట్టాలు ఉదయం అయిదు సాయంత్రం అయిదు భోజనానంతరం వాడండి.

ఎం. బి. వి. ప్రసాద్ - మండపాక

ఎపెండిక్స్‌లో మలం చేరినందువలన ఎపెండిసైటిస్ వస్తుందా? వ్యాధి గుర్తించేదెలా?

పొట్ట దిగువ భాగంలో కుడిపైపున నొప్పి అనిపిస్తే ఎపెండిసైటిస్ వ్యాధి అనుకునే అవకాశం వుంది. అలాంటప్పుడు డాక్టరుకు చూపుకోవటం మంచిది.

సింధు - ఏలూరు

మా అమ్మగార్కి మెడ వెనక బొప్పిగా వచ్చింది. బిళ్ళలు వాడితే తగ్గడం లేదు.

అక్కడ ఎవరికైనా డాక్టరుగారికి చూపించుకోండి. తెనాలి వస్తామన్నారు. అలాగైనా సరే - వెంటనే చూపించుకోండి.

ఎ. రవికుమార్ - కొత్తగూడెం

ముందు పన్ను విరిగింది. అసహ్యంగా వుంది.

పంటి డాక్టరుగారికి చూపుకోండి. విరిగిన పన్ను భాగం అమర్చే వీలున్నది.

బి. వెంకటేష్ - వరంగల్

వృషణాలు చిన్నవిగా వున్నవి.

మీ వుత్తరం చదివాక మీలో ఏం లోపం లేదనిపిస్తున్నది. నిశ్చింతగా వివాహం చేసుకోండి.

ఎన్. ఇస్సాకు - వుయ్యూరు


హస్త ప్రయోగం అలవాటు. నోరు దుర్వాసన - కాళ్ళ మీద మచ్చలు.

ఉదయం రాత్రి పడుకోబోయే ముందు పళ్ళుతోముకుని డెటోలిన్ మవుత్‌వాష్‌తో పుక్కిలించండి. కాలి మచ్చలకు డ్రిపో ఫాం మందు రాత్రిళ్ళు రాసుకోండి.

ఎ. సతీష్ - పాలకొల్లు

వయసు 20 సం. శరీరం ముడతలు పడుతుంది.

రెండుపూటలా స్నానం చేయండి. ఎవియాన్ రెండు వందల మిల్లీ గ్రాముల గొట్టం రోజుకొక్కటి రెండు నెలలపాటు వాడండి. ○



కథ కాని కథ

బెహరా వెంకట సుబ్బారావు

"సుగుణకి సీరియస్‌గావుంది-వెంటనే రావలెను"- శంకరం. విశాఖపట్నం నుంచి శంకరం యిచ్చిన టెలిగ్రాం అందుకొని, ఆఫీసుకి నాలుగురోజులు శలవు పెట్టి వెంటనే బయలుదేరాను.

శంకరం నా ఆఖరి బావమరిది. వాళ్ళది విశాఖపట్నం. సంక్రాంతికి శలవు లీయగానే నాభార్య సుజాత పిల్లల్ని తీసుకొని పుట్టింటికి విశాఖపట్నంవెళ్ళింది. వెళ్లిన వెంటనే లెటరు రాసింది. తన చెల్లెలు సుగుణకి వారం రోజుల నుంచీ సుస్తీగావుందని రాసింది, గానీ ఆ సుస్తీ ఏమిటో వివరంగా రాయలేదు. రెండు సంవత్సరాలనుంచీ సుగుణ తరచుగా అనారోగ్యానికి గురౌతూనేవుంది.

మామగారు విశాఖపట్నం కలక్టరాఫీసులో యూ. డి. సిగా పనిచేసేవారు. ఆయనకు ఆరుగురు సంతానం. భాస్కరం, కృష్ణ, సుజాత, లక్ష్మి, ఆఖరువాడు శంకరం. భాస్కరం భిలాయ్ స్టీల్‌ప్లాంట్‌లో అకౌంటెంటు. అతనికిద్దరు పిల్లలు. రెండో వాడు కృష్ణ. ఖరగ్‌పూర్‌లో రైల్వేలో పని చేస్తున్నాడు. అతనికి ముగ్గురు సంతానం. ఆఖరివాడు శంకరం. గ్రాడ్యుయేట్! నిరుద్యోగి! మామగారు బతికున్నరోజుల్లోనే భాస్కరానికి, కృష్ణకి, సుజాతకి పెళ్ళిళ్ళు చేసారు. పెద్దబ్బాయి భాస్కరానికి వచ్చిన కట్నంతో సుజాతని నాకిచ్చి వివాహం చేసారు. రెండో వాడు కృష్ణకి వచ్చిన కట్నంతో సుగుణకి పెళ్ళిచేద్దామనుకొన్నారు కానీ అలా జరగలేదు.

మా అత్తగారికి ఏకైక సోదరుడు సుందరం! వాళ్ళది అమలాపురం. చాలాకాలం అంటే సుమారు పది సంవత్సరాలు వీళ్ళతో సంబంధంలేనట్లు ప్రవర్తించాడు. కాంట్రాక్టర్‌గా చాలా డబ్బు సంపాదించాట్ట! మరొక యిద్దరు పార్టనర్స్‌ని కుదుర్చుకొని లక్షలమీద కాంట్రాక్టులు చేస్తున్నాట్ట! అయితే ఆ పార్టనర్స్ చేసిన మోసం వల్ల లక్షరూపాయలు నష్టపోయాట్ట! ఆ దెబ్బనుండి తేరుకోలేక పోయాట్ట! అకస్మాత్తుగాఒకనాడు అక్కగారింటికి విశాఖపట్నం వచ్చాడు. తన కూతుర్ని రెండో కోడలుగా చేసుకోమని అక్కని బ్రతిమాలాడు. తమ్ముడంటే మంచి అభిప్రాయం లేదుఅక్కకి.

"ఇన్నాళ్ళకి పిల్లలు ప్రయోజకులయ్యాక మేం గుర్తుకొచ్చామా? ఇన్నాళ్ళు తెంచుకొన్న సంబంధాన్ని యిప్పుడు మళ్లీ కలుపుకోడానికి వచ్చావా?"అంటూ దెప్పి పొడిచింది అక్క. అక్క కాళ్లమీద పడి ప్రాధేయపడ్డాడు సుందరం.

"నా మేనకోడలు సుగుణకి మంచి సంబంధం చూసి పెళ్ళిచేసే పూచీనాది!" అని భరోసా యిచ్చాడు. వాగ్దానం చేసాడు.

మొదట్లో అంగీకరించకపోయినా పుట్టింటి మీదున్న మమకారంకొద్దీ సరే అంది అక్క. మామగారుకూడా అంగీకరించారు. లాంఛనాలు మాత్రం ఘనంగా యిచ్చి కానీ కట్నం లేకుండా తన కూతుర్ని మేనల్లుడు కృష్ణకిచ్చి పెళ్ళి చేసాడు సుందరం. రెండో కొడుక్కి కట్నం రాలేదు కాబట్టి సుగుణ పెళ్ళి వాయిదా పడింది. ఆ తర్వాత మూడేళ్ళకి అంటే యింకా అయిదేళ్ళు సర్వీసుండగానే మామగారు పోయారు. ప్రావిడెంట్ ఫండూ గ్రాట్యుయిటీ వగైరాలు అన్నీ కలిపి ముప్పయివేలు వచ్చాయి. మామగారు చేసిన కొన్ని బాకీలు తీర్చారు. కర్మ కాండకీ రోజులకీ కొంత ఖర్చయింది. చాలాకాలం క్రిందట చవక రోజుల్లో గాజువాక దగ్గర ఆరు వందల గజాలు జాగా కొన్నారు మామగారు. 'అయితే యిల్లు కట్టలేకపోయారు.

"ఆ జాగాలో తాటాకు యిల్లయినా కట్టుకోండి! అద్దె బాధ తప్పుతుంది. బావ గారి కోరికా తీరుతుంది!" సలహా యిచ్చాడు సుజాత మేనమామ సుందరం. ఆ సలహా అందరికీ నచ్చింది. ఆ జాగాలో తాటాకు యిల్లు కట్టారు. అందులోకి మకాం మార్చారు. అన్ని ఖర్చులూ పోగా పదివేలు మిగిలింది. ఆ డబ్బుతో సుగుణ పెళ్ళి చేయాలనుకొంది తల్లి. మూడు నాలుగు సంబంధాలు చూసారు. ఒకటి వారికి అందుబాటులో లేదు. కట్నాల రేటు బాగాపెరిగి పోయింది.

"సుగుణ పెళ్ళి గురించి బెంగపడకమ్మా! మంచి సంబంధం చూసి చేస్తాం!" అని పెద్ద కొడుకు లిద్దరూ హామీ యివ్వడంతో సంతృప్తి చెందింది తల్లి. తర్వాత తమకేవో ఇబ్బందులూ ఖర్చులూ వున్నాయని చెప్పి తలొక వెయ్యి రూపాయలూ తీసుకొన్నారు. తర్వాత యిస్తామన్నారు.

"మిగిలిన డబ్బుతో యిల్లు గడుపుకొంటే దాని పెళ్ళి ఎలా చేస్తార్రా?" అడిగింది తల్లి. నెలనెలా తలొక నూటయాభై పంపుతామని వాగ్దానం చేసారు యిద్దరూ. తన పెన్షన్ వందా కలిపితే మొత్తం నాలుగొందలవుతాయ్ ఎలాగో లాగు గడుపుకోవచ్చుననుకొంది తల్లి. ఆ డబ్బు ముట్టుకోకూడదని నిశ్చయించుకొంది. కానీ అనుకొన్నట్టు జరుగలేదు. పిల్లలిద్దరూ నాలుగు నెలలపాటు నూర్రూ, నూటయాభై పంపేవారు. ఆ తర్వాత అసలు పంపడం పూర్తిగా మానేసారు. బ్యాంకులో వున్న డబ్బు యింటి ఖర్చులకివాడక తప్పిందికాదు. సంవత్సరంగడిచింది. తండ్రి సంవత్సరీకాలకి అందులోనే మరికొంత డబ్బు ఖర్చు చేసారు. సంవత్సరీకాలకి అంతా వచ్చేరు. అందరూ అలా ఒక సారి కల్సుకొనే అవకాశం చాలా అరుదుగా వస్తుంది. అందుకే చెల్లిలు పెళ్ళి విషయం యెత్తింది నాభార్య సుజాత. అదిగో యిదిగో అంటూ దాటవేసారు అన్నయ్యలిద్దరూ. అంటీ అంటనట్టుగా ప్రవర్తించి వెళ్ళేడు మేనమామ సుందరం.

సంవత్సరాలు గడుస్తున్నాయ్. పిల్లల వయసులూ పెరుగుతున్నాయ్. ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు కాలేదు! కొడుకులిద్దరూ నిర్లక్ష్యంగానూ బాధ్యతారహితంగాను ప్రవర్తిస్తున్నారు. బ్యాంకు బేలెన్స్ వందల్లోకి చేరుకొంది. ఆఖరి అబ్బాయి శంకరానికి వుద్యోగం రాలేదు. అత్తయ్యగార్ని బెంగ కృంగతీస్తోంది. శంకరం పిల్లలకి ట్యూషన్లు చెప్పి నూటయాభై సంపాదిస్తున్నాడు. అత్తగారి పెన్షన్‌వందా. ఆ డబ్బు ఏమాత్రం సరిపోతుంది?


"పిల్లల్ని కంటాం! వాత్సల్యంకొద్దీ పెంచి పెద్దచేసి ప్రయోజకుల్ని చేస్తాం! ఆఖరి దశలో ఆదుకొంటారని ఆశించడం వట్టి అవివేకమే అవుతుందోయ్!" తన ఆవేదనను వ్యక్తం చేసింది అత్తయ్యగారు అనేకసార్లు.


పెద్దబ్బాయి భాస్కరం కనీసం ఏడాదికోసారైనా అత్తవారింటికి అనకాపల్లి వెళ్తాడు పెళ్లాం పిల్లల్తో. దారిలో వైజాగ్‌లో దిగి తల్లినీ చెల్లెళ్ళనీ చూడడు! తిరుగు ప్రయాణంలో మాత్రం వెళ్తాడు. అతి కష్టం మీద ఒక పూట వుంటాడు. (రైలులో బెర్తుల రిజర్వేషన్ కోసం దిగుతా డంటుంది సుజాత) మరొకపూట వుండమంటే శలవు లేదంటాడు. ఉన్న ఆ ఒక్క పూటలోనూ కోడలు తమ గొప్పల్నీ, అంతస్తునీ వర్ణించుకొంటుందేతప్ప అత్తగారూ ఆడబడుచులూ మరిదీ ఎలా కాలక్షేపం చేస్తారన్న విషయం పట్టించుకోదు. పిల్లల కాన్వెంటు చదువుల గురించీ, తమ యింట్లోవున్న టీ. వీ, ఫ్రిజ్, లాంబ్రెట్టాల గురించీ మాట్లాడ్తుంది. అలా ఆ పూట గడిచిపోతుంది. కనీసం భాస్కరం అయినా వారి యోగక్షేమాలు అడిగి తెల్సుకోడు. తర్వాత రైలెక్కేస్తారు.

ఇక రెండో అబ్బాయి కృష్ణ. అన్నయ్య చదివిన బడిలోనే చదివాడు. రైల్వేలో వుద్యోగం కాబట్టి పాసులుంటాయి. తరుచుగా అంటే సంవత్సరానికి మూడు సార్లైనా అత్తగారింటికి కుటుంబ సహితంగా అమలాపురం వెళ్తాడు తిన్నగా. అలాగే తిరుగు ప్రయాణంకూడా! డైరక్టుగా ఖరగ్‌పూరు పోతారు. (వాల్తేరు స్టేషన్‌లో నలభై అయిదు నిమిషాలు. బండి ఆగినప్పుడైనా తల్లి గుర్తుకు రానందుకి ఆశ్చర్యపోతుంది సుజాత). ఏ మూడో ట్రిప్పులోనో నాలుగో ట్రిప్పులోనో తల్లి దగ్గరకు వెళ్తాడు. అదికూడా తిరుగు ప్రయాణంలో!

తన పుట్టింటివారి హోదా గురించీ, తాను చేయించుకొన్న నగల గురించీ, పాసుల మీద తాము తిరిగిన ప్రదేశాల గురించీ, యాత్రల గురించీ ఏకరవు పెడ్తుంది రెండో కోడలు. మేనత్తకదా అని మాట వరసకి మధ్యలో అంటుంది పూరించినట్టుగా "వచ్చే డిశంబరులో కన్యాకుమారి వెళ్తూన్నాం. అప్పుడు మీరుకూడా తప్పకుండా రావాలత్తయ్యా!" అని. "అలాగే" అంటుందామె. ఎన్నో డిశంబర్లు వస్తున్నాయ్! పోతున్నాయ్!

తమ యిబ్బందుల్నీ, కష్టాల్నీ కొడుకుల్తో చెప్పుకోవాలని వారు రాకముందు ఎన్నోసార్లు అనుకొంటుంది తల్లి. తీరా వాళ్ళు వచ్చాక మాట్లాడ్డానికే వీలుచిక్కదు! చిక్కినా మాట్లాడలేదు! ఎప్పుడైనా సుజాత కలవడం తటస్థ పడితే గట్టిగా కడిగి వదిలిపెడ్తుంది. అందుకే పెద్ద చెల్లి అంటే వాళ్ళకి కోపం! తల్లిని చూడ్డానికే వెళ్ళని వాళ్ళు చెల్లింటికి





వస్తారా? అందుకే మా యింటికెప్పుడూ రారు!

ఇక నా సంగతి! రాజమండ్రి కాలేజీలో లెక్చరర్‌ని. బరువు బాధ్యత లేవీ లేవు. అన్నదమ్ములం ముగ్గురవూ వుద్యోగాలు చేసుకొంటున్నాం. ఎవరి బ్రతుకు వారు బ్రతుకుతున్నాం. ఇద్దరు చెల్లెళ్ళకి వివాహాలయాయ్! నా కిద్దరే పిల్లలు! ఎంత విలాసంగా ఖర్చు చేసినా కొంత మిగుల్తుంది. వారికి సహాయంచేద్దామన్నా అత్తయ్యగారు అంగీకరించదు. ఒకసారి సుజాత ఇద్దరు చెల్లెళ్ళకీ తల్లికీ చీరలు కొని తీసుకెళ్ళింది.

"ఆడ పిల్లవి! నీకు పెట్టేది పోయి నీ దగ్గర తీసుకొంటామా! తిరిగి పంపితే నీ మొగుడు బాధ పడ్తాడు. ఇలా ఎప్పుడూ తేకు!" అని కూతుర్ని మందలించింది.

సుజాతనీ, పిల్లల్నీ వాళ్లింటికి పంపాలని వుండదు! పుట్టింటి మీద మమకారం కొద్దీ సంవత్సరానికోసారైనా వెళ్తానంటుంది సుజాత.

"పుట్టింటివారు చారూ అన్నం పెట్టినా పంచభక్ష్య పరమాన్నంతో సమానమండీ! ఆడ పుట్టుక పుడితే మీకు తెలిసి వుండేది" అని సుజాత బతిమాలుతుంటే కాదనలేను. అది నా బలహీనత. పోయిన దీపావళికి ముందు ఇంటర్వ్యూకి బెజవాడ వెళ్లి తిరుగు ప్రయాణంలో రాజమండ్రిలో దిగాడు శంకరం. అప్పటికి దీపావళి వారంరోజులుంది. పండక్కి విశాఖపట్నం రమ్మని మమ్మల్ని ఆహ్వానించాడు. ప్రత్యేకంగా పండగకి వెళ్లడం ఇష్టం లేదు నాకు.

"మాకు పెళ్లయి పదేళ్లయింది. ఇంకా పండగలకి అత్తవారింటికెళ్లడం యిష్టంలేదోయ్!" మనసులో మాట చెప్పా!

"అమ్మ మరీమరీ చెప్పిందటండి! మమ్మల్ని చూసి చాలా కాలం అయిందట! దానికి వయసు మళ్లింది! వచ్చే ఏడాది ఎలా వుంటుందో! మీరు కూడా రాక తప్పదు!" పట్టు పట్టింది సుజాత. మౌనం వహించాను ఆ క్షణంలో.

శంకరం మా పెద్దబ్బాయిని తీసుకొని యిన్నీసుపేట వెళ్లాడు తన స్నేహితుడింటికి. అప్పుడు సుజాతకి నచ్చజెప్పడానికి ప్రయత్నించా.

"మనం పండక్కి వెళ్లామనుకో! కూతురూ అల్లుడూ వచ్చారని భారీ ఎత్తున పండగ చేస్తారు. ఆ తర్వాత అవస్తలు పడ్తారు. మనక్కూడా రానూపోనూ ఖర్చులు! ఎవరు తిన్నదీ కాదు!...ఆ..." మధ్యలో అందుకొని విసుక్కొంది సుజాత.

"మీరొట్టి డబ్బు మనుషులండి! పైసా తోసహా లెక్కలు వేస్తారు!"

"అవును ఏదైనా పని చేయబోయే ముందు ఎంత ధనం వ్యయం అవుతుందీ, ఎంత టైము వేస్టవుతుందీ, ఎవరెవరికి నష్టమూ యిబ్బందులూ కలుగుతాయీ ఇవన్నీ ఆలోచించాలి!"

"వాళ్లు అప్పుచేయాల్సిన అవసరం వుండదులెండి! పెద్దన్నయ్య దీపావళికి భిలాయ్‌నుండి వస్తున్నావని రాసాట్ట! వచ్చేటప్పుడు అందరికీ బట్టలు తెస్తానని కూడా రాశాట్ట! శంకరానికి ఏదో కంపెనీలో చిన్న ఉద్యోగం దొరికిందిట! ఆరు వందలు ఇస్తారుట! మా పెద్ద మేనకోడల్ని పెద్దమనిషయాక అసలు చూడనేలేదండి!" ప్రాధేయపడింది.

సరే అనక తప్పలేదు! తమ్ముడితో పిల్లల్ని తీసుకొని వెళ్లింది సుజాత. పండగ ముందు రాత్రి నేను కూడా వెళ్లా! అనుకొన్నట్టుగా భాస్కరం పండక్కి రాలేదు. ఏదో అవాంతరం వచ్చిందని లెటరు రాసాడు. పండక్కి మాకందరికీ బట్టలు కొన్నాడు శంకరం. శంకరం నాకు బట్టలు అందిస్తూంటే ఓ మాట విసిరింది నా ఆఖరి మరదలు లక్ష్మి.

"బావగారు మరీ వంటెత్తు మనుషులు!" అని.

ఆ మాటలలో ఎంతో అర్థం స్ఫురించింది. అయితే ఆమె నవ్వుతూ అనడంతో ఈజీగా తీసుకోవలసి వచ్చింది. నా ముఖ కవళికలను గమనించిన అత్తయ్యగారు తేలికగా విడమరచి చెప్పింది.

"చూశావా బాబూ! నీ చిన్న మరదలు ఎంత గడుసుదో! కాలేజీలో చదువుతోంది కదూ! తోటి అల్లుణ్ణి తేకుండా ఒక్కడివే తీసుకుంటున్నావని అంటోంది! అదీ దాని వుద్దేశం!"

"ఆ ప్రయత్నంలోనే వున్నానండి! ఈ మధ్య ఓ సంబంధం చూశాం!..." చెప్పబోయా.

"అవును బాబూ! సుజాత చెప్పింది! అల్లుడు అబ్బాయితో సమానం అన్న మాటను రుజువు చేస్తున్నావ్! మంచిరోజు చూసి పెళ్లి చూపులకు తీసుకొనిరా!" అంది.

"వాళ్లిదివరలో నాలుగైదు సంబంధాలు చూశారండి! ఒక్కటీ నచ్చలేదుట! అనవసరంగా తిరగడమవుతోందనే అభిప్రాయంతో వున్నారు.!అందుకని..." తర్వాత సుజాత అందుకుంది.

"అవునమ్మా! అందుకే సుగుణని మాతో తీసుకువెళ్తాం! అక్కడే పెళ్లి చూపులు ఏర్పాటుచేస్తాం!"

"వద్దు బాబూ! పెళ్లికావలసిన పిల్లని అలా వూరూరా తిప్పకూడదు!" అసమ్మతిని తెలియజేసింది అత్తగారు. తల్లి విధించిన ఆంక్షకు తల్లడిల్లింది సుగుణ. ఆమె మొహంలో వ్యక్తం అయిన భావాల్ని బాగా చదవగలిగా. లక్ష్మి, శంకరం కూడా తల్లిని చికాగ్గా చూశారు. సుజాత సంగతి సరేసరి!

నేనే నచ్చజెప్పాలనుకొన్నా-

"ఇప్పుడిది మామూలే అయిందండీ! మగపెళ్లివారి అభీష్టానుసారం ఆడపెళ్లివారు

"కథ కాని కథ"

నడుచుకోక తప్పదు! పాత పద్ధతుల్ని పట్టు కొని వేళ్లాడితే పనులు కావు!"

"ఆడపిల్ల వారింటికి మగపెళ్లివారు రావడం ఆచారం బాబూ! అలా వచ్చినపుడు ఆడపెళ్లివారి హోదానీ అంతస్థునీ అంచనా వేసుకుంటారు. అదీ ఆచారంలోని ఆంతర్యం! ఆ సాంప్రదాయాన్ని పాటించాలి!"

తల్లి మొండి పట్టుదలకి ఆవేశపడింది సుజాత.

"పోనీ దాన్ని నా యింటికి తీసుకువెళ్లాలనుకుంటున్నా! ఓ వారం రోజులుంచుకొని తిరిగి పంపిస్తా! తీసుకెళ్లమంటావా?" ఆగ్రహాన్ని అణచుకొంటూ అడిగింది సుజాత.

అనంగీకారాన్ని వ్యక్తం చేస్తూ మౌనం వహించింది తల్లి. మర్నాడుదయమే మా తిరుగు ప్రయాణం! ఆ రాత్రి భోజనం చేసి వీధి వరండాలో వాలుకుర్చీ లో కూర్చున్నా. నేను ఏకాంతంగా వుండటం చూసి, నా వెనుకనే గుమ్మంలో నిలబడి అంది సుగుణ.

"బావగారూ! నేను ఎప్పుడూ రాజమండ్రి చూడలేదు! అక్క రమ్మంటోంది!" తన సంసిద్ధతను తెలియజేసింది. వెనక్కి తిరిగి ఆమె మొహంలోకి చూసా! లైటు వెలుగులో స్పష్టంగా కనిపించింది. పది సంవత్సరాల క్రితం నా పెళ్లినాటికి ఆమె వయసు పదహారు సంవత్సరాలు! అదే వయసులో వున్న మాచెల్లెలికి ముగ్గురు పిల్లలు! ఆమె సిగ్గుతో తల దించుకొంది.

ఆమె కళ్లలో-

అందరిలా తనూ పెళ్లికూతురు కావాలన్న కోరిక!

ఒకరికిల్లాలినై తన యింటిని దిద్దుకోవాలన్న తపన!

కన్నెచెర విడిపించమని అభ్యర్థన! ప్రార్థన!

వెనుకనుండే వస్తూ అంది సుజాత.

"అమ్మమాటకేం! దీన్ని మనతో తీసుకెళ్దాం!" తన నిర్ణయాన్ని తెలియజేసింది. ఎలాగైతేనేం! సుగుణని మాతో రాజమండ్రి తీసుకెళ్లాం! పెళ్లిచూపులు ఏర్పాటు చేశాం "పిల్ల నచ్చింది! చేసుకొంటాం!" అన్నారు. పెళ్లికొడుకు అన్నయ్య నా కొలీగ్! బాగా సన్నిహితుడు! అతి కష్టంమీద చొరవ తీసుకొని ఆరు వేలు కట్నానికి అంగీకరింపచేసాను. ఇక తర్వాత చేయవల్సింది నామీద పడింది. భాస్కరాన్నీ, కృష్ణనీ ఒకేసారి రప్పించడం బహు కష్టం అయింది. అంతా కూర్చుని పెళ్లికి ఎంత ఖర్చు అవుతుందో లెక్కలు వేశాం! పది వేలకి తేలింది. ఆ ఖర్చుని ఇద్దరన్నదమ్ముల్ని పంచుకోమంది అత్తయ్యగారు. కొడుకు లిద్దరూ తెల్లమొహం వేశారు.

"ఈ గడ్డు రోజుల్లో సంసారం గడవడమే కష్టంగా వుంది! మాదగ్గరంత డబ్బులేదు!" అన్నారిద్దరూ ఏక కంఠంతో. వారలా అంటారని నాకు తెలుసు! వేరొక మార్గం ఆలోచించి వుంచా! సుజాతకి చెప్పాను కూడా! ఆమె తల్లికి చెప్పింది కాబోలు!

"మన యింటి పక్కనున్న రెండువందల గజాలూ అమ్మేద్దాం! ఎలా లేదన్నా ఇరవై వేలొస్తాయ్! లక్ష్మి పెళ్లికృ్కడా డబ్బు కావాలి కదా!" అంది తల్లి.

అన్నదమ్ములిద్దరూ అసమ్మతిని తెలియజేశారు. ఏకగ్రీవంగా ఆ ప్రతిపాదనను త్రోసిపుచ్చారు.

"వద్దమ్మా! నాన్నగారు రెక్కలు ముక్కలు చేసుకొని కొన్న జాగా అది! అందులో ఇల్లు కట్టాలనుకొంటున్నాం!" అన్నాడు పెద్ద కొడుకు భాస్కరం.

"అంత కట్నం ఇచ్చుకోలేం! ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లు చేయాలి! మరో సంబంధం

"కథ కాని కథ"

చూసుకొందాం!" ద్వితీయ పుత్రుని ప్రతిపాదన.

అన్నయ్యల మాటలు సుజాతకు చిర్రెత్తించాయ్!

"మరెలా అవుతాయిరా చెల్లెళ్ల పెళ్లిళ్లు! మీ పెళ్లాలూ, పిల్లలూ మీ గొడవేగానీ తల్లీ చెల్లెళ్లూ, తమ్ముడు ఎలా బతుకుతున్నారని ఎప్పుడైనా ఆలోచించారా? వేలకు వేలు జీతాలు తెచ్చుకుంటున్నారు, ఇద్దరు, ముగ్గురు పిల్లలు! మీకే యిబ్బందులుంటే ముష్టి మూడొందలతో ఈ నలుగురూ ఎలా బతుకుతారనుకొంటున్నార్రా? మనల్ని కన్నవారినీ, నమ్ముకొన్నవారినీ ఆదుకోవాలన్న జ్ఞానం మీకుందా? ఉత్తరాలు రాయగా రాయగా ఏ మూణ్నెల్లకో ఓ వందో యాభైయ్యో పారేస్తారు ముష్టివేసినట్టుగా! పాతికేళ్లు దాటాయ్. చెల్లికి పెళ్లి చేయాలన్న జ్ఞానం మీకుందా? అసలు వీళ్లు మీకు జ్ఞాపకానికి వస్తారా? పది రూపాయలు పెట్టి జాకెట్టు గుడ్డ కూడా కొనని మీరు పదివేలు పెట్టి పెళ్లి చేస్తారని అనుకోవడం వట్టి అవివేకం రా!"

వుద్రేకంతో వూగిపోయింది సుజాత.

"అక్కా!" భయంతో వారించబోయింది ఆఖరి చెల్లి లక్ష్మి! సుజాతకి ఆవేశం ఏ మాత్రం తగ్గలేదు.

"అవును లక్ష్మీ ! నీ అక్కకే దిక్కు లేదు ! నీ సంగతెవరు పట్టించుకుంటారు? నా మాట విని ఓ బుద్ధిమంతుణ్ణి చూసుకుని వాడితో లేచిపో ! అమ్మలక్కలూ, చుట్టాలూ నాలుగు రోజులు గుసగుసలాడుకుంటారు. అయినా పరవాలేదు. నీ బతుకు నువ్ చూసుకో ! నీ అక్కకిది చేతగాదు!" తానేమి మాట్లాడుతున్నదీ తెల్సుకోలేని స్థితికి చేరుకుంది సుజాత. ఆ అన్నదమ్ములిద్దరూ పెదవి కదపకపోవటం నాకాశ్చర్యం వేసింది. సుగుణ కళ్లు చెమర్చాయ్. అత్తయ్యగారు కొంగుతో కళ్లు తుడుచుకొంది. అన్నదమ్ముల మనసు కరగలేదు ! సుగుణకి ఆసంబంధమూ తప్పిపోయింది.

* * * *

నే వెళ్లేసరికి శంకరం ఇంట్లో లేడు. సుగుణ మంచానికి అతుక్కుపోయి వుంది. చెల్లెలి నోట్లో టాబ్లెట్స్ వేస్తోంది సుజాత. వెళ్లి మంచానికి దగ్గరగా నిలబడ్డా. నన్ను చూసి పేలవంగా నవ్వు మొహం పెట్టింది సుగుణ. శక్తిని కూడదీసుకుని రెండు చేతులు జోడించి నమస్కారం చేసింది.

"నే పోతున్నా !" అన్నట్లు సైగ జేసింది. కన్నీరు చెంపల ద్వారా కిందికి ప్రవహిస్తోంది. నా హృదయం ద్రవించింది. కళ్లు చెమ్మగిల్లాయ్. ఆమె నుదురు మీద చేయివేసి లాలనగా చూస్తూ...

"లేదు సుగుణా ! బతుకుతావ్ ! అధైర్యపడకు !" నాలో ధైర్యం పూర్తిగా సడలిపోయినా ఆమెకు ధైర్యం చెప్పా.

"నూటనాలుగు జ్వరం ! మరి తగ్గలేదు !" అంది సుజాత కన్నీరు తుడుచుకుంటూ. అంతలో గదిలోకి వస్తూ చెప్పింది అత్తయ్యగారు.

"వెంకట్రావు డాక్టరుగారు రోజూ రెండు పూటలా వస్తూ చూస్తున్నారు బాబూ ! గుణం కనబట్టంలేదు. రెండు రోజులనుంచీ చెరుపుమరుపుగా వుంటోంది ! అన్నయ్యలకీ, నీకూ టెలిగ్రాంలు పంపాడు శంకరం !"

"కె. జి. హాస్పిటల్లో జాయిన్ చేసి ఉండాల్సింది !" అన్నా. అంతలో డాక్టరు వెంకట్రావుగారిని తీసుకొని వచ్చాడు శంకరం. సుగుణను పరీక్షించి ఇంజక్షన్ చేశారు. కొన్ని క్యాప్సూల్స్ ఇచ్చి, పూటకి రెండు చొప్పున వేయుమని చెప్పారు. ఆయన వెళ్తొంటే వెనకనే వెళ్లి వీధిలో అడిగాం.

"డాక్టర్ ! క్షమించాలి ! మీ మీద నమ్మకం లేక కాదు. మరోలా అనుకోకండి ! పేషెంటుని కె. జి. హెచ్. కి తీసుకెళ్లాలనుకుంటున్నా !"

"మీ ఇష్టం !" అంటూ రిక్షా ఎక్కారు డాక్టరుగారు.

సుగుణని వెంటనే పెద్దాస్పిటల్ కి తీసుకెళ్లాం టాక్సీలో. వెంటనే అడ్మిట్ చేసుకున్నారు. మూడు రోజులు గడిచాయ్. రోగి పరిస్థితి మరింత క్షీణించసాగింది. డాక్టరు శక్తివంచన లేకుండా ఆమెను బ్రతికించడానికి ప్రయత్నిస్తున్నారు. ఫలితం కనిపించడం లేదు. సుగుణకి మాట పడిపోయింది. ఆమె ముక్కుకి పెట్టిన ఆక్సిజన్ ట్యూబ్ ని సరిచేస్తూ అంది సుజాత భయంగా-

"అన్నయ్యలింకా రాలేదు !"

"ఎందుకక్కా ! వచ్చి మాత్రం ఏం చేయగలరు ?" శంకరం మాటల్లో కోపం, విసుగు ! నాకూ అలాగే అనిపించింది.

అంతలో ఒక సిస్టర్ వచ్చి నన్ను పిలిచింది.

"మాస్టారూ ! మిమ్మల్ని ఛీఫ్ రమ్మంటున్నారు !" సిస్టర్స్ రూమ్‌లో వున్నారు ఛీఫ్. వెళ్లి నమస్కరించి ఎదురుగా నిలబడ్డా. "కూర్చోండి" అన్నారు ఏదో పేషెంట్ ఈసీజీ పరీక్షిస్తూ. నేను కూర్చోలేదు. ఏమి చెబుతారో అన్న భయం.

"ఆ పేషెంట్ మీకేమౌతారు ?" అడిగాడు. చెప్పాను.


"అతను ఆమె తమ్ముడా ?" అవునన్నట్లు తలూపాను. ఆయన ఒక్క క్షణం మాట్లాడలేదు. నేనే మాట్లాడా.

"ఇద్దరన్నయ్యలు కూడా ఉన్నారు. దూరంగా ఉద్యోగాలు చేస్తున్నారు. టెలిగ్రామ్స్ పంపాం ! వస్తారు !"

ఆయన కళ్లనిండా సానుభూతి కన్పిస్తోంది.

"అయాం సారీ మిస్టర్ ! ఆమె పరిస్థితి బాగులేదు. ఇంటికి . తీసుకెళ్లటం మంచిదని నా అభిప్రాయం! తర్వాత ఇబ్బంది పడ్తారు ! చాలా ఆలస్యంగా తీసుకొచ్చారు!" అన్నారు.







స్వాతంత్ర్య మూల స్తంభాలు

నవంబరు 3వ వారంలో, మన పురుషులు,
స్త్రీలు, యువకులు, వృద్ధులు
మిలియన్ల సంఖ్యలో తమ ఓటు హక్కును
వినియోగించుకున్నారు.

ఇతరత్ర వీచే పరివర్తనల గాలులలాగే
మన దేశంలోకూడ ప్రజాస్వామ్య రీతిలో,
సులభంగా, సాఫీగా ప్రభుత్వ పరివర్తన
జరిగింది.

9వ లోక్‌సభ ఎన్నికలు మరోసారి
ప్రపంచానికి తేటతెల్లం చేశాయి.
స్వాతంత్ర్యం - ప్రజాస్వామ్యం వీటిపై
మనకున్న అచంచల విశ్వాసమే
మన బలమని నిరూపించాయి.

ఆ విశ్వాసం, ఆ స్వాతంత్ర్య జ్వాలల్ని
మనం పరిరక్షించుకోవాలి.





ప్రజల వాక్కు ఇది
జాతి వాక్కు ఇది

davp 89/970 Tel

మీ జి.కె. ఎంత?

(1) మొట్టమొదటిసారిగా స్పేస్‌షటిల్ పేరేమిటి?
(2) క్రెమనోఫోబియా అంటే ఏమిటి?
(3) "కాంగెరికెట్ నార్గే" అనేది ఏదేశం యొక్క జాతీయ లేక అధికారిక నామము?
(4) 'ఆస్కార్బిక్ ఆసిడ్'ని మనము సాధారణంగా ఏ పేరుతో పిలుస్తున్నాము?
(5) ఇంగ్లాండ్‌రాణి పాస్‌పోర్ట్ నంబర్ ఎంత?
(6) కోటీశ్వరులకే కోటీశ్వరుడు "సుల్తాన్ ఆఫ్ బ్రూనై" పేరేమిటి?
(7) 'భారత నావికాదళం'లోని మొదటి 'జలాంతర్గామి' పేరేమిటి?
(8) కేవలం 8 నిమిషాలు నటించి 'ఉత్తమ సహాయ నటుడి'గా ఆస్కార్ పొందిన నటుడెవరు?
(9) 1988 సంవత్సరానికి 'లతామంగేష్కర్' అవార్డు ఎవరికి లభించింది?
(10) "భారత రత్న" పొందిన మొదటి విదేశీ వ్యక్తి ఎవరు?

-జై

జవాబులు ఈ సంచికలోనే

"కథ కాని కథ"

"తర్వాత" అంటే అర్థం అయింది. నాలోని నవనాడులూ కృంగిపోయాయి. పక్కనేవున్న బల్లమీద చతికిలబడ్డా ! అపస్మారక స్థితి దాదాపు అలముకొంది. అలా ఎంతసేపు కూర్చున్నానో తెలీదు. శంకరం వెన్నుతట్టి లేపి చెప్పాడు.

"బావగారూ ! అన్నయ్యలూ, ఒదినలూ వచ్చారు !" అని. లేచి నిలబడ్డా. డాక్టరుగారక్కడ లేరు. బెడ్ చుట్టూ అన్నయ్యలూ, ఒదినలూ నిలబడి సుగుణని పరీక్షగా చూస్తున్నారు.

"డాక్టరుగారేమన్నారు ?" దుఃఖాన్ని దిగమింగుకుంటూ అడిగింది సుజాత. జవాబు చెప్పలేక మౌనం వహించా. భాస్కరాన్నీ, కృష్ణనీ వరండాలోకి తీసుకెళ్లా, శంకరం కూడా వచ్చాడు. డాక్టరుగారు చెప్పింది చెప్పా.

"నో ! అలా జరగడానికి వీల్లేదు ! డాక్టరుగారితో మాట్లాడ్దాం" అన్నారు ఉద్వేగంగా. తర్వాత చీఫ్ ఉండే రూమ్‌వైపు నడిచారు. నేనుకూడా వెనకనే వెళ్లా.

"మా చెల్లి తప్పకుండా బ్రతకాలి డాక్టర్ !" అన్నాడు కృష్ణ.

"ఎంత ఖర్చయినా భరిస్తాం !" చెప్పాడు భాస్కరం.

పరీక్షిస్తున్న ఎక్స్‌రేని పక్కకుపెట్టి ఆ ఇద్దర్నీ పరీక్షగా చూశారు డాక్టర్‌గారు. పక్కనే వున్న నన్ను చూసి వారెవరైనదీ అర్థం చేసుకొన్నారు. డాక్టరుగారి చూపుల్లో చికాకు ! సానుభూతి ! నిస్సహాయత !

"అయాం సారీ ! మీ బావగారితో చెప్పా ! అలా చేయటం మంచిదేమో అనిపిస్తోంది !" అన్నారు అతిసౌమ్యంగా.

"లేదు డాక్టర్ ! ఆమెని బతికించాలి !"

"ఖర్చుకి వెనకాడం ! ఎంతయినా భరిస్తాం !"

ప్రాధేయపడ్డారిద్దరూ. అతి శాంతంగా చెప్పారు డాక్టరుగారు.

"రోగి ప్రాణాన్ని డబ్బు కాపాడలేదు. మందులు మాత్రమే అపాయాన్నుండి రక్షిస్తాయ్ ! అదయినా సరైన సమయంలో అయితేనే ! చెల్లెలిమీదున్న ప్రేమకొద్దీ వేలూ, లక్షలూ ఖర్చుపెట్టడానికి మీరు సిద్ధపడి ఉండొచ్చు. కానీ చాలా ఆలస్యం అయింది. నాలుగు రోజులు ముందు తీసుకొని వచ్చి వుంటే పరిస్థితి ఇలా ఉండేది కాదు. రోగి ప్రాణాలు పోయేంతవరకూ అంటే ఆఖరి క్షణం వరకూ మా ప్రయత్నాలు మేము చేస్తాం ! అది మా విధి ! కర్తవ్యం కూడా ! తర్వాత మీ అదృష్టం ! నాకు తోచింది చెప్పా ! తర్వాత మీ ఇష్టం !"

అన్నదమ్ములు ముగ్గురూ నిశ్చేష్టులయ్యారు. డాక్టరుగారు ఎక్స్‌రేతో బయటకు వెళ్తూంటే వెనుకనే వెళ్లి "డాక్టర్ !" అన్నా.

ఆయన వెనక్కి తిరిగి చూసి - "మీరు పేషెంట్ బావగారు కదూ ?" అడిగారు. తలూపాను.

"నా అంచనా ప్రకారం ఆ పేషెంట్ నాలుగైదు గంటల కన్నా ఎక్కువ కాలం బ్రతకదు. అంటే తీసుకొని పొమ్మని బలవంతం చేస్తున్నానని మాత్రం భావించకండి ! ప్లీజ్ ! వారు ఆర్థిక ఇబ్బందుల్లో వున్నట్లు కన్పిస్తున్నారు. తర్వాతయ్యే ఖర్చుని దృష్టిలో ఉంచుకొని మాత్రమే ఆ సలహా ఇచ్చాను. మళ్లీ మరొక పావుగంటలో వచ్చి చూస్తా ! పేషెంట్‌ని వదిలి ఎక్కడికీ వెళ్లకండి !"

అడుగులు పడలేదు. రక్కున ఆగిపోయా.

సుగుణని వెంటనే టాక్సీలో ఇంటికి తీసుకెళ్లాం. డాక్టరుగారు చెప్పినట్లే జరిగింది. ఇంటికి తీసుకెళ్లిన ఒక గంటకి సుగుణ ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది.

చెల్లెల్ని కాటికి సాగనంపటానికి ఘనంగా ఏర్పాటు చేశారు అన్నదమ్ములిద్దరూ. ఆరు వందలు పెట్టి పట్టుచీర కొన్నారు. కూతుర్ని కాటికి తీసుకెళ్తుంటే భోరున ఏడ్చింది తల్లి. ఆమె వెనుక ఆడపిల్లలూ, కోడళ్లూ. ఆ ముగ్గురన్నదమ్ములూ, నేనూ శ్మశానం నుండి ఇల్లు చేరుకొన్నాం.

గుమ్మంలో ఉన్న తల్లి అడిగింది రోదిస్తూ-

"చెల్లెల్ని అత్తవారింటికి పంపారా ? ఏ లోటూ చేయలేదు కదా !" పిల్లలు ముగ్గురూ మౌనంగా తలలు వాల్చారు. ఆమె నావైపు తిరిగింది.

"బాబూ ! దగ్గరుండి మరదల్ని అత్తవారింటికి దిగబెట్టావ్ కదూ! నాకు తెల్సు ! ఏలోటూ జరగనీయవ్ !"

ఆమెకు మతిభ్రమణం కలిగిందేమోనన్న అనుమానం వచ్చింది. ఆ మాతృ హృదయాన్ని ఎలా ఊరడించడం ? ఆ కడుపు మంటని ఎలా చల్లార్చటం ? ఎవరికి చేతనవుతుంది ? సమాధానం చెప్పలేక వీధి అరుగుమీదనే చతికిలబడ్డా.

ఇది కల్పన కాదు ! జరిగిన కథ ! కథ కాని కథ ! జరగకూడని కథ ! కానీ జరుగుతూన్న కథ ! ●

యువతా! కవితా!

నైజం

తెగిందని తీగ
వీణను మూల పెడితే,
బూజు పడుతుంది...
చివరకు పాడు బడుతుంది!!
విరిగిందని మనసు
మనిషి కృంగి పోతే,
చిచ్చు పెడుతుంది!
బ్రతుకే చచ్చు బడుతుంది!!

-సాయిచంద్ర

జీవితం!

జీవితం...
మాయ అనుకొన్నావో
అది తీరం చేరలేని
బర్ముడా ట్రయాంగిల్ వైపు
పయనించే నౌకవుతుంది!
జీవితం...
అమూల్యమైన అవకాశమనుకొన్నావో
అది ఖచ్చితంగా తీరం చేరే
పగిలిన ఓడ దుంగైనా ఔతుంది!

-బడబాగ్ని శంకరరాజు

రెండుకాళ్ళ జంతువు

అన్యాయపు బీజాలను నాటి
అక్రమాల నెత్తుటి ప్రవాహంతో
అకృత్యాలను సాగు చేస్తే
విషఫలాలు కాక
అమృత ఫలాలు....
ఎలా పుడుతాయి?
మనిషి తనలోని
మేధను విడచి,
మానవుడ్ని చంపి,
సంచరిస్తే
రెండు కాళ్ళ జంతువు కాక
మంచి మనిషి....
ఎలా అవుతాడు?

-వి. పరుశురామ్

డ్రగ్

నరాల్లోకి ఎక్కుతున్నప్పుడు
నీ వొళ్ళు తెలిపోతుంది మత్తుగా
నీకది దొరకనప్పుడు
నీ మెదడు చిట్లిపోతుంది చిత్తుగా!

-సోమయాజుల సోదరులు

అండర్ గ్రౌండ్


నాడు స్వేచ్ఛకై
ప్రాణాలు తెగించి
దేశ నాయకులు
చీకటి ఖార్కానాలకెళ్తే...
నేడు తో (జో)డుకై
కట్నాలు చెల్లించి
అతివలు అత్తారిల్లనే
"అండర్ గ్రౌండ్ల కేగుతున్నారు !"

- "శ్రీధర విరజ"

కానివాళ్ళు

డాక్టరు కాని
డాక్టర్లు డాక్టరేట్లు!
యాక్టరు కాని
యాక్టర్లు కొందరు
డాక్టర్లు!

-చల్లా దుర్గాప్రసాద్



అంతరం

కత్తిరించిన క్రోటన్స్ మధ్య
విచ్చుకున్న గులాబీని
గుచ్చి చూడు!
ఎలా వుంది?
విలాసాల ఊబిలోంచి
చొచ్చుకు వచ్చిన
వికటమైన నవ్వులాలేదూ?
ముళ్ళమధ్య విరిసిన గులాబీలోనే
మృదుత్వం వుంటుంది!
కష్టాల కొలనులో పూచిన చిరునవ్వే
ఆర్తిని తొలగించి
హాయి నిస్తుంది!

-వల్లమూడి దుర్గాంబ

ఆనవాళ్ళు

దారానికి
'ముళ్ళు'వేసి
పసుపురాసి
'తాళి' అంటారు!!
'దారి'లో
ఎదురైన
వితంతువును
'ముళ్ళు' వంటిమాటలో
ఎగ'తాళి' చేస్తారు!!
ఇద్దరూ.... ఆడవాళ్ళే...
మాతృత్వానికి వాళ్ళు... ఆనవాళ్ళే..!!!

-మహర్షి

ఆమె!


ఆమె-
అన్నంతిననని పేచీ పెడుతున్న
తన చిన్నారి బాబును
మురిపించే మాటలతోమరిపించాలని
చూస్తోంది!
ఆమే-
జీవితపు చివరి దశలో
భార్యతో షికారు వెళ్తున్న కొడుకుని
పట్టెడన్నం పెట్టమంటూ
జాలికొలిపేలా అడుగుతోంది!

-"రమ"

మహేంద్ర జాలం

ఓ మనిషీ!
మమతా పాశంలో చిక్కుకోకు
మహిలో నీవు రాణించలేవు!
మధురోహలలో విహరించకు
మనుగడ మధుర స్వప్నం కాదు!
మదిలో ఆలోచనలనే తుఫానుల రేపకు
మాయా ప్రపంచంలో
జీవించగలిగేందుకు
మాటలతొ మత్తుజల్లే
మహేంద్రజాలం నేర్చుకో!

- ఎ. వి. జి. ఎస్. మూర్తి



లవ్ గేమ్

సీరియల్

చల్లా సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

సాయంత్రం నాలుగు గంట లవుతోంది.

మహాలక్ష్మమ్మ- సావిత్రి- మీనాక్షి అంతా ఏడుస్తూ నవ్యని తయారు చేశారు.

నవ్య కిదంతా గొప్ప ఫార్సులా అనిపించింది. తాను నిజంగానే కాపరాని కెళ్ళిపోతున్నట్టు, వీళ్ళంతా భ్రమపడుతున్నారు.... ఈ పెళ్ళి తనకి ఇష్టం లేకుండా చేసినప్పుడు ఏమయిందో ఈ ప్రేమంతా. ఛస్తామని బెదిరించి తన గొంతు కోశారు వీళ్ళంతా. హు! వీళ్ళూ- స్వాగత్ అందరూ ఏకమైనా తన మనసుని మార్చలేరు...

"ఏమిటాలోచిస్తున్నావ్? పద వెళ్దాం" చిన్నగా నవ్వుతూ అన్నాడు స్వాగత్. తలెత్తి అతన్ని తినేసేలా చూసింది నవ్య.

అప్పటికే సామాను కార్లో సర్దేశారు.

ఇంతవరకూ సాగిన కథ-2: పెళ్ళయిన భార్యాభర్తలు ఆనందలోకాల్లో విహరించే మధురాతి మధురమైన తొలిరోజు అనుభవాలను ఊహించుకుంటూ తన నవ్యతో పాటివి చవిచూడాలని లండన్ నుంచి వస్తాడు స్వాగత్. జీవితంలో కొత్త రహస్యాలు తెలుసుకొనే తొలి రోజున భార్య నవ్య నుంచి ఊహించలేని వ్యతిరేకత ఎదురైన స్వాగత్ ఖిన్నుడవుతాడు. పెద్ద వాళ్ల బలవంతం మీద జరిగిన ఈ పెళ్లి తనకు ఇష్టంలేదని సంవత్సరం తర్వాత విడాకులు తీసుకోవాలని నిక్కచ్చిగా చెప్తుంది నవ్య. అందుకు స్వాగత్ అంగీకరిస్తాడు.

అందరూ కారు దగ్గరకొచ్చి నిలబడ్డారు.

"ఏమిటో నండీ! మా కయితే ఇష్టంలేదు. మీనాక్షి రావడం.... కొత్తగా పెళ్ళయిన మీ మధ్య మూడో వ్యక్తి ఎందుకనుకున్నాం గానీ- మీరే అడిగారని చెప్పింది నవ్య."

నవ్వుతూ అన్న మామగారి మాటలు అర్థం కాలేదు స్వాగత్‌కి.

"అదేనండీ బాబూ... కొత్త కాపురం పెట్టించ డానికి మా పెద్దమ్మాయి మీనాక్షిని మీ వెంట తీసుకెళదామని అన్నారటగదా?" అన్నా డాయన.

"ఏమైనా అబ్బాయి దూరదృష్టి గొప్పదిసుమా! కొత్త కాపురంలో ఉండే లొసుగుల్ని దిద్దడానికి మీనాక్షిని రమ్మన్నారంటే... అల్లుడిగారి లౌక్యం అర్థమవుతుంది" సంబరంగా అంది మహాలక్ష్మమ్మ.

స్వాగత్‌కు మతి పోయింది.

నవ్య వేపు చూశాడు.

ఆమె నవ్వింది గర్వంగా-

అతని కర్థమైంది- ఆమె పథకానికి అప్పుడే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుందన్నమాట.

మన్మథరావు ఆశగా చూస్తున్నాడు స్వాగత్ వేపు.

నెల రోజులు!!

అంటే ముప్పై రోజులు... సెన్సార్ గొడవ లేకుండా తాను జీవితాన్ని ఎంజాయ్ చేయొచ్చు.!

పెళ్ళాన్ని ఊరికి పంపించి- తాను ఊరుమీదపడి బతికేసే సిసలైన మగాళ్ళకు ఉదాహరణ మన్మథరావు.

మీనాక్షి పిల్లలకేవో నీతులు చెప్పి తల్లికి అప్పగించి వచ్చింది.

"పదండి... పదండి... మళ్ళీ వర్జ్యం వస్తుంది"

కంగారు పడిపోయాడు సుందరమూర్తి.

"నువ్వు కంగారుపడకు నాన్నా. ఇంకా టైముంది" అన్నాడు నవ్య తమ్ముడు సూర్యం.

"నోర్ముయ్! బొత్తిగా భయమూ, భక్తీ లేకుండా పోయాయి. శ్రీరామచంద్రు డంతటివాడు తండ్రి మాటను జవదాటలేదు..."

"ఆపండి"- అరిచింది సావిత్రి.

పకాల్న నవ్వింది నవ్య.

"కారెక్కు తల్లీ! మళ్ళీ వర్జ్యం వస్తుంది" మహాలక్ష్మమ్మ అంది.

స్వాగత్ అందరికీ పేరు పేరునా చెప్పి కారు వెనక సీట్లో కూర్చున్నాడు. ఆ తర్వాత నవ్య ఎక్కి అతనికి అడుగు దూరంలో కూర్చుంది.

మీనాక్షికి స్థలం లేక పోవడంతో-

"కొంచెం జరగవే!" అంది ఎక్కుతూ.

ఓ అంగుళం జరిగింది నవ్య.

కారు కదిలింది.

స్వాగత్ నవ్యని చూశాడు.

ఆమె ముఖంలో కనిపిస్తున్న హాసరేఖకు అర్థం తెలిసిం దతనికి.

మీనాక్షిని తీసుకు రమ్మని తాను చెప్పినట్టు అందర్నీ నమ్మించి తనమీద తొలి విజయాన్ని సాధించిన తృప్తి అది!

సీటు వెనక్కి తలవాల్చి అనుకున్నా డతను.

"నవ్యా! రేపే నా ఛాలెంజ్‌కి శ్రీకారం చుడతాను. బీ రెడీ!"

కారు వేగంగా హైదరాబాద్ వేపు దూసుకు పోతోంది.

* * * * *

మద్రాస్ మౌంట్‌రోడ్‌లో యల్. ఐ. సి. బిల్డింగ్ దగ్గర బస్ దిగి ఎదురుగా ఉన్న రాయల్ కాంప్లెక్స్ వేపు నడుస్తోం దామె.

తెల్లగా- మైఖేల్ ఏంజిల్ బొమ్మలా అందంగా నాజూగ్గా ఉండి ఆలివ్ గ్రీన్ షెల్వార్ కుర్తాలో చాలా ఆకర్షణీయంగా ఉందామె.

ఆమెను చూసిన వారెవరూ మరోసారి ఆమెను చూడకుండా వెళ్ళిపోలేక పోతున్నారు.

రోడ్ క్రాస్ చేస్తోందామె.

ఓ బస్ ఆ తర్వాత ఓ టాక్సీ- దాని పక్కగా రెండు స్కూటర్లు- అవి వెళ్ళాక నాలు గడుగులు వేసింది.

సరిగ్గా అప్పుడు జరిగిందా సంఘటన-

శర వేగంతో వెనక నుంచి వచ్చి- దాదాపు ఆమెకు వెంట్రుకవాసిలో సడన్‌బ్రేక్‌తో ఆగిపోయింది స్కూటర్

రోడ్‌మీద జనమంతా ఆగిపోయి చూడసాగారు.

ఆమె ఒక్క క్షణం నిశ్చేష్టురాలయి-ఆ తర్వాత స్కూటర్‌మీది వ్యక్తిని చూసింది.

నల్లగా- ఎత్తుగా- రోజులో కనీసం ఐదు గంటలపాటు హెయిర్ స్టయిల్ విషయం కేర్ తీసుకునేవాడిలా ఉన్నా డతను.

"కళ్ళు కనిపించడం లేదా?" కోపంగా అన్నా డతను.

"అదే మాట నేనూ అనాలనుకుంటున్నాను. చేతిలో స్కూటరుంటే మేడ్‌మాక్స్ అయిపోయినట్టు

పోజ్ కొట్టడం కాదు. కాస్త డ్రైవింగ్‌సెన్స్ ఉండాలి''

తీవ్రంగా అందామె.

''షటప్'' అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు. ఆమె ముఖంలో ఏ భావమూ లేదు. జరుగుతున్న తంతును చాలా ఆనందంగా ఎంజాయ్ చేస్తున్నారు చుట్టూ ఉన్న సగటు భారతీయులు.

ఆమె నెమ్మదిగా అతని దగ్గర కొచ్చింది.

''సారీ'' అని మెల్లగా అంటుందని ఊహిస్తున్న స్కూటర్ వ్యక్తికి ఒక్క క్షణంలో ఏం జరిగిందో అర్థం కాలేదు.

అతని కాక్షణంలో కళ్ళు బైర్లు కమ్మి-ప్రపంచమంతా అంధకారమై ఆ చీకట్లో నక్షత్రాలు మెరుస్తూ కనిపించాయి.

''ఇంగ్లీషు నాకూ వచ్చురా రాస్కెల్! కానీ చేసిన తప్పును సమర్థించుకోడానికి- ఇంగ్లీషులో భయపెట్టడం నాకు చేతకాదు. స్కూటర్ డ్రైవింగ్‌తో పాటు కొంచెం సంస్కారం కూడా నేర్చుకో'' విసురుగా ఇంగ్లీష్‌లో అంటున్న ఆమె మాటలు మాత్రం వినిపించా యతనికి.

కళ్ళముందు అంధకారం పోయి-

సాధారణ స్థితికి వచ్చి- ఆమె కోసం చూసేసరికి ఆమె రోడ్ క్రాస్ చేస్తోంది.

అవమానంతో కుంగిపోతూ- కోపంగా కిక్ కొట్టి వేగంగా వెళ్ళిపోయాడు.

సగటు భారతీయులు నవ్వుకుంటూ ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆమె రాయల్ కాంప్లెక్స్‌లో ప్రవేశించింది.

లిఫ్ట్ వేపు వెళ్ళకుండా– మెట్లెక్క సాగింది.

చేతిలో బాగ్ ఓపెన్ చేసి చూయింగ్‌గమ్ పాకెట్ తీసి ఒకటి నోట్లో వేసుకుంది. ఆమె ఆనందంగా ఉన్నప్పుడు చేసే పనది.

ఫిఫ్త్ ఫ్లోర్‌లోకి అడుగుపెట్టి వాచీ చూసుకుంది. ఓ నిముషం లేటు.

ఆ ఇడియట్‌కి బుద్ధి చెప్పడంవల్ల జీవితంలో ఓ నిముషాన్ని కోల్పోయింది తను. అనుకుంటూ- ఆర్ అండ్ ఆర్ పబ్లిషింగ్ కంపెనీ లిమిటెడ్ అని గోల్డ్ లెటర్స్ చెక్కబడ్డ డెకోలాం డోర్‌ను తీసుకుని- తన సీట్లో కూర్చుందామె.

వెంటనే ఫోన్ మోగింది. రిసీవరెత్తి

''హలో ...'' అంది.

''ఒక్క నిముషం లేటయారు మేడం''

''అవును. దార్లో నీలాంటివాడొకడు కనిపిస్తే చేతి దురద తీర్చుకునేసరికి లేటయింది.''

''మీకిలా నెగిటివ్‌గా తప్ప– పాజిటివ్ అప్రోచ్ ఉండదా?''

''టు ఎవ్విరి యాక్షన్ దేరీజ్ యాన్ ఈక్వల్ అండ్ ఆపోజిట్ రియాక్షన్– అందెవరు?''

''వాస్కోడిగానూ అనుకుంటా!''

కంగ్రాచ్యులేషన్స్- ఎమ్మెస్సీ ఫస్ట్ క్లాస్ కదూ నువ్వు?''

''యస్ మేడం! థాంక్యూ!''

''సరిగ్గా గంట టైమిస్తున్నాను. ఆ మాట అన్నదెవరో తెలుసుకుని నాకు చెప్పు!''

''వాస్కోడిగామాకాదా మేడమ్?''

''కాదు''



"సోనీ-సర్దార్ పటేల్?"

"నీ మూలంగా ఇప్పటికి రెండు నిముషాలు వేస్టయ్యాయి-గంట టైమిస్తున్నాను. ట్రై చెయ్..."

ఫోన్ పెట్టేసి-ఎదురుగా ఉన్న ఫైల్ ఓపెన్ చేసి-

రెండే రెండు క్షణాల్లో ఆ ఫైల్లో లీనమై పోయిందామె.

పది నిమిషాల తర్వాత...

"గుడ్‌మాణింగ్ మేడం!" అన్న స్వరానికి ఫైల్లోంచి తలెత్తకుండానే-

"యస్ గుడ్‌మాణింగ్-ప్లీజ్ బి సీటిడ్" అందామె.

అవతల వ్యక్తి ఆమె కెదురుగా కూర్చున్నాడు.

రెండు నిముషాల తర్వాత ఫైల్ మూసేసి-

"యస్" అంటూ తలెత్తి చూసిందామె.

అవతల వ్యక్తి అదిరి పడ్డాడు.

"మీరా" ఆశ్చర్యంతో అన్నాడతను.

"మళ్ళీ ఎందుకొచ్చావ్?" కసిగా చూయింగ్‌గమ్ నములుతూ అంది.

"మాట్లాడవేం? ఫస్టాఫాల్- యు మస్ట్ స్టాండప్ ఐసే-" అందామె.

దిమ్మర పోయిన ఆ వ్యక్తి లేచి నిల్చున్నాడు భయంగా.

"నీ...మీ... పేరు శ్రీమతేనా?" అనుమానంగా అడిగాడతను.

"యస్- శ్రీమతి- కుమారి శ్రీమతిని నేనే! అసలెందుకొచ్చావో చెప్పు. తిన్న చెంపదెబ్బ సరిపోలేదా? అవతల చెంప ఖాళీగా ఉందని వచ్చావా?" తీవ్రంగా అంది శ్రీమతి.

"సారీ మేడమ్. మీరని నాకు తెలీక ఏదో అలా వాగాను. అయాం ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ" వినయంగా అన్నాడతను.

ఆర్ అండ్ ఆర్ పబ్లిషింగ్ కంపెనీ జనరల్ మేనేజర్ అంటే నలభై ఏళ్ళ వయసులో లావుగా- హుందాగా కార్లో వస్తుందని ఊహించిన అతను- ఎవరో కాలేజీ స్టూడెంట్‌లా బస్ దిగి వెళ్తున్న ఈ పాతికేళ్ళలోపు అమ్మాయే జనరల్ మేనేజరని తెలుసుకుని- షాక్ నొంచి కోలుకోలేకపోతున్నాడు.

అతి పొడవైన టి. వి. స్క్రీన్

ప్రపంచంలోనే పొడుగైన టెలివిజన్ స్క్రీన్ త్వరలో మార్కెట్‌లోకి విడుద లవుతోందట. జపాన్‌లో 'సోనీ' సంస్థ ఈ స్క్రీన్‌ను తయారు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఈ స్క్రీన్ పొడుగు 1.50 మీటర్లట.

అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారయ్యే ఈ స్క్రీన్‌కు అనుగుణంగానే టి. వి. ఫ్రేములను ఆ సంస్థ ఉత్పత్తి చేస్తుంది. మంచి మంచి రంగుల్లో ఈ స్క్రీన్‌లు తయారు చేస్తున్నట్లు ఆ సంస్థ వివరించింది.

లవ్ గేమ్

"ఐ డోంట్ వాంట్ యువర్ బ్లడీ అపాలజీస్-ప్లీజ్ గెటి వే" ఆమె కంఠంలోని తీవ్రతకు అతని వెన్నులో చలి మొదలైంది.

"సారీ మేడం! మీరని తెలీక పొరపాటు పడ్డాను."

"వాడ్యూ యూమీన్? నీకు పరిచయస్థులైన అమ్మాయిలతో నాగరికంగా- అపరిచితులతో అనాగరికంగా ప్రవర్తించడం హాబీనా? యూ బార్బేరియస్ రాస్కెల్- అసలు ఆడదంటే ఏమనుకుంటున్నావ్? హారన్ లేకుండా ఫాస్ట్‌గా వచ్చి సడన్ బ్రేక్ వేసి బెదిరించి- నీ మగతనం నిరూపించుకోవడానికి....! ఆడదంటే అబల కాదని -అనుభవంమీద తెలుసుకున్నావుగా."

ఆడ పులిలా అరిచిందామె.

"సారీ మేడమ్! క్షమించమని హృదయపూర్వకంగా అడుగుతున్నాను"

"ఇంత ఘోరంగా తిడుతున్నా చలనం లేకుండా సారీ చెపుతున్నావ్ రచయితవా?"

అతని ముఖంలో వెయ్యి క్యాండిల్స్ ఒక్కసారి వెలిగాయి.

"అవునుమేడం. ప్రేంకుమార్ పేరు వినే ఉంటారు మీరు. రొమాన్స్ రాయడంలో నన్ను మించినవారు లేరు" గర్వంగా చెప్పాడు.

"ఐసీ. ఇప్పటి కెంతమంది అమ్మాయిల్తో చెప్పుదెబ్బల రొమాన్స్ అనుభవించావ్?"

వేయి క్యాండిల్స్ ఒక్కసారి ఆరిపోయాయి. అతను తలదించుకున్నాడు.

"సారీ మిస్టర్ కాసినోవా- నీలాంటి మేనర్‌లెస్- కల్చర్‌లెస్- సెన్స్‌లెస్ రైటర్ నవల్ని మేము తీసుకోం- నువ్వు వెళ్ళొచ్చు."

"మేడం" దీనాతిదీనంగా ఆర్తనాదం చేసి అన్నాడతను.

"ప్లీజ్ అలా అనకండి. మీమీద కొండంత ఆశతో వచ్చాన్నేను. మీరు కాదంటే ఆత్మహత్య చేసుకుంటాను-"

ఆమె టేబిల్ డ్రాయర్ తీసి ఓ బాటిల్ అతనికిస్తూ అంది-

"ఇంద తీసుకో."

"ఏమిటి మేడం ఇది?"

"పొటాషియం సైనైడ్"

"ఎందుకు మేడం"

"ఆత్మహత్య చేసుకుంటా నన్నావుగదా- సుఖంగా చావడానికి మార్గం!"

"అంటే- ఇది మీ దగ్గర ఎప్పుడూ రెడీగా ఉంటుందా మేడం"

"అవును. నీలాంటి కేసులు నాకు రోజుకు కనీసం నాలుగొస్తుంటాయి."

"ఒక్క చిన్న డౌట్ మేడం"

"చెప్పు"

"ఇంతవర కెవరయినా ఇది తీసుకున్నారా మేడం?"

"తీసుకుంటే రచయిత లెందుకవుతారు. నువ్వు తీసుకుంటే నీ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. తీసుకో"

"మేడం..."

"ఇంకొక్క పాయింట్. తెలుగులో ఏ కళాకారుడికైనా చచ్చాకే గుర్తింపొస్తుంది. ఆ లైన్లో ట్రై చేయి హేవిట్!"

మరుక్షణం ఆ గదిలోంచి అతను మాయ మయ్యాడు.

చూయింగ్‌గమ్ మరొకటి తీసి నోట్లో వేసుకుంది శ్రీమతి.

"మే ఐ కమిన్ మేడం?"


"తలెత్తి చూసిందామె."

యాభై ఏళ్ళ షణ్ముగరావ్ తెల్లగా పండిపోయిన తల లోపలికి పెట్టి- గద్దలా నిల్చున్నాడు.

"యస్..." అంది శ్రీమతి.

తెల్లటి బట్టల్లో సన్నగా ఎత్తుగా వున్న షణ్ముగరావ్ కొంగలా నడుచుకుంటూ వచ్చి ఆమె కెదురుసీట్లో కూర్చున్నాడు.

"చెప్పండి" అందామె.



అతను నవ్వుతూ ఓ ఫైలు ఆమె ముందుంచాడు.

ఫైల్‌మీద చూసిందామె–

"ప్రణయఘోష-ప్రేంకుమార్" అని రాసుంది.

ఆమెకు సన్నివేశం అర్థమైంది. ఫైలు పట్టుకోకుండా షణ్ముగరావ్‌ను సూటిగా చూస్తూ అడిగింది.

"ఎలా ఉంది నవల?"

"ఫెంటాస్టిక్ మేడం. ఇది మనం తీసుకుంటే– ఫస్ట్ ఎడిషన్ ఇరవై వేలు పోతుంది గ్యారంటీ" అన్నాడతను.

"వెరీగుడ్... అయితే ప్రేంకుమార్ నీ కెన్ని వేలిచ్చాడు మిస్టర్ షణ్ముగం?"

అతని ముఖం పాలిపోయింది.

"మేడం.."

"యస్... ఆన్సర్ టు ద పాయింట్–"

"ఇట్స్ టూమచ్ మేడం.." కోపంగా అన్నాడతను. అతని ఇరవై ఏళ్ళ సర్వీసుకి గౌరవమిచ్చి అతనితో ఎవరూ అలా మాట్లాడలేదు.

"ఐనో... వాటీజ్ వాట్– బట్ ఐ వాంట్ యువర్ ఆన్సర్... కమాన్..."

"అతను నాకేమీ ఇవ్వలేదు–"

"కాదు ఇచ్చాడు–"

"ఏవిటి సాక్ష్యం?" మొండిగా అన్నాడు.

"చూడండి మిస్టర్ షణ్ముగం.. డబ్బు మీ చేతికొచ్చి పది నిమిషాలు కాలేదు– ఆ డబ్బు మీ జేబులోనో– మీ సీట్లోనో– ఎక్కడో ఓ చోట– ఇట్స్ నన్ ఆఫ్ మైబిజినెస్! ఐవిల్ రిపోర్ట్ ద మేటర్ టు ది ఛైర్మన్..."

ఫోనందుకుందామె.

"అమ్మా!" నిలబడి రెండు చేతులూ జోడించి అన్నాడు.

"చిన్నదానివైనా క్షమించమని అడుగుతున్నాను. బుద్ధి గడ్డి తిని– కక్కుర్తి పడ్డాను. ఛైర్మన్ గారికి చెప్పి నా కడుపు మీద కొట్టకు. పిల్లలు గలవాడ్ని–"

రెండు క్షణాలు నిశితంగా ఆమె అతన్ని చూసింది.

ఆ రెండు క్షణాలూ జీవన్మరణ సమస్య హద్దు మీద నిలబడ్డట్టు ఉద్విగ్నత ననుభవించాడు షణ్ముగరావు.

"ఇట్సాల్ రైట్! మీరు వెళ్ళండి–" అందామె ఫోన్ క్రెడిల్ చేస్తూ.

అతను రెండు చేతులెత్తి నమస్కరించి వెళ్ళిపోయాడు.

శ్రీమతి మరో చూయింగ్‌గమ్ నోట్లో వేసుకుంది.

'మ...గా...డు'

కసిగా నమిలింది... కళ్ళు మూసుకుందామె. ఆమె మనస్సు తెర మీద ఓ దృశ్యం–

ఓ లేడి పరుగెత్తుతోంది. ఒక్క ముఖం తప్ప అంతా లేడిలానే ఉంది. ముఖం మాత్రం ఓ పురుషుడిది... ఆమె చేతిలో గన్‌తో– జీప్‌లో కూర్చుని– ప్రాణ భయంతో వణికిపోతున్న లేడిని వినోదంగా చూస్తోంది.

ట్రిగ్గర్ నొక్కింది.

బుల్లెట్ కాలికి తగిలి కుంటుతూ పరుగెడుతోందది.

ఆమె తృప్తిగా నవ్వుకుంది. జీప్ వేగం తగ్గించమని డ్రైవర్‌కి సైగ చేసింది.

జీప్‌కూ– లేడికీ దూరం పెరగ సాగింది.

లేడి ప్రమాదం తప్పిపోయిందన్న రిలీఫ్‌తో పరుగును తగ్గించి గాయాన్ని చూసుకుంటోంది.

జీప్ హార్న్ మోగింది.

ఉలిక్కిపడి– మళ్ళీ పరుగెత్త సాగింది లేడి. మరో బుల్లెట్ వచ్చి రెండో కాలికి తగిలింది. లేడి పరుగెత్తలేక కూలబడిపోయింది. జీప్‌లోంచి దిగి– ఆమె ఆ లేడి దగ్గర కెళ్ళి నిల్చుంది. గర్వంగా– జయించానన్న తృప్తితో– లేడి ప్రాణ భయంతో దీనంగా ఆమెను చూస్తోంది.

ఆమె పెద్దగా నవ్వుతోంది.

అందుకే కద్సార్....

"ఇప్పటికే టైం దాటిపోయింది, మీరెల్లాగైనా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేసుకోవాలి" అన్నాడు ఫ్యామిలీ ప్లానింగ్ ఆఫీసరు, కేశవరావుతో.

"అందుకే కద్సార్...ముగ్గురు భార్యలతోనే సరిపెట్టుకున్నాను." తక్కున జవాబిచ్చాడు కేశవరావ్.

–ఎం. భువనేశ్వరరావు

కళ్ళు తెరిచింది శ్రీమతి.

రక్తం రుచి మరిగిన మేన్ ఈటర్‌లా నవ్వుకుందామె.

ఫోన్ మోగింది.

"ఏవిటి షణ్ముగరావ్‌కి డోసిచ్చారట?"

"వెధవ్వేషాలేస్తే నీకూ తప్పదు–"

"అద్సరే మేడం... అతను డబ్బు తీసుకున్నాడని అంత గ్యారంటీగా ఎలా చెప్పగలరు?"

"దటీజ్ శ్రీమతి? ఇంతకీ నేనడిగిన దానికి జవాబు దొరికిందా?"

"హజరాత్ మకూదుల్లా ఖాన్ అని నాడౌట్ మేడం!"

"నో... ఇంకా అరగంట టైముంది ట్రై చెయ్"–

"ఓకే మేడం" అన్నాడు ఆర్ అండ్ ఆర్ పబ్లిషింగ్ కంపెనీ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా చేస్తున్న సుందరం.

ఫోన్ పెట్టేసి– ఫైల్ ముందేసుకుని మరుక్షణం అందులో లీనమైంది కుమారి శ్రీమతి.

* * * *

సాయంత్రం ఐదున్నర–

అందంగా ఖరీదుగా ఉన్న ఆ భవనం ముందు లాన్స్‌లో– గార్డెన్ ఛెయిర్స్‌లో కూర్చుని ఉన్నారు స్వాగత్– నవ్య– మీనాక్షి.

దూరంగా కొండల వెనక ఎర్రగా కందిపోయి కుంగిపోతున్నాడు సూరీడు. చల్లని గాలి హాయిగా ఉంది. నైట్ క్వీన్ తన పరిమళాన్ని అప్పుడే వెదజల్లడం ప్రారంభించింది.

స్వంత ఊళ్ళో చిన్న డాబా ఇల్లు – అత్తగారి పెంకుటిల్లు తప్ప ఏనాడూ ఇలాంటి భవనాన్ని

చూడని మీనాక్షికి స్వాగత్ అంటే ఓ విధమైన హీరో వర్షిప్ ఏర్పడింది.

మనిషి తన ఫాంటసీలో ఊహించుకునే లక్షణాలు ఎదుటి వాడిలో కనిపించినప్పుడు– ఆ వ్యక్తి మీద అప్రయత్నంగా ఆరాధనా భావం కలుగుతుంది.

మీనాక్షికి చెల్లెలు అదృష్టానికి రవ్వంత జెలసీ కూడా కలిగింది.

"ఇంత పెద్ద ఇంట్లో మీరొక్కరే ఉండేవారా?" ఆశ్చర్యంగా అడిగింది మీనాక్షి.

స్వాగత్ చిన్నగా నవ్వి–

"లేదండీ – నేనూ – నా భార్య – పిల్లలు ఉండేవాళ్ళం!"

దిమ్మెర పోయింది మీనాక్షి.

"ఆశ్చర్యపోతున్నారా? ఈ ఇంటిని నేను దగ్గరుండి – ప్రతిదీ శ్రద్ధగా కట్టుకున్నాను గనుక ఈ ఇల్లు నేను కట్టుకున్న భార్య అయి– ఈ మొక్కలు– చెట్లు – నేను పెంచాను గనుక నా పిల్లలై పోయారు–" అన్నాడు.

పెద్దగా నవ్వింది మీనాక్షి.

మొహమాటంగా నవ్వింది నవ్య. ఆమెకీ సన్నివేశం భరించలేనిదిగా ఉంది. అతని ప్రెజెన్స్‌ను క్షణం కూడా సహించలేక పోతోంది. కానీ– తనొక్కతే ఇంట్లోకి వెళ్ళిపోతే అక్క అపార్థం చేసుకునే అవకాశం ఉంది.

అన్నిటినీ మించి ఆమె భరించలేక పోతున్న విషయం.

మీనాక్షి కళ్ళలో అతని పట్ల క్షణ క్షణానికీ పెరిగిపోతున్న గౌరవం–

"మరయితే మా చెల్లాయి రెండో పెళ్ళామా మీకు?"

"అసలు పెళ్ళామే కాదు–" సీరియస్‌గా

లవ్ గేమ్

అన్నాడతను.

నవ్య చటుక్కున తలెత్తి చూసింది.

ఆమెనే చూస్తున్న అతను చూపులకు ఆమె చూపులు కలిపి–

ఒకే ఒక్క క్షణం–

ఆమె తల తిప్పి – పడమటి కొండల మీద సంజె వెలుగుల్ని చూస్తోంది.

"అదేవిటి?" ఆశ్చర్యంగా అంది మీనాక్షి.

"మీకో రహస్యం చెప్పనా? భార్యా భర్తల్లో – భార్య భర్తను మొగుడన్నప్పుడు గానీ– భర్త భార్యను పెళ్ళామన్నప్పుడు గానీ వాళ్ళకు ఒకళ్ళమీద ఒకళ్ళకి గౌరవం తగ్గి పోయిందని గుర్తు! అంచేత మీ చెల్లెలు నాకు పెళ్ళాం కాదు. భార్య – అర్ధాంగి– ఇల్లాలు – శ్రీమతి–"

ఫకాల్న నవ్వింది మీనాక్షి.

"భలే గమ్మత్తుగా మాట్లాడతారే మీరు

"అదేమిటో నండీ. నేనెవరితో నయినా రెండు నిముషాలు మాట్లాడితే చాలు– ఇదేమాటంటారు–" అమాయకంగా అన్నాడు స్వాగత్.

"మరది నిజమేకదా?"

"కానీ ఒక్క వ్యక్తి మాత్రం ఇంత వరకూ అలా అనలేదు."

నవ్య తలెత్తలేదు. వేలిగోళ్ళను చూసుకుంటోంది.

"అనలేదూ అంటే – వాళ్ళొ జడపదార్థం అయియుండాలి!" అంది మీనాక్షి.

నవ్య గుండె భగ్గుమంది–

తనను ఎంత అందంగా... అమాయకంగా....

అవమానించాలని చూస్తున్నాడు. ఇక లాభంలేదు. తనిక్కడుంటే – ఇతని మాటలకు హద్దుండదు. చెలరేగి పోతాడు– వెళ్ళిపోవాలి... వెళ్ళిపోవాలి.... వెళ్ళి....

"మాట్లాడవేమే– నువ్వేమంటావ్?" మోచేత్తో నవ్యని పొడిచింది మీనాక్షి.

నవ్య ఉలిక్కి పడి – "ఏవిటి?" అంది.

"అదే– మీ ఆయన మాటలకు నవ్వనివాళ్ళు జడపదార్థం అయియుండాలి. కరెక్టేనా?" అంది మీనాక్షి.

అక్కమీద గొంతువరకూ వచ్చిన కోపాన్ని నిగ్రహించు కుంటూ అ.... అ.... వునవును....." అంది.

ఇక అక్కడ మరో క్షణమున్నా – అతను ఇన్‌డైరెక్ట్‌గా దెబ్బతీస్తూనే ఉంటాడనిపించి – చివాలున లేచి నిలబడి–

"తలనొప్పిగా ఉంది– అని విసురుగా లోపలికెళ్ళిపోయింది.

ఆమెకు కోపం వచ్చిందని గ్రహించాడు స్వాగత్.

చెల్లెలు అలా వెళ్ళిపోవడంతో సమర్థింపుగా–

"పాపం ప్రయాణం చేసి అలసి పోయింది కదండీ! అందుకే తలనొప్పి వచ్చుంటుంది–"

స్వాగత్ మాట్లాడలేదు.

అందమైన ఈ సాయంత్రం అందమైన భార్యతో ఎంతో మనోహరంగా ఊహించుకున్నాడు... తను...

ఎన్నో రోజులు–

ఈ తోటలో ఒంటరిగా కూర్చుని ఆమెను తన పక్కనే ఊహించుకుని– ఏవేవో తీయని ఊహల్లో తేలిపోయాడు. తోటలోని ప్రతి మొక్కకూ– సాయంత్రం తానూ నవ్యా కలిసి నీళ్ళు పెడుతూ– ఆమెను 'శకుంతల' అని ఉడికిస్తుంటే – ఆమె రోషంతో అలిగి ఇంట్లోకి వెళ్ళిపోతే – ఆమె అలక తీర్చడానికి తాను ప్రయత్నిస్తూ–

ఓహ్.....

విసురుగా తల విదిల్చాడతను.

అతని ముఖంలో మార్పును గమనించిన మీనాక్షికి చెల్లెలు ప్రవర్తన ఆగ్రహం తెప్పించింది.

విసురుగా లేచింది మీనాక్షి. ఆశ్చర్యంగా చూశాడు స్వాగత్.

కోపంగా లోపలి కెళుతున్న ఆమెను వింతగా చూస్తుండి పోయాడు.

కొన్ని క్షణాల తర్వాత–

అప్పుడు కలిగిందతనికి ఆ అనుమానం.

రవ్వంత ఆ అనుమానం క్షణాల్లో పెరిగి పోతుండగా–

కంగారుగా లేచాడతను.

వేగంగా లోపలి కెళ్ళాడు.


కానీ–

అప్పటికే అతనూహించిన ప్రమాదం జరిగి పోయింది.

నిశ్చేష్టుడై నిలబడి పోయాడు స్వాగత్.

(ఇంకావుంది)





మత్తుమందు ముందు క్రీడాకారులు “చిత్తు”!

మాదక ద్రవ్యాలకు (డ్రగ్స్) అలవాటు పడి అనేకమంది క్రీడాకారులు తమ భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్న ఎన్నో సంఘటనలను మనం వింటూనే వున్నాం. ఈ విధంగా డ్రగ్స్‌కు దాసోహమై “బంగారు” పతకాలను చేజార్చుకుంటున్నారు.

క్రీడారంగంలో ఈ దశాబ్దం మాదక ద్రవ్యాల దశాబ్దంగా భావించబడుతోంది. మాదకద్రవ్యాలవల్ల క్రీడలు నాశనమవుతాయన్న విషయాన్ని ఈ దశాబ్దారంభంలోనే ప్రముఖులు కొంత మంది తెలియజేశారు.

ఆత్మహత్యకే...

నాలుగు సంవత్సరాలపాటు ‘స్టెరాయిడ్’ (యిదొక రకం మాదకద్రవ్యం)కు అలవాటుపడి మానసికంగాను, శారీరకంగాను కృశించిపోయిన అమెరికా ఫుట్‌బాల్ ఆటగాడు టామీచైకిన్ ఆత్మహత్యా ప్రయత్నానికి కూడా ఒడిగట్టాడు. స్టెరాయిడ్ మూలంగా తన శరీరాన్ని అదుపులో వుంచుకోలేక ఈ ఆటగాడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడట.

అమెరికా కళాశాలల్లో ఈ స్టెరాయిడ్ సేవనం విపరీతంగా పెరిగిపోతోందట. ఈ విధమైన మాదకద్రవ్యాల వాడకం విపరీతంగా పెరిగిపోయి అథ్లెట్లు అనేకమంది తమ భవిష్యత్తును చిందర వందర చేసుకుంటున్నారు.

పట్టుబడ్డ జాన్సన్

ఈ కోవలోకే వస్తాడు ప్రముఖ అథ్లెట్ బెన్ జాన్సన్. సియోల్ ఒలింపిక్స్‌లో చేజేతులా పతకాన్ని చేజార్చుకున్న బెన్ జాన్సన్‌పై కెనడా ప్రభుత్వం దర్యాప్తు జరిపింది. క్రీడాకారులు ఏ మేరకు మాదకద్రవ్యాలు పుచ్చుకుంటున్నారో ఆ దర్యాప్తు విదితం చేస్తుందట.

సియోల్ ఒలింపిక్స్‌లో జరిగిన 100 మీటర్ల ఫైనల్స్ పరుగు పందెంలో ఈ కెనడా క్రీడాకారుడు అనర్హుడిగా ప్రకటింపబడటమే కాకుండా రెండేళ్లపాటు ఏ పోటీలోను పాల్గొనకుండా నిషేధానికి గురయ్యాడు. అతనిపై చేసిన వైద్య పరీక్షలలో డ్రగ్ తీసుకున్నట్లు రుజువైంది. ఈ చర్యవల్ల జాన్సన్‌కు, అతని దేశానికి అపకీర్తి వచ్చింది. ఇది అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది కూడా.

టొరాంటోలో జరిపిన దర్యాప్తులో గత ఎనిమిది నెలల్లోను లేనంత ఎక్కువగా క్రీడారంగంలో మాదకద్రవ్యాల వాడకం వున్నదని వెల్లడైంది.

మత్తుమందు...

వీటి వాడకం అదుపులోనే వుందన్న క్రీడారంగ ప్రముఖుల ప్రకటనల వల్ల ఈ డ్రగ్ సమస్య మరుగున పడిపోతోంది.

జాన్సన్ ఉదంతం క్రీడాకారులకు మంచి గుణపాఠం వంటిదని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐ.ఒ.సి.) అధ్యక్షుడు జాన్ అంటోనియో సమరాంచ్ ప్రకటించినప్పటికీ ఈ దశాబ్దం అంతా అథ్లెట్లు, కోచ్‌లు ఎంత భారీగా ఈ డ్రగ్స్‌ను వినియోగించారో టోరాంటో దర్యాప్తు వెల్లడి చేస్తుంది.

1970 ప్రాంతాలలో తాను 'స్టెరాయిడ్'ను ఉపయోగించానని జాన్సన్ కోచ్ ఛార్లీ ఫ్రాన్సిస్ వెల్లడిస్తూ జాన్సన్ డాక్టరైన మేరియో ఆస్టాఫన్ అతనికి స్టెరాయిడ్‌ను సరఫరా చేస్తుంటాడని అన్నారు.

90 శాతంమంది బానిసలు

ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలలో పాల్గొనే వారిలో 90 శాతం మంది ఈ మాదకద్ర



వ్యాలను ఉపయోగిస్తారని అమెరికా డాక్టర్ రాబర్ట్ కెర్ తెలియజేశారు.

తూర్పు యూరప్ డాక్టర్ కెర్ చెప్పిన విషయాన్ని ధృవీకరిస్తోంది. కాగా తూర్పు జర్మనీలోని అందరు అథ్లెట్లు వీటిని బలవంతంగా తీసుకుంటున్నారట.

సోవియట్ యూనియన్‌లో జరిగిన ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులలో 30 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు వెల్లడైందట. తమ దేశంలోని క్రీడాధికారుల ప్రోద్బలంతోనే తాము వీటిని ఉపయోగిస్తున్నట్లు ప్రముఖ చెకొస్లొవేకియా ఆటగాడు ఒకరు తెలిపారు.

'స్టెరాయిడ్' అలవాటున్నవారు హృద్రోగంతోపాటు ఉదరవ్యాధులు, మూత్ర పిండాలవ్యాధులు, కేన్సర్‌కు కూడా లోనవుతారట.

ఇది యిలా వుండగా రాజకీయ ప్రతిష్టకోసం తమ అథ్లెట్ల ఆరోగ్యంతో తూర్పు ప్రాంత క్రీడాధికారులు ఆటలాడుకుంటున్నారన్న వాదనలు కూడా వినబడుతున్నాయి. పశ్చిమ ప్రాంతాలలో ఈ ప్రమాదకరమైన డ్రగ్స్ వాడకానికి డబ్బే ప్రధాన కారణమని కొంతమంది వాదిస్తున్నారు.

ఇతరులతోపోటీకి....

ఇతర క్రీడాకారులను అధిగమించేందుకే తాను మాదకద్రవ్యాలను తీసుకుంటానని జాన్సన్ అంగీకరిస్తున్నాడు. సియోల్ ఒలింపిక్స్‌లో 10 మిలియన్ డాలర్లు (ఈ డ్రగ్స్‌ని వాడి) జాన్సన్ చేజేతులా పోగొట్టు కున్నాడు.

400 మీటర్ల పరుగు పందెంలో మేటి అయిన బ్రిటన్‌కి చెందిన డేవిడ్ జెంకిన్స్ 1976, 1980 సంవత్సరాల్లో ఒలింపిక్స్‌లో పాల్గొన్నప్పుడు స్టెరాయిడ్‌ను ఉపయోగించాడట. కానీ 1988లో అతన్ని అరెస్టు చేశారు స్టెరాయిడ్ సరఫరా చేస్తున్నాడనే ఆరోపణ మీద.

1980 మాస్కో క్రీడలలో 24 మంది ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు, 1983 లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలలోను అథ్లెట్లు డ్రగ్స్ తీసుకున్న సమాచారం లేదు. 1987 లో మాత్రం 9 మంది క్రీడాకారులు మాదకద్రవ్యాలను తీసుకున్నట్లు పరీక్షలో తేలింది.

టోరాంటోలో 20 మంది అమెరికన్ అథ్లెట్లకు స్టెరాయిడ్ అందజేసినట్లు డాక్టర్ కెర్ అన్నారు.

అమెరికాలో ఎక్కువ

1987 పాన్ అమెరికా క్రీడలలో ఆరుగురు మాదకద్రవ్యాలు తీసుకున్నట్లు తెలిసింది.

ఎంతోమంది క్రీడాకారులు వీటికి అలవాటు పడినప్పటికీ సియోల్ ఒలింపిక్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ అయిన జాన్సన్ ఒక్కరే పట్టుబడ్డారు.

క్రీడాధికారుల అవినీతి కారణంగా టోరాంటో దర్యాప్తు ఆరోపణలకు గురైంది. ఈ సందర్భంగానే 1987లో 15 సార్లు పరీక్షలు జరిగినప్పటికీ జాన్సన్ శిక్ష పడకుండా తప్పించుకున్నాడు.

పరీక్షకుముందే పోటీనుంచి విరమణ

కారకస్‌లో జరిగిన పాన్ అమెరికా క్రీడలలో యిటువంటి కేసులు అనేకం బయటపడ్డాయి. కాగా 12 మంది అమెరికన్ క్రీడాకారులు పరీక్షలు జరుపకముందే పోటీ నుంచి విరమించుకున్నారు.

1987లో అమెరికాకు చెందిన కార్ల్ లూయిస్ ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో అనర్హుడిగా ప్రకటింపబడటానికి కారణం ఈ మాదకద్రవ్యాలే.

సియోల్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న మరో 50 మంది ఇతర అథ్లెట్లు కూడా 'స్టెరాయిడ్' ఉపయోగించినట్లు పశ్చిమజర్మనీ శాస్త్రవేత్త మాన్‌ఫ్రెడ్ డోసికె జరిపిన ప్రత్యేక పరీక్షల్లో వెల్లడైంది కాని జాన్సన్ ఒక్కడే బలి అయ్యాడు.

క్రీడారంగంలో మాదకద్రవ్యాల వాడకాన్ని నిషేధించే దానిపై జరిగే పోరాటం విజయవంతం కాదని డోసికె విశ్వసిస్తున్నారు. మందు పుచ్చుకోని వారుండని ఈ సమాజంలో మందు పుచ్చుకొని ఆడే క్రీడలేదంటే నేను నమ్మను అంటారీయన.

ఈ దశాబ్దంలో అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం జాబితా తెరిస్తే యిటువంటి సంఘటనలు చాలా కనిపిస్తాయి.

డ్రగ్స్ వాడకంవల్ల ఎంతోమంది తమ పేరు ప్రఖ్యాతులను పోగొట్టు కుంటుండగా క్రీడారంగంలో వీటి వాడకాన్ని నిషేధించరాదంటున్నాడు ఫ్రెంచి డాక్టరు ఫ్రాంకోయిస్ బెల్లాక్. హార్మోన్లు తగ్గిపోకుండా స్టెరాయిడ్ ఇంజక్షన్‌లు తీసుకునేందుకు 1980 ప్రాంతంలో అనుమతించారని చెబుతున్నారు.

ఈ మాదకద్రవ్యాలు క్రీడలను నాశనం చేయగలవని ఈ దశాబ్దారంభంలోనే అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం మాజీ అధ్యక్షుడు లార్డ్ కిల్లానిన్ చేసిన హెచ్చరికను ఎంతమంది పరిగణనలోకి తీసుకుంటారు? కిల్లానిన్ హెచ్చరికను దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులు మాదకద్రవ్యాల వాడకాన్ని తగ్గించినట్లైతే అటు వారికి, యిటు వారి దేశానికి మంచి కీర్తి ప్రతిష్టలు వచ్చేందుకు అవకాశం కలుగుతుంది కదూ!

-తిలక్



ఓ తండ్రి కథ

పెనుమాక నాగేశ్వరరావు

రంగారావుగారికి రవ్వంత కూడా మనశ్శాంతి వుండటంలేదు. కూతురిపెళ్లి చేశామన్న తృప్తీ లేదు. అలాగని ఇన్నేళ్లు తమ వద్ద వున్న కూతురు అత్తవారింటికి వెళ్ళిపోయిందన్న దిగులూలేదు.

అయినవాళ్ళు, ఆత్మీయులు మాటల సందర్భంలో "ఇంకా మీకు దిగులే ముందుండి అమ్మాయి పెళ్లి చేసేశారు. సొంత ఇల్లువున్నది. నెలనెలా వచ్చే అద్దె, పింఛను డబ్బుతో మీ భార్యాభర్తలకు గడవకపోదు. అబ్బాయికి వుద్యోగం వచ్చింది కూడా. ఇక మొగపిల్లవాడి పెళ్లి గురించి అదుర్దాపడాల్సిన పనేముంది గనుక" అని అనటం రంగారావుగారికి నవ్వు తెప్పిస్తుంది.

ఆడపిల్ల పెళ్లి చేసిన తండ్రిని ఓ గొప్ప ఘనకార్యం చేసేసిన వాడిలా పొగడటం, ఇక జీవితంలో దిగులుపడవలసిన అవసరం ఏదీ లేదంటూ తేల్చి చెప్పేయడం ఆయనకు ఎంత ఆలోచించినా అర్ధం అయ్యేదికాదు.

"అమ్మాయి పెళ్లి ముందునుంచి గమనిస్తున్నాను మీరేమిటో ముభావంగా వుంటున్నారు. దేని గురించో ఒకటే ఆలోచిస్తూ మీలో మీరే దిగులుపడుతున్నారు. ఇన్నాళ్లు కాపురం చేశాం మనసులో మాట ఏమిటో నాకూ చెప్పొచ్చుగా" కొంత నిష్ఠూరం, మరి కొంత దిగులు మేళవించి అన్నది భార్య సుగుణమ్మ.

'అవున్నిజమే. ఆమెతో చెప్తే తప్పేముంది. పైగా మనసులో వేదన ఇతర్లతో చెప్పుకుంటే కొంత మనశ్శాంతి కూడా పొందవచ్చంటారు' అనుకున్నారు రంగారావుగారు.

'మనసులోని ఆవేదనంతా ఆమెకు చెప్పేస్తే.... ఆవిడెలా అర్ధం చేసుకుంటుందో. నన్ను ఇదివరకులా ప్రేమిస్తుందా, ఆదరిస్తుందా' సందేహం కలిగిందాయనకు.

తను చేసిన వన్నీ తప్పో, ఒప్పో జరిగిపోయాయ్. కాని వాటినలా రహస్యంగా తనలోనే దాచుకుని... అంతర్మథన పడటం ఆమె గ్రహించింది. ఇప్పుడు కూడా చెప్పకపోతే ఆమె మనసు మరింత బాధపడుతుంది. అందుకే ఏది ఎలా జరిగినా తన ఆవేదనంతా అర్ధాంగికి చెప్పటావికే

నిర్ణయించుకున్నారు రంగారావుగారు.

బంధువుల ఇంటికి పేరంటానికి వెళ్లిన భార్య రాక కోసం ఎదురు చూస్తూ వాలు కుర్చీలో పడుకున్నాడాయన. సంతోషాన్నయినా, విచారాన్నయినా కావలసిన వ్యక్తుల్తో పంచుకుంటేనే తృప్తి. వాటి విలువ కూడా అలా పంచుకోవటంతోనే పెంచుకోవచ్చు కూడా.

అలా ఆవిడకోసం ఎదురు చూస్తున్న రంగారావు గారి మనసులో మెరుపులా ఓ ఆలోచన.

'చెప్పాలనుకున్న విషయాలన్నింటిని ఆమెకు ఎదురుగా కూర్చుని చెప్పటం కష్టమేమో. పైగా విషయాలన్ని వివరంగా విశదీకరించలేనేమో' అందుకే తన మనోభావాలన్నింటికి అక్షర రూపం ఇవ్వదలిచాడాయన.

వెంటనే కాగితం కలం పట్టుకొచ్చుకున్నాడు లోపలికి వెళ్లి.

డాబా మీదకు వెళ్లి తన అంతరంగ తరంగాలతో వాక్య నిర్మాణం ప్రారంభించారు రంగారావుగారు. ఉవ్వెత్తున ఎగిరిపడుతున్న ఆలోచనావేశాలను ఉపశమింపచేసుకుంటూ వ్రాయసాగాడాయన.

సుగుణా:

ఇలా సంబోధిస్తూ నీకు ఎన్నో వుత్తరాలు వ్రాశాను మన పెళ్లికి ముందు, తర్వాత కూడా కొంతకాలం. పెళ్లికి ముందు మనం వ్రాసుకున్న ఆ వుత్తరాలన్నీ ఇంకా నా దగ్గర వున్న విషయం నీకూ తెలిసిందే. ఎప్పుడయినా మనసు బాగుండకపోతే వాటిని ముందేసుక్కూర్చుంటావన్నది నీవు ఎరిగిన విషయమే.

మన అబ్బాయి పుట్టినప్పుడు కాబోలు మీనాన్న నాకు వ్రాసిన ఉత్తరానికి బదులుగా ఆయనకు ఒకటి నీక్కూడా వేరుగా ఓ ఉత్తరం వ్రాశాను. నాకు జ్ఞాపకం వున్నంతవరకూ అదే నేను నీకు చివరిసారిగా వ్రాసిన ఉత్తరం. ఆటు తర్వాత నీకు ఉత్తరం వ్రాయాల్సిన అవసరం కలగలేదు.

ఇప్పుడు.... ఇన్ని సంవత్సరాల తర్వాత నీకు ఉత్తరం వ్రాస్తున్నాను. ఇన్నేళ్ల మన సంసారంలో ఎన్ని సంతోషకరమైన సంఘటనలు జరిగినయ్యే, ఎన్ని కష్టాలు ఎదురైనవో నీకూ తెల్సు. నిన్నెంతవరకు సుఖపెట్టానో చెప్పవలసింది నీవు.

చాలీచాలని నా ఆదాయంతో నీ కోర్కెలు ఎన్నింటిని చంపుకున్నావో నీవు పెదవి విప్పి చెప్పకపోయినా నాకు తెల్సు. నా సంతోషం కోసం, నా తృప్తి కోసం నీ అయిష్టాలెన్నింటినో ఇష్టంగానూ మరెన్నో ఇష్టాల్ని అయిష్టాలుగానూ మార్చుకున్నావు.

ఎప్పటికప్పుడు ఈ ఆలోచన్లను, బాధలను నీ చల్లటి చిరునవ్వుతోనూ, నీ ఆప్యాయతతోను మరచిపోవటం నాకు అంత కష్టం అనిపించలేదు. పిల్లలు పుట్టాక మన ఇద్దరి ఆలోచనా వారిపైనే వుండటం ప్రారంభం అయింది.

తల్లి తండ్రులిద్దరికి పిల్లల మీద ప్రేమ ఒక స్థాయిలో వుండటం నిజమే అయినా పిల్లలకు మాత్రం తల్లంటే ప్రత్యేక స్థానం, ఎక్కువ చనువు వుండటం కూడా అంత నిజం.

"మీరు పిల్లల పట్ల మరీ కఠినంగా వుంటున్నారు" అని నీవు ఎన్నోసార్లు నాతో అనేదానివి. నీవు అలా అన్న ప్రతిసారి ముక్తసరిగా, ముభావంగా వుండే వాడిన్నేను.

ముఖ్యంగా ఈ ఉత్తరంలో నేను వ్రాయదలుచుకున్న విషయం మన అమ్మాయి కమల గురించి. ఇక ఆ విషయం ప్రారంభిస్తాను.

నీకు గుర్తుండే వుంటుంది. కమల పసి వయసులో నన్ను రకరకాల కోరికలు కోర్తుండేది. నిన్ను అది ఏమడిగినా 'నాన్న గారిని అడుగు' అంటూ నా దగ్గరకు పంపి ముసిముసిగా నవ్వుకునే దానివి.

అది నన్ను ఏది అడిగినా "అలాగే కొందాం" అని ఓ తియ్యని అబద్ధం చెప్పి మరిపించేవాడిని. తెలిసీ తెలియని వయసులో పిల్లలు ఏవేవో అడిగినప్పుడు సహజంగా ఏ తల్లితండ్రులయినా అలాగే చెప్తుంటారు కదా. అందుకే నేను దాన్తో అలా అబద్ధాలు చెప్పినందుకు ఎప్పుడూ విచారించలేదు. నేను 'సరే' అన్నప్పుడల్లా ఆ పసి ముఖంలో కనిపించే ఆనందం ఇప్పటికీ నా కళ్లముందు కదలాడుతుంటుంది. అదే సమయంలో నా ఆర్థిక స్తోమత నన్ను వికృతంగా వెక్కిరిస్తూనూ వుంటుంది.


మనం ఎన్నోసార్లు పాపను తీసుకుని బట్టలకొట్టుకు వెళ్లి వుంటాము. అక్కడ దానికి నచ్చిన వాటిని చూపుతూ అవి కొనమని మారాం చేసేది. అవన్నీ పిచ్చివంటూ ఇద్దరం మభ్యపెట్టే వాళ్లం. అప్పటికీ వినకపోతే విసుక్కునే వాళ్లం. ఆ పసిదానిపైన విరుచుకుపడే వాళ్లం. కొన్నాళ్లు అలా మనతో విసిగిపోయిన ఆ చిన్నారి మనసులో ఎన్ని భావాలు కలిగినయ్యోకాని అటుపై ఎటువంటి పేచీ పెట్టనట్లే నాకు గుర్తు.

అమ్మాయి పెద్దదయింది. స్కూలు చదువు పూర్తి చేసింది. పదోతరగతి ఫస్టుక్లాసులో పాసయిందని మనం ఎంతగానో





"భక్త మార్కండేయ విజయం" (శ్రీశైల ప్రాకార శిల్పం)
ఫోటో: వెల్లటూరి పూర్ణానందశర్మ, (వెల్లటూరు)

అదీ ఇదీ మరేదీ కాదు దాని



పేరు







▲ ఆల్విన్ దాని పేరు. మిగతా వాటన్నిటికన్నా పైచేయి దీనిది.
▲ చప్పుడు చెయ్యదు. దృఢంగా ఉంటుంది, నమ్మదగ్గది. ఆల్విన్ కంప్రెసర్ హిటాచీ టెక్నాలజీతో రూపొందించబడినది, దానివల్ల రెఫ్రిజిరేటర్ నిశ్శబ్దంగా, ఏమాత్రం ఇబ్బంది లేకుండా పనిచేస్తుంది. ▲ రోల్ బాండ్ ఫ్రీజర్ మరింత త్వరగా చల్లబరుస్తుంది. ▲ ప్రత్యేకంగా డిజైన్ చేయబడిన చిల్ ట్రే, విద్యుచ్ఛక్తి ఆగిపోయినపుడు, డీఫ్రాస్టింగ్ చేసేటప్పుడు, రెఫ్రిజిరేటర్‌లో నిలువ చేయబడిన పదార్థాలపై నీరు పడకుండా నిరోధిస్తుంది. ▲ అటు ఇటు ఒరగ గల బాటిల్ రేక్స్ వలన సీసాలను జరుపుకొనే వీలు. ▲ సమర్థవంతమైన, త్వరగా పని చేయగల, బాదరబందీలేని దానంతటదే నీటిని తీసివేయగల సిస్టమ్ వున్న డీఫ్రాస్ట్, దాంతో రెఫ్రిజిరేటర్ ఆటోమేటిక్‌గా మళ్ళీ స్టార్ట్ అవుతుందిక. ▲ ఎక్కువ ఘన పరిమాణం గల పెద్దదైన హై క్రిస్పర్/చిల్ ట్రే ఉండటం వలన నిలువ చేసుకొనేందుకు మరింత జాగా. ▲ వోల్టేజిలో విస్తృతమైన ఎగుడుదిగుడులను తట్టుకుంటుంది. (170 వోల్టుల నుండి 250 వోల్టుల దాకా). ▲ ISI చిహ్నం గల రిఫ్రెజిరేటర్...
▲ ఆల్విన్–భారతదేశంలో రిఫ్రిజి–రేషన్ రంగంలో అగ్రగాములు. మార్కెట్‌లో నేడు అందరూ కావాలని కోరుకొనే డబుల్ డోర్ మోడల్‌ని మొదటిసారిగా ప్రవేశపెట్టినవారు వీరే. 165 లీటర్ల సింగిల్ డోర్ మరియు 165,300 మరియు 380 లీటర్ల డబుల్ డోర్ మోడల్స్‌లో దొరుకుతుంది. అనేక రంగుల శ్రేణిల్లో ఏడు సంవత్సరాల వారంటీతో ఎంచుకొనేందుకు ఏడు సంవత్సరాల అదనపు ప్రొటెక్షన్ కాంట్రాక్ట్ వున్న వీలు. కొనుగోలుదారులకు సేవను అందించే పరంపరకు బద్ధులు. దేశవ్యాప్తమైన నెట్‌వర్క్‌తో వెంటనే సమర్థవంతమైన సేవా సౌకర్యాలను అందించగలదు. ▲
▲ ఆశ్చర్యమేముంది గనుక, దాని పేరు ఆల్విన్ అంటే.

ALLWYN
REFRIGERATORS

QUIET · STURDY · FAITHFUL



Mudra:H:HAL:3:258:TLG



విజేతలకు స్వాగతం చెప్తూ
పదవీచ్యుతులకు వీడ్కోలు యిస్తూ
నిన్నటికి నేటికి వారధులం
చరిత్ర నడిపే సారథులం
ఇన్నేళ్ళుగా
ఎన్నో ఏళ్ళుగా
పదవి కోసం పోరాటంలో
ఎదురొడ్డి నిలిచి గెలిచినవారు కొందరు
వెన్నుపొడిచి గెలిచినవారు కోకొల్లలు
పదవీచ్యుతులంతా అపవిత్రులు కారు
పదవి వరించిన వారంతా పవిత్రులు కారు
అవినీతి బంధుప్రీతి
కుళ్ళు కుతంత్రం మోసం దగా
మాపై నడుస్తూ పూసిన మసి
న్యాయం సత్యం ధర్మం ప్రేమ
మాపై నడుస్తూ పూసిన సుగంధం
నాటికి నేటికి
మా మనసులోని మాట
పేదవాడి ఇంటి వాకిట
జీర్ణావస్త్రలో నిలిచి
బాధగా మోపిన
పాదాల్ని ప్రేమగా
నడుంవంచి మోస్తున్నాం!
కలవారి ఇంటి వాకిట
పాలరాయిని కప్పుకొని
నగిషీలు చెక్కుకొని
కర్కశంగా వేసిన బూటుకాలును
నడుం విరిగి మోస్తున్నాం!

—అడిగోపుల వెంకటరత్నమ్

సంతోషించాం.

"నేను సైన్సు గ్రూపే చదవాలి" అని అది ఎంతగా పట్టుదల చూపిందో కదూ.

ఆ గ్రూపు ఖర్చుతో కూడుకున్నదని అంతశక్తి నాకు లేదని ఆ లేత మనసుకు చెప్పి నొప్పించటం నాకు చేతకాలేదు. చెప్పటం చేతకాలేదు కాని చేతల్లో చేసి చూపిన అభాగ్యుడ్ని నేను. ఈ నిజం నీకూ ఇంతవరకు చెప్పనందుకు క్షమించు.

మనసు చంపుకుని రెండు మూడు సార్లు అమ్మాయి మనసు మార్చటానికి ప్రయత్నించాను. వేరే గ్రూపు చదవమని ప్రోత్సహించాను. కాని ఆ చిన్నారి మనసులోని బలీయమైన కోరిక నా మాటల్ని ఖాతరు చేయనీయలేదు. మొదటిసారిగా నాతో పౌరుషంగానూ, పరుషంగా కూడా మాట్లాడింది.

ఇక దాన్ని ఒప్పించడం కష్టమైన పని అనుకున్నాను. అందుకే కాలేజి ప్రిన్సిపాల్ దగ్గరకు వెళ్ళి నా గోడు వెళ్ళబోసుకున్నాను. నా బాధను అర్థం చేసుకోమన్నాను. కష్ట సుఖాలు తెలిసిన మనిషి కాబోలు నన్ను తిట్టకుండా మౌనంగా తలాడించాడు నా అభీష్టానికి అంగీకార సూచనగా.

ఫలితంగా అమ్మాయికి సైన్సు గ్రూపులో సీట్లు అయిపోయినవని, ఇంకా ఆలస్యం అయితే మిగతా గ్రూపుల్లో కూడా సీట్లుండవని చెప్పటం జరిగింది. ఆయనలా చెప్పేడనేకంటే నేను చెప్పించానంటే నిజం నిర్భయంగా నీ ముందు చెప్పినట్లు వుంటుంది. కాలేజి చదువుకే ముప్పు వాటిల్లుతుందనే భయం వలన కాబోలు అయిష్టంగానే ఆ గ్రూపులో చేరటానికి అంగీకరించింది కమల.

కొత్తగా, కాలేజి చదువు ప్రారంభించానన్న ఆనందం ఆ పిల్ల మొఖంలో వెతికినా కనిపించలేదు నాకు. నిర్లిప్తంగా యాంత్రికంగా అలా కాలేజీకి వెళ్ళి వచ్చే దాన్ని చూసినప్పుడల్లా నా మనసు విలవిల్లాడిపోయేది. నా మీద నాకే అసహ్యం వేసేది.

చదువు మీదున్న శ్రద్ధతో, సహజంగా వున్న తెలివితేటల్తోనూ అది చదువులో బాగానే రాణించింది. అంత తెలివైన పిల్లను, తను కోరిన చదువు చెప్పించలేకపోయిన నిర్భాగ్యపు తండ్రివి నేను. విచక్షణా రహితంగా దాని కోరికను మొదలంటూ నరికివేశాను.

పెద్దగీతముందు చిన్నగీత అన్నట్లు అప్పట్లో ఆవిషయానికి ఎంతో సిగ్గుపడిననేను, ఇప్పుడు ఆలోచిస్తే అదిచాలా మామూలు విషయంగా అనిపిస్తున్నది.

మొన్న కాకినాడ సంబంధం వారు, హైద్రాబాద్ వారు వచ్చి పెండ్లి చూపులు చూసి వెళ్ళారు కదా సుగుణా. ఆ ఇద్దరికి అమ్మాయినచ్చిందట. ఈ విషయం తెలియగానే ఆశ్చర్యపోతున్నావుకదూ, నిజమే మన అమ్మాయి వారిరువురికి నచ్చింది.

అమ్మాయి కాకినాడ సంబంధం అంటే ఎక్కువ ఇష్టపడుతున్నట్లు చెప్పేవు. అందం, ఆస్తి విషయాలలోనూ, ఉద్యోగం, హోదా విషయంలోనూ అతన్ని కోరుకున్నది కమల. ఈవిషయం ఆమె మనకు సూటిగా చెప్పక పోయినా నీ తల్లి మనసు గ్రహించి ఈ నిర్భాగ్యపు తండ్రికి వివరించింది. ఇద్దరి అభిప్రాయాలు సేకరించాం.

కాకినాడ వారు అడిగిన కట్నం, కోరిన లాంఛనాలు నా స్థోమతకు మించిపోయినై. నేను వారితో సరితూగలేనేమో ననిపించింది. మరి కొంత అప్పు చేసయినా సరే పిల్లని వారికే ఇచ్చేద్దామంటే పెళ్లి అయ్యాక కూడా వారి కోరికలు వగైరాలు నాకు భయం కలిగించినై.

నా స్థోమతకు, నా శక్తికి తగినట్లుగా అనిపించిన హైదరాబాద్ సంబంధం

ఖాయం చేసుకుని వచ్చాను.

'కాకినాడ వారికి నీవు నచ్చలేదుటమ్మా'అని చెప్పకూడని అబద్ధం చెప్పేను. పిచ్చితల్లి ఈ మాటకు ఎంత బాధ పడిందో. నా బంగారు తల్లి నచ్చకపోవటమా. ఆ మాట నా నోటితో నేను ఆ చిట్టితల్లితో అనడమా.... కానీ అనేశాను సుగుణా. ఆమె సున్నితమైన మనసు ఎంత గాయపడుతుందో కూడా ఆలోచించకుండా అనేశాను.

అంతేకాదు అల్లుణ్ణి గురించి వివరాలు కనుక్కున్న మాట నిజమే అయినా, అతను అన్ని రకాలుగా యోగ్యుడని తెలుసుకున్న మాట కూడా నిజమే అయినా మరిన్ని జోడించి అతన్ని గురించి గొప్పగా చెప్పి అమ్మాయిని ఉత్సాహపరిచాను.

నా మాటలకు ఉప్పొంగిపోలేదు. కృంగీపోలేదు. బహూశా 'ఈ నాన్న ఇంతే' వేవడిగినవి ఎప్పుడు సమకూర్చాడు కనక' అనుకున్నదేమో పిచ్చితల్లి మౌనంగా తలాడించి తన అంగీకారం తెలిపింది. పసి వయసు నుంచి పెళ్లి వరకు తను కోరింది ఏ ఒక్కటి సమకూర్చలేక పోయాను.మిగిలిన విషయాలన్నింటికి ఎలాగో రాజీపడి నా మనసును నేనే సమాధానపర్చుకున్నా కనీసం పెళ్లి విషయంలో నయినా అమ్మాయి కోరిక తీర్చగలిగి ఉంటే ఇంతమానశిక్షక్షోభ వుండేది కాదేమోనాకు. కాని వారి ఆలోచనా విధానం అంతా ఆర్థిక పరమైన లావాదేవీల్తో ముడిపడి వుండటం గ్రహించిన నేను ధైర్యం చేయలేక పోయాను.

నిజానికి ఈ విషయాలేవీ అమ్మాయికి తెలియవు. దాన్ని అడుగుఅడుగునా మోసంచేశానన్న బాధ నన్ను కృంగదీస్తున్నది.

నా బాధని, ఇబ్బందిని నీవు అర్థం చేసుకొని క్షమిస్తావని ఆశిస్తున్నాను.

ఉత్తరం వ్రాయడం పూర్తిచేసి డాబాపై నుంచి కిందికి వచ్చాడు రంగారావుగారు.

పేరంటం నుంచి తిరిగివచ్చి అప్పటికే అలస్యమయి పోయినట్లు హడావిడిగా వంటపనిలోనిమగ్నమయింది భార్య.

" సుగుణా....నేనలా బయటకు వెళ్లి వస్తాను....ఇదిగో ఇవి చూడు" అనునయంగా అన్నాడాయన.

భర్త చేతిలో కాయితాల వంక అర్థం కానట్లు చూస్తూనే యాంత్రికంగా అందుకుందావిడ.

"ఏమిటండీ ఇవి" ఆశ్చర్యంగా అడిగింది.

ఆయనలా వీధిలోకి నడిచాడు మౌనంగా.

ఉత్తరం చదవటం పూర్తి చేసిన సుగుణమ్మ గారి కళ్లల్లో నీటి సుడులు. కూతురి మీద ప్రేమ, భర్తపై సానుభూతి, తనపై తనకే జాలి.

మనసులో భావాలెలా వున్నా వెంటనే తేరుకున్నదామె. భర్త వచ్చేసరికి చిరునవ్వు చెదరకుండా ఎదురు వెళ్లింది.

"అన్నీ అనవసరమైన ఆలోచన్లు... మీరూ... ఇప్పుడు దానికేం తక్కువయింది. చక్కగా సంసారం చేసుకుంటూన్నది. రేపో మాపో పండంటి బిడ్డను కంటుంది. అప్పట్నుంచి దానికీ తెలిసి వస్తయ్ కష్టసుఖాలు.

మన శక్తి కొద్దీ చదివించాం. తాహతుకు తగిన సంబంధం కుదిర్చి తాళి కట్టించాం. చాలు మీరు దానికే రకంగానూ అన్యాయం చేయలేదు. అనవసరంగా మనసు కష్టపెట్టకోకండి" చనువుగా, మందలింపుగా అన్నది సుగుణమ్మ.


పొంగి వచ్చే దుఃఖాన్ని దిగమింగుకుని గట్టిగా భార్యను కౌగలించుకున్నాడు రంగారావు.

'ఇదిగో ఇలాంటి మాటల్తోనే నన్ను అప్పట్నుంచి ఇప్పటి వరకూ ఊరడిస్తూ వస్తున్నావు సుగుణా' మనసులో అనుకున్నాడాయన.

ఏనుగుల కోసం దంతాల వర్తకంపై నిషేధం

దంతాల కోసం ఏనుగుల్ని వధించడం వల్ల గత 10 ఏళ్లలో ఆఫ్రికన్ ఏనుగుల సంఖ్య 609,000కి తగ్గిపోయింది. ఇది ఏనుగుల సంఖ్యలో సుమారు 50 శాతం తగ్గుదల కావడం ఆందోళన కరమైన అంశం. కాగా ఈ పరిస్థితిని నివారించి ఆఫ్రికన్ ఏనుగుల తగ్గుదలను అరికట్టేందుకై ఏనుగులకు సంబంధించిన ధంతాలు మాంసం, చర్మం వర్తకాన్ని నిషేధించాలని 103 దేశాలకు సభ్యత్వం గల 'సి.ఐ.టి.ఇ.ఎస్' అనే అంతర్జాతీయ సంస్థ నిర్ణయించింది. ఈ అంతర్జాతీయ సంస్థ ఇటీవల స్విట్జర్లాండ్ లోని లాసేన్‌లో సమావేశం జరిపింది.

సమావేశంలో పాల్గొన్న అమెరికా ప్రతినిధి కాన్‌స్టన్స్ బి. హారీమన్ మాట్లాడుతూ అమెరికా ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నట్లు చెప్పారు. ఆఫ్రికన్ ఏనుగుల దంతాల దిగుమతిపై అమెరికా, కెనడా, యూరప్ సమాజం, జపాన్ మొదలైన దేశాలు విధించిన నిషేధం వల్ల ఏనుగు దంతాలకు ప్రపంచ మార్కెట్ 75 శాతానికి తగ్గిపోయినట్లు ఆమె చెప్పారు. ఏనుగులను పరిరక్షించే కృషికి తోడ్పడేందుకై అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ, అంతరంగిక విభాగాలకు 20 లక్షల డాలర్లకు పైగా మొత్తాన్ని 1990 ఆర్థిక సంవత్సరంలో అమెరికన్ కాంగ్రెస్ కేటాయిస్తున్నది.



ఏనుగు దంతాలకు విపరీతమైన గిరాకీ ఏర్పడడం వల్ల వాటిధరకిలో గ్రాము ఒక్కింటికి 200 డాలర్ల వరకు పెరిగిపోయిందని, దీని వల్ల దంతాల కోసం ఏనుగుల్ని మట్టు పెట్టడం ఎక్కువైందని, ఇప్పుడు ఏనుగు దంతాల వర్తకాన్ని నిషేధించడం వల్ల ఈ గిరాకీని తొలగించి ఏనుగుల్ని కాపాడడానికి అవకాశం ఏర్పడుతుందని హారీమన్ అన్నారు.



'ఓబుల్ ఫ్రెండ్స్ క్లబ్' సౌజన్యం

'టేక్వాండో' అంటే కరాటే కాదా?

ఇవాళ ప్రపంచంలో ఎవరు మిత్రుడో ఎవరు శత్రువో, ఎవరు దొంగో, ఎవరు దొరో గుర్తించాలంటే చాలా కష్టం. వాహనాల్లో ప్రయాణించేటప్పుడు, చివరికి రోడ్డు మీద నడిచి వెళ్లేటప్పుడు ఎవరైనావచ్చి మనల్ని అడ్డగించి మన చెంత వున్న డబ్బో, వస్తువులనో దోచుకునే ప్రమాదముంది. అకస్మాత్తుగా దాడిచేసే ప్రమాదముంది.

ప్రస్తుత సమాజంలో స్త్రీల రక్షణ గురించి చెప్పాల్సిందేమీ లేదు 4 సంవత్సరాల అమ్మాయి నుండి 80 సంవత్సరాల వృద్ధ స్త్రీ వరకు తన మాన ప్రాణ రక్షణ కొరకు తన అన్ననో, తమ్ముడినో, భర్తనో సంరక్షణకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతో వుంది.

అందుకే స్త్రీ పురుష భేదం లేకుండా తన స్వీయ రక్షణకు 'టేక్వాండో' (కొరియన్ కరాటే) గాని, మరే ఇతర మార్షల్ ఆర్ట్స్ గాని అవసరమని ప్రపంచ దేశాల మేధావులు, విద్యావంతులు గుర్తిస్తున్నారు.



'ఫ్రెండ్స్ లో క్లబ్'

అయితే అన్ని రకాల మార్షల్ ఆర్ట్స్ కంటే 'టేక్వాండో' ఒక ప్రత్యేకత నేర్ప రచుకుంది. 'టేక్వాండో' కొరియాలో అతి పురాతనమైన మార్షల్ ఆర్ట్. దీనితో పోల్చ దగిన సమానమైన మార్షల్ ఆర్ట్ లేదు. అందుకే దీనికి ప్రపంచ వ్యాప్తంగా విపరీత ప్రచారముంది.

మనిషి ప్రాణ రక్షణకే కాక మాన సిక ఒత్తిడులను తట్టుకునేందుకు 'టేక్వాండో' ఎంతో ఉపయోగపడుతుంది. ప్రస్తుత పరిస్థి తులలో స్త్రీలు, బాలికలతో సహా అందరు నేర్చుకోవాల్సిన విద్య. అందుకే ప్రాథమిక విద్యాస్థాయి నుంచి కరాటే కోర్సు అవసరం. ఇప్పుడిప్పుడే మనదేశంలోని ప్రైవేటు పాఠ శాలల్లో దీనిని ప్రవేశపెడుతున్నారు. అయితే మన రాష్ట్ర ప్రభుత్వం తగినంత ప్రోత్సా హాన్ని అందించడంలేదు అని 'టేక్వాండో'లో అనేక పతకాలు, ప్రశంసలు పొందిన బ్లాక్ బెల్ట్ హోల్డర్ ఎస్. పరమేశ్వరరెడ్డి అంటాడు.

మనదేశంతోపాటు ప్రపంచంలోని 120 దేశాలలో 'టేక్వాండో'ను పిల్లలు పెద్దలు నేర్చుకుంటున్నారు. 'టేక్వాండో'ను ఒలం పిక్ ఆసియా గేమ్స్‌లలో కూడా పరిచయం చేస్తున్నారు. మనదేశంలో 50 వేల మంది విద్యార్థులు ఈ విద్యను అభ్యసిస్తున్నారు.



'లెగ్ రైజ్' పొజిషన్

కానీ మనదేశంలో 'టేక్వాండో' ను చాలా ఆలస్యంగా గుర్తించారు. 1975లో 'టేక్వాండో' ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అసో సియేషన్ ఏర్పడిన తర్వాతనే దీనికి గుర్తింపు వచ్చింది.

'టేక్వాండో'లో మొదట 'వైట్ బెల్ట్', తర్వాత 'యల్లోబెల్ట్', గ్రీన్, గ్రీన్-I, బ్లూ, బ్లూ-I రెడ్, రెడ్-I బ్లాక్-I, బ్లాక్ -II, బ్లాక్-III, బ్లాక్-IV, బ్లాక్ V, బ్లాక్-VI, బ్లాక్ -VII చివరిగా, ప్యూర్ రెడ్ బెల్టులుగా ర్యాంకులు వుంటాయని రాష్ట్రస్థాయి పోటీ లలో ప్రథమ స్థానం పొంది బంగారు పతకం గెల్చుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక యిన పరమేశ్వరరెడ్డి అంటారు.

'టేక్వాండో' ను యువతీ యువకులే కాక, పోలీస్ శాఖల్లోని కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారులు వరకు అభ్యసిస్తే ఎంతో ఉపయోగకరం. ఇప్పటికే అనేక రాష్ట్రాలలో పోలీస్‌శాఖ వారు దీనిలో శిక్షణ పొందుతు న్నారు. పంజాబ్, కర్నాటక, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రాలలోని బి. ఎస్. ఎఫ్., సి. ఆర్. పి. ఎఫ్. దళాలకు 'టేక్వాండో' లో శిక్షణ ఇస్తున్నారు. కొత్త చక్రవర్తి

ఫొటోలు : రూపాచక్రవర్తి



కాంచన మృగం

రాత్రి పదకొండున్నర అవుతోంది. ఆ అడిటోరియం నిండా జనం కిటకిట లాడుతున్నారు. రాష్ట్ర స్థాయి నాటక పోటీలు అక్కడ నాలుగు రోజుల నుండి నిర్వహింపబడుతున్నాయి. ఆ వూళ్ళోని ప్రఖ్యాత నాటక సంస్థ కాళిదాస కళామందిరం' వారు పై పోటీలను నిర్వహిస్తున్నారు.

ఆంధ్రదేశంలో నాటకరంగం యింకా పూర్తిగా చావలేదని పై నాటకాల్ని చూశాక నాకొక గట్టి విశ్వాసం ఏర్పడింది. నాటకాల్లో వేషాలు వేసిన అనుభవాలు లేకపోయినా చిన్నప్పట్నుంచి నాకు నాటకాలంటే చాలా యిష్టం. అందుకే నేను నాలుగు రోజుల్నుంచి హాజరవుతూనే వున్నాను.

అప్పటి వరకు రంగస్థలం మీద రసవత్తరంగా ప్రదర్శింపబడిన నాటకం అయిపోయింది. ఆడిటోరియం ప్రేక్షకుల హర్షధ్వానాలతో మారుమ్రోగిపోయింది. ఆ నాటకం పేరు 'ముసుగు మనుషులు' దాన్ని ప్రదర్శించిన తీరు నాకు నచ్చింది. కానీ ఆ నాటక యితివృత్తం మాత్రం నాకు నచ్చలేదు.

యివాళ మానవ జీవితానికి ఆత్మవంచనే కేంద్రబిందువై పోయిందని, ఆర్థిక సంబంధాలు తప్ప మనుషుల మధ్య అభిమానాలూ స్నేహాల వంటివేవీ లేవని, సంఘంలో తమ స్టేటస్‌ని పెంచుకోవడానికి అభ్యుదయాలూ ఆదర్శాలు కొంత మందికి పావులుగా ఉపయోగపడుతున్నాయని ఆ నాటక యితివృత్తం.

"ఒక ముఖ్యగమనిక..."

తలెత్తి రంగస్థలం వేపు చూశాను. ఒక యువకుడు ఏదో అనౌన్స్‌మెంట్ యివ్వడానికి మైక్ ముందు నిలబడి గొంతు సవరించుకుని ఆడియన్స్ వేపు చూశాడు.

"ఎలక్ట్రిక్ సిటీ రెవెన్యూ ఆఫీస్‌లో వర్క్ చేస్తున్న సారంగపాణిగారు ఆడియన్స్‌లో ఎక్కడున్నా వెంటనే వేదిక మీదికి రావలసిందిగా కోరుకుంటున్నాం."

నేను ఆశ్చర్యపోయాను. వాళ్ళెందుకు నన్ను వేదిక మీదికి పిలుస్తున్నారో నాకర్థం కావడం లేదు. మెల్లగా ఆడియన్స్‌లోంచి పైకి లేచాను.

"మీ కోసం ఆడిటోరియంలో సుమారు పది నిముషాలు వెదికాను సార్. మీరు కన్పించలేదు. అందుకే మైక్‌లో అనౌన్స్‌మెంట్ యిప్పించవలసి వచ్చింది" అన్నాడు మా పక్క వాటాలో కాపురముంటున్న నారాయణ. అతని ముఖంలో ఆందోళన నాకు కొట్టవచ్చినట్టు అగుపిస్తూ వుంది.

"సార్! మీరు అర్జంటుగా యింటికి బయల్దేరాలి. మీ అమ్మాయికి చాలా సీరియస్‌గా వుంది. ఉన్నట్టుండి తీవ్రంగా వాంతులూ, విరేచనాలు ప్రారంభమయ్యాయి. అమ్మాయి తేలకళ్ళు వేస్తోంది. అమ్మాయిని ఒళ్ళో పెట్టుకుని అమరావతిగారు వలవలా ఏడుస్తున్నారు. రండి యింటికి వెళ్దాం."

నారాయణ చెప్పింది వినడం తోటే నాకు నవనాడులా కృంగిపోయాయి. నోట మాట రాలేదు. పరుగు లాంటి నడకతో నారాయణతో పాటు యింటి వేపు బయల్దేరాను. మా అమ్మాయి సుధకి రెండ్రోజుల నుంచి ఆరోగ్యం బాగలేదు. డాక్టర్‌కి చూపెడితే ఏవో మందులు రాసిచ్చారు.

ఈ రెండ్రోజుల్నుంచి ఆ మందుల్ని వాడుతూనే వున్నాం. పిల్లకి జ్వరం తగ్గింది. కుదుటపడిపోతూ వుందనుకున్నాను. మళ్ళీ యింతలోనే యిలా అయింది. ఏ తండ్రికైనా మనశ్శాంతి లేకపోవడానికి ఏమీ జరిగిపోనవసరం లేదు. తన పిల్లలకి ఒకే ఒక్క పూట ఆరోగ్యం బాగుండకపోతే చాలు.

"ఏమండీ! నాకేదో భయంగా వుందండీ!" అంటూ నన్ను చూడగానే బావురమంది అమరావతి. తన భయమేమిటో నాకు తెలుసు. ఆవగింజంత కష్టం వచ్చినా భరించే శక్తి అమరావతికి లేదు. ఆవిడది సున్నితమయిన మనస్సు.

"అమరా! అమ్మాయిని తీసుకుని పైకి లే. డాక్టర్ దగ్గరికెళ్దాం" అన్నాను నేను.

ఎవరి అభిప్రాయాన్ని తెలుసుకోకనే నారాయణ యింతలో ఓ రిక్షావాలాని తీసుకొచ్చాడు. యిలాంటి పరిస్థితుల్లో హృదయమున్న మనిషి ఎవరి అభిప్రాయం కోసమూ వేచి చూడడు. అమరావతి చేతుల్లోంచి సుధను అందుకుని భుజంపై పండబెట్టుకుని వీధిలోకి నడిచాడు నారాయణ.

కొన్ని పాత గుడ్డల్ని సంచిలో పెట్టుకుని బయల్దేరింది అమరావతి. యిద్దరం రిక్షా ఎక్కి కూర్చున్నాం. సుధని నా చేతికి అందించాడు నారాయణ. పరిస్థితిని గ్రహించి ముందుకు కదిలాడు రిక్షావాలా.

వీధిలో కరెంటు దీపాలు వెలుగడం లేదు. ఆ దీపాల కోసం ఖర్చు పెట్టబడినట్టు చూపించిన డబ్బు మున్సిపాలిటీ అధికారుల యినుప బీరువాల్లో వెలిగిపోతూ వుంటుంది. చీకట్లో రిక్షా ముందుకు దూసుకుపోతూ వుంటుంది. వద్దంటున్నా వినకుండా ఆ రిక్షా వెంబడి పరిగెడుతూ వస్తున్నాడు నారాయణ.

"డాక్టర్! డాక్టర్!" అంటూ ఆ యింటి తలుపుమీద దబదబా బాదాను. రెండు నిముషాల తర్వాత ఆ తలుపు తెరుచుకుంది. కళ్ళు నులుముకుంటూ డాక్టర్ వెలుపలికి వచ్చాడు. మా అమ్మాయి పరిస్థితి గురించి ఆయనతో చెప్పాను. నా వేపు చాలా విసుగ్గా చూశాడు డాక్టర్.

ఒక పేషంట్ ప్రాణం కంటే తన నిద్రే అమూల్యమైందని భావించే వ్యక్తులను డాక్టర్లుగా తీర్చిదిద్దిన కాలేజీలతో పాటు వైద్య వృత్తి కూడా సిగ్గుతో తలొంచుకోవాలి. డాక్టర్ని బలవంతంగా

వీరపల్లె వీణావాణి

క్లినిక్ దగ్గరికి తీసుకొచ్చాను

డాక్టర్ కళ్లలో రోగికి తన ప్రాణం అగుపిస్తుంది రోగి కళ్లలో డాక్టర్‌కి రాబోయే ఫీజు డబ్బు అగుపిస్తుంది రోగి ప్రాణాపాయ స్థితిలో వున్నా కొందరు డాక్టర్లు చలించరు నిమ్మకు నీరెత్తినట్టుంటారు మా అమ్మాయిని డాక్టర్ నిరాసక్తతో పరిశీలిస్తూవుంటే నా కడుపు మండిపోతూ వుంది

బెడ్‌మీద పడుకోబెట్టి మా అమ్మాయికో సెలైన్ బాటిల్ ఎక్కించా డాయన ఆ తర్వాత ఏవేవో పరీక్షలు చేశాడు యిదిగో యిది ఫలానా డిసీజ్ ఫలానా కారణాలవల్ల యిది వచ్చింది అని ఆ డాక్టర్ ఒక్క ముక్క కూడా చెప్పలేదు ఆయన చెప్పింది వేరు అది వినగానే నా గుండెల్లో రాయి పడింది

"అమ్మాయికేం ప్రమాదం లేదు అయితే ఈ అమ్మాయిని మీరు వెంటనే మద్రాసు తీసుకువెళ్తే మంచిది యింకో రెండు గంటల్లో మద్రాసు వెళ్లే ఎక్స్‌ప్రెస్ వుంది అందులో వెళ్తే మీరు ఉదయంకల్లా మద్రాసు చేరిపోవచ్చు"

డాక్టర్ చెబుతున్నాడు మద్రాస్‌లో మేం ఏ హాస్పిటల్‌కి వెళ్లాలో, సిటీలో అది ఏ ప్రాంతంలో వుందో, సెంట్రల్ స్టేషన్ దగ్గర్నుంచి ఏ యే నంబర్ సిటీ బస్‌లు వెళ్తాయో ఆ వివరాలన్నీ ఓ కాగితం ముక్కలో రాసిచ్చాడు డాక్టర్

మద్రాసు వెళ్లాలంటే కనీసం వెయ్యి రూపాయలైనా జేబులో వుండాలి ప్రస్తుతం మా యింట్లో ఒక పాతిక రూపాయలకంటే ఎక్కువ వుండదు

ఊరు కాని వూరు నా అనే వాళ్లెవరూ లేని వూరు యిప్పుడేమిటి చెయ్యడం? యింత రాత్రి పూట అంత డబ్బు అప్పుగా నా కెవరిస్తారు? అమరావతి, నారాయణని అక్కడే వుంచి నేను టవున్లోకి నడిచాను ఒక్క చిదంబరంగారు తప్ప ఈ వూళ్లో నాకు బాగా సన్నిహితులైన వారెవరూ లేరు

చిదంబరం సహృదయుడు సహాయం చేసే స్వభావం గలవాడు మాంచి ఆదర్శాలు అభ్యుదయభావాలూ గల మనిషి అతన్లోని ఆ మానవత్వమే నన్ను ఆకర్షించింది అతనికి సన్నిహితున్ని చేసింది చిదంబరం వంటి మిత్రుడు నాకు లభించినందుకు నేనెంతో గర్వపడుతున్నాను


చిదంబరం యింటి ముందు నిలబడి కాలింగ్‌బెల్ నొక్కాను తలుపు తీసుకుని బయట కొచ్చిన చిదంబరం అంత రాత్రి పూట నన్ను చూసి ఆశ్చర్యపోయాడు

"ఏమిటి సారంగపాణిగారూ! యింత రాత్రి మీరలా మా యింటికి "

"ఈ స్థితిలో మీరు తప్ప యింత వూళ్లో నా కింకొకరు అగుపించడం లేదు చిదంబరంగారూ! మా అమ్మాయి కండీషనేం బాగ లేదు వెంటనే మద్రాసు వెళ్లాలి" ఆ మాట అంటుంటే నా కళ్లలోంచి కన్నీళ్లు జలజలా రాలాయి

అది చూసి చిదంబరం కలవరపడ్డాడు మా అమ్మాయి పరిస్థితి గురించి వివరించి అర్జంటుగా నాకొక వెయ్యి రూపాయలు అప్పుగా యిమ్మని అడిగాను

"ఒక్క నిమిముషం వుండండి" చిదంబరం



యింట్లోకి గబగబా వెళ్లిపోయాడు చిదంబరం నాకు మాత్రం సాయం చెయ్యడానికి వెనుకాడడని నాకు తెలుసు

చొక్కా తగిలించుకుని ఐదు నిముషాల తర్వాత యింట్లోంచి వచ్చాడు చిదంబరం 'రండి వెళ్దాం' అంటూ అతడు నడక సాగించాడు నేను చిదంబరం వెంట నడవ సాగాను ఆ వీధిలోని కరెంట్ దీపం వెలుతుర్లో చిదంబరం కుడి చేతిలో ఏదో తళుక్కుమంది పరిశీలనగా అటే చూశాను

"చిదంబరంగారూ! మీ చేతిలో అది"

"బంగారు గాజు"

"అది యిప్పుడు"

"కుదవబెడితే తప్ప మన కిప్పుడు డబ్బులు రావు" అంటూ నవ్వేశాడు చిదంబరం

"వద్దండి. నా కోసం మి ఆవిడ గాజును"

"చూడండి సారంగపాణిగారూ! ఈ భూగోళంమీద ఎందుకూ పనికిరాని లోహం ఏమిటో తెలుసా? బంగారు దాని ఉపయోగం ఒక్కటే అది మనకు డబ్బు అవసరమైనప్పుడు కుదవ పెట్టుకోవడానికి పనికిరావడం ఒక మిత్రుడి యిబ్బంది కంటే ఈ బంగారు గాజు నాకు ముఖ్యంకాదు మా యింటి ముందుకు వచ్చి కన్నీళ్లు పెట్టుకున్నారు మీరు పట్టించుకోకపోవడానికి నేను మృగాన్నికాదు సమయానికి డబ్బు లేదు కనుక దీన్ని తాకట్టు పెట్టక తప్పదు ఒక మనిషి ప్రాణం కంటే విలువైంది ప్రపంచంలో యింకొకటి వుందని భావించే ఆటవిక అజ్ఞానంలో నేను లేను "

చిదంబరం మాటలకు నా హృదయం పులకించిపోయింది మానవత్వం మరణించిందని భ్రమించే వాళ్లెవరైనా చిదంబరాన్ని ఓసారి చూస్తే బావుంటుంది

"అది సరే చిదంబరంగారూ! యింత రాత్రిపూట తాకట్టు పెట్టుకునే షాపులుంటాయా?"

"షాపులుండవ్ కానీ మనుషులు మాత్రం వుంటారు వేకువ జామున వెళ్లి అడిగినా సొమ్మును తాకట్టు పెట్టుకుని అప్పిచ్చే వాళ్లున్నారు" అన్నాడు చిదంబరం

"ఈ వూళ్లో అలాంటి మనిషి "

"ఉన్నాడు ఆ మహానుభావుడి పేరుగానీ చెబితే

మీ గుండె బహుశా ఆగిపోతుందేమో"

"ఎందుకని?"

"ఆయన మీకూ పరిచయస్థుడే పైగా ఆయన పట్ల మీకు కొంత గౌరవం కూడా వుంది"

"ఎవరాయన?" అడిగాను

"బసవరాజుగారు"

నేను అవాక్కయిపోయాను బసవరాజుగారి పట్ల నాకున్న గౌరవం అంతులేనిది

"బసవరాజు గారి వ్యక్తిగత జీవితం గూర్చి నాకు బాగా తెలుసు నాకు తెలుసుననే సత్యం ఆయనకీ తెలుసు కనుకే ఆయన నా దగ్గరెప్పుడూ వేషాలెయ్యడు పైగా తన గురించి ఎక్కడా చెప్పవద్దని ప్రాధేయపడుతుంటాడు ఆయన అసలు రంగును నేనెక్కడా బయట పెట్టలేదు చివరికి మీ దగ్గర కూడా"

నేను వింటున్నాను

"యిప్పుడు అవసరం వచ్చింది కాబట్టి మీతో చెప్పాను నేను మీతో చెప్పినట్టు ఎవరితోనూ ఎటువంటి పరిస్థితిలోనూ అనకండి ఈ గాజును ఆయన దగ్గర తాకట్టు పెట్టి డబ్బు తీసుకొస్తాను మీరు యిబ్బందుల్లో పడి డబ్బు కోసం వచ్చారని ఆ ప్రసక్తి ఆయన దగ్గర తీసుకురాను నాకే డబ్బు అవసరమై వచ్చానని బసవరాజుతో అబద్ధం చెబుతాను" అన్నాడు చిదంబరం

"అలాగే చిదంబరంగారూ! బసవరాజు గారి గురించి నేనెప్పుడూ ఎవరి దగ్గరా ప్రస్తావించను" అంటూ నవ్వుతూ చిదంబరం గారి వేపు చూసి హామీ యిచ్చాను

"సారంగపాణిగారూ! మీరిక్కడే ఆగండి నేను బసవరాజు గారింటికి వెళ్ళి యిప్పుడే వస్తాను" అంటూ చిదంబరం వెళ్ళిపోయాడు నేనక్కడే నిలబడిపోయాను

బసవరాజుగారికి ఆ వూళ్ళో గొప్ప పేరు ప్రతిష్ఠలున్నాయి ఉదార స్వభావం గలవాడిగా, సంఘ సేవకుడిగా ఆయనకు మంచి గుర్తింపు వుంది బసవరాజుగారి మాటల్లో ఎప్పుడూ పరోపకారం ప్రకటింపబడుతూ వుంటుంది

ఈ నిముషం వరకు అదంతా నిజమేనని గుడ్డిగా నమ్మిన నాకు బసవరాజుగారి మీద ఎంతో గౌరవం అభిమానాలుండేవి చిదంబరం చెప్పింది వినడంతోటే ఆ గౌరవాభిమానాలు యిసుకలో పడ్డ నీటి బిందువుల్లా యింకిపోయాయి

బసవరాజుగారితో నాకు స్వల్పపాటి పరిచయం కూడా వుంది ఎప్పుడైనా రోడ్డు మీద అగుపిస్తే ఆయన నన్ను పలకరిస్తూ వుంటాడు పూర్తిగా వర్తకపు దృష్టితో జీవించే ఈ మనిషి ఒక సంఘ సేవకుడా? యితడొక పెద్దమనిషా?

మానవ జీవితానికి ఆత్మవంచనేనా కేంద్ర బిందువు? మనుషులకు ఈ ద్వంద్వ ప్రమాణాలెందుకు? యిలాంటి వాళ్ల జీవనానికి హిపోక్రసీయేనా ప్రాతిపదిక?

యిలాంటి వాళ్ళు తమ బ్రతుకేదో తాము బ్రతక్కుండా యిలాంటి పగటి వేషాలెందుకు? కసాయివాడు బుద్ధభగవానుడి భూతదయను భుజాల మీద వేసుకొని తిరిగినట్టు వీళ్ళంతా ఎందుకిలా అభినయిస్తారు?

బసవరాజుగారి యిల్లు ఆ వీధి చివర వుంది చిదంబరం ఆ యింటి ముందు నిలబడి తలుపు తట్టడం, బసవరాజుగారు తలుపు తీయడం చిదంబరం ఆయనతో ఏదో చెప్పడం, వాళ్ళిద్దరూ యింట్లోకి వెళ్ళడం యిదంతా ఆ వీధిలో నేను చాటుగా నిలబడి జాగ్రత్తగా గమనిస్తూనే వున్నాను

తర్వాత చిదంబరం నా దగ్గరికొచ్చాడు గాజు తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బు నా చేతిలో పెట్టాడు మా అమ్మాయిని ఆ రాత్రే మద్రాసు తీసుకెళ్లాం అదృష్టవశాత్తు ఎక్కువ డబ్బు ఖర్చు కాకుండానే మా అమ్మాయి ఆరోగ్యం రెండ్రోజుల్లో కుదుటపడింది మేం మద్రాసు నుండి తిరిగి వచ్చేశాం

వారం రోజులు గడిచిపోయాయి ఓ రోజు నేను బజార్లో వెళుతూ వుంటే ఓ టీ కొట్టు ముందు తన స్నేహితులతో పాటు నిలబడి టీ తాగుతూ అగుపించారు బసవరాజుగారు ఈ వ్యవస్థలో దిగజారిపోతున్న నైతిక విలువల గురించి మిత్రులతో ఆయన తెగ వాగేస్తున్నాడు

నెలకి నూటికి నాలుగు రూపాయల రహస్య వడ్డీ వ్యాపారం చేసే ఈ మనిషి నైతిక విలువలు గురించి ధర్మం గురించి మాట్లాడటం చాలా విచిత్రంగా వుంది బహుశా ఏకపత్నీ వ్రతం గురించి ఈ రోజుల్లో పదిమంది ఆడవాళ్ళతో తిరిగిన వాడికంటే ఎవరూ గొప్పగా మాట్లాడలేరేమో

బసవరాజుగారి ముఖం కూడా నాకు చాలా వికృతంగా అగుపించింది అతని మీద ఏవగింపు పుట్టింది తీవ్రంగా అసహ్యించుకొనే వాళ్ళ ఉనికిని నేను భరించలేను మనసులో ఒక భావాన్ని పెట్టుకొని పైకి మరో విధంగా మాట్లాడుతూ అభినయించడం నాకు బొత్తిగా అలవాటులేదు

"ఏవండోయ్ సారంగపాణిగారూ! అలా చూసీ చూడనట్టు వెళ్ళిపోతున్నారేమిటి?"


'తమరి ముఖం చూడలేక' అందామని మళ్ళీ ఎలాగో నిగ్రహించుకున్నాను


"మీరు అగుపించి చాలా రోజులైంది మీతో మాట్లాడాలి యిలా రండి" నవ్వాడు బసవరాజు అయిష్టంగానే ఆయన దగ్గరికెళ్ళి నిలబడ్డాను ఆయన నాకో టీ ఆర్డరివ్వబోయాడు యిప్పుడే తాగానంటూ నేను వారించాను

"ఆదివారంనాటికి మన వూళ్ళో అన్నదానం జరిపించాలని అనుకుంటున్నాం సారంగపాణిగారూ! మీవంటి సహృదయులు కూడా యిందుకు సహకరిస్తే బావుంటుంది" అంటూ తన ధోరణిలో మాట్లాడసాగాడు బసవరాజు ఆయన మిత్రులంతా వెళ్ళిపోయారు నేనొక్కడినే మిగిలాను.

"మానవజన్మ ఎత్తిన తర్వాత మనిషికి కాస్త జాలి, దయ వుండాలని అంటాను "

నేనిక భరించలేకపోయాను నా గుండె కుత కుత ఉడికిపోయింది బసవరాజు యిక నోరెత్తకుండా వాతలు పెట్టాలనిపించింది వెంటనే జేబులోంచి





కిమీ కాట్కార్ వాహ్వోయ్ !

మోకాలి మీది గౌనుపై తొడల దాకా లాక్కొని నోరు కప్పలా తెరిచిన ప్రతి సినిమా అమ్మాయి కూడా మార్లిన్ మన్రో అనుకుంటున్న రోజుల్లో, కిమీ కాట్కార్ లాంటి "టార్జాన్ ఫేమ్" హిందీ ఫిలిమ్ స్టార్ తాను మార్లిన్‌మన్రోని చంపి పుట్టాను అనుకోడంలో ఆశ్చర్యం ఏముంది? కొంతమంది ఫిలిం జర్నలిస్టులు యీామె కటువంటి సర్టిఫికెట్ యిచ్చేసినా వాళ్ల తప్పు లేదు. ఈ అమ్మాయి సౌష్టవ ప్రమాణాలు గొప్పవి- ముఖ్యంగా యీామె "రంభ" (చూడుడు : అర్థము కొరకు శబ్ద రత్నాకరము)

అంతేనా? కిమీ శ్రీదేవి తరువాత నెంబరు 1. సింహాసనం తనదే అనుకుంటున్నది అని బొంబాయి "గాసిప్"-

"హమ్" (యింగ్లీషులో చదివి మీరు "హుమ్" అనుకుంటే అది ఆ అమ్మాయి తప్పు కాదు) అనే చిత్రంలో లంబూ మహారాజ్‌తో యీ లేడీ టార్జాన్ హీరోయిన్‌గా వేస్తోంది. దాంతో తారాపథంలో ఓ మెలు లేదా కిలోమీటరున్నర పైకి ఎగబ్రాకానని కూడా యీ తారామణి నమ్ముతోంది

స్కాండల్‌కి భయపడదు. గలగలా నవ్వుతూ అందరితో అంటే మీతో నాతో కాదు తనకు ఫీల్డులో అవసరమైన అందరితో మాట్లాడుతుంది. దుస్తుల విషయంలో- చూశాంగా యీామె టార్జాన్ చిత్రం- పెద్ద పేచీలు పెట్టదు. మార్లిన్‌మన్రోలాగా అవ్వాలి అంటే దుస్తుల విషయం పట్టించుకోకూడదుగా!

నన్నెవరైనా సరే పుస్తకం లాగా చదువుకోవచ్చును. రహస్యాలంటే కిట్టదు అంటుంది కిమీ- చదవటం రావాలి అంతే!

కాని "ఫీల్డ్" మీద ఆమెకో "కంప్లయింట్" వుంది- అదేమిటంటే- బోలెడుమంది హీరోయిన్‌లు వున్నారు- హీరోలు కూడా వుంటారుగా హీరో గదిలోకి ఏదో పలకరింపు కోసం అని చాలా మంది హీరోయిన్‌లు వెల్తొంటారు!

లోపలికి వెళ్లిన హీరోయిన్‌లు హీరోని కాకా పడుతూ (ఎట్లా?) వుండిపోతారట గంటల తరబడి. ఇది కిమి కాట్కార్ మాట- కాని తాను- హీరోల మీద సెట్లమీద వున్నప్పుడు, లేదా అలా మేకప్ గదిలోకి వెళ్తున్నప్పుడు చిన్న చిర్నవ్వు, ఓ కంటి విరుపు లాంటి చేష్టలతో సమ్మోహనాస్త్రం సంధిస్తుంది. కాని "చూశారా! యీ పాడు లోకం- తనకీ హీరోలకి రంకు కడుతుంది"-

"మేరా లహూ" అనే చిత్రం "టార్జాన్" పిక్చర్ రెండూ కూడా నిర్మాతలకి బాగా నోరూరించాయి. అందుకే వాళ్లు కిమీ కాట్కార్ యింటి దగ్గరికి...... లాగా వచ్చి వ్రాలారుట- కాని అమితాబ్‌తో హీరోయిన్ అనే సరికి యిప్పుడు నెంబరు 1 స్థాయి తనకి వస్తోంది అని "కిమీ" అనుకుంటున్నది. అయితే నెంబరు 1 హీరోతో నటించిన హీరోయిన్ నెంబరు 1 అవుతుందా? అంటారా మీరు? నాకు 'తెల్దు'

***

అసలూ వడ్డీ మొత్తం కలిపి వేయీ నలభై రూపాయలు తీసి 'లెక్క పెట్టుకోండి' అన్నాను "ఈ డబ్బేమిటి?" అన్నాడు బసవరాజు ఆశ్చర్యంగా

"వారం రోజుల క్రితం చిదంబరంగారు ఓ రాత్రి పన్నెండున్నరకు మీ దగ్గరికొచ్చి ఓ గాజు తాకట్టు పెట్టి మీ దగ్గర్నుంచి వెయ్యి రూపాయలు అప్పు "

"ఆగండి సారంగపాణిగారూ! చిదంబరమేమిటి నా దగ్గర గాజును తాకట్టు "

"బుకాయించకండి బసవరాజుగారూ! నా కళ్ళతో నేను స్వయంగా చూశాను మీ అసలు రంగు బయటపడిపోయింది నా దగ్గర వేషాలు వెయ్యకండి"

బసవరాజు తల దించేసుకుని ఆలోచన్లలో పడిపోయినట్టు ఓ ఫోజు పెట్టాడు నాటకం భట్టబయలైపోయినందుకు ఆయన మనస్సు సిగ్గుతో కుంచించుకు పోయి వుండాలి

"సారంగపాణిగారూ! యిది డబ్బు వ్యవహారం కనుక పద్ధతిగా వుంటే బాగుంటుంది నేను వేయి రూపాయలు చిదంబరం చేతికిచ్చాను మీకు డైరెక్ట్‌గా యివ్వలేదు యిప్పుడు మీరు కూడా చిదంబరం చేతికే యివ్వండి నేను ఆయన దగ్గర్నుంచే పుచ్చుకుంటాను పదండి చిదంబరం యింటికి '

యిద్దరం చిదంబరం యింటికి నడిచాం మమ్మల్ని చూసి చిదంబరం ఆశ్చర్యపోయాడు

"ఏమిటిలా వచ్చారు?" అడిగాడాయన

"లాభంలేదు చిదంబరంగారూ! నాటకం బట్టబయలయ్యే సమయం వచ్చేసింది" బసవరాజు అలా అంటూ వుంటే చిదంబరం కొంత యిబ్బందికరంగా ముఖం పెట్టాడు

"చిదంబరం! నీకున్న నీచత్వాన్ని నా మీద రుద్దావు ఆ రోజు అంత రాత్రి వచ్చి అదేదో యిబ్బంది వచ్చి పడిందంటే వెంటనే నీకు వెయ్యి రూపాయలు సహాయం చేశాను నా దగ్గర నువ్వు గాజు తాకట్టు పెట్టావా? నీ వ్యాపార స్వభావాన్ని నాకు అంటగట్టడానికి నీకు సిగ్గు లేదూ? ఆఖరికి నా దగ్గర డబ్బు తీసుకుని దాంతో వడ్డీ వ్యాపారం చేస్తావా నువ్ ఛీ ఛీ"

బసవరాజుగారు అలా తిడుతూంటే చిదంబరం ముఖం కందగడ్డలా అయిపోయింది వాస్తవాన్ని చూసి నేను శిలలా బిగుసుకుపోయాను వారం క్రితం చూసిన 'ముసుగు మనుషులు' అనే నాటకం నా కళ్ళలో మెదిలింది

చిదంబరం ఆదర్శాల, అభ్యుదయాల ముసుగు తొలగిపోయింది అంతా మోసం యిది కాంచన మృగ వేషం చిదంబరంలాంటివాడు మిత్రుడైనందుకు సిగ్గుపడుతున్నాను మానవత బతికుందని భ్రమించే వాళ్ళకి ఓసారి చిదంబరాన్ని చూపెడితే బాగుండునన్పించింది నాకు

○



(గత సంచిక తరువాయి)

ప్రభు చెప్పిందంతా విపులంగా విన్న పింకీ ఒక్కసారిగా పొట్టపగిలేలా నవ్వనారంభించింది.

"గుడ్! వెరీగుడ్! సుందర్‌దాసు మన వల్లో పూర్తిగా చిక్కిపోయాడన్నమాట!" అంది హఠాత్తుగా నవ్వాపేస్తూ.

ప్రభు గబగబా తలూపేడు.

"అంతా నీ అద్భుతమైన మాస్టర్‌ప్లాన్ మహిమ!" అన్నాడు. ఆమెకేసి ఆరాధనా పూర్వకంగా చూస్తూ.

పింకీ చిలిపిగా నవ్వింది.

"అంతలోనే పొగిడెయ్యకు గురూ! ఇంకా మన ప్లాన్ పూర్తిగా సక్సెస్ కానీ - అప్పుడు పొగుడుదువుగానీ!"

"మన ప్లాన్‌కాదు - నీ ప్లాన్"అన్నాడు ప్రభు.

* * * * * * *

సుందర్‌దాస్ మెత్తటి పరుపుల్లో కూరుకుపోతూ విలాసంగా మోచెయ్యి పక్కదిండు మీద మోపుతూ రెండో చేత్తో జర్దాపాన్ తీసి నోట్లో కుక్కుకున్నాడు.

ఓ పెద్ద గండం తప్పిపోయినందుకు అతని మనస్సు ప్రశాంతంగా వుంది.

అన్యాయంగా తనని రెండు రోజులు లాకప్‌లో పెట్టించినందుకు ప్రభు తనమీద చట్టపరమైన చర్య తీసుకుని వుంటే తను మునిగిపోయి వుండేవాడు.

మంచివాడులా వున్నాడు పాపం.

అతన్ని రెండు రోజులు లాకప్‌లో పెట్టించడం నిజంగా అన్యాయమే!

అంతలో దర్వాన్ లోపలికొచ్చి ఆ రోజు సుందర్‌దాస్ పేరుమీద వచ్చిన వుత్తరాలన్నీ ఒక బొత్తిగా పెట్టి వెళ్లిపోయాడు.

సుందర్‌దాస్ తాపీగా ఒక్కోకవరూ చించి లోపలున్న కాగితం చదివి పక్కన పెడుతున్నాడు. వాటిలో ఎక్కువగా సరుకు పంపవలసిందిగా వచ్చిన ఆర్డర్లు. కొన్ని ఇన్‌వాయిస్‌లు. ఒకటి రెండు పర్సనల్ లెటర్స్.

సుందర్‌దాస్ అవన్నీ చదివి పక్కనపెట్టి చివరగా ఓ కవరందుకుని చించాడు.

లోపలున్న కాగితం బయటకి లాగి చదవడం ప్రారంభిస్తూనే అతని మొహం కళ తప్పింది. నుదుట చిరుచెమటలు అలుముకొని గొంతు తడారిపోయింది.

చదవడం పూర్తి చేస్తూనే తాచుపాముని విదిలించుకున్నట్టు ఆ కాగితాన్ని పక్కకు విసిరేసి కంగారుగా జేబు తడుముకుంటూ ఓ కాగితం బయటికి లాగాడు.

ఉంగరం కొనేటప్పుడు ప్రభు రాసిచ్చిన హామీ పత్రం అది.

ప్రభు అడ్రసూ, టెలిఫోన్ నెంబరూ అందులోనే వున్నాయి.

సుందర్‌దాస్ వెంటనే టెలిఫోన్ దగ్గరకి లాక్కుని ప్రభు యిచ్చిన నెంబరు డయల్ చేశాడు.

కొద్దిసేపటివరకూ అవతల ఎవరూ రిసీవర్ ఎత్తలేదు.

ఆ కొద్ది క్షణాలే కొన్ని యుగాలుగా తోచాయి సుందర్‌దాసుకు.

అవతల్నుంచి రిసీవర్ ఎత్తుతున్న శబ్దం వినిపించింది.

"హలో!" తాపీగా వినిపించింది.

"హలో ప్రభుభాయ్?" తనలోని కంగారు కప్పిపుచ్చుకుంటూ నార్మల్‌గా వుండడానికి ప్రయత్నిస్తూ అన్నాడు సుందర్‌దాస్.

"యస్, ప్రభు స్పీకింగ్!"

"ప్రభు భాయ్, నేను సుందర్‌దాస్‌ని! ఏమిటీ పని?"

"ఏమిటి సేట్‌జీ?"

"ఏమిటీ లీగల్ నోటీసు?"

"ఓ అదా!" మరింత తాపీగా అన్నాడు ప్రభు. "మరేంలేదు సేట్‌జీ! మీరు నన్ను రెండు రోజులు లాకప్‌లో పెట్టించారుగా అనవసరంగానూ! ఆ విషయంగా మా ఫ్రెండ్సులో దరిలోనూ నాపరువు పోయింది. పరువు నష్టం రాబట్టుకుందామని లాయర్ చేత నష్టపరిహారం కోరుతూ మీకీ లీగల్ నోటీసిప్పించాను. ఏం సేట్‌జీ - ఆ నోటీసులో యేమైనా పొరపాట్లున్నాయంటారా?"

"ప్రభుభాయ్! ఇదన్యాయం!"

"నేను అదే అంటున్నాను సేట్‌జీ! రెండు రోజులు ఉత్తిపుణ్యానికి మీరు నన్ను లాకప్‌లో పెట్టించడం కూడా అన్యాయమే!"

"అది కాదు - క్షమించమని నిన్ననే అడిగానుగా!" నీరసంగా అన్నాడు సుందర్‌దాస్.

"ఎంతమాట! మీవంటి పెద్దవారిని నేను క్షమించడమా! అయినా వుత్తుత్తి క్షమాపణల్తో ఏమౌతుంది సేట్‌జీ? పరువుక్కూడా ఓ ఖరీదంటూ వుంది మరి!"

"పదిహేను లక్షలా?!"

"తక్కువంటారా? మరో అయిదేను కొండి పోనీ!"

"ఆశకైనా హద్దుండాలి ప్రభూభాయ్! పదిహేను లక్షల నష్టపరిహారం కోర్టు ఎన్నటికీ యివ్వదు."

"ఆ విషయం కోర్టులోనే తేలుతుంది!"

సుందర్‌దాస్ గుటకలు మింగాడు.

అతనికి జరగబోతున్నదేమిటో క్షుణ్ణంగా అర్థమైంది.

ఈ కేసులోంచి తను బయటపడాలంటే పెద్ద లాయర్ని పెట్టుకో·లి. పెద్ద లాయరంటే నూట్ ఎమౌంట్ మీద పర్సెంటేజి - అడుగుతాడు. అప్పైన కేసు గెలుస్తాడో లేదో ఖచ్చితంగా నమ్మకం వుండదు. ప్రభుని

ఇంతవరకూ సాగిన కథ-21 : విశ్వధర వర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడు భూమిలో బావి త్రవ్వుతుండగా దొరికిన అపురూప వజ్రాన్ని అతని దాయాది అయిన వజ్రపాణి చేజిక్కించుకుంటాడు. నగ్నదేవత మైలమ్మ చేతిలో కీలు బొమ్మ అయిన వజ్రపాణి తన హవేలీలో బందీ అయిన మల్లిని అనుభవించి చంపేస్తాడు. చిన్నోడి ద్వారా వృద్ధుడు వజ్రపాణి వజ్రపు గనుల రహస్యాన్ని తెలుసుకొని అతనిపై వజ్రకాయుడ్ని యుద్ధానికి పురికొల్పుతాడు. వజ్రపుటుంగరం లాకెట్టు పెట్టేందుకు వచ్చిన ప్రభు అరెస్టయి తర్వాత విడుదలవుతాడు.

తను లాకప్‌లో వుంచింది నిజమే కాబట్టి కోర్టు ఎంతో కొంత నష్టపరిహారం చెల్లించమని అడ గొచ్చు. ఎంతలేదన్నా అయిదు లక్షల ఖర్చు కనిపించింది సుందర్‌దాస్‌కి. ఆపైన కోర్టు చుట్టూ తిరిగే చికాకులు కూడా తప్పవు!

"ప్రభూభాయ్! మనం రాజీకొద్దాం!" మరింత నీరసంగా అన్నాడు సుందర్‌దాస్.

"రాజీ? నో నో!"

"ప్లీజ్ ప్రభూభాయ్! మీరీ దావా తెస్తే నేను నిండా మునిగిపోతాను."

"ప్చ్! పాపం!"

"మీరొక ఎమౌంట్ చెప్పండి. కుదిరితే ఈ క్షణమే చెల్లించడానికి సిద్ధంగా వున్నాను."

"ఐసీ! ఆలోచించి చెబుతాను!"

"లేదు ప్రభూభాయ్! మీరిప్పుడే చెప్పాలి."

"సరే, అయితే నష్టపరిహారం ఎంతిస్తారో మీరే చెప్పండి సేట్‌జీ!"

"యాభై వేలు!"

"ముష్టెత్తుకుంటున్నాననుకున్నారా సేట్‌జీ!"

"లక్ష!"

"సారీ"

"ఆల్‌రైట్! రెండు లక్షలు! అంతకు మించి దమ్మిడీ యివ్వను."

"మూడు లక్షలు!"

"నో, రెండు లక్షలే!"

"కుదర్దు!"

"సరే, రెండున్నర! ఇక పెంచేది లేదు!"

"ఓకె. సేట్‌జీ! మంచివారు కదా అని ఒప్పేసుకుంటున్నాను. పేమెంట్ ఎప్పుడిస్తారు?"

"ఈ సాయంకాలమే! దావా జోలికెళ్ల నని అగ్రిమెంటు రాసి రెడీగా వుంచండి!"

"రైట్! ఎదురుచూస్తుంటాను సుమా! బై బై సేట్‌జీ!"

సుందర్‌దాస్ క్రెడిల్ మీదికి రిసీవర్ విసిరికొట్టి తలపట్టుక్కూర్చుండిపోయాడు.

* *****

"గ్రాండ్ సక్సెస్!"

ఆనందంగా రిసీవర్ క్రెడిల్‌చేస్తూ పింకీకి షేక్‌హేండిచ్చాడు ప్రభు.

"అండ్ కంగ్రాచులేషన్స్!"

పింకీ నవ్వింది.

"ప్లాన్ నాదే అయినా కథ నడిపిన వాడివి నువ్వేకదా! నీకే నేను కంగ్రాచులేషన్స్ చెప్పాలి!"

ప్రభు యేదో అనబోయాడు.

అంతలో గుమ్మంలోంచి ఎవరివో చప్పట్లు వినిపించడంతో యిద్దరూ ఉలిక్కిపడి ఆవైపు చూశారు.

"గ్రేట్! మార్వలెస్! వండ్రఫుల్! అమెరికాలో ఒకప్పుడు జ్యూయెలర్స్‌ని దివాళా



తీయించిన ఫేమస్ జ్యూయెలరీ బంకోగేమ్ ఇక్కడ ఆంధ్రదేశంలో కూడా చూసే భాగ్యం కలిగింది. రియల్లీ గ్రేట్! రియల్లీ గ్రేట్ !"

గుమ్మం దగ్గర నీడచాటున నిలబడిన వ్యక్తివైపు పింకీ ఆశ్చర్యంతో చూసింది.

"ఎవరు మీరు?"

ఆ వ్యక్తి నీడ చాటునుంచి బయటికొచ్చి ఆ గదిలో అడుగుపెట్టాడు.

10

ఆ గది చాలా చిన్నది.

పెద్దగా ఖరీదైన వస్తువులేవీ ఆ గదిలో లేకపోయినప్పటికీ చాలా నీట్‌గా హుందాగా వుంది. గదిలో ఓ మూల పుస్తకాల బీరువా దర్పంగా నిలబడివుంది. దాని నిండా అత్యుత్తమ ప్రపంచ సాహిత్యం పుస్తకాల రూపంలో ఒక పద్ధతి ప్రకారం వర్సగా పేర్చబడివుంది. ఆ బీరువాకు కొద్ది దూరంలో వున్న చెక్క టేబుల్ ముందు సీరియస్‌గా కూర్చొని తన సర్వీస్ రివాల్వర్ విప్పి ఓవరాలింగ్ చేస్తున్నాడు జైలర్ సత్యం.

అతనిప్పుడు జైలర్‌కాదు.

ఈపాటి కతనికి ప్రమోషన్ వచ్చి ఏ జైలు సూపరెంటెండో కావలసింది. కానీ, తప్పనిసరి పరిస్థితుల్లో సర్వీస్ నుంచి రిటైర్ కావల్సివచ్చింది. అయినా అతన్ని ఇప్పటికీ జైలర్ సత్యమనే పిలుస్తారు అందరూ.

జైలర్ సత్యం రివాల్వర్ ఓవరాలింగ్ చెయ్యడం పూర్తిచేసి శ్రద్ధగా ఒక్కో పార్టు బిగించసాగాడు.

రివాల్వర్‌ఫిక్స్ చేస్తుండగా అతని కళ్ళు తీక్షణంగా మారాయి.

గుండెల్లోంచి పెల్లుబుకుతున్న ఏవో తీవ్రమైన తుఫానులను బలవంతంగా అణిచి పెడుతున్నవాడిలాగా దవడలు బిగించాడు.

రివాల్వర్ ఫిక్స్ చెయ్యడం పూర్తికాగానే ఒకే ఒక్క బుల్లెట్ నింపి మేగజైన్‌ని కసిగా రివాల్వర్‌లోకి తోశాడు. క్లిక్‌మన్న శబ్దంతో తన స్థానంలో తాను పర్ఫెక్టుగా వెళ్ళి కూర్చుండిపోయింది మేగజైన్.

జైలర్ సత్యం రివాల్వర్ పైకెత్తి ఎదురుగా గోడకు వేలాడుతున్న ఓ అందమైన యువతి ఫొటోకు గురిపెట్టాడు.

కానీ, రివాల్వర్ పేల్చలేదు.

రివాల్వర్ పేల్చే వుద్దేశం అతనికి లేదు.

ఆ రివాల్వర్ అప్పుడే పేలకూడదు.

దానికింకా వ్యవధి వుంది.

అంతలో వెనక నుంచి అడుగుల చప్పుడు వినిపించింది.

ఎంతదూరం నుంచైనా ఆ అడుగుల చప్పుడెవరిదో ఇట్టే గుర్తుపట్టగలడతను. అడుగుల చప్పుడు వినిపిస్తూనే చప్పున డెస్కు తెరిచి రివాల్వర్ అందులో దాచేశాడు.

"దాచాల్సిన అవసరం లేదన్నయ్యా! నేను చూశాను!" గంభీరంగా వినిపించింది.

జైలర్ సత్యం భుజం మీదుగా వెనక్కి చూశాడు.

గుమ్మం దగ్గర అలిసిపోయిన కళ్ళతో నిలబడి వుందొక స్త్రీమూర్తి.

ఆమెను చూస్తూనే వుదాసీనంగా తల వంచుకున్నాడతను.

ఆ స్త్రీమూర్తి నెమ్మదిగా లోపలికి అడుగు పెట్టింది.

ఆ ముఖవర్చస్సు ఒకప్పుడు ఆవిడ మహాసౌందర్యవతి అయివుండాలన్న విషయం స్పష్టంగా సూచిస్తోంది. అయితే ప్రస్తుతం ఆ ముఖం వాడిపోయింది. కళ్ళల్లో కాంతి పూర్తిగా తగ్గిపోయింది. మనిషి చాలా బలహీనంగా వుంది. పొడవాటి తలవెంట్రుకలు చాలావరకు నెరిసిపోయాయి. వయసుకు మించిన వృద్ధాప్యం మోస్తున్నదానిలా వుందావిడ.

ఆవిడ చేతిలో టాల్‌స్టాయ్ మహానవల 'వార్ అండ్ పీస్' బరువుగా వుంది. ఆ గదిలోని బీరువాలో వున్న పుస్తకాలన్నీ ఆవిడ కోసం కొన్నవే.

పుస్తకాన్ని బల్లమీద పెట్టి సూటిగా అతని కళ్ళలోకి చూసిందావిడ. తర్వాత డెస్కు తీసి రివాల్వర్ చేతిలోకి తీసుకుంది. మేగజైన్ తెరిచి లోపలికి చూసింది.

"ఒక్క రివాల్వర్- ఒక్క బుల్లెట్! ఎవరికోసమన్నయ్యా?" మరోసారి అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించిందామె.

జైలర్ సత్యం మొహం కఠినంగా మారింది.

"ఒక్క రివాల్వర్- ఒక్క బుల్లెట్- ఒక్క ప్రాణం!" అన్నాడతను.

"ఎవరిదా ప్రాణం?"

"ఎవరిదో నీకూ తెలుసు!"

"తెలుసు! ఆ ప్రాణం నీకన్నకూతురిదని కూడా తెలుసు! కానీ, ఒక్క విషయం మాత్రం తెలీదు. పింకీ అంతకానిపనేం చేసింది?"

ఆ ప్రశ్న వింటూనే అతను అసహనంగా బుసకొట్టాడు.

టేబుల్‌కు ఒకవైపుగా ఆనించి వున్న క్రచెస్ విసురుగా తీసుకుని వాటి ఆధారంతో లేచినిలబడ్డాడు.

"ఏం చేసిందా?!"


క్రచెస్ ఆధారంతో అటూయిటూ పచార్లు చేస్తూ తీవ్రంగా అన్నాడతను.

అతనికో కాలు మోకాలి వరకూ ఆపరేషన్ ద్వారా తొలగించబడింది.


"ఏం చేసిందీ అనడుగుతున్నావా అమ్మా? అది నాకూతురని చెప్పకోవడానికి సిగ్గుపడే పనిచేసింది. ఇంకేం చెయ్యాలి? తల్లిలేని బిడ్డని గారాబంగా పెంచినందుకు మంచి శాస్తే చేసింది. తండ్రి ఒక సామాన్యుడైన గవర్నమెంటు వుద్యోగి అని ఆలోచించకుండా విలాసాలు కోరుకుంది. చివరికి ఆ తండ్రి జైలునుంచి పారిపోతున్న ఖైదీని పట్టుకోవడంలో గాయపడి కాలుపోగొట్టుకుని దీనావస్థలో వుండగా ఒంటరిగా విడిచిపెట్టి ఇల్లు వదిలి విలాసాలు వెతుక్కుంటూ వెళ్ళిపోయింది. ఇప్పుడెవరో అనామకుడితో జత

కలలన్నీ కాలిబూడిదైతే
ఆశలన్నీ మాడి ఎడారైతే,
తెరుచుకుంటుంది ఒయాసిస్సుహృదయం!
దిగి వస్తుంది వజ్రసంకల్పం!!

వజ్రసంకల్పం




వజ్రసంకల్పం నేపథ్యంలో...



ప్రపంచంలోనే అతిపెద్దవజ్రం ది గ్రేట్ స్టార్ ఆఫ్ ఆఫ్రికా కల్లినాన్

కోడిగుడ్డు ఆకారంలో కట్ చేయబడిన ఈ మహోద్భుతవజ్రం ప్రపంచంలోనే అతి పెద్దది. ఈ 530.20 కారెట్ల మహా వజ్రం దక్షిణాఫ్రికాలోని ప్రీమియర్ వజ్రాల గనిలో చాలా తమాషాగా దొరికింది. ఫ్రెడరిక్ వెల్స్ అనే వజ్రాలగని సూపరింటెండెంటుగారి కళ్ళకు అకస్మాత్తుగా ఈ వజ్రం కనబడింది. ఎవరో ప్రాక్టికల్ జోకర్ పెద్ద గాజుముక్కను అక్కడ పెట్టి వుంటాడని వెల్స్‌గారు భ్రమపడ్డారు. అయన కొంచెం జాగ్రత్తగా పరిశీలించి వుండకపోతే బహుశా ప్రపంచానికి ఈ వజ్రం దొరికేది కాదేమో. 3,106 కారెట్ల ఆ ముడివజ్రం నుంచే ప్రపంచంలో రెండో పెద్ద వజ్రం కల్లినాన్- II కూడా వచ్చింది. బ్రిటిష్‌రాణి పార్లమెంటు సెషన్స్ ప్రారంభించే ప్రతిసారీ కల్లినాన్-I పొదిగిన కిరీటం ధరిస్తుంది. కల్లినాన్ కవలలు రెండూ లండన్‌లోనే వున్నాయిప్పుడు.



కట్టి లోకాన్ని మోసం చేస్తూ లక్షలు గడించే ప్రయత్నంలో దేశం పట్టుకు తిరుగుతోంది. సమాజానికి బరువుగా తయారైన ఒక భ్రష్టురాలికి జన్మనిచ్చానన్న మనోవ్యథ నాకు మిగిల్చింది. దాన్నేం చేసినా పాపం లేదు!"

ఉద్రేకంతో అతనన్న మాటలకు ఆవిడ దయగా నవ్వి రివాల్వర్‌ని తిరిగి డెస్కులో పెట్టేసింది.

తర్వాత శాంతంగా చెయ్యిపట్టుకుని అతన్ని కుర్చీ దగ్గరికి తెచ్చి మళ్ళీ కూర్చోబెట్టింది.

తనవంకే చిత్రంగా చూస్తున్న ఆమె చూపులకు అతను ఒక్క క్షణం అప్రతిభుడయ్యాడు.

"ఎందుకలా చూస్తున్నావ్?"

"చూడ్డంకాదు! జ్ఞాపకం చేసుకుంటున్నాను! మొట్టమొదటిసారిగా నేనారోజు మావయ్యతో కలిసి నిన్ను చూసినప్పుడు నువ్వెంతటి సాత్వికుడివో జ్ఞాపకం చేసుకుంటున్నాను! ఇప్పుడు నీలో ఎంత మార్పో ఆలోచిస్తున్నాను."

"మార్పు! అది ప్రతిమనిషికీ సహజం కౌసల్యా! ఏ వ్యక్తీ కలకాలం సాత్వికుడిగానే వుండిపోలేడు. వయసుమీద పడేకొద్దీ పాత అనుభూతులు మర్చిపోతాడు. ఏరోజుకారోజు జీవితం చేదు అనుభవాల్ని రుచి చూపిస్తుంది. ఇంతకంటే మంచి జీవితం రాబోదన్న అవగాహన మనిషిని నిరాశావాదిగా మారుస్తుంది. ఆ నిరాశావాదంలోంచి ఫ్రస్ట్రేషన్ పుట్టుకొస్తుంది. ఉద్రేకం, ఈర్ష్య, కోపం, అసూయ- ఇవన్నీ ఫ్రస్ట్రేషన్‌కు గుర్తులు. వాటితో మనిషి రాక్షసుడైపోతాడు. నేనూ అంతే అయ్యాను."

"అంటే?"

"ఒక్కసారి నా జీవితాన్ని అవలోకించి చూడు. ఏ ఒక్కరోజున కూడా నా తాహతుకు మించి నేనాలోచించలేదు. నాకు వచ్చే జీతంతోనే తృప్తిపడేవాడ్ని. ఆ డబ్బుతోనే జీవితాన్ని ఆనందంగా గడిపేవాడ్ని. హఠాత్తుగా నా జీవితగమనం మారిపోయింది. నేనెంతగానో ప్రేమించిన భార్య మూడేళ్ళ పాపను నా చేతుల్లో పెట్టి జబ్బుతో మరణించింది. తల్లిలేని పిల్ల అని ఆ పాపను గారాబంగా పెంచితే ఆమె విలాసాల మోజుకు లొంగిపోయింది. జీవితంలో అడుగడుగునా నేనన్న మాటకు ఎదురుతిరిగింది. చివరికి నాకు కాలుపోయింది. కాలుతోపాటు వుద్యోగమూ పోయింది. కుంటి తండ్రి తనకేదీ సమకూర్చి పెట్టలేడని కన్నకూతురు ఇల్లు విడిచిపెట్టి భ్రష్టురాలై తిరుగుతోంది. జీవితంలో అడుగడుగునా నిరాశ! క్షణ క్షణమూ ఫ్రస్ట్రేషన్! సాత్వికత నాలో చచ్చిపోయింది. ఎవరికోసం బతకాలి? ఏం చూసుకుని బతకాలి? అందుకే నాలో రాక్షసుడు నిద్రలేచాడు."

"జీవితాన్ని ఇంత విశ్లేషణాత్మకంగా దర్శించగలవాడివి, నువ్వు రాక్షసుడివౌతావంటే నమ్మమంటావా అన్నయ్యా?"

"నాలో సాత్వికత చచ్చిపోయిందని నువ్వే అన్నావు!"

"లేదు, నేనలా అనలేదు! నీలో మార్పు వచ్చిందని మాత్రమే అన్నాను. నువ్వు వూహించుకుంటున్న రాక్షసత్వం కేవలం తాత్కాలికమైంది. పింకీ నిన్ను ఒంటరిగా వదిలిపెట్టిపోయిందన్న, వ్యథ నీచేత ఇలా ఆలోచింపజేస్తోంది. పింకీ నీ దగ్గరికి తిరి

ఉషారెక్కించే పాటల ఉషాకి ఎవరంటే ఇష్టం!
పై వారమే!

వజ్రసంకల్పం

గొచ్చేస్తే నువ్విలా అనవు. మళ్ళీ పూర్వపు మనిషివై పోతావు. పింకీని క్షమిస్తావు."

"అసంభవం! ఆ భ్రష్టురాల్ని క్షమించే ప్రసక్తే లేదు."

కౌసల్య మొహం గంభీరంగా మారింది.

"క్షమ అనేది ఆత్మగతమైంది. క్షమా గుణం కలవాడు తనకు తెలియకుండానే క్షమిస్తాడు."

"క్షమ!"

"అవును క్షమ! నా నోటివెంట క్షమ అనేమాట వినడం నీకు విడ్డూరంగా వుండవచ్చు. పగతీర్చుకోవడం ఒకటే జీవిత లక్ష్యంగా జీవిస్తున్న మనిషి క్షమ గురించి మాట్లాడితే ఎవరికైనా విడ్డూరంగానే వుంటుంది."

ఒక్క క్షణం మౌనం వహించి మళ్ళీ అందామె.

"పగ! ఆ ఒక్క పదానికి శాంతి కలిగించడంకోసం కన్నకొడుకునే ఇంతవరకూ కళ్ళ జూడకుండా జీవిస్తున్న నేను 'క్షమ' అనే పదం పలకడమే హాస్యాస్పదంగా వుండవచ్చు. పగ! ఆ ఒక్క పదం గురించే జీవితకాలమంతా ఆలోచించాను. ఇంకా ఆలోచిస్తూనే వున్నాను. దాని గురించి తెలుసుకోవడానికే అన్వేషణ సాగిస్తున్నాను. ఆ ఒక్క పదం విలువ తెలుసుకోవడానికి ప్రపంచ సాహిత్యం మధించాను. మహాపురుషుల జీవితాల గురించి తెలుసుకున్నాను. అప్పుడే నాకొక కొత్తపదం తెలిసింది- 'క్షమ!' 'క్షమ'కు అర్థం తెలుసుకున్నాక 'పగ' అనే పదానికి అర్థమే లేకుండాపోయింది. అనేక కోణాలనుంచి ఆలోచించి నన్ను నేనే పరీక్షించుకున్నాను. వజ్రపాణిలాంటి దుర్మార్గుడ్ని క్షమించగలనా?! క్షమించగలను!"

ఆ చివరిమాట వినగానే జైలర్ సత్యం వులిక్కిపడ్డాడు.

"కౌసల్యా...." అంటూ యేదో అనబోయాడు.

ఆమె అతన్ని మాట్లడనివ్వలేదు.


"చెప్పన్నయ్యా! వజ్రపాణిలాంటి తుచ్ఛుడ్ని, నాకూ నా కుటుంబానికీ తీరని అపకారం చేసిన దుర్మార్గుడ్నీ నేను క్షమించగలనూ అంటున్నాను. నువ్వు పింకీని క్షమించలేవా?"

అంతే!

ఆమాటతో తలగ్రిరున తిరగడం ప్రారంభించింది.

తన ఎదురుగా వున్నదెవరో తనకే మాత్రం తెలియనట్టుగా అనిపించింది.

కళ్ళు పెద్దవి చేసి ఆమెవైపు వెర్రిగా చూస్తుండిపోయాడతను. (ఇంకా వుంది)



ఈవారంలో మీ యోగం

9-2-1990 శుక్రవారం మొదలు
15-2-1990 గురువారం వరకు

మేషం : పాత్రికేయులకు, పంపిణీదారులకు, దర్శక నిర్మాతలకు, చిత్రరంగాన ప్రసిద్ధిగల వారికి వారమంతా మేలు. ఇటీవల చేసిన అప్పు కొంతలో కొంత తీరుటకు ఆస్కారం. స్త్రీలకు : భూ సబంధ తగాదాలు, ధన విషయమైన పేచీలు, ఉద్యోగ చిక్కులకు ఆస్కారం, గ్రహించండి.

వృషభం : ధనలోపం లేదు. ఆరోగ్య లోపం లేదు. బంధు మిత్రులు యింటికి రానున్నారు. వారికై శ్రమించవలసిన అగత్యం కూడ ఉన్నది, గ్రహించండి. నూతనోద్యోగ యత్నం సానుకూలం కాగల వారం, యత్నించి చూడండి. స్త్రీలకు : అధికాదరణ కాలం. ప్రసిద్ధులను కలుసుకుంటారు.

మిధునం : ఎవరేమనుకొన్నా మీ పద్ధతి మానకండి. మీ పరిస్థితి యందు మేలున్నది. మీ మాటకు అధిక గౌరవం, గ్రామాన, యింట ప్రసిద్ధి. శుభదాయక దినం. రాజకీయాలందు మేలు. బంధు మిత్ర సమాగమం. స్త్రీలకు : అపూర్వ వస్తు సేకరణకు ఆస్కారం. ప్రజారంగాన, మహిళా రంగాన ప్రసిద్ధి యుంటుంది.

కర్కాటకం : 'శని' గురు, శుక్ర గ్రహానుకూలత గల వారం. ప్రసిద్ధులు యింటికి రాగలుగుట కూడ వార గ్రహ విశేషమే. 'జాయింటు' వ్యాపారం అనుకూల దాయకమని గ్రహిస్తారు. పూజ్యులు పెద్దలు యింటికి రానున్నారు, గ్రహించండి. స్త్రీలకు : విలువ గల వస్తు సేకరణకు ఆస్కారం. ఆదాయవృద్ధి.

సింహం : 'శని' మేలే చేస్తాడు. గురుని కృపా కటాక్షం కూడ లేకపోలేదు. 'రవి' గ్రహానుకూలత గల సమయం. బంధుమిత్ర సమాగమం. శుభ కార్యాలోచనలు, బంధు సంబంధ నిశ్చయం, 'నిశ్చితార్థం' అనుకూలం కావటం కూడ గమనింపదగిన అంశం. స్త్రీలకు : ధనలబ్ధి, పరిపూర్ణ ఆరోగ్య వృద్ధి చెప్పవచ్చు.

కన్య : అనుకూల మిత్రులు చేరుతారు. చాల కాలంగా యిల్లు వదలినవారు, యింటికి రానున్నారు. నూతన మిత్ర సమాగమం. కొందరకు 'ధాన్య' లాభానికి ఆస్కారం. ప్రభుత్వపరంగా రాదగిన పైకం అందటం గ్రహింపదగిన అంశం. స్త్రీలకు : ఉద్యోగ పెంపునకు చేసిన యత్నం ఫలవంతం. వృత్తియందు పెంపు గమనించండి.

తుల : 'శని, గురు, బుధ' గ్రహాలు వారమంతా అనుకూలురు. మీ యత్నాలు అన్ని రంగాలందు అనుకూలమని గ్రహింపగలరు. ఉత్తముల స్నేహం, వృత్తియందు మేలు, స్త్రీలకు : అభిమానించే వారున్నారు. ధన లోపం లేదు, గ్రహింపగలరు.

వృశ్చికం : ఏడున్నర సంవత్సర శని' బాధ యింకా నివారణ కాలేదు. 'గురుడు' కూడ అనుకూలుడు కాలేదు. మరి ఎంత జాగ్రత్తగా ఉండుట అంత మేలుగా! ఉద్యోగ వృత్తులందు కొందరకు అనుకూల వారమే!. స్త్రీలకు : ప్రజాదరణ, ఉద్యోగ వృద్ధి, బంధు మిత్ర సమాగమం, గ్రహింపగలుగుతారు.

ధనుస్సు : ఇంకా కొన్ని వారాలు జరిగితే గాని, మీకు శని గ్రహానుకూలత కనిపించదు. చలనచిత్ర రంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది. మంచిదేగా! గత కొన్ని వారాలు కన్నా మేలే. 'జాయింటు' వ్యాపారమందు అభివృద్ధికరమైన మార్పులున్నాయి. స్త్రీలకు : లాభదాయకం. వృత్తియందు అనుకూలదాయకం.

మకరం : క్రమంగా 'గురు శని, శుక్ర' గ్రహాలు అనుకూలురు కానున్నారు. అభివృద్ధికరమైన మార్పులు అన్ని రంగాలలో అనుకూలమే. సాహితీ రంగాన ప్రసిద్ధులకు మేలైన వారం. బంధువులకై శ్రమించవలసి రావచ్చు. స్త్రీలకు : ఉద్యోగ యత్నమా? మేలే. వ్యాపారం చేయాలనుకొన్నారా? అనుకూలదాయక వారంగా గ్రహించాలి.

కుంభం : బంధువులు రానున్నారు. ధాన్య వసతి ఏర్పడనున్నది. సభా మర్యాద యున్నది. రాజకీయ రంగాన ప్రసిద్ధి యున్నది. యత్న కార్యసిద్ధి యున్నది. నూతన మిత్ర సమాగమమున్నది. ఇకనేం? అన్నివిధాలా మేలే. స్త్రీలకు : గత కొన్ని వారాల కన్నా మేలే.

మీనం : 'గురుని సుఖస్థాన స్థితి' ధన కనక వస్తు వాహనానుకూలం. మీరే వారాంతాన గ్రహింపగలరు. సభారంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది. దూర ప్రాంతాల నుండి బంధువర్గీయులు రానున్నారు. పదిమందిలో ప్రతిష్ఠ యున్నది. గ్రహించాలి. స్త్రీలకు : ఉద్యోగమందు అభివృద్ధికరమైన మార్పులు రానున్నవి.

- విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి

యువతీ యువకుల కోసం

"జాగృతి కిరణ్" కొత్త శీర్షిక

కూపన్

ఆంధ్రసచిత్ర వారపత్రిక

నేనేం చదవాలి?

ప్రశ్న: ....


....

పేరు: ....

చిరునామా: ....

....

నేనేం చదవాలి?



మీరు ఇప్పుడు పరీక్ష ప్యాసై పోయాక ఏం చెయ్యాలన్న అనుమానం రావొచ్చును. 10 తర్వాత 12 తర్వాత, డిగ్రీ తర్వాత మీరేం చేయాలో సలహాలు యిచ్చే ప్రత్యేక కొత్త ప్రశ్నలు-జవాబులు శీర్షిక సచిత్ర వారపత్రికలో ప్రారంభిస్తున్నాము. కూపన్ కూడా ఇచ్చాము.

-ఎడిటర్

నిర్ణయం



ఇలపావులూరి మురళీమోహనరావు

తెల్లవారు ఝామును దాటి చీకటి తెరలను చీల్చుకుంటూ పైకి రావటానికి ప్రయత్నిస్తున్నాడు సూర్యుడు. బద్ధకాన్ని వదిలించుకుని నిద్రలేచి తమతమ పనులలో తాము మునిగి పోతున్నారు పల్లె ప్రజలు.

నెల్లూరునుండి నరసరావుపేట వెళ్ళే సూపర్ డీలక్స్ బస్సు చక్రాయపాలెంలో ఆగదు. కానీ నరసరావుపేట వరకూ టికెట్ తీసుకుని కండక్టరును రిక్వెస్టు చేసి బస్సు ఆపించి దిగాడు విద్యాధర్.

అచ్చమైన 'పల్లె' పదానికి సంకేతం ఆ వూరు. తూర్పు వైపున భవనాశి చెరువు. రెండు వందల ఎకరాలను తన నీరు నందిస్తూ సశ్యశ్యామలం చేస్తున్నది ఆ కల్పవల్లి. పడమర వైపున గుండ్లకమ్మనది. లక్షలాది మందికి త్రాగటానికి తియ్యని నీరు నందిస్తూ విలాసంగా ప్రవహిస్తుంటుంది ఆ నదీమతల్లి.

ఆ నేలమీద దిగీ దిగగానే గత స్మృతులు మదిలో మెదిలాయి విద్యాధర్‌కు.

ఇరవై సంవత్సరాల క్రితం విద్యాధర్ తండ్రిగారు ఆ గ్రామంలో టీచర్‌గా పని చేసేవారు. అక్కడే పుట్టి

ఏడు సంవత్సరాలు పెరిగాడు విద్యాధర్.

అపుడు విద్యాధర్ వాళ్ళుండే ఇంటి పక్కనే ఉండేది మీనాక్షి. మీనాక్షికి పదిహేడు సంవత్సరాలుంటాయి. తాను ఆమెను "అక్కయ్యా" అని పిలిచేవాడు.

మీనాక్షి భర్త సింహాచలం పెద్ద త్రాగుబోతు. చిన్న హోటల్ నడుపుతూ మీనాక్షి సంపాదించే రెండో, మూడో, మీనాక్షిని చావగొట్టి తీసుకెళ్ళి త్రాగొచ్చేవాడు. వచ్చిన తరువాత మరలా ఏదో వక వంకపెట్టుకుని మరలా కొట్టేవాడు.

పరులెవరిముందు తన బాధను వెల్లడించేది కాదు మీనాక్షి. విద్యాధర్‌ను ఎంతో ప్రేమగా చూచేది. రోజూ తినడానికేమైనా పెడుతుండేది. మీనాక్షి కూతురు ప్రమిదను తాను ఎత్తుకుని ఆడించేవాడు. ఇపుడు వాళ్ళేం చేస్తున్నారో!!

రెండిళ్ళ అవతల శేషాచలం మాష్టారు గారుండేవారు. ఆయన స్కూలు హెడ్‌మాస్టరు. ఆ వూరి వాడే. బాగా కలిగినవాడు. ఊరు మొత్తంలో వారిదొక్కరిదే ఇల్లు అని చెప్పుకోతగినది. తాత ముత్తాతలు బాగా సంపాదించారు. వారు సంపాదించిన దానిని తన తెలివితేటలు ఉపయోగించి నాలుగింతలు చేశాడాయన. పైగా హెడ్మాస్టరు కావడంతో ఆయనకు మంచి గౌరవ మర్యాదలు లభించేవి.

ఆయనకు ఒక కూతురుండేది. పేరు కిరణ్మయి. విద్యాధర్ క్లాస్‌మేట్. కలిగిన వాళ్ళమ్మాయి కావడంతో ఎంతో ఆరోగ్యంగా, పుష్టిగా ఉండేది. ఆ వయసులోనే ఆమెంటే విద్యాధర్‌కు ప్రత్యేకాభిమానం ఉండేది.

ఇపుడు ఆమె బాగా ఎదిగి మగవారి గుండెల్లో గుబులు రేపుతుండవచ్చు. ఆమె సౌందర్య శిఖలు మరింత శోభాయమానమై ఎంతటి పురుషుడినైనా పాదాక్రాంతుడిని చేసుకునే హొయలు చిలికిస్తుండవచ్చు. ఎంతవరకూ చదివిందో? ఇపుడేం చేస్తున్నదో!

ఊరు ఏమీ మారలేదు. ఇరవై సంవత్సరాల క్రితం ఎలా వున్నదో, ఇపుడూ అలాగే ఉన్నది. అవునుమరి! పల్లెల అభివృద్ధి పట్ల ఉపన్యాసాలు దంచేవారేకానీ ఆచరించే వారెవరున్నారు?

"ఇన్‌షర్టు" వేసుకుని కొత్తగా దిగిన వారెవరబ్బా? అని కొందరు ఆశ్చర్యంగా. చూడసాగారు.

"ఎవరైనా ఆఫీసరేమో!" అని కొంతమంది అనుకుంటూ దూరంగా జరిగి పోతున్నారు.

విద్యాధర్ కొంతమందిని గుర్తుపట్ట సాగాడు.

ఆ నాటి కుర్రవాళ్ళు కొందరు మధ్య వయస్కులుగా దర్శనమిస్తున్నారు. ఆనాడు కొత్తగా కాపురాలకు వచ్చిన భామలంతా అమ్మమ్మల్లాగా కనపడు తున్నారు.

పల్లెటూర్లలో ఇది చాల సహజం. ప్రభుత్వం ఎంత మొత్తుకుంటున్నా తమ పిల్లలకు పదిహేనేళ్ళు నిండీ నిండగానే పెళ్ళి చేస్తారు. వాళ్ళకు వెంటనే పిల్లలు పుడితే వాళ్ళకు పదిహేను, పదహారేళ్ళు రాగానే పెళ్ళిళ్ళు చేస్తారు. ముప్ఫైరెండేళ్ళు వచ్చేసరికి తాము అమ్మమ్మో, నాయనమ్మో అనిపించుకుంటారు. ఐదారు తరాలు చూచేవారు పల్లెల్లో మాత్రమే ఉంటారు. ఆ వయసుకు పట్నాల్లో అమ్మాయిలు పెళ్ళిళ్ళు కూడా చేసుకోరు.

మీనాక్షి హోటల్ వైపు వెళ్ళాడు విద్యాధర్. మీనాక్షిని గుర్తించాడు. చూడగానే ఆమెలో ఏదో లోపం కనిపించిందతనికి.

ఆలోచిస్తున్న లోపే "ఏం కావాలి?" అని అడిగింది మీనాక్షి.

"అక్కయ్యా" అని పిలవబోయి ఆగాను.

రాతి బెంచీల మీద కూర్చుని నలుగు రైదుగురు కాఫీలు త్రాగుతున్నారు. ఇరవై సంవత్సరాల లోపు యువతి వారికి కావాల్సినవి అందిస్తున్నది.

"నన్ను గుర్తించావా? నేను విద్యాధర్‌ను." అన్నాడు విద్యాధర్. ఆమె ఒక క్షణం ఆలోచనలో పడ్డది.

"గుర్తుకు రావటం లేదు. ఎవరు మీరు?" అని ప్రశ్నించింది.

"సుమారు ఇరవై సంవత్సరాల క్రితం మీ యింటి పక్కనే ఉన్నాం. రఘురాం మాస్టరు గారబ్బాయిని' అన్నాడు విద్యాధర్.

"ఆఁ... నీవు విద్యావా?" రెండు నిముషాలు ఆశ్చర్యంలో మునిగి పోయింది.

"అవునక్కయ్యా" నవ్వుతూ అన్నాడు విద్యాధర్.

"ఓహో! సూటు బూటులో దర్జాగా వుంటే గుర్తుపట్టలేక పోయాను. అపుడే ఎంత ఎదిగి పోయావు? రా... రా.... లోపలికి రా..." అంటూ ఇంట్లోకి నడిచింది.

"ఆనాటి చిరునవ్వు, ఆప్యాయత ఏమాత్రం మారలేదు. కొంతమంది ఆశ్చర్యంగా చూడసాగారు.

"ఏమిటి ఆగావు? నీకిక్కడ కొత్త ఏముంది. రా విద్యా" అని పిలిచింది మీనాక్షి.

విద్యాధర్ లోపలకు వెళ్ళాడు.

"కూర్చో బాబూ... ఇరవై ఏళ్ళు గడిచినా నువ్వీ వూరును, మమ్మల్ని మర్చిపోలేదన్న మాట. మేమింకా మీకు గుర్తున్నామా? అంతా బాగున్నారా? అమ్మ నాన్నలేం చేస్తున్నారు? బామ్మ బాగున్నదా? అన్నయెలా వున్నాడు? చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళయ్యాయా? నీక్కూడా అయిందా?" ప్రశ్నల వర్షం కురిపించింది.

విద్యాధర్ చిరునవ్వు నవ్వాడు.

తానీ వూరు మర్చిపోక పోవడానికి కారణం అక్కయ్యకేం తెలుసు? ఎన్నాళ్ళ నుండో తాను కంటున్న కలలు ఈనాడు నిజం చేసుకోవడానికి ఈ వూరు వచ్చానని బహుశా అక్కకు తెలియదు.


"అక్కయ్యా నీ అన్ని ప్రశ్నలకూ సమాధానం ఒక్కటే. అంతా ఓ.కె. అమ్మ నాన్నలు బాగున్నారు. బామ్మ ఆరోగ్యం ఓ మాదిరిగా ఉన్నది. అన్నయ్యకు పెళ్ళయింది. నేను ప్రయత్నాలలో వున్నాను" అన్నాడు విద్యాధర్.

మీనాక్షి గలగలా నవ్వింది.

అక్కయ్యా అని పవిత్ర భావంతో పిలుస్తున్నపుడు అనుకోకూడదు కానీ మీనాక్షి నవ్వుఎంతో అందంగా వుంటుంది. ఆమె నవ్వులో ఆకర్షణ ఏమీతగ్గలేదు. ఎదుటి వారి మానసిక వ్యధలను మరపింప చేసే నవ్వు ఆమెది.

కాఫీ యిచ్చింది మీనాక్షి. కాఫీ కప్పులో కిరణ్మయి ఊహా చిత్రం కనిపించింది విద్యాధర్‌కు. అమృతాన్ని సేవించినట్లుగా త్రాగాడు కాఫీని.

"అవునూ సింహాచలం కనిపెంచటం లేదు. ఎక్కడి కెళ్ళాడు?" అడిగాడు విద్యాధర్.



నిర్ణయం

మరుక్షణంలో మీనాక్షి నయనాల నుండి రెండు అశ్రువులు జారి క్రింద పడ్డాయి.

"ఏమయిందక్కయ్యా" గాభరాగా అడిగాడు విద్యాధర్. "నా అదృష్టం బాగా లేదు విద్యా. ఆ పాడు త్రాగుడు మానుకొమ్మని నెత్తీ నోరు కొట్టుకుని చెప్పినా నన్ను చావ గొట్టేవాడే కానీ నా మాట చెవిన పెట్టుకున్న పాపాన పోలేదు. ఒక రోజు సాయంత్రం బాగా తాగి తూలుతూ రోడ్డు దాటుతూ లారీ క్రింద పడ్డాడు. నా కళ్ళ ముందే నెత్తుట ముద్దైపోయాడు" అపుకోలేక భోరున రోదించింది మీనాక్షి.

విద్యాధర్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎంత దారుణం! ఇంత చిన్నవయసులో నీ కెంత కష్టం వచ్చిందక్కయ్యా? ఎన్నాళ్ళైంది?" అన్నాడు బాధగా.

ఆరేళ్ళయింది. పెళ్ళి కెదిగిన కూతురును నాకప్పగించి తాను తప్పించుకున్నాడు." అన్నది మీనాక్షి కళ్ళు తుడుచుకుంటూ.

"మర్చేపోయాను. ఇందాక హోటల్లో నేను చూచిన అమ్మాయి ప్రమిదేనా?" అడిగాడు విద్యాధర్.

"అవును. ప్రమిదా" అని పిలిచింది మీనాక్షి.

ప్రమిద లోపలకు వచ్చి విద్యాధర్‌ను వింతగా చూడసాగింది. దొరబాబులా వున్న అతనెవరో ఆమెకు తెలియదు.

"ప్రమిదా! ఇతనెవరో తెలుసా? ఇరవై సంవత్సరాల క్రితం మనింటి పక్కన ఒక మాస్టరు గారుండేవారు. ఇతను వారి రెండో అబ్బాయి. నీవు అప్పుడు పసిపిల్లవు. చిన్నపుడు నిన్నెత్తుకుని ఆడించే వాడు" అని పరిచయం చేసింది మీనాక్షి.

ప్రమిద నమస్కరించింది.

"అలా అని నేనేదో ముసలాడిననుకు నేవు. నేనపుడు అయిదారేళ్ళ వాడినే" అన్నాడు విద్యాధర్.

మీనాక్షి, ప్రమిద ఇద్దరూ పక పక నవ్వారు.

ప్రమిదను ఎగాదిగా చూచాడు విద్యాధర్. మీనాక్షి నోట్లో నుంచి ఊడి పడ్డట్లుగా వున్నది. మరీ అందంగా లేకపోయినా వికారంగా మాత్రం లేదు కాకపోతే పేదరిక కళ కొట్టొచ్చినట్లు కనపడుతున్నది.

"ఇంతకూ ఏం చదివిరిది ప్రమిద?" అడిగాడు విద్యాధర్. "అద్దంకిలో పది వరకు చదివింది. ఇక ఆ తరువాత చదువుకోవాలని దానికున్నా, చదివించే స్తోమతు నాకు లేక ఆపించాను. దీని పెళ్ళే నాకో పెద్ద సమస్యగా మిగిలింది విద్యా. ఇంతకూ నువ్వేం చేస్తున్నావో చెప్పనేలేదు" అన్నది మీనాక్షి.

"ఇంజనీరుగా పని చేస్తున్నాను. నెల్లూరులో ఉంటున్నాను. అన్నట్లు ఇదివరకు శేషాచలం మాస్టరు గారుండేవారు. ఇపుడున్నారా?" అడిగాడు విద్యాధర్.

కిరణ్మయి గురించేమైనా చెపుతుందేమోనని కుతూహలంగా చూడసాగాడు.

"అందరూ బాగానే వున్నారు. మాస్టారు రిటైరైనారు. ఒక్క కిరణ్మయి సమస్య తప్ప వారికే చింతా లేదు" అన్నది మీనాక్షి.

విద్యాధర్ మనసు కుదుటపడింది.

అంటే కిరణ్మయి కింకా పెళ్ళి కాలేదన్నమాట! అయినా ఆమె పెళ్ళి మాస్టారుకు ఒక సమస్యా? బహుశా గొప్ప సంబంధాల కోసం చూస్తుంటాడు. తాను పెద్ద ఇంజనీరు. తను వెళితే వెతకబోయిన తీగ కాలికి తగిలిందని మురిసిపోడూ?

ఇక కుదురుగా కూర్చోవటం విద్యాధర్ తరం కాలేదు.

"సరే అక్కయ్యా ఒకసారి వారింటికి వెళ్ళి చూచి వస్తాను." అని లేచాడు.

"అలాగే. భోజనానికి మాత్రం ఇక్కడికేరా." అన్నది మీనాక్షి.

"సరే." అనిలేచి శేషాచలం గారింటికి గబగబ నడవ సాగాడు విద్యాధర్.

అన్ని పూరి గుడిసెల ముందు వారి మేడ చూడగానే విద్యాధర్ శరీరం అప్రయత్నంగా పులకించింది.

ఈ సమయంలో కిరణ్మయి ఏం చేస్తున్నదో? ఈరోజు శుక్రవారం. తలంటు పోసుకుని పట్టుచీర కట్టుకుని ఉదయ భానుని లేత కిరణాలకు తన నీలి కురులను ఆరబెట్టుకుంటున్నదా? లేక టిఫిన్ ముగించి ఊయల మంచం మీద విలాసంగా కూర్చుని పేపరు చదువుకుంటున్నదా?

వేలాదిగా ఊహలు విద్యాధర్ మదిలో ప్రవేశించి ఉక్కిరి బిక్కిరి చేయసాగాయి.

శేషాచలంగారింట్లో అడుగు పెట్టాడు విద్యాధర్. ఆయన పడక కుర్చీలో కూర్చుని పేపరు చదువుతూ విశేషాలు తన వ్యాఖ్యానంతో కలిపి భార్యకు వినిపిస్తున్నాడు.

చూడగానే ఇద్దరినీ గుర్తుపట్టి నమస్కరించాడు విద్యాధర్.

ఎవరూ?" అన్నాడు శేషాచలం.

తననుతాను పరిచయం చేసుకున్నాడు విద్యాధర్. వారిద్దరూ ఒక్క సారిగా ఆశ్చర్య పోయారు.

"నువ్వట్రా... అరెరె... ఎంత ఎదిగిపోయావు? అసలు గుర్తించలేకపోయాను ఎంత మారిపోయావు? రా రా..." ఆప్యాయంగా ఆహ్వానించారిద్దరూ.

ఆ ఆప్యాయతకు పొంగి పోయాడు విద్యాధర్ ఎంతైనా పల్లె ప్రజల ఆదరణ, ప్రేమ స్వచ్ఛమైనవి.


అరుగు మీద కూర్చున్నాడు విద్యాధర్.

"బాగున్నారా సార్. నేను మిమ్మల్ని మర్చిపోలేదు. అక్షరాభ్యాసం మీదగ్గరే కదా చేశాను! మీ చలువ వలన బాగా చదువుకుని ఇంజనీరునైనాను." అన్నాడు విద్యాధర్.

మీబోటి వారు అలా అనుకోవడమే గానీ, నిజానికి అసలు మమ్మల్ని గుర్తుంచుకుంటున్న దెవరయ్యా? ఈ మధ్య పెన్షన్ ఆఫీసుకు వెళితే నా పూర్వ శిష్యుడొకడు కనిపించాడు. నా ఫైలు వాడిదగ్గరే వున్నది. చిన్నప్పుడెపుడో నేను వాడిని కొట్టానట. ఆ కక్ష మనసులో పెట్టుకుని నన్ను కుక్కను తిప్పినట్లు తిప్పుతున్నాడు." నిట్టూర్పు విడుస్తూ అన్నాడు శేషాచలం.

కిరణ్మయి దర్శనం కోసం చూస్తున్నాడు విద్యాధర్. ఇంతలో పంతులమ్మగారు కాఫీ తెచ్చి అందించారు. తాగుతున్నాడే కానీ అతని మనసు కాఫీ మీదలేదు. ఎలా అడగాలా? అని ఆలోచిస్తున్నాడు.

"అవునుసార్... కిరణ్మయి కనపించ దేం? ఇంట్లో లేదా?" అడిగాడు విద్యాధర్ శక్తినంతా



కూడదీసుకుని.

అంతే!

మరుక్షణంలోనే అదిదంపతుల వంటి వారి ముఖాలు కళావిహీనమై పోయాయి.

పంతులమ్మగారు ముఖం మాడ్చుకుని లోపటికు వెళ్ళిపోయారు. సగం త్రాగిన కాఫీని వదిలేశాడు శేషాచలం.

"ఏమైంది సార్?" కంగారుగా అడిగాడు విద్యాధర్.

"దాని ప్రస్తావన నాముందు తీసుకురాకు నేను సహించను." బొంగురు గొంతుతో అన్నాడు శేషాచలం.

విద్యాధర్‌కు అంతా అయోమయంగా వున్నది. "ఏమైంది శార్.... నేనేమైనా పొరపాటు మాట్లాడానా?" అన్నాడు.

"లేదుబాబూ... ఖర్మ కొద్దీ కన్నాము. ఒక్కగానొక్క కూతురని గారాబంగా పెంచాము. దానితో మాకు ఋణం తీరిపోయింది.అబ్రహాం అని చిన్నపుడు నీ క్లాస్ మేట్ ఒకడుండేవాడు. గుర్తుందా?"

"అవును." అన్నాడు విద్యాధర్ గుర్తురాకపోయినా.

"మా మాట వినకుండా మమ్మల్ని లెక్కచెయ్యకుండా, నేనొక వైపు మంచి సంబంధాల కోసం వెతుకుతుంటే, వాడితో సంబంధం పెట్టుకుని ఆ విషయం మాకు తెలిసిన తరువాత ఇంట్లో నగలు, డబ్బుతీసుకుని వాడితో ఎటో...." తరువాత పూర్తి చేయలేక పోయాడు శేషాచలం.

విద్యాధర్ స్తంభించి పోయాడు. క్రింద భూమి కంపించి నట్లయింది.

ఇరవై సంవత్సరాల నుండి తాను కంటున్న కలలు ఒక్కసారిగా ఎలా చెదిరి పోయాయి? కిరణ్మయిని స్ఫూర్తిగా తీసుకుని తను ఎంతో కష్టపడి చదివి పైకొచ్చాడు. తీరా తాను ఆశించింది అందుకుందామని వచ్చేసరికి ఆశాభంగమే మిగిలింది.

అయినా తనను తాను కంట్రోల్ చేసుకున్నాడు విద్యాధర్. "నన్ను క్షమించండిసార్ తెలియక మిమ్మల్ని బాధపెట్టాను." అన్నాడు లేస్తూ.

'అదేమిటి లేస్తున్నావు? కూర్చోరా... ఈ పూట భోజనం మా ఇంట్లో చేయాలి" అన్నాడు శేషాచలం.

"మన్నించండి సార్. ఈ సారి వచ్చినపుడు తప్పకుండా చేస్తాను. త్వరలో నేను పెళ్ళి చేసుకోబోతున్నాను. మీరు తప్పకుండా రావాలి" అని నేరుగా మీనాక్షి ఇంటికి వచ్చాడు.

"రా బాబూ... భోజనం రెడీ. అమ్మాయ్... తమ్ముడికి కాళ్ళకు నీళ్ళివ్వు" అన్నది మీనాక్షి.

"మీరు కూడా భోజనానికి కూర్చోండి. అందరం కలిసి భోజనం చేద్దాం" అన్నాడు విద్యాధర్.

"మగ వారు భోజనం చేయకుండా ఆడవారు తినవచ్చా?" నవ్వుతూ అన్నది మీనాక్షి.

భోజనం చేస్తూ అడిగాడు విద్యాధర్. అక్కయ్యా... ఒక మాట అడుగనా?"

"ఏమిటి?" అన్నది మీనాక్షి.

"ప్రమిదను నేను పెళ్ళి చేసుకుంటే నీకేమైనా అభ్యంతరమా?"

విస్తుపోయింది మీనాక్షి.

"అక్కయ్యతో పరాచికాలాడవచ్చా?" అన్నది.

"పరాచికాలు కాదు. నిజంగానే అడుగుతున్నాను. అక్క కూతురు నాకు వరసేగా" అన్నాడు విద్యాధర్.

కలలో కూడా ఊహించని క్రొత్త మాటలు వింటున్నాను. ఏం చూసి ప్రమిదను చేసుకుంటావు? నువ్వా పెద్ద ఇంజనీరువు. దానికి చదువులేదు. ఆస్తి లేదు. కట్నకానుకలు రావు. పండుగలు, వేడుకలు జరిపించటానికి మామగారు లేరు. కనీసం పెళ్ళి సాధారణంగా కూడా చేసే పరిస్థితిలో లేను. ఏదైనా తగినట్లుగా ఉండాలి అన్నది మీనాక్షి నెయ్యి వేస్తూ.

"ప్రమిదలో వున్న అర్హత ఏమిటో చెప్పనా! నీ పెంపకంలో పెరిగింది. అంతకు మించి ఇంకేం కావాలి?" అన్నాడు విద్యాధర్.

ఈ సారి కొంచెం సీరియస్‌గా మారింది మీనాక్షి.

"మీ నాన్నగారికి తెలిస్తే కోప్పడతారు. ఎంతో మంది గొప్పగొప్ప వాళ్ళు తమ పిల్లలను నీకు ఇవ్వటానికి క్యూలలో నిలబడతారు. వాళ్ళ అండదండలతో నీవింకా పైకి వస్తావు. తొందర పడవద్దు" అన్నది మీనాక్షి.

"గొప్పగొప్ప వాళ్ళంతా గొప్పగుణం కలిగిన వారని నిర్ణయించలేము అక్కయ్యా. ఆస్తి అంతస్తులను బట్టి గుణాలు, స్వభావాలు, మనసులు వుండవని ఇప్పుడే గుణపాఠం నేర్చుకున్నాను. నా జీవితంలో కూడా ముందు ముందు ఇలాంటి ఆప్యాయత, ఆదరణ ఆశిస్తున్నాను అవి ప్రమిద దగ్గర పుష్కలంగా లభిస్తాయని నమ్ముతున్నాను. నాన్నగారిని నేను ఒప్పిస్తాను. నువ్వు కాదనకక్కయ్యా. ప్లీజ్. అన్నాడు విద్యాధర్.

"నీవలా అంటే నాకు కావలసిందే మున్నది? అదృష్టం నా యింటి తలుపు తట్టిందని మురిసిపోతాను. కాని మేము అలాంటివి ఆశించటం ప్రస్తుత సమాజం తీరులో నేరమవుతుంది. అందుకే ఆలోచిస్తున్నాను." అన్నది మీనాక్షి.

"అలాంటి ఆలోచనలేం పెట్టుకోకు. ప్రమిదను నేను అపురూపంగా చూచుకుంటాను. నువ్వు కూడా ఈ పని మానేసి మాతో వచ్చి మాకు తోడుగా ఉండాలి" అన్నాడు విద్యాధర్.

మీనాక్షి కళ్ళనుండి ఆనంద బాష్పాలు రాలాయి.

"అవునూ. సుశీల లేచి పోయిందటగా. ఇందాక నాకా సంగతి చెప్పలేదేం?" అన్నాడు విద్యాధర్ చెయ్యి కడుక్కుంటూ.

"నాకు పెళ్ళీ డొచ్చిన కూతురుంది. ఆ మాట చెప్పడానికి నాకు నోరు రాలేదు. అయినా కిరణ్మయి తనకు నచ్చిన వాడిని చేసుకుందనుకోవచ్చుగా" అన్నది మీనాక్షి.

"నీ సంస్కారం చాల గొప్పది. ఇక నేను వెళ్ళొస్తానక్కయ్యా" అన్నాడు విద్యాధర్.

"అందరినీ అడిగానని చెప్పు" అన్నది మీనాక్షి. తృప్తి నిండిన హృదయంతో బయలు దేరాడు విద్యాధర్.

●

హిందీ చిత్రాల్లో టి. వి. శిల్ప



అనేక టి. వి. సీరియల్స్ ద్వారా ప్రేక్షకులకు పరిచయమైన శిల్పకు హిందీ చిత్రాల్లో ఆఫర్ వచ్చిందట.

ప్రతి శనివారం టి. వి. ద్వారా ప్రసారం అవుతున్న 'భోజరాజు కథలు', గతంలో ప్రసారమైన 'తెనాలి రామకృష్ణ' యింకా మరెన్నో తెలుగు సీరియల్స్ ద్వారా ప్రేక్షకులకు దగ్గరైన శిల్ప బాగా పాపులర్ అయి దాదాపు నాలుగు ' చిత్రాల్లో బుక్ అయిందట.

హిందీలో నిర్మిస్తున్న 'అత్తకు యముడు అమ్మాయికి మొగుడు' చిత్రంలో ప్రదీప్ సరసన శిల్ప నటిస్తోంది. టి. వి.లో వేసిన ప్రతి వారికీ ఎప్పుడో ఒకప్పుడు సినిమా ఛాన్సు రాకుండా వుండదేమో!

సీరియల్

సూపర్ హీరో

మన్నెం శారద

(గత సంచిక తరువాయి)

ఏ రంగంలోనయినా మొట్టమొదట ప్రవేశించిన స్త్రీలు ఆ కాలపు వ్యక్తుల తీవ్ర నిరసనకి, హేళనకి, అసహకారానికి లోను కాక తప్పదు. బాధలకిలోను కాక తప్పదు. అదే నిఖిలకి ఎదురయ్యింది.

అంతకుముందు ఆ ఆఫీసులో స్త్రీ ఉద్యోగినులు ఉన్నా వారు టైపిస్టులు, క్లర్క్‌లు మాత్రమే! స్త్రీలని కేవలం టీచింగ్ స్టాఫ్‌గాను, నర్సులగానూ, టైపిస్టులగానూ చూడటానికి అలవాటు పడ్డ మగ ఉద్యోగులు నిఖిల ఇంజనీరుగా రావడాన్ని సహించలేక బాహాటంగానే పరుషంగా మాట్లాడి ఆమెని గాయపరిచి ఆనందించేవారు.

ఒక్కోరోజు ఆమె సీట్లో ఫైల్సు మాయమయ్యేవి. ఒకో కరెంటు డిస్పోసల్ తెలియక అవస్థపడి హెడ్‌డ్రాఫ్ట్స్‌మన్‌ని అడిగితే 'అందరి సీట్ల నుండి వచ్చే ఫైల్సు నేనే చూడాలి, మధ్యలో నీకు ప్రయివేటు చెప్పడానికి నాకు తీరికలేదు తల్లీ!' అని వెటకారంగా మాట్లాడేవాడు.

ఆమె ఏ కొలీగ్ పక్కకైనా వెళ్ళి అడిగితే 'పిట్ట నీ పెట్టె మీద వాలిందేంటి గురూ! జాగ్రత్త!' అంటూ డైరక్టుగానే అసభ్యంగా మాట్లాడి ఆనందించే వారు కొందరు.

టెక్నికల్ సెక్షన్ అంటేనే అకారణంగా అసూయపడి సంస్కార రహితంగా తిట్టి పోసే ముసలి మేనేజర్ నిన్నగాక మొన్న జాయినయిన ఆడపిల్ల తనకంటే ఎక్కువ జీతాన్ని తీసుకోవడాన్ని అసలు సహించలేక పోయేవాడు.

అతనికింక సర్వీసు ఓ సంవత్సరముంది. అయినా చింత చచ్చినా పులుపు చావని మనస్తత్వం అతనిది. కరిగించిన తారుడబ్బాలా వుండే అతని చూపులన్నీ నిఖిల మీదనే!

తన పనేదో తాను చూసుకొని డిగ్నిఫైడ్‌గా ప్రవర్తించే నిఖిల అతనికి అహంభావిలా తోచేది.

"నన్ను వాళ్ళిలా అన్నారు సర్! వీళ్ళిలా అన్నారు సర్" అని మిగతా వారిలా రిపోర్టులు తీసుకొని తన దగ్గరకొచ్చి బావురుమనకుండా దర్జాగా మసలుకొంటున్న నిఖిలని చూస్తే అతనికి చెప్పలేని కోపం వచ్చేది! తనని ఏ మాత్రం గుర్తించని ఆమెని చూస్తే అతని అహం దెబ్బతినేది!

పనిలేకపోయినా టెక్నికల్ సెక్షన్‌లో కొచ్చి హెచ్.డి. (హెడ్‌డ్రాఫ్ట్స్‌మాన్) ముందు కూర్చొని బాతాఖానీ వేసే వాడు. చూపులు మాత్రం నిఖిల మీదనే!

"ఏం హెచ్.డీ, ఇన్స్‌పెక్షనుంది వెళ్తావా?" అనడిగే వాడు ఓరగా నిఖిలని పరీక్షిస్తూ.

"ఎక్కడికండీ?" హెచ్.డి. ప్రశ్న.

"చిలకలూరి పేట! అక్కడ చిలకల్ని చూశావో లేదో" హెచ్.డి.తోపాటు మిగతా వారి నవ్వు!

"వద్దులెండి!"

"చిలకలు ఇక్కడికే వచ్చి వాలుతున్నాయా?" అతని ప్రశ్న!

"ఏమో మీకే తెలియాలి!" హెచ్.డి. ఫైల్లో తలదూర్చి ముసిముసిగా నవ్వేవాడు.

"అక్కడికి నువ్వేదో నంగనాచివయినట్లు! పోనీ పెద్దాపురం చూశావా? వెళ్తే తిరిగి రావులే!"

"ఏమోసార్! మీరు అనుభవజ్ఞులు. మీ ముందు మేమెంత!" అనేవాడు హెచ్.డి.

"ఏమ్మాయీ, నీది కాకినాడనుకుంటాను. పెద్దాపురం తెలీదూ!" వెంటనే నిఖిలని అడిగేవాడు మేనేజర్.

ఆ సంభాషణల్లోని శ్లేష, మాటలకి మరో నీచార్థం తీయగల అలవాటు లేని నిఖిల "తెలుసండి" అనేది అమాయికంగా.

"అదిగో ఆడపిల్ల కున్నంత పాటి తెలివి లేదు నీకు హెచ్.డీ! ఎలాబతుకుతావయ్యా! పెద్దాపురం దేనికి ప్రసిద్ధమ్మా నిఖిలా!"

నిఖిల అతని వైపు చురుక్కున చూసింది.

"ఏంటీ కోపమొచ్చిందా?"

"నాకు నా ఇంటి సభ్యులు తప్పించి ఎవరైనా ఏకవచనంలో పిలిస్తే ఇష్టముండదు" అంది నిఖిల ఖచ్చితంగా.

మేనేజర్ పళ్ళెంపడేసినట్లు నవ్వి "ఓహో, అందుకా! ఇంకా పెద్దాపురం గురించనుకున్నాను. ఏదో పెద్దవాణ్ణి! నీ మావయ్యలాంటి వాణ్ణి! నాకు అందర్నీ ఇలానే పిలవడం అలవాటు! రిటైరయ్యే ముందు ఇక పద్ధతేం మార్చుకోగలనమ్మాయ్! ఇంతకీ పెద్దాపురం....."

"నాకు తెలిసినంత వరకు పట్టుచీరలకి ప్రసిద్ధి" ముభావంగా జవాబు చెప్పింది నిఖిల.

"అంతేకాని అవికట్టుకుని కులికే పాపల గురించి తెలీదంటావు!"

"మీరు వయసులో చాల పెద్దవారు! ప్రవర్తనలో కూడ ఆ పెద్దరికం నిలబెట్టుకోవడం మంచిది!" నిఖిల రివ్వున ఫైలు తీసుకొని పి.ఏ. రూమ్‌లోకి వెళుతుంటే అసలే నలుపు రంగులో వున్న మేనేజర్ మొహం నేరేడు రంగు తిరిగింది.

"చూస్తాను, దీని పొగరు" అంటూ అతను కుర్చీని తన్ని లేచేడు.

"రాజుగారు తలచుకొంటే దెబ్బలకి కొదవా! పిల్ల కాకికేం తెలుసు, ఉండేలు దెబ్బ" అంటూ స్టాఫ్ రెచ్చగొట్టి వినోదించేరతన్ని.

ఆ మర్నాటి నుండి అసభ్యమైన రాతలున్న ఉత్తరాలు ఆమె సొరుగులో పడివుండేవి!

ఇంతవరకూ సాగిన కథ-3: అనతి కాలంలోనే బిజీ హీరో అయిన విజయేంద్ర కాల్‌షీట్ల కోసం నిర్మాతలు పడిగాపులు కాస్తుంటారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు అయిన తల్లి నిఖిలేశ్వరి కొడుకు విజయాలు చూసి మురిసిపోతుంటుంది. పోలీసు కమీషనర్ కూతురు పీయూషను ప్రేమిస్తున్నానని విజయేంద్ర తల్లికి తెలియజేస్తాడు. తన కూతుర్ని మరిచిపోవలసిందిగా కొడుకుతో చెప్పమని పీయూష తండ్రి నిఖిలను హెచ్చరిస్తాడు.

అనురాగమయమైన తల్లిదండ్రులకి ఒక్కగానొక్క కూతురిగా పుట్టి, చదువు సంస్కారం, మంచి విషయాలు, మాత్రమే అలవాటు పడి పుట్టి పెరిగిన నిఖిల హృదయం ఆ రాతల్ని చూసి తట్టుకోలేకపోయేది! చెప్పుకోవడానికి స్నేహితుల్లేరు! తల్లిదండ్రులకి చెప్పడానికి ఒకలాంటి జంకు.....ఆమె ఆ విషాన్నలాగే దిగమింగి, ఇతరులతో మాటలు తగ్గించి ఖాళీ వుంటే డైరక్టు ఏ.ఇ. పరీక్షలకని ఇంజనీరింగ్ పుస్తకాలు చదువుకుంటుండేది!

అయినా తోటి స్టాఫ్ శాడిజం మాత్రం తగ్గలేదు. ఆమె ఓర్పు పట్టేవరకు వారు రెచ్చి పోతూనే వుండేవారు.

ఒకరోజు ఆమెకు ఎస్.ఇ. (సూపర్నెంటెండింగు ఇంజనీరు) నుండి కబురొచ్చింది. "అయ్యగారు రమ్మంటున్నారు" అంటూ ఎస్.ఇ. అటెండర్ వచ్చి చెప్పేడు. సహజంగా ఎస్.ఇ.లు పి.ఎ.నిగాని హెచ్.డి.నిగాని పిలుస్తారు. కాని మిగతా సబార్డినేట్స్‌ని ఛాంబర్లోకి పిలిచి డిస్కస్ చేయరు. మే నేజర్ ఏదో తిరకాసు చేసి ఆమెని ఇరికించి వుంటాడని అందుకే తిట్టడానికి పిలిచి వుంటారని అందరూ తెగ సంతోషపడిపోసాగేరు.

నిఖిలకి కూడ భయమేసింది.

"హెచ్.డి.గారూ, మీరు కూడ వస్తారా!" అంటూ అడిగింది భయంగా.

"మధ్యలో నేనెందుకూ, మిమ్మల్ని పిలిస్తే! మీరసలే గ్రాడ్యుయేట్ ఇంజనీరు కదా! మీకేం భయం వెళ్లడానికి! రేపొద్దుట మాకు సుపీరియర్‌గా వచ్చినా వస్తారు" అన్నాడు వెటకారంగా.

నిఖిల అతని వంక దెబ్బ తిన్నట్లుగా చూసింది.

"నేను అవన్నీ మాట్లాడలేదండీ, మీరు సెక్షన్ హెడ్డని రమ్మన్నాను" అంది బాధగా.

"వెళ్ళండి, వెళ్ళండి, ఆయనసలే ముక్కోపి! ఆ దొబ్బులు నాక్కూడా పెట్టిద్దామనా!" అంటూ అసభ్యంగా మాట్లాడేడు.



అతని మాటకి అందులో ఏదో హాస్య మున్నట్లు మిగతా వాళ్ళు నవ్వుతుంటే నిఖిల పెన్ తీసుకొని బలిపశువులా అతని ఛాంబర్ కేసి నడిచింది.

ఎపాయింటయ్యేక ఎస్.ఇ.ని దూరం నుండి చూడటమే గాని ముఖాముఖి కలుసుకొని ఎరుగదు తాను.

ఆయన కసలే ఛండశాసనుడని, ముక్కోపి అని పేర్లున్నాయి. ఒకవేళ అతను గట్టిగా మాట్లాడితే తను ఏడవదు కదా కొంపదీసి! ఛీ! తనేడవకూడదు! మగవాడిలా చదువు కొంది! మగవాడిలా ఉద్యోగం చేస్తోంది! తనకి ఎదురయ్యే ప్రతి సమస్యని మగవాడిలా నిబ్బరంగా, నిదానంగా ఎదుర్కొనే స్థయిర్యం తను అలవాటు చేసుకోవాలి!

తన దురదృష్టం కొద్దీ ఈ ఆఫీసులో మగజనం తనని వేరు చేసి చూసి ప్రతిక్షణం తను ఆడపిల్లనని గుర్తుచేస్తున్నారు.

నిఖిల ఛాంబర్ తలుపు తెరచి పట్టుకొని "మే అయ్ కమిన్ సర్!" అంది వినయంగా.

"ఎస్!"

నిఖిల లోనికి నడిచింది మెల్లిగా.

"పిలిచేరట సర్!"

"అవును. ఈ టెండర్స్ చూసింది మీరేనా?"

పెద్ద ఆఫీసరయినా అతను మన్నించి మాట్లాడటం చూసి ఆమెకు ఆనందమేసింది.

"ఎస్ సార్!" అంది వినయంగా.

"టెండర్స్ ఓపెన్ చేసిన మర్నాడే కంపేరటివ్ స్టేట్‌మెంట్ తయారు చేసి వెంటనే ఎస్.ఇ.కి పుటప్ చెయ్యాలన్న రూల్ మీకు తెలీదా?"

"తెలుసు సర్!"

"మరి?" ఆయన కొద్దిగా అసహనంగా చూశాడు.

"అలాగే పుటప్ చేసేను సర్!"

సూపర్ హీరో

"మీరు అబద్ధం చెబుతున్నారు" ఆయన కోపంగా అరిచేడు.

"లేదు సార్! నేను నిజమే చెబుతున్నాను. ఇది చాల కాంపిటీషన్ వున్న టెండరు. మొత్తం పదకొండు మంది టెండరర్స్ టెండర్స్ వేసేరు. మొత్తం రేట్లన్నీ పి.ఏ.గారు చదువుతుండగానే నోట్ చేసుకున్నాను. అర్థమేటిక్ చేయడానికి టైము చాలక ఇంటికి తీసుకెళ్ళి అర్ధరాత్రి వరకు చేసేను. (అప్పట్లో కేలికు లేటర్స్ వాడుకలో లేవు) మర్నాడు నోటు రాసి పుటప్ చేసేను సర్!"

"సీల్డ్ టెండర్స్ ఇంటికి తీసుకెళ్ళ కూడదని తెలియదా మీకు!"

"తెలుసుసర్! నేను కంపేరటివ్ స్టేట్‌మెంట్ మాత్రమే తీసుకెళ్ళేను."

"అదర్‌దెన్ లోయస్టు టెండర్‌ని ఎందుకు సిఫారసు చేసేరు?"

"నోటులో ఆ విషయ మంతా రాసేను సర్! లోయస్టు టెండరరు కొన్ని కండిషన్స్ సూచించేడు. అది డిపార్టుమెంటుకి లాభదాయకమైంది కాదు. పైగా అదర్‌దెన్ లోయస్టు టెండరర్‌కి మంచి అనుభవముంది. పైగా అన్‌ఎంప్లాయిడ్ ఇంజనీరు!

"పార్షియాలిటీయా?"

"కాదు సర్! అతనికి టెక్నికల్ పరిజ్ఞానముండే అవకాశం ఉందని మాత్రమే చెబుతున్నాను"

"అయితే ఈ నోటు నాదగ్గరకెందుకింత ఆలస్యంగా వచ్చింది?"

నిఖిల ఎస్.ఇ. గారి పక్కకెళ్ళి ఫైలు తిరగేసి చూసి "నేను సంతకం చేసి తారీఖు వేసిన పేజీ మిస్సయింది సర్! నా నోటుకి కంటిన్యూయేషన్ హెచ్.డి.గారు రాసిన నోటు వుంది. నా సంతకం లేకపోతే ఆయన నన్ను పిలిచి అడగాలి కదా!" అంది.

ఆమె తొణకకుండా తప్పుపట్టి చెప్పడం కొద్దిగా ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కల్గించిందాయనకి.

"ప్లీజ్ బి సీటెడ్! " అన్నాడు నెమ్మదిగా.

"థాంక్యూ సర్!" అంటూ కూర్చొంది నిఖిల.

బజ్జర్ నొక్కి అటెండర్‌ని పిలిచి "హెచ్.డి.ని తీసుకురా!" అన్నాడు ఎస్.ఇ.

అటెండర్ వెళ్ళి హెచ్.డి.ని పిలుచుకొచ్చేడు.

నిఖిల ఏ ఫైల్లోనో ఇరుక్కొని వుంటుందని ఇంకాస్త ఇన్వాల్వ్ చేసి ఆమెని తిట్టించాలని హెచ్.డి. ధీమాగా ఛాంబర్స్‌లోకి ప్రవేశించేడు.

నిఖిల ఎస్.ఇ. గారి ఎదుట కూర్చోవటం అతనికి ఆశ్చర్యాన్ని కల్గించింది. తప్పుడు పనులు చేసి, లంచాలు తినే చాలా మంది ఉద్యోగస్తులు ఆఫీసర్స్ ఎదుట అక్కర్లేని వినయాన్ని ప్రదర్శించి ఆఫీసర్ను కళ్ళలో మత్తు జల్లి తమ తప్పులు తెలియకుండా చేసుకోవడానికి నటిస్తారు. అలానే హెచ్.డి. ఎంతో వినయం ప్రదర్శిస్తూ "పిలిచేరట సర్!" అన్నాడు.

"ఈ టెండర్ మీద కేస్ వర్కర్ ఇనిషియల్ ఏది?" ఆయన ఫైలుని హెచ్.డి. ముందుకి తోసేడు.

హెచ్.డి. పేజీలు అటూ ఇటు తిప్పి "ఆవిడ మరచిపోయినట్లుంది!" అన్నాడు.

"అయితే ఈ నోటుకి కనీసం కన్‌క్లూజన్ అడగకుండా, మీరెలా కంటిన్యూయేషన్ రాశారు?" అని క్రాస్ చేసేరు ఎస్.ఇ. గారు.

దాంతో హెచ్.డి. దొరికిపోయి నీళ్ళు నమిలేడు.

"యూ కెన్ గో!" అన్నారు ఎస్.ఇ. గారు సీరియస్‌గా. హెచ్.డి.బయటికి నడుస్తుంటే నిఖిల కూడ లేచి నిలబడింది.

"మీరు కూర్చోండి" ఆయన ఆజ్ఞకి బద్ధురాలయి తిరిగి కూర్చుంది నిఖిల.


"మీరు డైరక్టు ఏ.ఇ. పరీక్షలకి చదువుతున్నారా?" అవునన్నట్లుగా తలూపింది నిఖిల.

"ఆఫీసులోనే చదువుతుంటారా?"

"కేవలం ఖాళీ ఉంటేనే సర్!"

ఆయన తలపంకించి సొరుగుల్లోంచి రెండుత్తరాలు తీసి "ఈ ఉత్తరాలు మీ సొరుగులో వున్నాయి. దీనికి బాధ్యులెవరు?" అనడిగేరు సీరియస్‌గా.

ఆ ఉత్తరాలు చూడగానే నిఖిల మొహం



మ్లానమయ్యింది. తలవంచుకొని "అవి నన్ను ఎడ్రస్ చేసి వున్నాయి. బాధ్యులెవరో నాకెలా తెలుస్తుంది సార్!" అంది.

"మీకెవరి మీదయినా అనుమానం వుందా?"

"లేదు సర్! అంత నీచానికి ఎవరు ఒడిగట్టగలరో ఎసెస్ చేయలేకపోతున్నాను"

"సరే! మీరెళ్ళండి" అన్నాడు ఎస్.ఇ. గారు.

నిఖిల బయట కొచ్చింది.

నిఖిల సెక్షన్‌కి రాగానే తన మీద రిపోర్టు చేసిందని విరుచుకుపడ్డాడు హెచ్.డి.

"మీరు నమ్మినా నమ్మకపోయినా నేనేం చేయలేను. నేను మీ గురించి రిపోర్టు చేయ లేదు. నా గురించి మాత్రమే చెప్పుకున్నాను" అంది.

** ** ** ** ** ** ** **

నాల్గు రోజుల్లో హెచ్.డి.కి రివర్షన్‌తో పాటు పేరంటు సర్కిలుకి పంపిస్తున్నట్లు ఆర్డర్స్ వచ్చేయి. దాంతో నిఖిలేశ్వరి పేరు డిపార్టుమెంటంతా మార్మోగిపోయింది. హెచ్. డి.నిఖిలకి సారీ చెప్పుకొని రిలీవయి పోయేడు.

మరో వారంలో నిఖిల సొరుగులో దొరికిన ఉత్తరాలు మేనేజరు రాస్తున్నాడని ప్రూవయ్యింది. అటెండరు అప్పలస్వామి సాక్ష్యంతో రిటైర్‌మెంటు ముందుగా మిస్ బిహేవియర్‌కి సస్పెండ్ కాబడ్డాడు మేనేజరు. నిఖిలని క్రిమినల్‌గా ప్రొసీడ్ కావొద్దని కాళ్ళు పట్టుకున్నంత పని చేసాడు మేనేజరు! చివరికి అతను బాహాటంగా నిఖిలని క్షమాపణ చెప్పుకున్నాకనే అతనికి సర్వీసు మేటర్సుని సరి చేసేరు ఎస్.ఇ. గారు.

** ** ** ** ** ** ** **

ఆ రోజు నుండి నిఖిలంటే అందరూ హడలిచచ్చేవారు. వర్క్ విషయంలో ఆమె మంచి పేరు సాధించింది.

ఒక రోజు ఆమె శెలవురోజు ఇంట్లో కూర్చుని చదువుకొంటోంది.

"మే అయ్ కమిన్ మేడమ్!"

నిఖిల తలెత్తి చూసింది.

గోపాల్రావు!

అతను ఈ మధ్యనే రెండవ తరగతి కాంట్రాక్టరుగా రిజిస్ట్రేషన్ పొంది ఆ దరిదాపులో వున్న వాగు మీద బ్రిడ్జి కట్టే కాంట్రాక్టు తీసుకొన్నాడు. వర్కు అతనికిస్తూ ఈ మధ్యనే అగ్రిమెంటు జరిగింది. అతను కూడ బి.ఇ. చదివేడు. అనెంప్లాయిడ్ ఇంజనీరుగా అతను నమోదయ్యేడు. వయసు పాతిక దాటి వుండొచ్చు. అతను ఇంటికి రావడంతో తెల్లబోయింది నిఖిల.

మిథున్ చక్రవర్తి ప్రపంచం



ఈ మహాప్రపంచం ఒకటే అయినా నటీ నటులకు మాత్రం ఒక్కొక్కరికి ఒక్కో వేరే ప్రపంచం వుంటుంది. ఒక నాటి డిస్కో నటుడు మిథున్ చక్రవర్తికి తన సంపద, తనకున్న మోటారు కార్లు, తనకున్న యిల్లూ, వాకిళ్లు యివే ప్రపంచం. సాధారణంగా అతను నోరు విప్పితే సంభాషణ అతని కొడుకు గురించి చెప్పటంతో ఆరంభమై అతని కొడుకు గురించి మురిసిపోవటంతో ముగుస్తుంది. తన గురించి కన్నా తన విలాస వస్తువుల గురించి ఎక్కువగా వ్రాస్తేనే ఇంటర్వ్యూ యిస్తాడట ఈ మహా చక్రవర్తి.

"రండి" అంది ఇక తప్పదన్నట్లుగా.

అతనొచ్చి కూర్చుంటూ "చాల థాంక్స్ మేడం! వర్కు నాకు వచ్చేట్లు చూశారు" అన్నాడు.

ఆమె తెల్లబోతూ "నేనిందులో ప్రత్యేకంగా చూసిందేమీ లేదు. మీది లోయస్టు కొటేషన్. రాకేం చేస్తుంది!" అంది.

"మీరు తలచుకుంటే నోటు ట్విస్టు చేసి తలక్రిందులు చేయలేరా ? నాకు ఎక్స్‌పీరియన్స్ లేదని ఆ టెండరు నా తర్వాత తక్కువ రేట్లు పెట్టిన వారికి ఇప్పిస్తే మీకు పదిశాతం ఇస్తామని రాఘవయ్యగారు ఆశ చూపినా మీరు వినలేదని తెలిసింది. నాచేత గారంటీ సొమ్ము కూడ కట్టించుకోలేదు మీరు !" అన్నాడు.

ఆ మాటలు విని నిజంగానే ఆశ్చర్యపోయింది నిఖిల. "ఈ సంగతులు ఎవరు చెప్పేరు ?" అంటూ అడిగింది కటువుగా.

ఆమె మొహంలో కాఠిన్యం చూసి నిజంగానే బిత్తరపోయేడతను.

"మీ ఆఫీసులో అనుకుంటే విన్నాను."

"అంటే ... ఎవరు ఎవరితో అనగా విన్నారు ?"

"అదంతా సరిగ్గాతెలీదు మేడం ! అటెండరు పెంచలయ్య చెప్పేడు."

"మీలాంటి ఎడ్యుకేటెడ్ కాంట్రాక్టర్‌కి ఇన్‌ఫర్మేషన్ ఫీడ్ చేసేది ఒక నిరక్షరాస్యుడైన అటెండరా ! బాగుంది !" అంది వెటకారంగా నిఖిల.

"సారీ మేడం ! నేను ఈ ఫీల్డులోకి కొత్తగా వచ్చేను. నేను మాట్లాడే దాంట్లో తప్పులుంటే క్షమించండి. ప్రస్తుతానికిదుంచండి " అంటూ ఒక కవరు అందిచబోయేడతను.

నిఖిలకి షాక్కొట్టినట్లయింది.

"ఏంటిది ? "

"ఏదో నాకు తోచినంత ఇస్తున్నాను. తక్కువయితే చెప్పండి. వర్కు స్టార్ట్ అయ్యేక మళ్లీ కలుస్తాను" అన్నాడతను లేచినిలబడి సిన్సియర్‌గా.

నిఖిల మొహం ఎర్రగా కందిపోయింది.

"నన్ను గురించి మీరేమనుకుంటున్నారు. ఈ రకంగా అవమానించాలని ఇంటిదాక వచ్చేరా ! ప్లీజ్ గెటవుట్ !" అంటూ పేకట్ అతని మీదకి విసిరి రివ్వున ఇంట్లోకి వెళ్లిపోయింది నిఖిల.


ఆ హఠాత్పరిణామానికి అతను తెల్లబోయేడు.

చిన్నబోయిన మొహంతో అపరాధిలా అలానే నిలబడిపోయేడు.

నిఖిల అరుపులు విని ఆమె తండ్రి దశరథరామయ్య బయటకి వచ్చి గోపాల్రావు మొహంకేసి చూశారు.

అతను బేలగా అలానే నిలబడి వుండటం చూసి ఆయనకు కొద్దిగా జాలికల్గి "ఏంటి బాబూ, ఏంజరిగింది, నువ్వెవరివి ? " అన్నారు నెమ్మదిగా.

గోపాల్రావు గుక్క తిప్పుకోకుండా జరిగినదంతా చెప్పి "నాకేంతెలీదుసార్ ! ఇలా చెయ్యాలని నాకు అటెండర్ పెంచలయ్య చెప్పేడు. మేడంని ఇంటి దగ్గరే కలవాలని చెబితే నిజమనుకొని వచ్చేను. నేనెప్పుడు ఎవరికీ లంచాలివ్వలేదు. నా మొదటి వర్కు ఇది ! తప్పయితే నన్ను క్షమించండి" అన్నాడు బాధగా.



తారాపథానికి నిచ్చెనలు !

సేల్స్‌గర్ల్ స్థాయినుండి తారాపథానికి మైఖెల్లీ ఫై ఫెర్

కాలిఫోర్నియా సూపర్ మార్కెట్‌లో సేల్స్‌గర్ల్‌గా పనిచేసే మైఖెల్లీ హఠాత్తుగా నటిగా మారి "మారీడ్ టుది మాచ్, డేంజరస్ లెయిజన్స్" చిత్రాలలో అందమైన ఎదురులేని నటిగా నిలబడ గల్గింది.

మైఖెల్లీ చిత్రాలలో ఆమెకు పేరు తెచ్చిన మరో చిత్రం గ్రేజ్ 2. కాలిఫోర్నియాలోని ఓ ఎయిర్‌కండిషనింగ్ కాంట్రాక్టరు కుమార్తె మైఖెల్లీ. స్కూలు చదువు ముగించుకొని కాలేజీలో కొద్దిరోజులు చదివింది. ఆనక బట్టల షాపుల్లోను, నగలు తయారుచేసే ఓ పెద్ద కంపెనీలోను, కాలిఫోర్నియా సూపర్‌మార్కెట్‌లోనూ పనిచేసింది. మిస్ ఆరెంజ్ కంట్రీ బ్యూటీ కాంటెస్ట్‌లో అందగత్తెగా గెలుపొందిన తర్వాత కొన్ని టి.వి. చిత్రాల్లో నటించింది. తర్వాత నటనను వృత్తిగా స్వీకరించాలని నిశ్చయించుకుంది. కాలిఫోర్నియా నుంచి లాస్ ఏంజెల్స్‌కు మకాం మార్చి, ఏక్టింగ్ క్లాసెస్‌కు వెళ్లసాగింది. అనతికాలంలో లారెక్కా అనే ఏజెంట్‌ను పెట్టుకొంది. 'లారొక్కా' మైఖెల్లీ అభివృద్ధికి చాలా కృషి చేశాడు. ఫాంటసీ అయిలెండ్‌లో నటించడానికి అతనే కారణం. ఈ చిత్రం తర్వాత డెల్టాహౌస్ చిత్రంలో మైఖెల్లీ సెక్సీగా నటించింది. ఆ చిత్రం కోసం ఆమెకిచ్చిన దుస్తులు చూసి గుండెలు బాదుకుంది. ఏడుస్తూ తన ఏజెంట్ లారెక్కాకు ఫోన్‌చేసి "నేను ఈ దుస్తుల్లో చాలా సెక్సీగా కనిపించాలని వాళ్లు భావిస్తున్నారు. నేను సెక్సీగాళ్‌నని జనం భావిస్తే నా గతి ఏమిటి ?" అందట. ఆ చిత్రం విజయవంతమైంది.

తర్వాత హాలీవుడ్ నైట్స్, చార్లీ చాన్ వంటి చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు ధరించింది.

స్వీట్ లిబర్టీ, ది విచెస్ ఆఫ్ ఈస్ట్ విన్, మారీడ్ టుద మాచ్ మొదలైన చిత్రాల్లో ఆమె నటనా సామర్థ్యంబాగా వెలుగులోకి వచ్చింది.

దశరథరామయ్యకి పరిస్థితి అర్థమయ్యింది.

నిఖిలని రమ్మని పిలిచేరాయన.

నిఖిల ముభావంగా వచ్చి నిలబడింది.

"చూడమ్మా నీ ఆఫీసు విషయాల్లో తల దూరుస్తున్నానని అనుకోకపోతే అతనికీ ఫీల్డు కొత్త ! ఇలా చెయ్యాలని అది పద్ధతని ఎవరో చెబితే అమాయకంగా వచ్చి దెబ్బతిన్నాడు. చాలమంది నడిచే త్రోవనే నడవటం పద్ధతి అనుకొని పొరబడ్డాడు. నువ్వు కోపగించక అతని పొరబాటును సరిదిద్దు. నీలాంటి వాళ్లు కూడ అక్కడక్కడ వుంటారని అతనికి అర్థమయ్యింది. అతని డబ్బు అతని కిచ్చేసి మర్యాదగా పంపించు" అన్నారు.

నిఖిల కొద్దిగా మెత్తబడింది.

ఆమె టీపాయ్‌మీద కవరు అతనికందించి "ఇంకెప్పుడూ ఇలా చేయకండి ! మీలాంటి యువకులు కూడ అడ్డదారినే నడవాలని ప్రయత్నిస్తే భావితరం ఏమవుతుంది ! పోతే అఫిషియల్ పనిమీద వచ్చిన వారు అఫిషియల్‌గానే ఆఫీసులో కలవడం మంచిది."అంది ఖచ్చితమైన కంఠస్వరంతో.

గోపాల్రావు కవరందుకొని నిఖిలకి, దశరథరామయ్య గారికి నమస్కరించి వెళ్లిపోయేడు.

"పాపం, కుర్రాడు బెదరిపోయేడు" అన్నారు దశరథరామయ్య నవ్వుతూ.

నిఖిలకి మాత్రం నవ్వు రాలేదు.

ప్రతివారు తమ పనుల్ని అడ్డదారిని వెళ్లి పూర్తిచేసుకోవాలనుకునే వారే ! నీతి, నిజాయితి అనే పదాలు కొన్నిరోజులకి డిక్షనరి నుండి తప్పుకుంటాయా !

6

నిఖిల ఏ.ఇ. పరీక్షలు రాసి పాసయ్యింది.

ఆ రోజు ఆమెను డిజైన్ వింగ్‌కి ఎ.ఇ.గా పోస్టు చేసేరు. నిఖిల సంతోషంగా ఫీలయ్యింది. ఆరోజు ఆమెకు ఆఫీసులో గ్రాండ్‌గా పార్టీ ఇచ్చేరు.

ఆమె ఇంటికి వచ్చేసరికి గోపాల్రావు, దశరథరామయ్యగారు సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ వుండటం కనిపించింది.

నిఖిలని చూడగానే "కంగ్రాట్స్ మె డమ్" అన్నాడు గోపాల్రావు లేచి నిలబడుతూ.

నిఖిల చూపులతోనే తండ్రిని ఇతన్నెందుకు ఇంట్లో ఎలవ్ చేసేవన్నట్లుగా చూసింది.

కూతురి మనసుని మాట్లాడకుండానే గ్రహించగల నేర్పున్న దశరథరామయ్య "ఈ అబ్బాయి ఎవరో కాదమ్మా. నా చిన్ననాటి స్నేహితుడు వైకుంఠరావుగారబ్బాయి. వాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తూ పోయేటా

క్‌తో పోయేడట !" అన్నారు.

"అలాగా !" అంది నిఖిల సానుభూతిగా.

అలా గోపాల్రావు నిఖిల కుటుంబ స్నేహితుడిగా మారేడు. పైగా ఆమిప్పుడు డ్రాయింగ్ బ్రాంచ్‌లో లేదు కనుక పబ్లిక్ కాంటాక్ట్సు ప్రసక్తికూడ లేదు.

గోపాల్రావు నిఖిలల గురించి రూమర్స్ కూడ మొదలయ్యేయి. ఆమెని గోపాల్రావు పెళ్లి చేసుకోబోతున్నాడని, ఇద్దరూ ప్రేమించుకున్నారని -రకరకాలుగా ఎవరిశక్తి కొద్దీ వారు చెప్పుకోవడం ప్రారంభించారు. నిజానికి ఆ రోజు రానే వచ్చింది కూడ.

"గోపాల్రావు పట్ల నీ అభిప్రాయం ఏమిటి ? " అనడిగేరు దశరథరామయ్యగారు కూతుర్ని.

నిఖిల తండ్రివైపు నిదానంగా చూసి "నా అభిప్రాయం దేనికి ? " అని సూటిగా అడిగింది.

కూతురంత సూటిగా అడిగేసరికి దశరథరామయ్యగారు కొంచెం తడబడ్డారు.

"ఏముందమ్మా ! నీకు పెళ్లి చేయడానికి సంబంధాలు వెదకాలిగా ! ఎదురుగా అతన్ని పెట్టుకొని ఎక్కడో వెదకడం దేనికి ? నా కతను నచ్చాడు. మరి నీకు ? " అనడిగేరు మెల్లిగా.

నిఖిల వెంటనే జవాబు చెప్పలేదు.

నాకు అతను నచ్చలేదని చెప్పడానిక్కూడ ఏవీ కారణాలు లేవు. పోతే నా ఇండివిడ్యుయాలిటీని కించపరచకుండా, జీవిత భాగస్వామినిగా చూసి గౌరవించ గల వ్యక్తిని నేను వివాహమాడటానికి సిద్ధమే ! నేనీ చదువు ఒక ధ్యేయంతో చదివేను ! మగవాడినని ఇగో మొదలైతే నేను విడిపోవడానికి సిద్ధపడగలను కాని రాజీపడి ఉద్యోగం మానుకోలేను" అంది.

"అవన్నీ నేను కూడ ఆలోచించే గోపాల్రావుని అల్లుడిగా ఎన్నుకొన్నాను. అతను నీలోని సిన్సియారిటీని, వ్యక్తిత్వాన్ని చూసి అబ్బురపడుతున్నాడు. పైగా నీలానే చదువుకున్నవాడు. ఇద్దరూ ఒకేరంగానికి చెందిన వ్యక్తులే కాబట్టి సమస్యలు ఉత్పన్నం కావు. ఏమంటావు ! "అన్నారాయన.

నిఖిల అంగీకారంగా తల ఊపింది.

ఆ మరుసటి నెలలోనే నిఖిల, గోపాల్రావుల వివాహం జరిగిపోయింది.

విజయేంద్ర పుట్టేవరకు వారి సంసారం సరదాగానే గడిచి పోయింది. గోపాల్రావు క్లాస్‌వన్ కాంట్రాక్టరయ్యేడు. పరిచయాలు, పలుకుబడి పెరిగాయి. నిఖిల ఆనెస్టీ గురించి చాల మంది తలనొప్పిగా చెప్పుకోవడం అతనికి బాధ కల్గించేది.

సూపర్ హీరో

"పోనీ చూసీ చూడనట్లుపోకూడదూ ! " అంటూ సలహా ఇచ్చేడు ఒకరోజు.

"చూసి ఎందుకు చూడనట్లు పోనివ్వాలి ? " అని సూటిగా అడిగింది నిఖిల.

"నీ ఇష్టం ! నీ గురించి ఎంత నేస్టీగా కామెంట్ చేస్తున్నారో తెలుసా ? "

"ఎవరు ? "

"అటు కాంట్రాక్టర్లు -ఇటు డిపార్టుమెంటు మనుషులు !"

"ఏం కాని పని చేసేనని చెప్పుకుంటారు ? "

"నీ వాదన నీదే నిఖిలా ! కాని పని చేస్తేనే చెప్పుకోరు ! ఆడదంటేనే మగవాళ్లకి లోకువ ! అందులో వ్యవహారాలకి అడ్డొస్తే చెప్పాల్సిందేముంది ? "

"మరలాంటప్పుడు బాధ దేనికి ? "

"భర్తగా నాకు బాధ వుండదంటావా ?"అంటూ అడిగేడు గోపాల్రావు.

"చూడండి-వీటికి అతీతంగా వుండగల్గినప్పుడే మనం ఎవరి బాధ్యతలు వాళ్లం చూసుకోగలం !" అంది నిఖిల తొణకకుండా.

గోపాల్రావుకి మొదటిసారి భార్య పెంకి మనిషిగా అనిపించింది.

"అయినా నేను రెండు చేతులా సంపాదిస్తున్నాను. విజయ్‌ని చూసుకుంటూ నువ్వు ఇంట్లో వుండిపోవచ్చుగా !"

అతని మాటకి ఆమె దెబ్బతిన్నట్లుగా చూసింది.

"ఇదేమాట తిప్పి నేనంటే మీరేమవుతారు ? "అంది కోపంగా.

"అంటే ...నన్ను...నన్ను... చేతులు ముడుచుకొని ఆయా పని చేస్తూ ఇంట్లో కూర్చోమని నీ ఉద్దేశ్యమా ! " అతను రెట్టిస్తూ అడిగేడు.

"కాదు. కాని నాకంటూ కొన్ని అభిప్రాయాలు, ఆశయాలు నాకున్నాయి. అందుకే నేను ఏ మగవాడో కట్నంకోసం డొనేషన్‌తో నయినా ఎ లంక కెళ్లయినా సరే ఇంజనీరింగ్ డిగ్రీ సంపాదించాలన్న ధ్యేయంతో చదవలేదు. కాంపిటీషన్‌లో నిలబడి యూనివర్శిటి ఫస్టు సాధించింది ఆ డిగ్రీని పాతిపెట్టడానిక్కాదు. వ్యక్తిగా ప్రజల సొమ్ము తింటున్నందుకు ఏదో కొంత సేవ చేయాలని. డబ్బు సంపాదించడమనేదే ఏకైక లక్ష్యమయితే, డబ్బే మనిషికి విలువనిస్తుందని అనుకొని వుంటే నేను ఈ వృత్తిని మాత్రమే చేపట్టేదాన్ని కాదు. అయినా పెళ్లికి ముందే మా నాన్నగారు నా సంగతి మీకు చెప్పేరనుకుంటాను" అంది నిఖిల.

గోపాల్రావు దెబ్బతిన్నట్లు చూశాడు.


"మీ నాన్న నాకేం చెప్పలేదు. డొనేషన్ చదువంటే నీ కంత హేళనగా ఉన్నప్పుడు అల్లుడు దొరకకనా నిన్ను నాకు అంటగట్టేరు!" అన్నాడతను ఉక్రోషంగా.

నిఖిల భర్తవైపు నిదానంగా చూసి "ఆయనేం చెప్పలేదని బుకాయిస్తే చనిపోయిన నా తండ్రి తిరిగొచ్చి సాక్ష్యం చెప్పలేరు. నన్ను మీకు అంటగట్టేరన్న పదాన్ని మీరు పొరబాటుగా ఉపయోగించేనని విత్‌డ్రా చేసుకోలేకపోతే మనం ఇద్దరం కలిసి వుండటం ఈ క్షణం నుండి జరగదు" అంది.

"ఏం బెదరిస్తున్నావా ? "

"లేదు. రాజీపడే అలవాటు నాకు లేదని మాత్రమే చెబుతున్నాను" అంది నిఖిల నిశ్చయంగా.

(ఇంకాఉంది)



సినిమా... సినిమా...

కృష్ణ దర్శకత్వంలో "అన్నా-తమ్ముడు"


రెండో షెడ్యూల్ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 1 నుండి 15 వరకు జరుగుతుంది. నేను సి. ఐ. బి. ఆఫీసర్‌గా, మహేష్‌బాబు ఒక చలాకీ పాత్రలో వినూత్నంగా కనిపిస్తాం." అన్నారు కృష్ణ. ఈయన స్క్రీన్‌ప్లే, కూర్పు, దర్శకత్వంలో పద్మావతి, మంజుల నిర్మించే పద్మావతీ క్రియేటివ్స్ "అన్నా-తమ్ముడు" చిత్రంలో గౌతమి, జె. వి. సోమయాజులు, కె. ఆర్. విజయ, తులసి, ప్రభాకరరెడ్డి, గిరిబాబు, ప్రదీప్‌శక్తి, పృధ్విరాజ్, మధుబాబు వగైరా నటవర్గం. ఓంకార్ మాటలు, వేటూరి-సీతారామశాస్త్రి గీతాలు, రాజ్-కోటి సంగీతం, పుష్పాల గోపీకృష్ణ ఛాయ, భాస్కరరాజు శిల్పం, శీను నృత్యాలు, త్యాగరాజన్ సాహసాలతో పద్మాలయా స్టూడియోస్ సమర్పణ.

రాజేంద్రప్రసాద్‌తో "తేనెటీగ"

"పెళ్ళయిన ఏడేళ్ళ అనంతరం నాయకుడు కోరికల మార్పు కోసం అన్యకాంతల పొందుకు ఆర్రులు చాస్తాడు. అయితే, ఆ పరుగుల వేటలో కష్టనష్టాలు చవి చూసి, చివరికి భార్యకు మించిన అనుబంధం, అనుభూతి లేదనీ, ఇంటికి మించిన స్వర్గం లేదని గుర్తిస్తాడు. చక్కని సెంటిమెంట్‌తో, అన్ని ఎలిమెంట్స్‌తో కూడిన కథ." అన్నారు ఎం. నందకుమార్. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో జె. వి. రామారావు, ఉద్దండ గురుప్రసాద్ నిర్మించే సుమప్రియా క్రియేషన్స్ "తేనెటీగ" చిత్రంలో రాజేంద్రప్రసాద్, రేఖ, కుష్బూ, సితార, అజి, తాతాజీ, చిదంబరం ప్రభృత నటవర్గం. మల్లాది వెంకటకృష్ణమూర్తి కథ, మాటలు రాశారు. భువనచంద్ర, వెన్నెలకంటి గీతాలకు విద్యాసాగర్ స్వరకర్త. ఎ. సురేష్‌కుమార్ ఛాయ సూర్యకుమార్ శిల్పం, కళ నృత్యాలు, తాతాజీ సంయుక్త దర్శకత్వం. మురళీరామయ్య కూర్పుతో ఈ చిత్రాన్ని సమర్పించే సి. ఆర్. రాజారెడ్డి, "మార్చిలో పాటలు రికార్డ్ చేసి, ఏప్రిల్‌లో షూటింగ్ ప్రారంభిస్తాం." అన్నారు.

డి. వి. ఎస్. రెండు చిత్రాలు

"ఈ పాతికేళ్ళలో డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ బ్యానర్‌లో 16 చిత్రాలు నిర్మితమయ్యాయి. ఈ ఏడు రెండు చిత్రాలను ప్లాన్ వేశాం. సుమన్‌తో వై. నాగేశ్వరరావు దర్శకత్వంలో తయారయ్యే చిత్రానికి భీశెట్టి కథ సమకూర్చారు. డి. వి. ఎస్. ఎంటర్‌ప్రైజెస్ పతాకంలో తయారయ్యే మరో చిత్రానికి కోడి రామకృష్ణ దర్శకుడు". అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డి. వి. కె. రాజు. నిర్మాత డి. వి. ఎస్. రాజు జాతీయ చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మెన్‌గా నియమితులయ్యారు.



'కిరాయి గూండా' లో కృష్ణ, గొల్లపూడి, వై. విజయ

విశ్వనాథ్ మరో సృష్టి''
''సిరిముువ్వల సింహనాదం''

''నాట్యాచార్యుడు కళాకృష్ణను నాయకుడుగాను, నాట్యంలో ప్రావీణ్యత ఉన్న మాధవీమాల, మాణిక్యభారతిలను నాయికలుగా పరిచయం చేస్తున్నాం'', అన్నారు కళా తపస్వి కె. విశ్వనాథ్. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో యలమంచిలి నాగేశ్వరరావు నిర్మించే శ్వేత ఆర్ట్స్ థియేటర్స్ ''సిరి మువ్వల సింహనాదం'' చిత్రంలో చంద్రమోహన్ ప్రధాన పాత్రధారి. శుభ, సాక్షి రంగారావు, నవభారత్ బాలాజీ, జిత్‌మోహన్‌మిత్ర, మిశ్రో, చిట్టిబాబు, రత్నసాగర్ ఇతర పాత్రధారులు. దివాకర్‌బాబు సంభాషణలకర్త. కె. వి. మహదేవన్ స్వరకల్పనలో సిరి వెన్నెల సీతారామశాస్త్రి, ధారా రామనాథశాస్త్రి, నాగఫణిశర్మ గీతాలు రాశారు. ఎం. సత్తిబాబు ఛాయ, నందూరి విజయ్ సంయుక్త దర్శకత్వం, పి. భరద్వాజ నిర్వహణ, రవిప్రకాష్ సహకార దర్శకత్వం, జి. జి. కృష్ణారావు కూర్పుతో యలమంచిలి సాయిబాబా సమర్పణ.

విజయన్ దర్శకత్వంలో సుమన్
''మహాయజ్ఞం''

"ఫైట్ మాస్టర్ విజయన్‌కు దర్శకత్వ బాధ్యతను అప్పగించాం. ఈయనా, హీరో సుమన్ సరికొత్త థ్రిల్స్‌ను అందిస్తారు. నాయికగా కె. ఆర్. విజయ చెల్లెలి కుమార్తె అనూషని పరిచయం చేస్తున్నాం", అన్నారు జ్యోతిప్రసాద్. ఈయన రూపొందించే సుదర్శన్ పిక్చర్స్ ద్వితీయ చిత్రంలో సమర్పకులు సత్యనారాయణ, కోట శ్రీనివాస రావులతో పాటు వేలు, బ్రహ్మానందం, ఆహుతి ప్రసాద్, శ్రీలక్ష్మి, సిల్క్ స్మిత, అవంతి, ఆదిగాగల వారు పాల్గొంటారు. జయరాం ఛాయ. సంగీతం రాజ్-కోటి, తార, రఘురాం నృత్యాలతో కథ, స్క్రీన్‌ప్లే, ఫైట్స్, దర్శకత్వం: విజయన్.

''ప్రేమ జిందాబాద్''లో పెళ్ళి పెద్దలు

గోపాలం (రాజేంద్రప్రసాద్) ముసలి వేషంలో ఉండగా మునసబు వచ్చి నమస్కరిస్తూ, ''తమరు తమ అమ్మాయికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని తెలిసి...'' అంటూ కూర్చున్నాడు.

"అవునండీ. ఇదిగో ఈ పక్క ఊరు పెళ్ళికొడుకుని చూద్దామని వచ్చాను. ఆ కుర్రాడు చెరుకు గడకి చెడ్డీ తొడిగినట్టూ, హేంగర్‌కి చొక్కా తగిలించినట్టూ అర్భకుడిలా ఉన్నాడు. నాకు నచ్చక తిరిగెడుతుంటే, మీ అబ్బాయి గురించి తెలిసింది", అన్నాడు గోపాలం.

ఇంతలో నటరాజ్ ఆడవేషంలో ''డాడీ!'' అంటూ వచ్చాడు.

''నా కూతురు- అదే పెళ్ళికూతురు- లావణ్య. తల్లి లేని పిల్లవడంతో మహా గారంగా పెంచి పెద్ద చేశాను, బావగారూ!'' అన్నాడు గోపాలం.


'కొత్త పెళ్ళికూతురురా'తో డిస్కోశాంతి

''పెళ్ళయితే పెద్దరికం దానంతటదే వచ్చేస్తుంది, బావగారూ! పిల్ల మహా లావణ్యంగా ఉంది పేరుకు తగ్గట్టుగా'', అన్నాడు మునసబు.

''లవ్‌లీ! వెళ్ళి అంకుల్‌కి నీ చిట్టి చేతుల్తో కాఫీ తెచ్చివ్వమ్మా'', అంటూ నటరాజ్‌ను పంపిస్తూ గోపాలం, మునసబు వంక తిరిగి, ''మీరెంతలో ఉన్నారు?'' అన్నాడు.

''ఇదివరకటి సంబంధం వాళ్ళు లక్ష ఇస్తామని... మీరు తొంభై, ఎనభై- డెబ్బై- అరవై- యాభై, నలభై- ముప్పై- ఇరవై ఇస్తే చాలు'', అని మునసబు అంటూండగా కప్పుతో వచ్చిన నటరాజ్ కాఫీని మునసబు మీద ఒంపేశాడు.

''అరెరే... వేడి భరించలేక పడేశావా అమ్మా? చెయ్యి కాలలేదు కదా? నా చిట్టీ- నా బంగారో- నా రత్నాల కొండో'', అంటూ నటరాజ్ వేళ్ళు ఊదసాగాడు గోపాలం.

బాధతో మునసబు మెలి తిరిగిపోయాడు.

జంధ్యాల స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో వి. ఫయాజ్ సమర్పించే సంగీత ఆర్ట్ ఫిలిమ్స్ ''ప్రేమ జిందాబాద్'' చిత్రానికి బి. ఎ. వి. శాండిల్య, వి. భోపాల్‌రెడ్డి నిర్మాతలు.

-జి.వి.జి.

శత్రుసంహారం

లల్లాదేవి

(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ-22: వైమానిక దళ పైలెట్ రాహుల్ తన తల్లి, భార్య కారు ప్రమాదంలో మరణించటానికి సంబంధించిన వివరాలు సేకరించే సందర్భంగా దుండగులను ఎదుర్కోవలసి వస్తుంది. దుండగుల చేతి నుంచి కూతురు సుషుమ్నను కాపాడుకొని ఒక అనాధాశ్రమంలో చేరుస్తాడు రాహుల్. కారవెల్లి విమాన ప్రమాదానికి సంబంధించిన క్రూటాక్సులోని ఇండికేటర్‌ను ఎలాగైనా సంపాదించమని అలయన్స్ సంస్థ అధినేత దేవీప్రసాద్-కైలాష్ చడ్డాను కోరతాడు. అనాధాశ్రమం నుంచి పాపను ఎవరో అమెరికా జంట తీసుకువెళ్లారని తెలిసి సైతాన్ దళం కుప్పకూలిపోతుంది.

"హమ్మయ్య! ఎలాగో యింటికిచేరాం. మళ్లీ బ్రతికిబట్ట కడతానని అనుకోలేదు. మెడ మీది గాయం ఇంకా సలుపుతూనే ఉంది. గాయం చాల లోతుగా అయింది. ఎంత రక్తం పోయిందో?" అందరి ఎదుట తన బాధల్ని వివరించుకుంటున్నాడు చెన్నుడు.

తన్వి అప్పటికే ఒక సారి యిల్లంతా కలియతిరిగి వచ్చింది.

"బావా! సుషుమ్న కన్పించదేం?" అని అడిగింది భయంగా.

"పాప యింటిలో ఉండటం మంచిదికాదనిపించింది" అన్నాడు రాహుల్. తన్వి మరింక మాటాడలేదు. ఇంటిమీద దాడులు ఎక్కువ అవుతున్నాయి. ఇంటిలో వుంచి కాపాడటం అసాధ్యమే! అందుకే ఎక్కడో రహస్యమయిన చోటుకు తీసుకుపోయి ఉండాలి.

ఆచోటు గురించి ఇందరిలో అడగటం మంచిదికాదు. చెన్నుడు వంటగది వైపు చూస్తున్నాడు. కాస్సేపయాక ఆకలి దాచుకోలేక అడిగేశాడు. డయినింగ్ టేబుల్ మీద హోటల్ నుంచి వచ్చిన కారియర్‌లు కన్పిస్తున్నాయి. అవన్నీ సర్దేసి వంట ప్రారంభించింది తన్వి.

ముందుగా అందరికి కాఫీలు అందించేందుకు మధ్యలో ఒకసారి హోలులోకి వచ్చిందామె. చెన్నుడు నిలువుటద్దం ముందు నిలబడి తగ్గిపోతున్న గాయాన్ని పరిశీలనగా చూచుకుంటున్నాడు.

సోఫాలో రాహుల్ ప్రక్కనే కూర్చున్న మరో యువతిని పరిశీలనగా చూసింది.

"పీయూషని గుర్తించలేదా? "అన్నాడు రాహుల్.

"హాస్పిటల్‌లో ఒకసారి చూచానుకదా? " కాఫీ అందిస్తూ నిర్లిప్తంగా అన్నది తన్వి. ఆమె కళ్లలో ఎటువంటి భావాలు లేవు.

"మీరు బాగా విశ్రాంతి తీసుకోవాలి. ఈ పనులన్నీ నేను చూచుకుంటాను" ఆమె చేతిలోని ట్రే అందుకుంది పీయూష.

తన్వి తమాషాగా చూచింది. అదేమీ పట్టించుకోకుండా వంటగదిలోకి వెళ్లిపోయిందామె. ఇంక తప్పనిసరి అయిపోయి బావగారి ప్రక్కనే కూర్చుండిపోయింది మరదలు.

"ఎవరా అమ్మాయి? " అంది అనుమానంగా! ఎన్నో విషాదాలు భయాల మధ్య బావగారికి బాగా దగ్గర అయిపోయింది. అక్కచనిపోయాక పాపకోసం ఆ కుటుంబంలోకి వచ్చింది.

రాహుల్‌కి మానసికంగా బాగా దగ్గర అయింది. తండ్రి హాస్పిటల్ వాసం, ఆకుటుంబ బాధ్యతల మధ్య తానుండిపోవడం ఆమె మనసులోకి వేరు ఆలోచనలు రాకుండా చేసింది.

"పీయూష సంపత్‌మాస్టారి కూతురు. సైతాను దళాలలో కొంతకాలం పనిచేసింది." అన్నాడు రాహుల్.

తన్వి ముఖం అదోకలా మారిపోయింది. ఒక్కక్షణంలో ఆమె పదహారణాల తెలుగింటి ఆడపడుచు లాగే అయింది.

"అటువంటి వారితో ఈ పరిచయాలేమిటి? ఇంటికి తీసుకురావటం ఏమిటి? ఇలాంటి అతిచనువులు నాకు నచ్చవు" అంది తన్వి వంటగదిలో పనిలో మునిగిపోయివున్న పీయూష వంక చూస్తూ!

"ప్రస్తుతం ఆమె మన యింటిలో ఉండవలసిన అవసరంచాలా ఉంది"

"అయితే ఇకనుండి ఇక్కడే ఉండిపోతుందా బావా?"

"ఆమె ఇంటిలో ఉన్నంతకాలం నీకు కూడా భయం ఉండదు."

"నేను వెళ్లిపోయి హాస్పిటల్‌లో ఉండి నాన్నగారిని చూచుకుంటాను."

"డోంట్ బిసిల్లీ! ఈ పరిస్థితుల్లో నువ్వు ఒంటరిగా ఎక్కడా తిరిగేందుకు వీలుకాదు. అందుకు నేను ఒప్పుకోను."

"ఒక వరలో రెండు కత్తులు యిమడవు."

రాహుల్ నవ్వు ఆపుకోలేకపోయాడు.

"నువ్వు మరీ పసిపాపాయిలా మాటాడుతున్నావు" అన్నాడు.

"నీతో మరొకరు అంత చనువుగా ఉండటం నేను భరించలేను"

"ఇక నుంచి ఆమె వంటగదిలోకి అంటే నీ సామ్రాజ్యం సరిహద్దులలోకి కాలుపెట్టదు. సరేనా?" నవ్వుతూ చిలిపిగా చూచాడు. చాలా రోజుల తరువాత అతనిలో ఇదివరకటి రాహుల్ కన్పించాడు.

"నీకు అన్నం పెట్టకూడదు. కాఫీ యివ్వకూడదు"

"ఓకే! అలాగే నడుమకుంటుందిలే! అనుమానించి అవమానించకు."

"నువ్వు బాత్‌రూంలో ఉండగా పేష్ట

బ్రష్ నేనే యివ్వాలి. టవల్ సబ్బు నేనే తెచ్చి యివ్వాలి. షాంపూ కూడా."

"అలాగే! ఆ అధికారాలు అన్నీ నీవే! ఆమె వచ్చింది సైతాన్ గాంగ్‌మీద నా పోరాటంలో సాయపడేందుకే కాని నా వ్యక్తిగతమయిన పనులు చూచేందుకు కాదు."

"మీరు బయట ఎలా వున్నా ఇంట్లో అతి చనువుగా ప్రవర్తించకూడదు.'

"ఇంట్లో ఉండగా చనువు చూపించను. చాలా? ఇంక ఈ విషయాలు మాటాడటం మానెయ్యి. ఆమె వింటే బాగుండదు" అన్నాడు వంటగది వాకిలి వంక చూస్తు!

తన్వి అడుగుల చప్పుడు విని మాటాడటం మానేసింది.

"పోపుల డబ్బా కనిపించలేదు" అంది హడావుడిగా!

"ఏపనికయినా అలవాటుండాలి!" అంది తన్వి. ఆమెవంక పరిశీలనగా చూసింది పీయూష.


"ఎందుకలా ఉన్నారు?" అంది అనుమానంగా.


"ఎందుకేమిటి? ఆమె సామ్రాజ్యం సరిహద్దుల్లోకి అంటే వంటగదిలోకి నువ్వు ప్రవేశించావు. అదే కారణం" అన్నాడు రాహుల్. పీయూష పరిస్థితిని అర్థం చేసుకుంది. పరిస్థితుల కారణంగా తాను ప్రమాదభరితమయిన జీవితాన్ని ఎంచుకుంది. ఆ దారిలో తిరిగి రాలేనంత దూరం వెళ్ళిపోయింది. అయినా ఒక సాధారణ మయిన ఆడపిల్ల మనసులో వుండే కోరికలు ఆమెలోనూ ఉన్నాయి.

ఒకసారి దారి తప్పిన జీవితం తిరిగి అదుపులోకి తీసుకురావటం అసాధారణమయిన విషయం. ప్రథమ ప్రయత్నంలో తాను విఫలమయినందుకు బాధపడలేదు పీయూష. భయపడలేదు.

మనోగతాలను భయటపడనీయక అలా కూర్చుండిపోయింది. ఇనుమడించిన ఉత్సాహంతో వంటగదిలోకి వెళ్ళింది తన్వి.

గంభీరమయిన మౌన ముద్ర వహించాడు రాహుల్.





"ఒక ఐడియా ! పోలీసు రిపోర్టు యిచ్చి శ్రీదేవి అలయెన్స్ కంపెనీ మీద రైడ్ చేయిస్తే దొంగలు దొరికిపోతారు కదా!" తిరిగి వచ్చి వారి మధ్య కూర్చుంటూ ఓ సలహా అందించాడు చెన్నుడు.

"ఇదేనా ఐడియా?" నవ్వుతూ అడిగింది పీయూష!

"అవును. అలా చేస్తే దొంగలు దొరికిపోతారు కదా?'

"ఈ వికృతమయిన సమాజంలో దొంగలు దొంగల్లా ఉండరు. దొరబాబుల్లా ఉంటారు. వారిని పట్టుకోవటం నువ్వు అనుకున్నంత సులభం కాదు. వారి కంపెనీ మీద పోలీసులు రైడ్ చేస్తే దొంగలు దొరకరు కదా వారు పెద్దమనుషులే అని మరోసారి రుజువు అవుతుంది. చేతులు కాల్చుకోవటం ఎందుకు?"

"పోనీ మనమే వెళ్లి కొన్ని సాక్ష్యాధారాలు సంపాదిస్తే?"

"అది నువ్వు ఊహించినంత సులభం కాదు చెన్నూ"

"అయితే మన పరిశోధన ఎక్కడనించి ప్రారంభించాలి?"

"ముందు నీ గాయాలు మానిపోనివ్వు. ఆ తరువాత ఆలోచిద్దాం" పీయూష సమాధానం విని చెన్నుడు ముఖం మాడిపోయింది.

రాహుల్ ముఖం మరోవంకకు మరల్చుకుని నవ్వుకున్నాడు.

"ఆ ఇండికేటర్ ఎక్కడుందో? అది మన ప్రాణాలు తీస్తోంది. దాని ఆచూకి తెలుసుకోకుండా పాపని రక్షించుకోవటం అసాధ్యం. ఇంతకూ పాప ఎక్కడుంది?"

" ఆ విషయాన్ని పరిశోధించి తెలుసుకోవలసిన బాధ్యత నీదే!"

" అయితే పాపని మళ్ళీ వాళ్లు కిడ్నాప్ చేశారన్నమాట?"

ఎవరూ మాటాడలేదు.

"నేను పాపకోసం వెడుతున్నాను. పాపని తీసుకుని మళ్లీ తిరిగి వస్తాను. లేకపోతే నా ముఖం మీకు చూపించను" అంటూ అకాలంలో అనవసరమయిన ఆవేశం తెచ్చుకుని వెనుకా ముందూ చూడకుండా వెళ్ళిపోయాడు చెన్నుడు. ఆ యిద్దరూ నవ్వుకున్నారు.

ఏదో చేసి ఈ ప్రమాదాలనించి బయటపడాలన్న తపన, ఏమీ చేయలేని అసమర్థత అతని విచిత్ర ప్రవర్తనకి అర్థం అనుకున్నారు.

"ఈరోజు జూబిలీ హిల్స్‌కి వెళ్లి ఆ యింటి సంగతి తేల్చాలి. దాన్ని ధ్వంసం చేయకపోతే యిబ్రహీం తిరిగి రంగంలోకి రాడు. యిబ్రహీం రాకుండా వారి తప్పుల్ని నిరూపించటం అసాధ్యం" అంది పీయూష.

"ఆ యిండికేటర్ ఎక్కడుందో ముందు తెలుసుకోవాలి" అన్నాడు రాహుల్.

"బహుశా దానికోసం మనం ప్రయత్నిస్తే నిరాశ ఎదురుకాక తప్పదు. అది మన దగ్గరే వుందని వాళ్లు అనుకుంటున్నారు. అలా అనుకోవటానికి బలమయిన సాక్ష్యం యిబ్రహీం దగ్గరే ఉంది. ఆ సాక్ష్యం ఏమిటో కూడ మనం తెలుసుకోవాలి" అందామె.

ప్రస్తుతానికి ఆ సమస్యని వాయిదా వేసి ఇద్దరూ జూబిలీ హిల్స్‌కి బయలుదేరారు. రాహుల్ డ్రసప్ అవుతున్నాడు.

"భోజనాలు చేసి వెళ్ళండి" అంది తన్వి. ఆమెను నిరుత్సాహపరచడం యిష్టంలేక టేబిల్ ముందు కూర్చున్నారు. కాని ఆ స్థితిలో ఎవరయినా ఎలా తినగలరు. రెండుమూడు నిముషాల్లో ముగించారు.

హడావుడిగా వెళ్ళిపోతున్న వారిని ఆశ్చర్యంగా చూస్తోంది తన్వి.

* * * * * *

" వెళ్ళిన పని ఏమయింది?" పాపని తీసుకురాకుండా ఉత్తి చేతులతో తిరిగి వచ్చిన అనుచరులవంక క్రూరంగా చూస్తూ అడిగాడు యిబ్రహీం.

" బాస్! పాపాయి దేశం దాటి వెళ్లిపోయింది."

"అదెలా జరిగింది? " అతని కనుబొమలు ముడిపడ్డాయి.

"యశోదాదేవి అని ఓ అనాధ శరణాలయం నడిపే ముసల్ది రాహుల్‌కి సాయం చేసింది. పాపాయిని దేశం దాటించి పంపేసింది. ఏమీ తెలియని అమాయకురాల్లా వుంది. ఆ వృద్ధురాలు అసాధ్యురాలు. కాసింతయినా భయభక్తులు లేకుండా సమాధానాలు చెబుతోంది "

" ప్రాణాలమీద ఆశఉన్న వారికే భయం ఉంటుంది. కాని ప్రాణాలమీద ఆశవొదులుకున్న వారికి భయం అనేది ఉండదు. అలాంటివాళ్ళ జోలికి మనం వెళ్ళకూడదు. కాని ఇంత వేగంగా దేశం దాటించటం ఎలా సాధ్యపడింది. ఈజిట్ పాసిబుల్? "

"ఆ ముసిల్దే స్వయంగా చెప్పింది బాస్! "

" మూర్ఖుడా! ఆమె చెప్పిన మాట అబద్ధం అయిఉండకూడదా? మిమ్మల్ని ప్రక్కదారి పట్టించేందుకు అలా చెప్పిఉండవచ్చు కదా!"

అందాకా తానేదో ఘనమయిన వార్త తెచ్చి అందించాననుకుంటున్న అనుచరుడు ఈ ప్రశ్న విని తెల్లముఖం వేశాడు.

" అవును బాస్! అబద్ధం కూడ అయి ఉండొచ్చు. కాని యశోదమ్మ మాటలు వింటే అలా అనిపించలేదు. ఆ ముసిల్దానికి అంత గొప్ప అబద్ధం చెప్పేంత తెలివీ, ధైర్యమూ ఉన్నాయంటావా?"

"ఇప్పుడే చెప్పానుకదా! ప్రాణాలకి తెగిస్తే ధైర్యం దానంతట అదే వస్తుంది. మిమ్మల్ని వెర్రిముఖాల్ని చేసి పంపేసిందా యశోద! ఇంత బాధ్యత కలిగిన పని అప్పగించటం నాదే తప్పు! గెటవుట్! బద్మాష్! ఇంకెప్పుడూ ఈ పాడు ముఖాలు నాకు చూపించకండి" అంటూ పిడుగులు కురిపించినట్లుగా ఉరిమాడు ఇబ్రహీం.

వారంతా వెళ్ళిపోయాక ఆలోచనలో నిమగ్నుడు అయ్యాడు.

వరుసగా ఎదురవుతున్న పరాజయాలు, కెమికల్ వెపన్స్ తయారయినందువల్ల తన ఆయుధ సంపత్తికి తగ్గిపోతున్న ప్రాధాన్యత అతన్ని కృంగదీస్తున్నాయి. భవిష్యత్తు అంధకారంలా కన్పిస్తోంది.

అదంతా కోపంగా మారింది. అవమానాలు, అపజయాలు అన్నీ దుఃఖంగా మారి,

దుఃఖం కోపంగా మారి గుండెల్ని పొంగించింది. పళ్లు పటపట నూరాడు. ఏదో ఒక భారీ కార్యక్రమం చేపట్టకుండా తన వ్యక్తిత్వానికి విలువ పెరగదు. ఇటువంటి విపత్కర పరిస్థితులెన్నింటినో అవలీలగా పరిష్కరించిన అతని మస్తిష్కంలో పథకాలు రూపుదిద్దుకుంటున్నాయి.

అలాంటి సమయంలో అతనికి మనశ్శాంతి యిచ్చే చోటు ఒకటుంది. అది యిబ్రహీం సందు. ఆ సందులో తనకోసం తెచ్చుకున్న కనకదుర్గ! వెంటనే బయలుదేరాడు. దుర్గ వాకిట్లో అడ్డుగా నిలబడింది.

అతను వచ్చినా ఆమె తప్పుకుని దారి యివ్వలేదు. నగరాన్ని గడగడ లాడించే యిబ్రహింతో పదహారు సంవత్సరాల బాలిక ప్రవర్తనకు తలవొంచి ఆమె ఎదురుగా నిలుచుండిపోయాడు.

"ఆముదం త్రాగినవాడిలా ఏమిటా ముఖం?" అని అడిగింది దుర్గ!

" మనసు బాగోలేదు" అన్నాడు యిబ్రహీం పసిపిల్లవాడిలా!

" అలాంటి పెద్దపెద్ద మాటలు చెప్పకు యిబ్రహీం. నువ్వు బ్రతికుండగా నాదగ్గిర మనసు గురించి మాటాడకు. నీకు మనసేమిటి? కొండరాళ్ళకు పూలు పూస్తాయా ఎక్కడయినా? నాదగ్గరకూడ ఎందుకీ

శత్రుసంహారం

బడాయి మాటలు?" అంది కనకదుర్గ చాల యీసడింపుగా!

ఆ అవమానాన్ని అతడు చాల సంతోషంగా భరించాడు.

"నీకు అర్థం కాదులే! గుండెలు తొలుచుకుపోతున్నాయి."

"ఏమంత కష్టం వచ్చిందట పాపం?"

"వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి"

"అంటే నీ సైతాను రాజ్యం ఎల్లకాలం ఎదురులేకుండా సాగాలంటావా?"

"దీనికంతా కారణం ఆ రాహుల్ ఒక్కడే! బద్మాష్"

"ఈ ప్రపంచంలో నువ్వు ఒక్కడివే సమర్థుడివి అనుకుంటున్నావా? నీ తలదన్నే మగాళ్ళు యింకెవ్వరూ ఉండరని ఊహించుకున్నావా?" అందామె.

"నీయవ్వ! నన్ను రెచ్చగొట్టమాకు! చీరేస్తాను"

"నువ్వేమాత్రం చరేయగలవో నాకు తెలియదా? నీలాంటి వెధవలకి ఎప్పుడో ఒకప్పుడు పతనం తప్పదు. కాని యింత త్వరగా ప్రారంభమవుతుందని నేను అనుకోలేదు. అనుకోకుండా చాలా పెద్ద చిక్కులో పడ్డావన్నమాట! నిన్ను చూస్తే నాకు జాలిగానే వుంది. రా! లోపలికి" అంటూ ప్రక్కకు తొలగి దారి యిచ్చింది దుర్గ. యిబ్రహీం నేరుగా వెళ్లి మంచంమీద వాలిపోయాడు. కనకదుర్గ వెళ్లి అతని ప్రక్కనే కూర్చుంది తాపీగా!

"ఇంతకూ నీకివాళ ఏమయింది! నీకొచ్చిన కష్టం నాతో చెప్పుకో!"

"ఎందుకు చెప్పుకోవటం? తిట్టిపోయటానికా?" అన్నాడు. దుర్గ మనసు కరిగిపోయింది. అతనిమీద నిజంగానే జాలి కలిగిందామెకు.

"తిట్టిపోయను. సాయంచేస్తాలే చెప్పు" అందామె సానుభూతిగా.

"దుర్గా! ఛద్దాగాడు శనిలా దాపురించాడు. కెమికల్ వెపన్స్ తయారు చేయించాడు. నా ఆయుధాలకి ప్రాధాన్యం తగ్గిపోయింది. దేవిప్రసాద్ దృష్టిలో తేలికపడిపోయాను.

అది చాలదన్నట్లు ఇండికేటర్ ఆచూకీ తెలియలేదు. కనీసం పాప ఆచూకీ అయినా తెలియలేదు. మనుషుల్ని పంపితే వాళ్లు వెర్రి ముఖాలేసుకుని తిరిగి వచ్చారు. ఒకవంక పోలీసు కమీషనర్ పగబట్టాడు. దేవీ ప్రసాద్ కోసం నేను చేసిన ఘాతుకాలు నన్ను వెన్నాడుతున్నాయి. నా ప్రాధాన్యత తగ్గిపోయింది

కాబట్టి దేవీప్రసాద్ నన్ను రక్షించడు. వీలయితే నన్ను తప్పించేందుకు ప్రయత్నిస్తాడు. ఇక నన్ను అల్లా ఒక్కడే రక్షించాలి."

"నీలాంటి పాపాత్ముల్ని దేవుడు కూడా రక్షించడు ఇబ్రహీం."

"మరేమిటి దారి ?"

"నీమీద సానుభూతి ఉంది కాబట్టి నిన్ను కాపాడేందుకు ప్రయత్నిస్తాను."

"నువ్వు ప్రయత్నిస్తావా ? ఏం చేస్తావు ?"

"ఏదైనా సరే ! నీ ఇష్టం వచ్చిన కోరిక ఒకటి కోరుకో తీర్చుతాను."

"నువ్వు కనకదుర్గమ్మవా వరాలివ్వటానికి ?"

"పిచ్చి మాటలు మాట్లాడకు. అడగమన్నాను. అడుగు అంతే ! డన్" అందామె.

"ఇండికేటర్ సంపాదించగలవా ?"

"అదొక్కటేనా నీ కోరిక !"

"దాన్ని సంపాదించలేకపోతే పావని తీసుకురావాలి."

"ఇక నువ్వు నిశ్చింతగా ఉండు. తాగి, తిని నిద్రపో ! నువ్వు నిషా తగ్గి నిద్ర లేచేసరికి నీ కోరిక తీరుతుంది."

"బయటకు వెళ్లి పారిపోయేందుకు ప్రయత్నిస్తావా ?"

"నా జీవితం నాశనమయింతర్వాత నేనెక్కడికి పోతాను. నువ్వు చచ్చిపోయేవరకు నా ముఖం ప్రపంచానికి చూపించను."

"నేను చనిపోవాలని కోరుకుంటున్నావా ?"

"నీలాంటి జీవితాలకి ముగింపు అదే అని చెప్తున్నాను. అయినా నీ కోరిక తీర్చుతా" అంటూ వెంటనే బయలుదేరింది కనకదుర్గ. ఆ క్షణంలోనే త్రాగటం ప్రారంభించాడు ఇబ్రహీం. జీవితంలో భయంకరమైన నేరాలు చేసినందుకు కొంత త్రాగాడు. చేసిన నేరాలకు ఫలితాన్ని అనుభవించవలసిన సమయం ఆసన్నమవుతున్నందుకు మరికొంత త్రాగాడు.

త్రాగి త్రాగి మంచి చెడులు అర్థం చేసుకునే స్థితిని దాటిపోయాక మొద్దులా మంచంమీద పడి ఉండిపోయాడు.

దుర్గ ఆయింటినుంచి అప్పటికే చాలా దూరం వచ్చేసింది. ఒక పాపాత్ముడి మీద జాలిపడి వరమిచ్చినందుకు ఫలితంగా ఒక చెడ్డ పని చేయాలని నిర్ణయించుకుందామె. చెడ్డపని అని తెలిసినా చేయాలనే అనుకుంది.

ఇబ్రహీం అనుచరుడు ఒకడు కొంత దూరం తోడుగా వచ్చాడు.

"ఇక్కడినుంచి నేరుగా వెళ్లితే అరకిలోమీటరు దూరంలో యశోద అనాథ శరణాలయం కన్పిస్తుంది" అని చెప్పాడు ఒక దారి చూపుతూ !

"సరే నువ్వింక తిరిగి వెళ్లిపో ! నేను ఆ ఇండికేటర్ సాధించి తీసుకువస్తానని ఇబ్రహీంతో చెప్పు. నేను తిరిగి వచ్చేలోపుగా ఆత్మహత్య చేసుకోవద్దన్నానని చెప్పు. చేసిన తప్పులకి శిక్ష అనుభవించకుండా ఎవ్వరూ చనిపోకూడదు. వెళ్లు" అంది కనకదుర్గ.

అంతదూరం దారి చూపేందుకు వచ్చిన సైతాన్‌దళం సభ్యుడు వెళ్లిపోయాడు. దుర్గ ఒంటరిగా ముందుకు నడిచింది.

ఆ వీధి చివర ఎవరి చూపులూ పడని ప్రశాంతమయినచోట ఉంది అనాధ శరణాలయం. ముందు గదిలో కూర్చునిఉంది యశోద. లావుపాటి కళ్లద్దాలు పెట్టుకుని పేపర్లో మంచి వార్తల కోసం వెదుకుతోంది.

తన చిన్నతనంలో స్వాతంత్ర్య పోరాటాల వార్తలు, వీరుల త్యాగాలు, మహాపురుషుల ఉపన్యాసాలు వార్తాపత్రికలలో వచ్చేవి. ఇప్పుడు పరస్పరం దుమ్మెత్తిపోసుకోవటాలు, బురద చల్లుకోవటాలు, అవి చాలదన్నట్లు హత్యలు, మానభంగాలు, దోపిడీలు !

"నమస్కారం యశోదమ్మగారూ ! ఏమిటంత శ్రద్ధగా చదువుతున్నారు ?" అంటూ వెళ్లి పక్కన కూర్చుంది దుర్గ.

"ఏముందమ్మా ! ఇప్పుడు మనచుట్టూ ఉన్న ప్రపంచం నైతికంగా ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాను."

"కన్పిస్తూనే ఉందిగా ! దహనకాండలు, దోపిడీలు, కర్ఫ్యూలు."

"అవునమ్మా ! ప్రపంచమంతా అలాగే మారిపోతోంది."

"అంతేనండీ ! ఇహ ఈ ప్రపంచం బాగుపడదు" నిట్టూర్చింది దుర్గ.

"ప్రపంచం సంగతి సరేకాని ఇంతకూ నువ్వెవరమ్మా ?" మాటల్లో పెట్టి ఎలాటి ప్రశ్న ఎదురుకాకుండా చెయ్యాలనుకుందో అదే ప్రశ్న ఎదురయింది. ఉలికిపడింది కనకదుర్గ !

"నేను ఒక దిక్కులేనిదాన్ని యశోదమ్మగారూ ! నా అనేవాళ్లు ఎవరూ లేరు. మీరేమన్నా సాయం చేస్తారని వచ్చాను" అంది.

"ఇక్కడ అనాధ బాలికల్ని చేర్చుకుంటారు కాని నీ వయసువాళ్లని కాదమ్మా ! నువ్వు పొరపడి వచ్చి ఉంటావు."

"పొరపాటో, గ్రహపాటో వచ్చాను కదా ! ఏదైనా పని చూపించండి."

"పని కావాలని వెతుక్కుంటే దొరక్కపోతుందా ? ఇక్కడికి ఎందుకొచ్చావు ?"

"మీరు చాలా మంచివారట కదా ! ఆ సంగతి విని వచ్చాను."

"అనాధాశ్రమం నడిపేవారిలో చెడ్డవాళ్లుకూడా ఉంటారా ?"

"ఎందుకుండరు యశోదమ్మగారూ ! అనాధపిల్లలకోసమని చందాలు పోగుచేసి గుటకాయస్వాహా చేసేవాళ్లుకూడా ఉంటారు"

"చాలా అనుభవం కలదానిలా చెప్తున్నావు? నీ వయసెంత ?"

"ఇరవైలోపే ! మంచిగా పనిఇస్తే చేస్తాను."

"ఏ పని ఇమ్మంటావు ?"

"ఏదయినా సరే ! మీ ఇష్టం."

"ఒక పెద్దింట్లో పనిమనిషి కావాలంటున్నారు ఉంటావా ?"

"ఉంటానండి ఆశ్రమంలో పనులేవీ

వీరపాండ్యకట్ట బ్రహ్మన గా మనోజ్‌కుమార్



గ్లామర్ వున్న హిందీ సినిమా తారలంతా కొంచెం వయసు మళ్లంగానే వెండితెర వదిలిపెట్టి బుల్లితెరకు వలస వచ్చేస్తున్నారు. ఉదాహరణకి హేమమాలిని 'నూపుర్' సీదాసాదాగా తీసినా కూడా టి.వి. మీద విజయవంతంగా సాగుతోంది. ఇప్పుడు మనోజ్‌కుమార్ కూడా బుల్లితెర మీదికి విజయం చేస్తున్నాడు. 'భారత్‌కే షహీద్' అనే 26 భాగాల సీరియల్‌ను మనోజ్‌కుమార్ బుల్లితెర కోసం తయారు చేస్తున్నాడు. 30 సంవత్సరాల క్రితం 'భగత్‌సింగ్' మీద 'షహీద్' అనే చిత్రం తీసినప్పుడు మనోజ్ దానికి మాటలు వ్రాశాడు. ఇప్పుడు మనోజ్ తీస్తున్న కథల్లో 'వీర పాండ్య కట్టబ్రహ్మన' వుంది. 'చంద్రశేఖర్ అజాద్' కథ కూడా వుంది. 'అల్లూరి సీతారామరాజు' కథ ఎందుకు చేర్చలేదో అర్థం కావటంలేదు.?!

లేవంటారా ?"

"ఇక్కడ ఇలాగే వచ్చినవాళ్లు చాలామంది ఉన్నారు. కాని అది చాలా పెద్ద ఇల్లు. చాలా నమ్మకంగా పనిచేయాలి. తప్పుచేశావో దొరికిపోతావు. ఆ తరువాత జీవనాధారం కూడా ఉండదు."

"నేనలా చేయనండి. చాలా మంచి దాన్ని."

"మంచితనం ఒక్కటే చాలదు. పరాయిచోటున ఉండేటప్పుడు ఓర్పుకూడా కావాలి. అలా నడుచుకుంటావా ?"

"నడుచుకుంటానండి ! నేను చాలా ఓర్పుకలదాన్ని."

"అలాగా ఒక పాపని పెంచాలి."

" ఓ దానికేం ? పసిపిల్లలంటే నాకెంత ఇష్టమో !"

"మరీ పసిపాప కాదులే ! నాలుగేళ్లు ఉంటాయి."

"ఆ వయసు వాళ్లయితే ముద్దుముద్దుగా మాటలుకూడా చెబుతారు గదండీ" అంటూ సంబరపడిపోయింది కనకదుర్గ.

"నీకు అమ్మా నాన్న ఉన్నారా ? అడ్రస్ కావాలి."

"లేరని చెప్పానుకదా అమ్మగారూ ! అడ్రస్ ఉంటే అనాథలు ఎలా అవుతాం ?"

"సరే ! మంచిది" అంటూ వెంటనే ఒకచోటికి కబురుపెట్టింది యశోద. ఆ ఇంటినుంచి ఇరవై నిమిషాల్లో కారు వచ్చింది.

దుర్గని తీసుకుని స్వయంగా తనూ బయలుదేరిందామె. వారు విశాలమైన భవనంలోకి వచ్చి దిగారు. యాభై సంవత్సరాలుంటాయేమో ఒక లావుపాటి స్త్రీ ఎదురు వచ్చింది.

యశోదమ్మగారి పట్ల ఎంతో గౌరవ మర్యాదలు చూపుతూ లోనికి తీసుకుపోయిందామె. కూర్చోపెట్టి మర్యాదలు చేసింది.

"పాప హటం చేస్తోందన్నావు కదా ! చూచుకునేందుకు మనిషిని తీసుకువచ్చాను" అంటూ పరిచయం చేసింది యశోదమ్మ.

"నీకు జీతం ఎంత కావాలన్నా ఇస్తాను. పాపను బాగా చూసుకుంటావా ? కాని మాదగ్గర పనిచేసినంతకాలం నువ్వు మెయిన్‌గేటు దాటి వెళ్లటానికి వీలుకాదు" ఖండితంగా చెప్పింది ఇంటావిడ.

"అలాగేనండీ వెళ్లను."

"పాప బాగా హటం చేస్తోంది ఓర్పుగా దారికి తీసుకురావాలి"

"పసివాళ్లు నాకు త్వరగా స్నేహం అవుతారు. పాపకూడ !" అంది దుర్గ.

"సరే ! నేను వెళ్లిపోతాను" అంది యశోదమ్మ.

"ఈపూట ఉండి మా ఆతిథ్యం స్వీకరించరూ ?"

"వీలుకాదమ్మా ! చాలా పనులున్నాయి. మరోసారి వస్తాను" ఆమె వెళ్లి కారులో కూర్చుంది. వీడ్కోలు చెప్పి తిరిగి వచ్చింది ఆ ఇంటావిడ.

"పై గదిలో ఉంది పాపాయి ! రా చూపుతాను" దుర్గను వెంటబెట్టుకుని మేడ మీదికి వచ్చిందావిడ.

ఒక గదిలో మోల్డామీద నిర్వికారంగా కూర్చుని ఉంది పాపాయి. ఆమె చేతిలో ఒక ఆటవస్తువు కూడా ఉంది. మిక్కీ మౌస్ !

దుర్గ గదిలోకి వచ్చాక వెనుకనించి తలుపులు మూసి వెళ్లిపోయింది ఇంటావిడ ! అడుగుల చప్పుడు విని తలెత్తింది పాప !

"కోపంగా ఉన్నావా పాపా ?" పలకరించింది దుర్గ.

"కోపంగా ఉన్నావా పాపా ? వెవ్వెవ్వె" వెక్కిరించింది పాప.

"తప్పమ్మా ! పెద్దవాళ్లని అలా వెక్కిరించకూడదు. నీకంటే నేను పెద్దదాన్ని కదా ! నేను చెప్పినట్లు నువ్వు వినాలి."

"నేను వినను పో ! మా పపా దగ్గరకు వెళ్లిపోవాలి."

"తీసుకుపోయేందుకే నేను వచ్చాను."

"నిజంగా తీసుకుపోతావా ?" మెల్లగా దిగివచ్చింది పాప.

"అవును. మరి బిస్కట్లు తిని పాలు తాగుతావా ?"

"పపా దగ్గరకు తీసుకుపోతానంటే నువ్వు చెప్పిన పనులన్నీ చేస్తాను" అంటూ వాగ్దానం ఇచ్చింది పాప.

దుర్గ పాలు అందించింది. అవి గడగడ తాగేసి "ఇక వెళ్లిపోదాం" అంటూ మారాం చేయటం ప్రారంభించింది.

"ష్ ష్ ! అరవకు మనం దొంగతనంగా పారిపోవాలి."

"ఓ అలాగా ! పోలీసులు పట్టుకుంటారా ?"

"మనల్ని ఎవరూ పట్టుకోరు. చీకటి పడినతర్వాత హాయిగా వెళ్లిపోదాం సరేనా ?" అంటూ లాలించింది దుర్గ.

పాప మానసికంగా పూర్తిగా స్వాధీనురాలయిపోయింది.

"మనం తోటలోకి వెళ్లి ఆడుకుందాం !" అంది దుర్గ.

"చీకటిపడిందాకా ఆడుకుని అప్పుడు పపా దగ్గరకు వెళ్లిపోదాం."

"ష్ ష్ ! అరవకు. ఈ సంగతి ఇంటిలో ఎవ్వరికీ తెలియకూడదు."

"అంతే అంతే ! ష్ ష్ ! అరవకూడదు" అంది పాప.

కొద్దినిమిషాల తర్వాత పకపకలాడుతూ తోటలో ఆడుకుంటున్న పాపని చూచి తృప్తి పడింది ఇంటావిడ !

ఇన్నిరోజులుగా మునగదీసుకుని కూర్చున్న పాపాయి ఆనందంగా కన్పించింది. ఇదంతా ఆ అమ్మాయి సామర్థ్యమే !

యశోదమ్మగారు ఏంచేసినా దాని వెనుక ఎంతో అర్థముంటుంది అనుకుంది అన్నెం, పున్నెం ఎరుగని ఆ ఇంటావిడ ! ఆ రాత్రికి జరుగనున్న దుస్సంఘటనను ఊహించలేకపోయిందామె !

(ఇంకాఉంది)



సుహాసిని రాజీ!

దక్షిణాది భాషల్లో వంద చిత్రాలకు పైగా పూర్తి చేసిన మహానటి సుహాసిని సినిమా ప్రపంచంలో షబ్నాఅజ్మీ, దీప్తీనావల్ లాంటి మంచి నటీమణులకి గిరాకీ తగ్గిపోవటం మీద చాలా బాధపడుతోంది. నటించటంలో గొప్ప పేరు సంపాదించిన నటులకు గ్లామర్ లేకపోవటం చేత మామూలు ప్రేక్షకుల్లో అంత పేరు ప్రఖ్యాతులు వుండటం లేదని, తన మటుకు తాను అటు గ్లామరు.... యిటు నటన-రెండూ కూడా సంపాదించుకున్నాను అంటోంది. ఇప్పుడు 'పెన్ష్' అనే ఒక సీరియల్‌ను 'పెన్' చేస్తోంది. 'పెన్ష్' అంటే అమ్మాయి. 'పెన్' అంటే కలం. ఈ ఒక్క టి.వి. సీరియల్ తప్ప మరో సీరియల్‌లో నటిస్తే ఒట్టు అని కూడా సుహాసిని చెప్పింది. సినిమా స్టార్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుంటే తనకు కూడా చాలా చిక్కులొచ్చేవని, డైరెక్టర్‌ను పెళ్లి చేసుకున్నందు వల్ల కొంత రాజీపడటంతో తన జీవితం హాయిగానే వుందని సుహాసిని బోలెడు సంతోషపడుతోంది!



వనస్థలిపురం (హైదరాబాద్)లో ఉజ్వల కళాసమితి నాటికల పోటీల సందర్భంగా సినీ, రంగస్థల నటుడు శ్రీ ధూళిపాళకు సత్కారం చేస్తున్న దృశ్యం.

అవీ-ఇవీ-అన్నీ

వ్యాస రచన పోటీలు

మార్చి 16న మదరాసులో జరిగే అమరజీవి పొట్టి శ్రీరాములు 89వ జయంత్యుత్సవాల సందర్భంగా మద్రాసులోని పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటీ యువతీ యువకులకు "ఎవరి పని వాళ్ళు చేసుకోడమే మంచిది" అన్న అంశం మీద వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నది. ఏ రాష్ట్రంలో వున్న తెలుగు వారైనా ఈ పోటీలో పాల్గొనే అర్హత వుంది. వ్యాసాలను ఫిబ్రవరి 20 లోగా-ఆనరరీ జనరల్ సెక్రటరీ, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటీ,126, ఆర్. హెచ్. రోడ్, మైలాపూర్, మద్రాస్-4 అన్న చిరునామాకు పంపాలని ఆ సొసైటీ గౌరవ కార్యదర్శి కోరుతున్నారు.

న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు



అడ్వొకేట్: బి.భాస్కరరావు ఎం.ఎ., ఎల్.ఎల్.బి.

సత్యనారాయణ, సెంట్రల్‌జైలు, రాజమండ్రి

ప్రశ్న : నేను సుమారు 6 సంవత్సరములు ఏ. పి. ఎస్. ఆర్. టి. సి.లో కండక్టరుగా పని చేసి ఒక హత్యా నేరారోపణపై 7న్నర సంవత్సరాలుగా జీవిత ఖైదు అనుభవిస్తూ వచ్చే నవంబరు 14న ప్రభుత్వ జీవోపై విడుదలకు సిద్ధంగా ఉన్నాను. మరల ఏ. పి. ఎస్. ఆర్. టి. సి. కండక్టరుగా చేరడానికి అవకాశం ఉన్నదా? ఎక్కడైనా అలా ఉద్యోగంలో చేరిన సంఘటనలు ఉన్నవా?

(1) నేరారోపణకు, సంస్థకు సంబంధం లేదు.

(2) ప్రభుత్వానికి పునరావాసం కల్పించవలసిన బాధ్యత ఉన్నది.

(3) రిటైర్డ్ సెషన్స్ జడ్జి శ్రీ నాయని కృష్ణమూర్తి ఒక సమావేశంలో ప్రథమ నేరంగా భావించి ఉద్యోగం ఇవ్వవచ్చునని చెప్పారు.

(4) 1982లో కేంద్ర ప్రభుత్వం వారిచే జైళ్ల నిర్వహణపై నియమించిన ముల్లా కమీషన్ ఖైదీ విడుదల అయిన తరువాత వేరే పునరావాసం కల్పించే బదులు అనుభవం ఉన్న, శిక్షకు ముందు ఉన్న ఉద్యోగమే ఇవ్వటం సమంజసమని సిఫారసు చేసి యున్నారు.

జవాబు : తులసీరామ్ పటేల్‌కు క్రిమినల్ కేసులో శిక్ష విధించారు. తులసీరామ్ పటేల్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసి వేశారు. విచారణ లేకుండా డిస్మిస్ చెయ్యడం రాజ్యాంగములోని 311 అధికరణకు విరుద్ధమని తులసీరామ్ పటేల్ సుప్రీం కోర్టుకు అప్పీలు పెట్టుకున్నాడు. ఈ వాదన సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ కేసులో విచారణ లేకుండా డిస్మిస్ చెయ్యడం రాజ్యాంగం లోని 311 (2) అధికరణకు అనుగుణము గానే ఉన్నదని సుప్రీంకోర్టు 1985 లో తీర్పు చెపుతూ తులసీరామ్ పటేల్ అప్పీలు కొట్టి వేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రిమినల్ కేసులో శిక్ష విధింప బడినవారిని తిరిగి ఉద్యోగంలో చేర్చు కొనరాదని 7-12-1979 తేదీ గల మెమో. నెం. 2253-సర్-ఎ- (జి. ఏ. డి.)లో ఆదేశాలు జారీ చేశారు. మోరల్ టర్పిట్యూడ్‌కు చెందిన నేరము చేసి నట్లయితే వారిని ఉద్యోగంలో తిరిగి చేర్చుకొనరాదని ఉత్తర్వులు ఇచ్చారు. మోటారు నడపడం, లైసెన్సు లేకుండా ఆయుధాలు కలిగి వుండడం, మధ్య రాత్రిమీద వాయిద్యాలు మ్రోగించి ప్రక్కను నివసించు వారి ప్రశాంతతకు భంగము కలిగించడం, ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్ పంపించక పోవడం, మోరల్ టర్పిట్యూడ్‌క్రిందకు రావు అని ప్రభుత్వం వివరణ ఇచ్చారు. కనుక మీకు తిరిగి ఏ. పి. ఎస్. ఆర్. టి. సి. లో ఉద్యోగం దొరకడం కష్టం. కాని ఆర్. టి. సి. ప్రభుత్వం కాదు గనుక మళ్లీ మీకు ఉద్యోగం ఇవ్వవలెనని పిటిషన్ పెట్టండి.

జి. దుర్గారావు, గోపాలపురం

ప్రశ్న : వ్యక్తి మీదైనా, సంస్థ మీదైనా పరువునష్టం కేసు వెయ్యాలంటే ఎలా?

జవాబు : మీకు పరువు నష్టం కలిగినప్పుడు భారతీయ శిక్షాస్మృతిలోని 500 మరియు 501 సెక్షన్ల క్రింద మేజిస్ట్రేట్ కోర్టులో కంప్లయింట్ దాఖలు చెయ్యండి. 499 సెక్షన్ ప్రకారం ఎవరైన మాటలలో గాని, వ్రాతలలో గాని లేదా కనబడే విధంగా గాని ఒకరి పేరును చెడగొట్టు ఉద్దేశ్యముతో అపవాదము చేసినట్లయితే అది పరువు నష్టము క్రిందకు వస్తుంది. ఈ సెక్షనులో 10 మినహాయింపులు ఉన్నవి. హైదరాబాదులోని ప్రైవేటు పబ్లిక్ స్కూలువారు ఉదయం పత్రికపై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పరువు నష్టం కేసు పెట్టారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు పిటిషన్ పెట్టుకొనగా శ్రీ దాసరి నారాయణరావు పత్రికకు సారథి అని ఉన్నది. గాని ఎడిటర్ కాదు గనుక అతనిపై కేసు పెట్టడానికి వీలు లేదని హైకోర్టు కొట్టి వేసింది అయితే ఎడిటర్‌మీద, ప్రింటర్‌మీద కేసు కొనసాగించవచ్చునని 1985 లో హైకోర్టు తీర్పు చెప్పింది.

కేరళలోని కన్ననూరులో కో ఆపరేటివ్ నర్సింగ్‌హోమ్ ఉన్నది. ఈ నర్సింగ్‌హోమ్ వ్యవహారంమీద కరుణాకరన్ విమర్శ చేస్తూ పేపర్‌కు లేఖ వ్రాశాడు. దానిమీద నర్సింగ్ హోమ్ ప్రెసిడెంట్ మేజిస్ట్రేట్ కోర్టులో కంప్లయింట్ పెట్టాడు. మేజిస్ట్రేట్ కంప్లయింట్ కొట్టి వేశారు. కాని కేరళ హైకోర్టు సెక్షన్ 500 క్రింద 200 రూపాయలు జరిమానా విధిస్తూ 1989 లో తీర్పు చెప్పింది. కనుక మీకు పరువునష్టం కలిగినప్పుడు మేజిస్ట్రేట్ కోర్టులో కంప్లయింట్ పెట్టవచ్చును.

ఆంధ్రసచిత్ర వారపత్రిక
న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....
పేరు: ....
పూర్తి చిరునామా: ....
....

జి. కె. ఎంత?

ఇంత కాలం మాకు అందని 'ఆంధ్ర పత్రిక' ఇప్పుడు అందుతున్నందుకు మాకెంతో ఆనందంగా ఉంది. 'యువతా– కవితా' శీర్షికలోని కవితలు పాఠకుల మనస్సులను తట్టి మేల్కొల్ప జేసేవిలా ఉంటున్నాయి. 'మీ జి. కె. ఎంత' శీర్షికలోని ప్రశ్నలు ముందుముందు ఎంట్రన్స్ టెస్ట్లలో ఉపయోగకరంగా ఉండే విధంగా ఉంటున్నాయి. ఈ పత్రికలోని ఈ శీర్షికలు ఎప్పటికీ ఇలాగే ఉండాలని ఆశిస్తున్నాను.

– జి. మాధవ్ (మెట్‌పల్లి)

అభినందనలు

మా అభిమాన పత్రిక ఆంధ్ర సచిత్ర వారపత్రిక తిరిగి పాఠకలోకానికి అందిస్తున్నందుకు ఎడిటర్‌గారికి, సంపాదక వర్గానికి మా అభినందనలు.

యథాలాపంగా, రెగ్యులేట్‌గా పాఠకలోకానికి ఆంధ్ర సచిత్ర వారపత్రిక మా ముందుకు వస్తుందని ఆశిస్తున్నాము.

సి.హెచ్.ఎమ్. నాయుడు, ఎ. రాంబాబు (తుని)

సీరియలు

ఈ వారం ప్రారంభం అయిన "చల్లా సుబ్రహ్మణ్యంగారి "లవ్ గేమ్" సీరియల్ మమ్మల్ని అమితంగా ఆకట్టుకొంది.

కె. ప్రభాకరరావు (భద్రాచలం)

అవార్డులు

చాలాకాలం తర్వాత మీకు లెటర్ వ్రాస్తున్నాను. పత్రిక రెగ్యులర్ తప్పింది. కాని ఈ మధ్య 10 రోజులల్లోనే మూడు సంచికలు వచ్చినవి. 24వ పేజీలో మళయాళ చిత్రం 'పిరవి' గురించి వ్రాస్తూ ఈ చిత్రం ఐదు ఆస్కార్ అవార్డులు గెలుచుకున్నదన్నారు. ఈ చిత్రానికి కేవలం జాతీయస్థాయిలో మాత్రమే అవార్డులు

వీక్లీ పోస్ట్

(4 వ పేజీ తరువాయి)

లభించాయి.

బోనేపల్లి మురళి, గీతా స్టుడియో (తెనాలి)

నిరాశ

మీ ఎడిటింగ్‌లో రూపుదిద్దుకుంటున్న మీ(మా) 'ఆంధ్రసచిత్ర వారపత్రిక' ప్రతీవారం కొత్త పుంతలు తొక్కుతున్నదనటంలో సందేహం లేదు. సీరియల్స్, కథలూ మొదలైనవి అద్భుతంగానే వుంటున్నాయి. ఆంధ్రసచిత్ర వారపత్రిక కొన్నదగ్గర్నుంచీ ఎంత వేగంగా చదివేద్దామా అన్న ఆతృత. ఎడిటోరియల్ చాలా విజ్ఞానదాయకంగా వుంటోంది. మీరు క్రొత్తగా ప్రవేశపెట్టిన "విద్యార్థుల్లో అశాంతి ఎందుకు?", "టిట్ ఫర్ టాట్" "కవితా' యువతా!" "ఫోటో వ్యాఖ్య పోటీ" శీర్షికలు బావుంటున్నాయి. కానీ "ఫోటో వ్యాఖ్య పోటీ" ఈమధ్య ప్రచురించక పోవటంతో పాఠకులలో నిరాశ కనబడుతోందనిపిస్తోంది. అంటే విమర్శించటం నా కోరిక, హాబీ కాదు.

మహమ్మద్ రఫీ, అయితానగర్ (శ్రీకాకుళం)

పిలుపు

ఆంధ్రసచిత్ర వారపత్రిక తిరిగి చాలా కాలానికి వచ్చి మా చేతుల్లో వాలింది. మేము ఆంధ్రసచిత్ర వారపత్రిక అభిమానులం. 'పత్రిక' తిరిగి సకాలంలో వస్తున్నందులకు సంపాదకులకు అభినందనలు తెల్పుకుంటున్నాము.

26–1–90 సంచికలో 'తాజా కాలమ్'లో 'నక్సలైట్‌లకి పిలుపు' వ్యాసం ద్వారా చాలా విషయాలు తెల్సుకున్నాం. ముఖ్యమంత్రి మ చెన్నారెడ్డి గారి పిలుపు మేరకు 'పీపుల్స్‌వార్' గ్రు నాయకులు ముందుకు వచ్చి వారి సమస్య నిర్భయంగా చెప్పుకుంటే చాలా క్షేమదాయకం ఉంటుంది.

ప్రముఖ యువరచయిత శ్రీ చల్లా సుబ్రహ్మణ్య గారి సీరియల్ 'లవ్‌గేమ్' ప్రారంభం కావడం చా సంతోషంగా ఉంది.

ఇకనుంచైనా మా అభిమాన వారపత్రి 'ఆంధ్రసచిత్ర వారపత్రిక' ఇక గేప్ ఇవ్వకుం ప్రతీవారం మా చేతులలో వాలేటట్లుగా చేస్తారని ఆశిస్తున్నాము.

–న్యాయపతి రమేష్‌బాబు మరియు మి హైదరా

సంతోషం

26–1–90 సంచిక అందంగా తయ మాకందింది. ఎన్నో విషయాలతో, ఎన్నెన్ని శీర్షికలతో విజయవాడ నుండి మా హైదరాబా నగరాని కొచ్చి మాకెంతో సంతోషాన్ని కల్గిస్తూం సంపాదకీయం పంజా విముక్తికి సూచనలు ఆలోచింపదగినవి ఉన్నాయి. ఇల్లును చూసి ఇల్లాలి టేస్ట్ చెప్పొచ్చు అలాగే సంపాదకీయాన్ని చదివితే చా సంపాదకుడు ఎంత ఘటికుడో తెలుస్తుంది.

క్రొత్త సీరియల్ "లవ్ గేమ్" శ్రీ సుబ్రహ్మణ్యం చక్కగా వ్రాస్తున్నారు. ము సుందరమూర్తి పాత్ర సహజానికి చాలా ఉంది. అలాగే నవ్య శోభనం గదిలో అలా ప్రవర్తించిందో ఊహించ లేకుండా ఉన్నాం.

–పోలోజు వెంకటా బోడు

మీ జి. కె. ఎంత? జవాబుల

(1) "ఎంటర్ ప్రైజ్" (1976లో "పామ్‌డేల్" 'కాలిఫోర్నియా (2) మెట్లమీద నుండి జారిపడిపోతామన్న భయం (3) నార్వే (4) " మిన్ (5) ఇంగ్లాండ్ రాణి పాస్‌పోర్టుకి అసలు నెంబరు ఏమీ ఉండ రాణీగారి భర్తది. (6) ముదాహస్సనల్ బొల్కియా ముజాద్దీన్ వాద్దె కల్వేరి (8) ఆంధోసిక్వేన్ (9) హిందీ సంగీత దర్శకుడు "ఖయ్యాం" ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ (అవార్డు లభించినప్పుడు ఆయన దేశం పా

Editorial Adviser: *S. RADHAKRISHNA*, Editor: *VEERAJI*,
Printed and Published by *S. NAGESWARARAO* for Nageswara Rao Estates Ltd.,
at the Andhra Patrika Press, Gandhi Nagar, Vijayawada-520003.
Phones: Editorial: 75667. Business: 61247, 61248.